మీన మేషములకును, కర్కాట సింహములకును, వృశ్చికధనుస్సులకును, సంధి అరఘడియ ప్రబల శిశుగండము.

పంచమివష్ఠులకును, దశమ్యేకాదశులకును, పూర్ణిమాప్రతిపత్తులకును, అమావాస్యాప్రతిపత్తులకును సంధి ౨ గడియలును, బహుళ ౧౪ శిలో మొదటి ౬వ వంతుగాక తక్కిన భాగములును దుష్టములైనవి. వ్యతీపాత, వైధృతి, పరిఘ, వ్యాఘ్ర, వైధ్రలను మహాపాతలును, సంధ్యాకాలము, అమావాస్య, తల్లి తండ్రి సోదరుడు వీరి నక్షత్రములునైనను గ్రహణకాలమయినను గూడ శాంతి జేయవలయును.

పైన జెప్పబడిన నక్షత్రములయందు ఆయా పాదములయందు జననమయినచో మహాదోషము గాన హోమములు, నవగ్రహజపము మొదలగు సంపూర్ణశాంతి చేయవలయును. చెప్పబడిన పాదములుగాక తక్కినపాదములయినను సామాన్యశాంతి చేసికొనుట యుక్తము. నక్షత్రము మంచిదై తక్కిన తిథి మొదలగునవి చెడువైనను సామాన్య శాంతి చేసుకొనవలయును.

మరియు మృగశిర ౧పా॥ విశాఖ ౪పా॥ అనూరాధ ౩పా॥ ధనిష్ఠ ౨పా॥ శతతార ౧పా॥ ఉత్తరాభాద్ర ౪పా॥ ఇవైనను సామాన్యశాంతి చేసికొనుట యుక్తము.

అమృతాది యోగములు

	అశ్వి	భ	కృ	రో	మృ	ఆర్ద్ర	పున	పు	ఆశ్లే	మ	పుబ్బ	ఉ	హ	చి	స్వా	వి	అనూ	జ్యే	మూ	పూషా	ఉషా	శ్ర	ధ	శత	పూభా	ఉభా	రే
ఆది	సి	ప్ర	అసి	సి	సి	సి	సి	సి	సి	ము	సి	అ	అసి	సి	సి	ఉ	ము	ము	అ	సి	అ	అ	ము	సి	సి	అ	అ
సోమ	సి	సి	ము	అ	అసి	సి	సి	అ	సి	ము	సి	సి	సి	ప్ర	అ	ము	సి	సి	సి	ఉ	ము	అ	సి	సి	ము	సి	సి
మంగళ	అసి	సి	సి	అ	సి	ము	సి	సి	సి	సి	సి	అ	సి	సి	సి	ము	అసి	ఉ	అ	సి	ప్రఅ	అ	సి	ము	ము	అ	సి
బుధ	ము	సి	అ	సి	సి	సి	సి	సి	సి	సి	అ	అ	ము	సి	సి	సి	అసి	సి	ము	[illegible]	అ	సి	ప్రఅ	సి	అ	సి	ఉ
గురు	అ	సి	ము	ఉ	ము	ము	అ	అసి	సి	అ	సి	ము	సి	సి	అ	సి	సి	ప్రఅ	సి	సి	సి	సి	సి	ము	సి	సి	సి
శుక్ర	అ	సి	సి	ము	సి	ము	సి	సి	ము	ము	సి	సి	అ	సి	సి	సి	సి	ము	అ	ప్రఅ	సి	ము	సి	సి	సి	సి	ఉ
శని	సి	సి	అ	అ	సి	సి	సి	సి	ము	అ	సి	ఉ	ము	ము	అ	సి	సి	సి	సి	సి	సి	సి	సి	[illegible]	ము	ము	ప్రఅ

అ=అమృతయోగము; సి=సిద్ధయోగము, అసి=అమృతసిద్ధయోగము, ఉ=ఉత్పాతయోగము, ము=మరణయోగము, ప్రఅ=ప్రబలారిష్టయోగము.

శ్రీ సర్వధారి సంవత్సర ఉదయాస్తమయ (స్టాండర్డుటైము) గంటలు, నిమిషములు (1948-1949)

నెల. తేదీ. 1948 సంవత్సరం		రాజమండ్రికి ఉ. గ.	రాజమండ్రికి అ. గ.	బెజవాడ ఉ. గ.	బెజవాడ అ. గ.	మదరాసుకు ఉ. గ.	మదరాసుకు అ. గ.
ఏప్రెల్	10	5_53	6_16	5_58	6_21	6_ 1	6_20
,,	20	5_46	6_18	5_51	6_23	5_56	6_21
,,	30	5_40	6_21	5_45	6_26	5_50	6_24
మే	10	5_35	6_23	5_40	6_28	5_46	6_24
,,	20	5_32	6_27	5_37	6_32	5_44	6_27
,,	30	5_30	6_30	5_35	6_34	5_42	6_30
జూన్	1	5_30	6_31	5_35	6_35	5_42	6_31
,,	11	5_30	6_35	5_35	6_39	5_42	6_34
,,	21	5_32	6_37	5_37	6_41	5_45	6_36
జులై	1	5_35	6_39	5_41	6_44	5_47	6_38
,,	11	5_38	6_39	5_43	6_43	5_50	6_38
,,	21	5_41	6_38	5_46	6_42	5_53	6_38
,,	31	5_44	6_35	5_49	6_39	5_56	6_36
ఆగస్టు	10	5_47	6_30	5_52	6_34	5_59	6_31
,,	20	5_49	6_24	5_54	6_28	5_59	6_27
,,	30	5_50	6_17	5_55	6_21	6_ 0	6_20
సెప్టెంబ్రు	9	5_52	6_ 9	5_57	6_14	6_ 0	6_15
,,	19	5_58	6_ 1	5_58	6_ 6	5_59	6_ 7
,,	29	5_54	5_58	5_59	5_58	5_59	6_ 0
అక్టోబరు	1	5_54	5_51	5_59	5_56	5_59	5_59

		రాజమండ్రికి ఉ. గ.	రాజమండ్రికి అ. గ.	బెజవాడకు ఉ. గ.	బెజవాడకు అ. గ.	మదరాసుకు ఉ. గ.	మదరాసుకు అ. గ.
అక్టోబరు	11	5_56	5_48		5_48	5_59	5_47
	21	5_59	5_37	6_0	5_42	6_ 1	5_44
	31	6_ 2	5_31	6_4	5_35	6_ 4	5_39
నవంబరు	10	6_ 6	5_27	6_16	5_31	6_ 6	5_35
	20	6_12	5_26	6_16	5_30	6_13	5_32
	30	6_17	5_26	6_21	5_30	6_17	5_32
డిసెంబరు	1	6_18	5_20	6_22	5_24	6_19	5_31
	11	6_24	5_28	6_28	5_32	6_23	5_38
	21	6_29	5_32	6_33	5_36	6_28	5_42
	31	6_34	5_38	6_38	5_42	6_33	5_48
1949 జనవరి	1	6_34	5_39	6_38	5_43	6_33	5_49
	11	6_37	5_44	6_41	5_48	6_36	5_54
	21	6_38	5_52	6_42	5_46	6_37	6_11
	31	6_37	5_56	6_41	6_ 0	6_38	6_ 6
ఫిబ్రవరి	10	6_33	6_ 1	6_37	6_ 5	6_35	6_10
	20	6_29	6_ 5	6_33	6_ 9	6_31	6_12
మార్చి	2	6_23	6_ 9	6_27	6_13	6_27	6_14
	12	6_15	6_ 1	6_19	6_ 5	6_20	6_ 8
	22	6_ 8	6_13	6_12	6_17	6_14	6_19
	30	6_ 1	6_14	6_ 5	6_18	6_ 8	6_19





Adamin

HIGH POTENCY VITAMIN OIL

Gives

Health & Strength

ఆరోగ్య భాగ్యానికి పుష్కలంగా మంచి
"ఏ" – "డి" విటమిన్లు ముఖ్యాన సారం

అడమిన్

విటమిన్ ఆయిల్ ఆదర్శప్రాయమైన టానిక్. ఇది
ఆరోగ్యాన్ని పెంపొందించి, వజ్ర శరీరం కలిగిస్తుంది.



మోతాదు:–రోజూ భోజనానంతరం నాలుగు ఔన్సుల పాలలో
గాని, లేక నారింజ రసంలోగాని 5 మొదలు 10 చుక్కలు
వేసుకుని సేవించాలి.

GOVERNMENT OIL FACTORY
CALICUT

చెన్నరాజధానికి పరిసర సంస్థానాలకు ఏజెంట్లు:

మెసర్స్. పారీ అండ్ కో, లిమిటెడ్, మద్రాసు

ఉగాది నాడు

శ్రీ బులుసు వెంకటేశ్వర్లు

శ్రీమంతమును, జగత్క్షేమంకరమును నగు యునికి నేతనె కాదు మునికిచేత
నతిపురాతనము, నత్యంత నిర్మలంబు నాస్యమాటనె కాదు శౌర్యమహిమ
భక్తి ప్రపంచమును ముక్తి ప్రదమగు విజ్ఞానశక్తిచేతను, ననురక్తి చేత
మహోన్నతము భాగ్యసాధ్యంబు పరమపావనత చేతను, బహుళసత్త్వ యుత
యోగభోగాకరము; భోగి యోగి నిలయమ్ము నయి తా, నచలంబు, సత్కృతమయిన భూమి
భరతమాత! తత్పాదసంస్మరణచేత - నవనవోన్మేష సౌఖ్యతనమ్ము నగుచు.

అపవిత్ర తాపసీ హాసనంబు నిరోధించె శాసనం జేసి తపోధనాళి
కలుషరాసుల ప్రోలంగ సర్వక్షేత్ర ప్రపంచంబు పేమారు పంకబిత్తు
అజ్ఞానతమసము మారియించు సవిష్ణక్తి తేటమోహాంధమున్ తక్కి
నిఖిలసర్వస్థాని నిలువరించు పవిత్ర సస్యాళి జేమాత ప్రాగ్నికోల
విమలగుణ సస్కృతము నిల్పి యోజేసి యాగమునకే నిరాగంబు నొసఁగి
తే మహోన్నత తత్వ ప్రకృతి నెరసు నేడు నవనవోన్మేష సౌఖ్యతనమ్ము నగుచు.

క్లిష్ట సుఖాదిసంఘటనమే తల్లికి కలంకరము సబ్బను గలుగఁజేయ
జేద్ద్వంద్వముల కైన నీతల్లి యమృత నతిశాంత్య దృష్టిత యాంత్రికతన
యుగయుగంబులకైనఁ బెగ్గైన పగ్గైన నీతల్లి నిమురము ప్రాతస్మృతి
అవతారపురుషులే యవతరింపఁగ నీవ తల్లి నరక్రియ నెనరు
ఇట్టి తల్లిని తల్లికే పట్టాభిషేకము చేయుఁ సౌష్ఠవైన సానందమయము
పవిత్ర భారత మాత సంస్కృతి సౌఖ్యతనమ్మయాతఁ గూర్పు.

ఒక మహాకవివాక్ప్రకాశంపు లోని రత్నఖనికాఁ గాఁగ
ఒక మహర్షిని యమృత ప్రపంచమును రాజ్యంబితికాఁగ
ఒక్క ప్రశస్త్ర ధర్మసంస్థాపనంబె మేలునొనుపు కాఁగఁ
ఒక పుణ్యపురుషుని సత్కీర్తి జగత్ క్షోభ హర్త ఘనస్ఫూర్తి కాఁగఁ
గవివరుల ఋషిగలను బ్రహ్మర్షులను బుణ్యపురుషస్మృతిఫలఁ గన్నట్టి భరతమాత
మహితపాదారవిందసంస్మరణచేత - నవనవోన్మేష సౌఖ్యతనమ్ము నగుచు.

కర్మంబు లాచరింపఁ గాంచినయు నైసర్గిక సిద్ధి నొసంగు ప్రసిద్ధశక్తి
నగంజకాంచి యసంఖ్యగా సందేశ పరమపహార్యంబు నెరపు నేర్పు
సకలంబు నశియించు సమయంబునందైన లయము గానంగ నలంకపవము
అజరామరంబైన యాత్మోన్నతి వెలుఁగఁజాచి పురుషార్థసాధనంబు
నే మహోన్నత శ్రద్ధల నొసఁగ నేర్పె - యమృతమయులను జేసి నా యాంబ మధుర
పదకములనేరిచె ముక్తిపథము గనఁగ - నాదిదేవుని గొల్తు నుగాదినాఁడు.



సతీ నిర్యాణము

చిత్రకారుడు : శ్రీ [illegible]

ప్రస్తావన

సర్వజిత్తు నిష్క్రమించి సర్వధారి ప్రవేశించినది. నూతనసంవత్సరారంభమున భూతభవిష్యత్తులను గురించి తలపోయుట స్వాభావికము. గత సంవత్సరము కన్న రాబోవు సంవత్సరమును సుఖప్రదముగను, సంతోషప్రదముగను చేసికొనగోరుటయే దాని ఉద్దేశము. పూర్వానుభవమును స్ఫురణకు తెచ్చుకొనుట భవిష్యద్వ్యవహారమునకు ప్రయోజనకరముగను, గుణపాఠముగను నుండునని పెద్దలవాక్యము. అయితే ఈగుణపాఠము నేర్చుకొనుట జరుగుచున్నదా అని ప్రశ్నించినచో తృప్తికరమైన సమాధానము లేకపోవచ్చును. అయినను ప్రయత్నము వాంఛనీయము. సంవత్సరాదినాడు ఏరీతిగా ఉండిన సంవత్సరము పొడుగునను అదే విధముగ నుండునని సామాన్యముగా అనుకొందుము. అనగా ప్రయత్నశూన్యముగా అట్లు జరుగునని అర్థము కాదు. నాటి సంకల్పప్రవర్తనల గాఢతనుబట్టి యుండునని అర్థము. నూతన సంవత్సరనిశ్చయములు అనునది అందరును వినుమాట. కార్యసాధనకు నాడు మనస్సును ఉత్తేజపరచుకొనుట అని భావము. ఉద్విగ్నమానసిక స్థితియు, అందు గాఢముగా కార్యనిశ్చయదీక్ష హత్తుకొను అదనులు అపుడపుడు మాత్రమే తటస్థించును గాని పొడుగునను ఉండవు. అదవరకు ఎట్లున్నప్పటికిని పండుగదినము వచ్చునరికి అదవరకు లేని సంతోషమును తెచ్చిపెట్టుకొనగలుగుట నిత్యపరిస్థితిని అధిగమించి ఆనందపరిస్థితిని కలిగించుకొనగలుగుట అంతులేని శక్తి మనస్సునందు ఇమిడియున్నదని వ్యక్తము అవుచున్నది. అట్టి సంతోషపరిస్థితిని కల్పించినపుడు చేసికొనిన నిర్ణయములు, సంకల్పములు ఆచరణకు సులభసాధ్యములవును. అందుకు సంవత్సరాదికన్న ఉత్తమ దినము, శుభదినము లేదుకదా?

సర్వజిత్తు ప్రపంచమునకు—ముఖ్యముగ భారతీయులకు సంతోషవిషాదసంఘటనలతో కూడినది. బ్రిటను రాజ్యాధికారమును భారతీయులపర మొనర్చినది. కాని దానితోపాటు భారత దేశమును విభజించి పోయినది. విభజనకన్న చేయగలిగినది, చేసినది మహాపచారము ఇంకొకటి లేదు. బ్రిటిషుపరిపాలనావిధానము భగ్నమైనదనుటకు ఇంతకన్న వేరు నిదర్శనము అనవసరము. ఇది తమ పరిపాలనాశయ (Fulfilment of British Rule in India) సిద్ధి యని వారు అనుకొనుచుండిరేమో తెలియదు. ఏసమస్యను పురస్కరించుకొని దేశవిభజనకు ఒడబడిరో ఆసమస్య నేటికి ఇంకను పరిష్కారము కాలేదు. తాము వచ్చినపుడు భారతదేశము ఏస్థితియందున్నదో అదేస్థితియందు తిరిగి వదలిపోయిరి. దేశమును విభజించుటయేగాక సంస్థానములకు స్వాతంత్ర్యము నిచ్చుటతో వారి సహృదయతను మరింత శంకించవలసిన పరిస్థితి ఏర్పడినది. కనీసము ౧౯౪౬ మే ప్రణాళికకు అంటిపెట్టుకొనియుండినచో అది కొంతవరకు వారి నిష్కల్మషబుద్ధిని ధ్రువపరచియుండెడిది. దేశవిభజన సైనికరక్షణదృష్ట్యా సాధ్యము కాదని, విభజన అల్పసంఖ్యాక సమస్యను పరిష్కరింపజాలదని, ముస్లిములు ప్రత్యేక జాతి కాదని వారు నాడు తెలిపిరి. యూనియనునది సంస్థానములతో చేరి నిర్మింపబడవలెనని చెప్పిరి. కాని చివరకు దానికి విరుద్ధముగ ప్రవర్తించిరి. మే ప్రణాళిక ఉపసంహరింపబడుటకు కారణము కాంగ్రెసు, లీగులు అంగీకారమునకు రాకపోవుట అని వారు వాదించవచ్చును. కాని ఇది రెండుపక్షముల వాదములను సమన్వయపరచి సృష్టించితిమని చెప్పుకొనిరి కదా? అంతేకాక ఇది అంత్యప్రణాళిక యనియు, తమకు తామై ఇక ప్రయత్నించమనియు తెలిపిరి. పంజాబు బెంగాలులలో ముస్లిములను నిలుప శక్తిలేక విభజనతప్ప మార్గము లేదని అభిప్రాయపడిరని అనుటకు వీలులేదు. సింధులో నివారింపగలిగినవారు ఈ రెండు రాష్ట్రములందును నివారింపగలిగియుండెడివారు. రాష్ట్రీయస్వాతంత్ర్యమను సాకుమీద కల్పించుకొన తిరస్కరించిరిగాని, ఆదిలోనే ఆ రెండురాష్ట్రముల గవర్నరులు పట్టుపట్టి, మంత్రివర్గములను బరతరఫుచేసి పరిపాలనను తాము వహించియుండినచో పరిస్థితులు ఉధ్వాన్నస్థితికి వచ్చెడివి కావు. అదియుగాక మే ప్రణాళికను అంగీకరించితిమని లీగు కేంద్రప్రభుత్వములో చేరి ఆపిమ్మట లేదనినపుడు వేవెలుప్రభువు వానిని బర్తరఫుచేసియుండినను కూడ భారతచరిత్ర భిన్నముగ నుండెడిది. అయితే కాంగ్రెసుకూడ అసామ

కారకు వర్గీకరణవిషయమైన పట్టుపట్టుట మూలమున పరిస్థితి కొంతవరకు క్లిష్టమగుటకు కారణమైన దన వచ్చును. ప్రథమమున లీగు అంగీకరించినపుడే మే ప్రణాళికను అంగీకరించిన ఎట్లుండెడివో? వేవెలు ప్రభువు అల్లరులు జరుగుచున్న పంజాబురాష్ట్రము నందు బ్రిటిషుఅధికారమును ఉపసంహరించిన బాగుండు ననె ననియు, అట్లే బ్రిటిషుప్రభుత్వమునకు తెలిపె ననియు ప్రధాని అట్లీ తెలియజేసెను. అపుడే ఫిబ్రవరి ప్రకటన వెలువడినది. బ్రిటిషుఅధికారము ఉండి ఉద్ధరించినది లేదు. ప్రజలే తమలో తాము ఏదోవిధమున పరిష్కరించుకొని యుండెడివా రని వేవెలు ప్రభువు అభిప్రాయపడియుండవచ్చును. ఆయనసూచన అంగీకరింప బడలేదు. ఉండి ఉద్ధరించినది లేనప్పుడు అసలు అధికారమును కేంద్రప్రభుత్వమునకు వప్పగించి వైదొలగినచో ఆసూచనను అనుసరించియుండెడిది. కేంద్రప్రభుత్వమున లీగుప్రతినిధులు చేరుటకుముందు అమాత్యప్రణాళికను అంగీకరించితినని జిన్నాగారు చెప్పి తరువాత కాదనినపుడు వేవెలుప్రభువు ఊరకొనుటతో లీగు వైఖరి మరింత బిరబిగిసిపోయినది. ఎప్పుడైతే వేవెలు ప్రభువు కలకత్తా దురంతములప్పుడు ప్రసక్తిచేసికొనక ఊరకొనెనో అప్పటికే జిన్నాగారు తన ఆట సాగునని గ్రహించెను. అమాత్యత్రయ రాయబారమప్పుడున్నంత గట్టిగా బ్రిటిషుప్రభుత్వ ముండబోదని ఆయనకు ద్యోతకమైనది.

వేవెలుప్రభువును తొలగించి, విభజనకార్యక్రమమును నెరవేర్చవలసినదని మౌంట్‌బాటన్ ప్రభువును బ్రిటిషుప్రభుత్వ మంపినది. అదివరదాక భారతఐక్యత చెడకూడ దనిన బ్రిటను ఇప్పుడు ఆ విశ్వాసమును మార్చుకొనుటకు కారణము గోచరించుటలేదు. కేవలము పంజాబుఅల్లరులు, బెంగాలుఅల్లరులు కారణ మనుటకు వీలులేదు. వాస్తవమునకు ఆ అల్లరులు వారి వైఖరివల్లనే పెరిగిపోయినవి. విభజన నిర్ణయమును సమర్థించుకొనుటకు వాటిని పెరుగనిచ్చిరేమో కూడ! అమాత్యప్రణాళికను వారు అమలుచేయలేని స్థితియందున్నారనుటకు వీలులేదు. కాబట్టి వారి వైఖరిలో ఆకస్మికపు మార్పునకు అంతర్జాతీయ వ్యవహారములే కారణమని ఊహించవలసియున్నది. మధ్యప్రాచ్యమందలి ముస్లిముదేశములను సుముఖులుగా చేసికొనుటకే ఇది మూలము.

మౌంట్‌బాటనుపథకము దేశమును విభజించినదికాని అసలు దానికి కారణమైన అశాంతిని నిలుపలేకపోయినది. ఉభయపక్షములు అంగీకరించినప్పటికిని హత్యలు, దురంతములు ఆగలేదు. ఆపథకము అమలు జరుగుటకు ముందు, తర్వాతనుకూడ జరిగినవి. ఇప్పుడు కూడ జరుగుచునేయున్నవి. ఉభయ అధినివేశముల నుండి లక్షలాది ప్రజలు స్వగృహములను వదలి వీధులపాలు కావలసివచ్చినది. కని విని ఎరుగని బాధలు పడవలసివచ్చినది. ఎందరో మరణించిరి. ఆత్మీయులకు దూరమైరి. కులమును, మతమును, మానమును కోల్పోయిరి. అందువల్ల మౌంట్‌బాటన్ పథకము భగ్నమైనదనియే అనవచ్చును. ఇంత బాధపడుటకు సిద్ధముగ నుండిన అమాత్యపథకమునే అమలుపరచియుండవచ్చునేమో?

దేశవిభజనయే పెద్ద విషాద మనుకొనిన దాని తరువాత అంతకన్న విషాదకరమైన సంఘటన జరిగినది. అది గాంధీజీహత్య. దేశవిభజన మతద్వేషమును పురస్కరించుకొని జరిగినది. విభజన ఆ ద్వేషమును తీవ్రమొనర్చినదిగాని ఆర్పలేదు. గాంధీజీ దానికి ఆహుతి కావలసివచ్చెను. దీనినిగురించి ఇంతకన్న చెప్పుట అనవసరము.

గాంధీజీ మరణించిన విధము మహోత్కృష్టమైన ఆయనకీర్తిని ప్రజ్వలింపజేసినది. కాని భారతదేశము మాత్రము సిగ్గుతో తలవంచుకొనవలసి వచ్చినది; వంచుకొనినది. చంపినవాడు హిందువు అని అనవచ్చును. అటువంటి హింసప్రవృత్తి ఉద్భవించుటకు కూడ లీగు ప్రారంభించిన మతద్వేష రాజకీయములే కారణము. హిందువైనను, ముస్లిమైనను అది దేశపతితస్థితికి నిదర్శనము. గాంధీజీ పోయిన తరువాతగాని ఆ మానసికదుస్థితి ఆకళింపుకాలేదు. ఆయన జీవించి భారతదేశమునకు స్వాతంత్ర్యమును సంపాదించెను. మరణించి దేశసంహతను మతసామరస్యమును ప్రగాఢమొనరించెను. మరణించనిమొదల నిరశనవ్రతమువల్ల కలకత్తా ఢిల్లీలందు హిందూ ముస్లిము సఖ్యతను స్థాపించినట్లుగానే పాకిస్థానులో కూడ ఆ సఖ్యతను స్థాపించగలిగెడువాడు. ఢిల్లీలో పరిస్థితి తనకు పూర్తిగా నచ్చినట్లు ఏర్పడినతరువాత పాకిస్థానుకు పోయి అక్కడ కృషిచేసెడివాడు. "భారతదేశములో పరిస్థితి చక్కబడినది నీరాజ్యమును చక్క

బరచు"మని జిన్నాగారిని అడిగెడువాడు. బహుశః జిన్నాగారికికూడ ఆయన రాక సహాయకారిగ నుండెడిది. పాకిస్థానుకు అది ప్రాప్తిలేకపోయినది.

మూడుదశాబ్దములుగా గాంధీజీయే భారతదేశము, భారతదేశమే గాంధీజీగా నున్నవి. శ్రీరామ నామముతరువాత గాంధీజీనామమంతగా ప్రజా హృదయములలో మరేనామము హత్తుకొనలేదు. ఆయన కేవలము స్వాతంత్ర్యోద్యమమును నడపిన నాయకుడే కాదు; భారతజాతికి జనకుడన్నమాట అక్షరాల సార్థకమైనది. ఆయన హత్యావార్త విన్నపుడు దుఃఖించని భారతీయుడు లేడు. భారతీయులకు ఆయన అవతారమూర్తి ఆయెను.

భారతప్రధాని పండిత నెహ్రూ చెప్పినట్లు ౩౦ సంవత్సరముల క్రితమే గాంధీశకము ఆరంభమైనది. గాంధీజీ ఆశయములను అమలుజరపుటకు ప్రయత్నించెదమని భారతప్రభుత్వము ప్రకటించినది. పండిత నెహ్రూ చెప్పినట్లు గాంధీజీసిద్ధాంతముల ననుసరించిననే తప్ప భారతసమస్యలు పరిష్కారముకాజాలవు.

ఇంతవరకు వచ్చిన కష్టములను భారతప్రభుత్వము సంతృప్తికరముగనే ఎదుర్కొని పరిష్కరించినది. సార్వభౌమత్వము ఎవరికిని సంక్రమింపక అంతరించిపోవు నను బ్రిటిషు ప్రకటన సంస్థానములనన్నిటిని స్వతంత్రములను చేసినది. పాకిస్థానుగా వడిపోయిన ప్రదేశము పోగా మిగిలిన దేశముకూడ వివిధరాజ్యములుగా విడిపోవు ప్రమాదము లేకపోలేదు. కాని సంస్థానశాఖామంత్రి సర్దార్ పటేల్ రాజకీయచాతుర్యము, సంస్థానాధీశుల వాస్తవిక దృక్పథములనుపట్టి అట్టి ప్రమాదము తొలగిపోయినది. హైదరాబాదు తప్ప మిగిలిన సంస్థానములన్నియు భారతయూనియనులో చేరిపోయినవి. బాధ్యతాయుత ప్రభుత్వములను స్థాపించుచున్నవి. నైజాము సమస్య కూడ ఈ మాసాంతమునకు తేలిపోగలదు. తానింత వరకు అనుసరించిన విధానముయొక్క దుష్ఫలితములను నైజాము గ్రహింపకతప్పదు. బ్రిటిషు ప్రభుత్వమే ప్రజావాంఛితమునకు లొంగక తప్పనపుడు ఇక తాను త్రోసిపుచ్చగల ననుకొనుట భ్రమతప్ప వేరుకాదు. భారతయూనియనును కాదని హైదరాబాదు సంస్థాన మనుగది మనజాలదు. కాశ్మీరుసమస్య ఉభయ అధినివేశముల చేతులను దాటిపోయినది. దాని పరిష్కారము ఐక్యరాజ్యసమితిమీద ఉన్నది. కాని అగ్రరాజ్యములు ఇదమిత్థమని నిర్ణయమునకు వచ్చువరకు ఆ సమస్య తేలునని చెప్పుటకు వీలులేదు. ఈ వైఖరికి కారణము భారత వైదేశికవిధానము విస్పష్టముగా లేకపోవుటయే.

అగ్రరాజ్యములలో ఏవర్గపక్షమున చేరమని, యుద్ధము వచ్చిన మనకు ఏ పక్షము వహించిన ఉపయోగమో ఆవైపున చేరెదమని ప్రధాని పండిత నెహ్రూ పదేపదే ఉద్ఘాటించెను. ఇది ఏవర్గమునకును తృప్తినివ్వక ఉభయులకు అసంతృప్తిని కలుగజేయక తప్పదు. అసలు అది ఒక విధానమని అనిపించుకొనజాలదు. బ్రిటను దేశవిభజనను సైనికవ్యూహదృష్ట్యా జరిపినదని పశ్చిమరాజ్యముల విధానమును గమనించిన బోధపడగలదు. పాలస్తీనానుండి దూరప్రాచ్యమువరకు వారనుసరించిన పద్ధతి దానిని ధ్రువపరచుచున్నది. అసలు కాశ్మీరును విభజించవలెనను సూచన అమెరికాది అను అభిప్రాయము లేకపోలేదు. ప్రథమమున పాలస్తీనాను విభజింపమని సూచించిన అమెరికా ఇపుడు ఆ ప్రతిపాదనను ఉపసంహరించుకొనినది. బహుశః పాలస్తీనావిషయము తేలువరకు కాశ్మీరుప్రశ్న కూడ తేలకపోవచ్చును. రెండును సైనికవ్యూహదృష్ట్యా ప్రాముఖ్యము కలవి. కాబట్టి వాటి పరిష్కారముకూడ పరస్పరాశ్రితము కావచ్చును. విస్పష్టవిదేశవిధానము అవసరమని కాశ్మీరు వెల్లడిచేయుచున్నది. వెనుక భద్రతామండలికి భారతప్రతినిధి పోటీచేసినపుడే ఈవిషయము వెల్లడి అయినది. అగ్రరాజ్యపు ఎత్తులందు చదరంగపు బంటుగా ఉండదలచలేదని పోటీనుండి విరమించితిమని ఆత్మశ్లాఘ ఒనర్చుకొంటిమి.

కాని భారతదేశమునకు అంతర్జాతీయముగా శత్రులెవరో, మిత్రులెవరో తెలియుటలేదు. అందుకు కూడ నిశ్చితమైన విధాన మవసరము. అంతేకాక జాతీయవిధానము, విదేశవిధానము పరస్పరబద్ధమైనవి గాంధీజీయే యుండిన ఆ రెంటిని ఒక విశిష్టమార్గమున నడిపియుండెడివాడు. ఆయనయెడ ఉన్న భక్తివల్ల ఇపుడు వాపోవుట జరుగుచున్నది. అంతేకాని ఆయన మరణమువల్ల దేశమునకు, ప్రపంచమునకు ఎంత నష్టము సంభవించినది ఆకళింపుకాలేదు. గాంధీజీ మూలమున ఆసియానేకాక యావత్ప్రపంచదృష్టిని భారతదేశము ఆకర్షించినది. అహింసాతత్వమే ప్రపంచ సమస్యల పరిష్కారమునకు మార్గ మని గ్రహించిన

సమయములో ఆయన గతించెను. దానితో అంతర్జాతీయముగ భారతదేశమునకు రావలసిన ప్రముఖస్థానమునకు అడ్డు వచ్చినది. ప్రపంచమునకు ఈనాడు గాంధీజీతో ఎంతైనను అవసర మున్నదని, చరిత్రను పరికించిన ప్రపంచములో నేడు ప్రబలిన పీడను, వరకస్థను తుదముట్టించగలది గాంధీజీఅహింసయే నని పండిత నెహ్రూ తెలిపెను. అందువల్ల ఆ సిద్ధాంతమును జాతీయ అంతర్జాతీయములందు అనుష్ఠించునట్లు చూచు బాధ్యత ప్రత్యేకముగ భారతదేశముపై నున్నది.

ఆర్థికపారిశ్రామికాభివృద్ధికి, దిగుమతులకు ఇతరులపై ఆధారపడవలసియున్నది. ప్రస్తుతము కీలక యంత్రములనుగాని, పెట్టుబడినిగాని ఇవ్వగల్గినది ఒక అమెరికా మాత్రమే కనబడుచున్నది. ప్రజాప్రభుత్వ రాజ్యము లన్నియు అమెరికానుండియే సహాయమును పొందుచున్నవి. యూరపునకు మార్షలు పథకము అను పేరున సహాయముచేసినట్లు ఆసియాకుకూడ నెహ్రూ పథక మను పేరున సహాయముచేయదలచినట్లు సూచింపబడినది. దానినిగురించి సంప్రతింపులు జరిపి పథకమును తయారుచేయుటకు సందేహింప నవసరములేదు. ప్రజాప్రభుత్వ సిద్ధాంతములకు, భారతఆశయములకు ఎక్కువ సామీప్య మున్నదిగాని రష్యా ప్రతిపాదించుచున్న కమ్యూనిస్టు నియంతృత్వమునకు సాన్నిహిత్యము లేదు. దౌర్జన్యపద్ధతులకు దిగకుండగనే సాంఘిక ప్రజాప్రభుత్వమును పార్లమెంటరీవిధానము ద్వారా స్థాపించవచ్చునని బ్రిటను రుజువుచేసినది. భారతరాజ్యాంగపు ముసాయిదా ప్రజాసత్తాక రాజ్యస్థాపనే ఆశయముగా వివరించినది.

దానిసత్వమూలమునను, యుద్ధపరిస్థితివలనను అణచబడియున్న ఉద్రేకము స్వాతంత్ర్యము లభించగనే ఒక్కపర్యాయము పైకుబికినది. నేడు దేశమున చెలరేగుచున్న అశాంతికి అదే ప్రధాన కారణము. కాని క్రమక్రమముగా స్వాతంత్ర్యముతో వచ్చిన బాధ్యతలను గుర్తించుట జరిగి దేశము స్తిమితము చెందగలదు. అట్టి పరిస్థితిని కలిగించుటకు అన్ని రాజకీయపక్షములును ప్రభుత్వమునకు తోడ్పడవలసియున్నది. సిద్ధాంతప్రచారము సాకుగా అంతఃకలహములు ప్రేరేపించినచో వచ్చిన స్వాతంత్ర్యప్రయోజనము వ్యర్థముకాగలదు.

ముఖ్యముగా పారిశ్రామికరంగమున శాంతి అనునది అవసరము అశాంతిని, అరాచకమును పెంపొందించి తమ రాజకీయప్రయోజనములకు అనుకూలముగ నుండునను వారు తప్ప మరేపక్షమును ఈసమయమున ఉత్పత్తిని తగ్గించుటకు ప్రయత్నింపదు. భారత ప్రభుత్వము పరిశ్రమలలో కార్మికవర్గమునకు భాగస్వామికున్న స్థానమున్నట్లే గుర్తించినది అందువల్ల ప్రభుత్వమును పెట్టుబడిదారులకు పాక్షికముగ నున్నారని నిందించుటకు వీలులేదు. అహింసామార్గమున స్వాతంత్ర్యమును సంపాదించినపుడు దేశ ఆర్థిక సాంఘికనిర్మాణము కూడ అదే పద్ధతిని సాధించవలసియున్నది. అంతేకాక అల్పసంఖ్యాకుల సమస్య ఇంకను ఆందోళనగనే యున్నది. వెనుకటంత ప్రమాదకరముగా లేనప్పటికిని సింధునుండి, తూర్పుబెంగాలునుండి హిందువులు తరలివచ్చుట ఇంకను తగ్గలేదు. కొద్దికాలములో ఉభయ అధినివేశముల సంప్రతింపులవల్ల సాధారణపరిస్థితి ఏర్పడవచ్చును. ప్రస్తుతఉద్రేకము తగ్గిన మీదట ఆత్మపరిశోధన జరిగి ఉభయ అధినివేశ ప్రజలు తాము పరాయివారము కామని గ్రహించి అనేక విషయములందు ఏకమార్గమున నడువవచ్చును. పాకిస్థానుతో రక్షణ ఏర్పాటుచేసికొనుటకు అభ్యంతరము లేదని ప్రధాని నెహ్రూ చెప్పియుండెను.

నూతనరాజ్యాంగమును జూనునాటికి పరిషత్తు ఆమోదించనున్నది. ఇప్పటికికూడ ఆంధ్రరాష్ట్రనిర్మాణము అస్థిరస్థితియందుండుట ఆంధ్రప్రజలకు నిరాశాభావమును కలిగించినది. ఈ స్థితికి కారణము వివరముగ ప్రత్యేకవ్యాసములో చర్చింపబడినది. స్థానికరాజకీయములను మాని ఇప్పటికైనను ఆంధ్రనాయకులు ఏకముఖముగ పనిచేసిన సర్వధారి గడుచునప్పటికే ప్రత్యేకాంధ్రరాష్ట్రము సిద్ధింపగలదు. దూరదృష్టితో వ్యవహరించిన ఈ మాసారంభముననే వచ్చియుండెడిది. కాని ప్రాప్తము లేకపోయెను.

సర్వజిత్తు పైన చెప్పినట్లు విషాదసంఘటనలతో కూడియున్నది. సర్వధారి అట్లుగాక సర్వవిధముల మంగళప్రదమగుగాక. గాంధీజీ బోధించిన ఉత్కృష్ట సిద్ధాంతముల ననుసరించి భారతప్రజలు తమ దేశమును నిర్మించుకొని ప్రపంచమునకు మార్గదర్శకులవుదురుగాక.

మహాత్మా! భారతోద్ధారకా!

శ్రీ గురజాడ రాఘవశర్మ

కదలిన తీర్థమై పొదలు నీపదములఁ బూలఁ బూజింపఁగా బుద్ధిపుట్టు
అమృతమ్ముఁ జిందించు విమలమౌ నీవాక్కు పరగ రాతిగుండె గరఁగఁజేయుఁ
గడుసుమాంత్రికురీతి వెడలు నీదృక్కులో లీనమౌ నెంతటివాని మనసు
మోహనమగు నీదు మూర్తిసన్నిధి నెంత శక్తిగలాఁడును స్తబ్ధుఁ డగును
ఇట్టి తేజోనిధానమౌనట్టి నిన్నుఁ దేరిపాఱఁగఁ జూడఁగలారె యెందు?
నీకతమ్మునఁ బే ర్గననేర్చెఁగాక కశ్చన యొకండు, విధిచేష్ట గడవఁగలదె?

పాపభూయిష్ఠప్రపంచమ్మునం దింక మనుటెల్లఁ బాపమ్ము గొనుట యొండె
కాలమ్మునకు నెంత ఘనుఁడైనఁ దాకట్టుపడకతప్పదు ధర్మబద్ధముగను
శ్రమ యెంతబడ్డ నీజాతి గుర్తింపదే విలువ గుర్తింతురా వెనుకజనము
లోకకల్యాణార్థమై కష్టపడు మహాపురుషనిర్యాణ మీకరణినగద
అనుచు జను లాడుకొనఁగల్గె నంతెకాని నీవు నిక్కముగా చనిపోవలేదు
జగతిలోన విద్యుద్దీప్తిచందమునను వ్యాప్తిజెందితి కీర్తికాయమ్ముతోడ
యుగయుగమ్ముల శ్రీపూరుషోత్తముఁడవు.

వసివాడలే దింక స్వాతంత్ర్యవిజయోత్సవారంభనవపుష్పతోరణమ్ము;
ఆరిపోలే దింక నూహూర వెల్గిన స్వాతంత్ర్యమంగళాభంగదీప్తి;
మరపురాలే దింక పురుషార్థపారిజాతక్షితిజాతోత్థ త్యాగబుద్ధి;
సమసిపోలే దింక సల్పిన సత్యనిష్ఠాబద్ధమౌ నహింసావ్రతమ్ము;
ఈయలేదింక విడకీసి యెవరివారి రాజ్యములు పంచి శ్రీరామరాజ్యముగను;
ఔర! ఫలభుక్తి మాకెల్ల చూఱవిడచి చల్లగా జారినా వనాసక్తియోగి!

ఇతఁడె హారుఁడు నిన్నుహరియింపఁగ, వే, లయకారుఁడై, మహో
ద్ధతిమెయిఁ బృచ్చజేసెను, పదంపడి తా నొసరింపఁబోవు దు
ష్కృతికి క్షమించుమన్నటుల గేలు మొగిడ్చి నమస్కరించెఁ; గా
కితరు డొకండు నిన్ను స్పృశియించునె? యింత తెగింపనేర్చునే?

మదనుఁ డొకండు నిన్ను బలిమార్పఁగ వచ్చిన నీడు సైచి, నీ
మృదుకృప వానిపైఁ జిలుకరించితి వీ తెగుదారినేతకున్;
మదిమది నిల్పి, కేల్మొగిచినాఁడవు రామ! హరే! యటంచు, నో
ర్వఁదరము గాని వీని యపరాధము నెమ్మది బెట్ట వింతయున్!

జాగది యేలనయ్య! కడసారి హరిన్ స్మరియింపు మన్నటుల్
జాగును గూర్చి హెచ్చరిక సల్పుచు, సాగిలి మ్రొక్కి, భక్తిచే
మూగిన వందలాదిగ సమూహము వెల్వడి, తాతలంపు గ
ట్టేగగజేసికోఁగలిగె నీతఁడు; నే మనువార మక్కటా!

“నే నొనరించు కార్య మవనిన్ గలదేని యతండె నిల్పు; లే
దా, నను గొంచుబోవును; విధాత్మని చెయ్దు మెఱుంగఁజాల; మ
జ్ఞానముగాక మీరిలెడు కావలికోటలు గట్టిపెట్టినన్
మానునె మిత్తి రాక; నను మన్చఁగ మాపఁగ నేర్చు దైవమే.

ప్రాణము లుండుదాక, హరి రామ హరే రఘురామ యంచిలన్
మానుగ మీ రహర్నిశలు మానక సంస్మరియింపు డొప్ప నా
ప్రాణములందు గల్గు ననురక్తిబలమ్మునఁజేసి, ప్రార్థనా
స్థానము, రాఘవస్మృతినిధానము కత్తులబోను నేతురే?

కర్తయు, భర్త, యింక లయకర్తయు నౌ రఘురాము నామసం
కీర్తన జేయుచున్ దనువు కేవలమున్ ద్యజియింప నెంచితిన్;
కర్తృతఁబూననేల నెటు కావలెనో కద యీశ్వరేచ్ఛ? సం
హర్తను జిన్నబుచ్చఁ గలనయ్య, తనంతట నచ్చి పిల్వఁగా?

మేన జనించు మృత్యువు, నిమేషము దన్నెడబాయకుండు, నె
వ్వానిని లెక్కసేయదు, కృపారహిత మ్మది, యంత్యకాలమం
దైనను శ్రీహరిస్మరణ యాగక నేగుట బుద్ధి; యీ హరి
జ్ఞానము గల్గువాఁ డొదుగఁ గల్గునె, రక్షకశిక్షకాళికిన్?

నిత్యమె యీ శరీర మది? నిత్యము శాశ్వతమైన యాత్మయే
సత్య మటంచు లో నెఱుఁగఁజాలినవానికి సర్వకాలమున్
మృత్యుభయమ్ము లే; దిఁక భ్రమింపఁగఁ జూతు రిదేల? పూర్వమె
ప్డో త్యజియించి భ్రాంతితనువున్ బదిలం బొనరించితిన్ మదిన్.”

అను నీ పల్కిన వేదవాక్యములె సత్యంబాయె; నీ భారతా
వనికిన్ నీవు స్వరాజ్య మీకరణి సంపాదించుటల్ వింత యే!
జని సాఫల్యము నొందగా ధర నహింసాధర్మమున్ నిల్పు నీ
కణుమాత్రంబగుఁ గాదె యియ్యది మహాత్మా! భారతోద్ధారకా!

చరితార్థంబగు నీదు పుట్టువు, అహింసాసత్యధర్మస్థిరా
చరణం జూపితి వద్దుజాడలఁ; బ్రపంచమ్మున్ బ్రవర్తింపఁగాఁ
దరియించున్; భవదీయజన్మ దగు కర్తవ్యమ్ముఁ బాలించిత
య్యా! రహస్యం బిదె! నిల్చు నీదు యశ మిం కాచంద్రతారార్కమున్!

అఘము హరించి, అజ్ఞత రయమ్మునఁ బాసి నిజాభిధేయమున్
లఘువుగ సంస్మరించు ప్రజలన్ దరిజేర్చెడి వేల్పొసంగుతన్
రఘుపతి, రాఘవా! యని నిరంతరమున్ దను బాడికొన్న మా
నఘునన కాత్మశాంతి భవనమ్ముల నింటను నింట వెల్గుచున్!

భారత లక్ష్మీ బ్యాంక్, లిమిటెడ్.

(స్థాపితం :_1929)　　　　　　　　　　(షెడ్యూల్డు :_1946)

హెడ్డాఫీసు: మచిలీపట్నం.　　　　**సెంట్రల్ ఆఫీసు: 15-ఏ, ఆర్మీనియన్ వీధి, మద్రాసు.**

Phone 3180.

బ్రాంచీలు :_మచిలీపట్నం – మద్రాసు – కాకినాడ – గుడివాడ – గూడూరు – గవర్నరుపేట (బెజవాడ) – బెజవాడ
బొబ్బిలి – నరసాపురం – నూజివీడు – రామరావుపేట (కాకినాడ) – గాజోలు - కావలి.

అధికారముపొందిన మూలధనం	రు. 10,00,000
జారీచేయబడి, చందావేయబడిన మూలధనం	రు. 7,50,000
పిలువబడిన మూలధనం	రు. 5,75,000
చెల్లించబడిన మూలధనం	రు. 5,74,875
మొత్తం వ్యాపారం (31 12-47)	రు. 67,93,000


చైర్మన్, బోర్డు ఆఫ్ డైరెక్టర్సు,

శ్రీ రాజా రావు స్వేతాచలపతి రామకృష్ణ రంగారావు బహదర్ వారు, రాజా ఆఫ్ బొబ్బిలి.

ఫిక్సడ్, సేవింగ్సు, కరెంటు డిపాజిట్లు అంగీకరించబడును. వడ్డీరేట్లువివరములు ఏ బ్రాంచిలోనైనను తెలిసికొనవచ్చును. మూడుసంవత్సరముల క్యాష్ సర్టిఫికెట్లు ఒక ప్రత్యేకత. నగలు మొదలగునవి భద్రముగా ఉంచుట అమ్ముట, వడ్డీ వసూలు చేయుట, అప్పులు, ఓవరుడ్రాఫ్టులు మొదలగు అన్ని బ్యాంకింగు సౌకర్యములు ఏర్పాటు చేయబడెను.

దయచేసి వివరములకు వ్రాయ ప్రార్థన.　　　　భోగరాజు వేంకటరత్నం,
మేనేజింగు డైరెక్టరు.

★ ★ రేడియో సిరా ★ ★



వాడితే కలము బాధ లేవీ వుండవు

విలువగల ఫౌంటెన్ కలములకు
క్షేమకరమైనదని
పూచీ నివ్వగలము
సులభంగా వ్రాయును
ముద్దకట్టదు. వ్రాతకు
ఆటంకము కలుగచేయదు
పాళీలను కొరకదు.
తుప్పు పట్టనీయదు.

విక్రయపు ఏజెంట్లు :
బెస్ట్ అండ్ కో లిమిటెడ్.
మదరాసు.

బ్రాంచీలు : హైదరాబాద్ (డక్కన్)
విశాఖపట్టణము, కాకినాడ, పుదుచ్చేరి.

గాంధీమహాత్ముడు

శ్రీ భోగరాజు పట్టాభిసీతారామయ్య

మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ అని ఆయనగారి పూర్తిపేరు. దేశాచారమునుబట్టి మొదటి పేరు తనదియు, రెండవది తండ్రిగారిదియు, మూడవది ఇంటిపేరున్ను అయియున్నవి. గాంధి అనగా చిల్లరకొట్టు వర్తకుడు. బజాజ్ అంటే బట్టల వర్తకుడు. అటువంటి ఘూర్జర దేశస్థుడు చివరకు 'గాంధీమహాత్ముడై, మరణ విధానముచేతను,' జీవితచరిత్రచేతను అమరపురుషుడై అవతారమూర్తులలోనైతేనేమి, చిరంజీవులలోనైతేనేమి పదవ వ్యక్తిగ పరిగణింపబడి, పూర్ణపురుషుని ఆదర్శమునకు అత్యంతసన్నిహితులైరి.

పుట్టుపూర్వోత్తరములతో మనకు సంబంధము లేదు. ఋషులయొక్కయు, నదులయొక్కయు జన్మలెటులున్నను, వారి మహత్తునకు ఎట్టి కళంకము నుండజాలదని మన పూర్వులు చెప్పియున్నారు. జన్మ ఆగర్భశ్రీమంతునిదైనను, జీవితము దరిద్రనారాయణుల సేవయందే గడపుట సంభవించినది. లక్షలరూపాయలు చేతులగుండ రాకపోకలు జరుపుచున్నను, తనది అన్న వస్తువు ఒక్కటైనను ఆయనది లేదు. గిన్నె, పంచా, కర్ర, రాటము, ఘడియారము, కళ్ళద్దములు, చెప్పులు టోపీ—ఇవి ఆస్తిగ పరిగణింపబడజాలవు. ఇవి అవయవములతోబాటు నేత్రములకు ప్రతినేత్రములు, పాదములకు ప్రతిపాదములు, హస్తములకు ప్రతిహస్తములు, శిరస్సునకు ప్రతిశిరస్సుగనే భావింపబడవలసి యున్నవి. ఒకరి కళ్లజోడు ఇంకొకరికి వినియోగించవు. ఒకరి పాదరక్షలు ఇంకొకరికి పట్టవు. కావున ఇవి ఎవరివి వారికి ప్రత్యవయవములు. ఆస్తి కాజాలవు. మానవశరీరము దహింపుపొందిన పిమ్మట ఇవి ఆశరీరమునకు భౌతికచిహ్నములుగ పరిణమించును.

ప్రపంచములో మహనీయులనియు, మహాత్ములనియు, అవతారమూర్తులనియు, ప్రవక్తలనియు పిలువబడువారి మహత్తు పూర్వజన్మసంస్కారఫలితమా, లేక స్వోత్కృష్టసంపాదనయా అన్న ప్రశ్నకు ఉత్తరము చెప్పగలవారు లేరు. పునర్జన్మసిద్ధాంతమును గూర్చి, ప్రపంచములోని క్లిష్టసమస్యలను తీర్చుటకును, కష్టములను తరించుటకును అనుకూలమైన సమాధానము, సాధనము అని ఎన్నవచ్చును. ఇక్కడ కూడ మాహాత్మ్యముయొక్క పుట్టుకమూలకారణముతో మనకు నిమిత్తము లేదు. కాని మాహాత్మ్యము ఎట్టిదో తెలియగోరుట సహజము. లోకములో రాగద్వేషములు మానవులకు స్వభావసిద్ధములు. 'వీతరాగభయక్రోధః' అనదగినవారే మహాత్ములు; స్థితప్రజ్ఞులు. ఆశ, భయము—ఈ రెంటిని జయింపదగిన వ్యక్తి ప్రకృతిని జయించిన మహాత్ముడు. ఆశయొక్క రూపాంతరమే భయము. ప్రాణముమీద ఆశ లేనివానికి ప్రాణము పోవునను భయ మెక్కడ? ఆస్తిమీద ఆశ లేనివానికి ఆస్తి రాలేదనికాని, రాదనికాని, పోయినదనికాని దుఃఖము-భయము ఎట్లు కలుగగలవు? కావున ఆస్తి ఎట్టిదో, రాగద్వేషములును అట్టివే. కాబట్టి కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములు పతితుని దశలు—అంతర్దశలుగాని వివిధములగు దుర్గుణములు గావు. ఈ యరిషడ్వర్గములు వర్గములును కావు; షట్ (ఆరున్నూ) కావు. ఇవి ప్రకృతియొక్క రూపములు-రూపాంతరములు. వీని విరోధులు బ్రహ్మచర్యము, అపరిగ్రహము, అస్తేయము. గాంధీమహాత్ముని వివాహము బాల్యమందు జరిగినను, యౌవనమందే, 3౭ వ ఏట బ్రహ్మచర్యవ్రతమును పూని, ౭౯ వరకు అవిచ్ఛిన్నముగ జరుపుకొనెను. ఆగర్భ శ్రీమంతుడైనను దారిద్ర్యమును, త్యాగమును పూని, అపరిగ్రహమును

ఆవలంబించెను. ఏ భోజనమున కా భోజనమే ఏర్పరచుకొని, సాయంత్రమునకు దాచిపెట్టుకొనుట దొంగతనము(స్తేయము)గ నెంచి అస్తేయవ్రతమును పూనెను. ఇట్లు నాలుగు ఆశ్రమములను ఏకకాలమందు జరిపి, వివాహితుడైనను బ్రహ్మచారిగా నుండి, భార్యాభర్తలు ఉభయులు వానప్రస్థులై, చిల్లిగవ్వ అంత స్వంత ఆస్తిని పొందక సర్వసంగపరిత్యాగి అయిన సన్యాసమును పుచ్చుకొని, స్థితప్రజ్ఞుడై, లోకములోని చెడుగులను సంస్కరించి, తన జీవితమును చాలించెను. ఇంటిలో బిడ్డ ఎదుగుచూ ఉన్నను, బలుస్తూ ఉన్నను, చిక్కుతూ ఉన్నను తల్లిదండ్రులకును, సన్నిహితులకును తెలియదు. అట్లే దేశమంతయు స్వమతము, స్వవేషము, స్వభాష మున్నగునవి కోల్పోయి, ఆంగ్లమానసపుత్రులగుట ౧౯౧౫ లో దక్షిణాఫ్రికానుండి స్వదేశము వచ్చినపిమ్మట గాంధీమహాత్మునికి తట్టినట్లు ఇచ్చటి పెద్దలకు తట్టదయ్యె. దీని కారణము ఏమి యని యోచించి, అంతయు స్వయంకృతాపరాధముగ నెంచుచు, ప్రతిక్రియనుగూర్చి చింతింపగా, అసహయోగముతప్ప మార్గాంతరము గానిపింపదయ్యెను. ౧౮౫౭ సంవత్సరపు తిరుగుబాటులో బ్రిటిషువారికి జయము చేకూరినపిమ్మట వారు కోటలను పెంచక, సేనను పెంపొందింపక, మందుగుండుసామానులను వృద్ధిచేయక మద్రాసు, బొంబాయి, కలకత్తా నగరములందు విశ్వవిద్యాలయములను స్థాపించి, ఈ నూతనవర్గములందు తయారయిన విశ్వవిద్యాలయస్నాతకులను సిపాయీలుగ చేసి, తమయొక్క సారస్వతమునే మందుగుండు సామానుగ నుపయోగించి, వీనిద్వారా అదివరకు దేశమును మాత్రమే జయించిన ఆంగ్లేయులు భారతీయుల హృదయములను, మనస్సును, భావములను స్వాధీనపఱచుకొని, ఆంగ్లసామ్రాజ్యమును చిరస్థాయిగ నుంచు పునాదులను వేసి, అందుపై సర్వాంగశోభితమగు సామ్రాజ్యభవనమును నిర్మించి, వారి చదువు, వారి భాష, వారి సారస్వతము, వారి సేవ, వారి జీతములు, వారి పించన్లు, వారి బిరుదులు మహాభాగ్యముగ నెంచుకొని, దేశములోని వివిధవర్ణములవారును ఒకరితో నొకరు పోటీపడి, పరవిద్యలలో తులతూగుచు, హిందువులకు ప్రతిగ మహమ్మదీయులును, బ్రాహ్మణులకు ప్రతిగ బ్రాహ్మణేతరులును, హిందూమహమ్మదీయులకు ప్రతిగ సిక్కులును, వైద్ లకు ప్రతిగ కాయస్థులును, కాయస్థులకు ప్రతిగ రాజపుత్ర క్షత్రియులును, క్షత్రియులకు ప్రతిగ జాట్లును, జాట్లకు ప్రతిగ భూమిహార్యాలును పరస్పరవైమనస్యములను పెంచుకొనుచుండిరి.

గాంధీమహాత్ముని దూరదృష్టి, ఆత్మవిశ్వాసము కలిసినూతనపంథను కనిపెట్టగలిగెను. ఈమహోద్యమము యొక్క ప్రమేయము క్రమక్రమముగ పెరిగి, దేశము యొక్క పలుముఖములను ఆవరించుచు, అన్నిరంగ తులవారికిని కాంగ్రెసుఉద్యమముపై విశ్వాసము కలుగసాగెను. ధర్మభంగమును గాంచినను అస్పృశ్యతా నివారణ ఉన్నతజాతులు అనుకొను హిందువులకును ముఖ్యముగ పాలేళ్లచే సాగగా వ్యవసాయము చేయించుకొనగోరు భూస్వాములకును [illegible] మయ్యెను. విద్యార్థులకు పాఠశాలాబహిష్కారము న్యాయవాదులకు వృత్తివిసర్జనయు, శాసనసభ్యులకు ఉద్యోగత్యాగనయు లోకజ్ఞానవిరుద్ధములుగ గనిపించెను. తాడి, ఈత, కొబ్బరిచెట్ల సరుకును [illegible] వ్యాపారస్థులకును, తద్దా [illegible] తులకును ఆత్మహత్య అనిపించెను. వర్తకులకు విదేశవ్యాపారబహిష్కారము ఆర్థికహీనముగ తోచెను. అడుగడుగునకు ఎదుర్కొను [illegible] ఆటంకములను తరించిన గాంధీమహాత్ముని ధైర్యస్థైర్యములు సత్యాహింసలయెడల వారికి గల భక్తిగౌరవములు గాక మరి ఎట్లు జనించగలెను?

గాంధీమహాత్ముని సత్యాగ్రహోద్యమము [illegible] క్రమాగతముగ వృద్ధిపొందిన [illegible]. ౧౯౨౦ వ సం.వ [illegible] సం. [illegible] జయి [illegible] మొదటి సత్యాగ్రహోద్యమము [illegible] గనే వారు పూనిరి. ఫలితము [illegible]. పునాదులలో వేసిన [illegible] పైకి [illegible]చునా? ౧౯౩౦ వ సం.న వారి వయస్సు [illegible] యున్న పుడు ఉప్పుసత్యాగ్రహము [illegible], సామ్రాజ్య [illegible] ము యొక్క గోడలను లేవనెత్తిరి. ౧౯౪౦ వ సం.న ౭౦ సంవత్సరముల వయస్సులోనున్నపుడు, యుద్ధసంరంభమున [illegible] సత్యాగ్రహమును ప్రారంభించి ౧౯౪౨-౪౫ వరకు జరిగిన పోరాటముద్వారా స్వరాజ్యప్రాప్తికి సాధనములను గల్పించిరి. సత్యాగ్రహమునకు [illegible]ధనములు లేవు,

జయాపజయములు లేవు. సుఖదుఃఖములు లేవు. ఎంత వరకు జరిగిన నంతవఱకే జయప్రాప్తి నందును. జయాపజయములు సాపేక్షములుగాని స్వతస్సిద్ధములు గావు. జయమన్నది అపజయ పరంపరల పరిపక్వము. అపజయ మన్నది జయసౌధముయొక్క సోపానము.

గాంధీమహాత్ముని ఉద్యమము ప్రజాసామాన్యము యొక్క సానుభూతిమీదను, తమ సిద్ధాంతముల యొక్క అమోఘత్వముమీదను ఆధారపడియుండెను. ఆంగ్ల రాజ్యము స్టేటు సెక్రెటరీగారి ఉత్తరువులను గ్రామ గ్రామాలకు రెండుగంటలలో జారీచేయగలుగు ఏర్పాటు మీద ఆధారపడియున్నసంగతి గమనించి, కాంగ్రెసు నిర్మాణమునుకూడ గ్రామములనుండి మన 'సెక్రెటరీ ఆఫ్ స్టేట్' అగు గాంధీమహాత్మునివరకు కాంగ్రెసు యొక్క సంస్థలద్వారా కట్టుదిట్టముగ చేయుటవలన ఈ మహానీయుడు సృష్టికి ప్రతిసృష్టిగావించి, రవి యస్తమింపని ఆంగ్లరాజ్యమును పరాజితముగ జేయగల్గెను. గాంధీమహాత్మునికంటె యెక్కువ బుద్ధిమంతులు, మేధావులు, వక్తలు, వ్రాయసగాండ్రు, యుక్తిపరులు లేకపోలేదు. కాని ఈ గుణపుంజములన్నియు గలిసిన మహారాశియై, సత్యాహింస లనెడి చుక్కానిగలన జీవితయాత్ర యను సముద్రముపై జాతీయత యను ఓడను జయప్రదముగ నడిపించి గమ్యస్థానమును పొందింపగల్గెను. ఓడ రేవు చేరినతరువాత నావికుని కర్తవ్య మేమో ఈయన గుర్తింపగల్గుట సంతసనీయమే గదా! స్వభావసిద్ధమే గదా! వెంటనే యీ నావను తిరిగి సప్తసముద్రాలపై పోషము చేయించక పూర్వము నావలోని బాటసార్లు పరస్పరమైత్రితో మెలగెదరా? లేనిచో వైమనస్యము లెట్లు సంభవించెను? వాటి నివారణమార్గము లెట్టివి? అందులకై ఇంక తాను చేయవలసిన త్యాగము లున్నవా? అను పరిశోధనలలో నిమగ్నుడై హిందూ మహమ్మదీయఐక్యతను సమకూర్చి ఘనీభవింపజేయు నుద్దేశముతో నవాఖాలీ కేగి, పాట్నా యరిగి, ఢిల్లీ కేతెంచి, ఏ ఐక్యతకొఱకు ౧౯౨౦లో అసహాయోద్యమము నారంభించెనో, పూర్తిగ నెరవేరని ఆ ఫలితముకొఱకే జీవితయాత్రను ఒక తోడిమతస్థుని చేతిలో దేశమునకును ప్రకృతికిని అర్పించెను. 30 వ జనవరినాడు బిర్లాపార్కునందు వారి శరీరమునుండి ప్రవహించిన రక్తమ్ముచే పోషితమై, సర్వసమైక్యత లను బీజములు మొక్కలై పెరిగి పెంపొంది పూవులు పూచి, కాయలు కాచి, పండ్లు పండి ఆసేతుహిమాచలపర్యంతము నీడ నిచ్చి ద్వారకనుండి ప్రాగ్జ్యోతిషపురమువఱకు సుఖదాయకమై భారతవర్షమును తోడిజాతులవారి సరసన అగ్రస్థానము వహింపజేయుగాక!

గాంధీమహాత్ముడు పూర్ణపురుషుడు అని ఒకానొకప్పుడు (౧౯౩౯లో) నేను వర్ణించినపుడు "అవతారమూర్తి యంటే అందువుగాని, పూర్ణపురుషు డని చెప్ప రాదు" అని నన్ను ఆయన మందలించెను. అవును, నిజమే. ఉపనిషద్వాక్యమునందలి పూర్ణపురుషుని వర్ణనను బట్టి నా వ్రాతకంటె ఆయనవిమర్శనయే సత్యముగ తోచుచున్నది.

పూర్ణమదః పూర్ణమిదం
పూర్ణాత్పూర్ణముదచ్యతే,
పూర్ణస్య పూర్ణమాదాయ
పూర్ణమేవావశిష్యతే.

ఇంక అవతారమూర్తి యనెదమా? ఆక్షేపణ ఏముండగలదు? ఆదిని జీవము జలమునందు పుట్టిన మత్స్యమై, జలస్థలములందు నివసించు కూర్మముగ మారి, స్థలవాసి యగు వరాహరూపమున, ఇంకను పూర్వవాసనలు వదలలేక 'పంది బురద మెచ్చు పన్నీరు మెచ్చునా' యను కవివాక్యమునకు ఆధారభూతమై, అరణ్యరాజయిన నారసింహమై, మానవసృష్ట్యాదియగు వామనరూపమును దాల్చి, ఖడ్గప్రయోగముచే క్షాత్రవంశమును సంహరించిన పరశురాముడై, దుష్టమూర్తియగు రావణుని సంహారము గావించిన శ్రీరాముడుగ మారి, జీవహత్యను త్యజించి, భూగర్భమునుండి ఆహారపదార్థములను జనింపజేయు బలరాముడై, భూతదయను బోధించిన బౌద్ధావతారమై, చివరకు అహింసాసత్యములను ప్రపంచమున కెల్ల పాదరక్షలుగను, ఛత్రములుగను నుపకరింపజేసిన కల్కియని యూహింపదగిన గాంధీమహాత్ముని అవతారపురుషునిగ భావించుటలో ఆశ్చర్యమేమి? అహింస ఆయనయొక్క అస్త్రశస్త్రములలో డాలుగను, సత్యము కత్తిగను పరిణమించిన పనులలో అతిశయోక్తి ఏముండ గలదు? 'నేను' అన్న కేంద్రమునుండి 'మమ' యను


కైవారము గల సంకుచితచక్రములో సంచరించు మానవకోటిమధ్య అహంకార, మమత్వములను త్యజించిన పురుషుడు మహాత్ముడు కాకున్న మరి యెవ్వరు మహాత్ములు కాగలరు? ఆనాడు భీష్ములు ధర్మరాజునకు బోధించిన నిత్యోపవాసము, నిత్యబ్రహ్మచర్యము, నిత్య ఆతిథ్యము ఎక్కడ? గాంధీమహాత్ముడు 36వ ఏటినుంచి అవలంబించిన ఘోరబ్రహ్మచర్యము, ఘోరతరఉపవాసము, ఘోరతమ ఆత్మసమర్పణ ఎక్కడ?

ఒకానొకనాడు భీష్ముని వాక్యములు ప్రసంగవశమున నేను ఆయనకు వినిపించినపుడు 'చూడు' అని ఏవగింపుతో ఆయన బదులు చెప్పగా "మీకు ఏవగింపు అయితే కావచ్చును. మాకు ఆదర్శమే" అంటిని. గాంధీమహాత్ముని సత్యవ్రతనిర్వచనము ననుసరించి మరియొకరు మనపేర వ్రాసిన లేఖను తిరిగి వారు తీసుకొనదలచినపుడు ఆ లేఖయొక్క ప్రతిని మనవద్ద నుంచుకొని మూలము నిచ్చుట అసత్యము. అహింసయొక్క నిర్వచనము చేయునపుడు మనోవాక్కాయకర్మలందు హింసను హర్షించుట సర్వవిధహింసాతుల్యమే! లక్షల మధ్య అపరిగ్రహము, యువతుల మధ్య బ్రహ్మచర్యము, శత్రువుల మధ్య అహింస, అధికారము మధ్య ప్రాయోపవేశము బూనుట సామాన్యపురుష లక్షణములు గావు. సామాన్యులకు సాధ్యమును గావు. ఇట్టి ప్రశంసలు జరుగునపుడే గర్వభావముతో "అందుకనే నేను మహాత్ముడ నయినది" అని ఆత్మస్తుతితో పరిహాసము గావించగలిగిన మహాపురుషుడు గాంధీ. కోపమును చాలించి, దుఃఖముగ పరిణమింపజేయదగిన స్పష్టోక్తి. సర్వజనారాధన మధ్య వినయమును బూని, తా నెంత అల్పుడనో యని ఆత్మసంస్కరణకొఱకై యత్నించు వివేకి. వీతరాగభయక్రోధుడై ప్రవర్తింపగలిగిన స్థితప్రజ్ఞుడు.

ప్రజహాతి యదా కామాన్
సర్వాన్ పార్థ మనోగతాన్
ఆత్మన్యేవాత్మనా తుష్టః
స్థితప్రజ్ఞస్తదోచ్యతే.
దుఃఖేష్వనుద్విగ్నమనాః
సుఖేషు విగతస్పృహః
వీతరాగభయక్రోధః
స్థితధీర్మునిరుచ్యతే.
యస్సర్వత్రానభిస్నేహః
తత్తత్ప్రాప్య శుభాశుభం
నాభినందతి న ద్వేష్టి
తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా.

ఇట్టివారికి మృత్యు వెట్లు సంభవింపగలుగు ?





మరవరాని మహనీయవ్యక్తి

శ్రీ యస్. డి. శర్మ

గాంధీమహాత్ముడు ఆత్మార్పణము గావించి రెండు మాసములు గడిచినవి. కాని మన దుఃఖాశ్రువులు ఇంకను రాలుచునే యున్నవి; మన మనసులు ఇంకను దిగ్భ్రాంతిలోనే యున్నవి. అందువలన గాంధీమహాత్ముని వ్యక్తిస్వరూపమును యథార్థదృష్టితో పరిశీలించలేకున్నాము. మానవజాతిచరిత్రయందు ఆయనజీవితమునకు గల విశిష్టస్థానమును ఊహించజాలకున్నాము. ఆయన మహత్తును అంచనా వేయలేకపోవుచున్నాము.

మహాత్ముని దుర్మరణము ప్రపంచమునంతటిని కలచి వైచినది. నలుదిక్కులనుండి దేశదేశముల నాయకులు, పాలకులు, మంత్రులు, మతగురువులును తమ సంతాపమును వెల్లడించిరి. సత్యదూరమగు ప్రచారములతో మారుమ్రోగుచు, అనుదినము మారణాయుధములు లెక్కకు మిగిలి ఉత్పన్నమగుచున్న ఈ ప్రపంచములో మానవజాతి ఇంకను జీవించియుండుటకు కొంతవరకైనను ఆశ లున్నవని ఈ సానుభూతి సందేశములు సూచించుచున్నవి. ప్రజల హృదంతరాళమున గాంధీమహాత్ముని దివ్య సందేశము నాటుకొన్నదని నిస్సంశయముగ చెప్పవచ్చును. ఈనాడు గాకపోయినను, మరొక శతాబ్దమునకైనను, లేక సహస్రాబ్దమునకైనను మానవజాతికి ఆయన సమకూర్చిన మహత్తరమైన మేలును లోకము గుర్తించక పోనేరదు.

లోకోపకారిగ ప్రస్తుతించుటకు పూర్వము మహాత్ముని స్వతంత్రభారత స్రష్టగా భావించవలసియున్నది. ఆయన మనదేశమునకు పితృతుల్యుడని కీర్తించుట సమంజసమైన వర్ణన. అతిదీర్ఘమైన మనదేశ చరిత్రలో అర్ధ శతాబ్దముగ గాంధీ మహాత్మునివలె జాతీయజీవితమునందలి వివిధవిషయములతోడను ప్రసక్తి కల్పించుకొనిన వ్యక్తి మరొకడు లేడని నిస్సందేహముగ చెప్పవచ్చును. గొప్ప మతాచార్యులు, స్మృతికర్తలు, ధర్మశాసనులు, రాజ్యతంత్ర ప్రవీణులు మొదలైనవారు అవతరించిన దేశమిది. కాని, గాంధీమహాత్మునివలె సర్వవిషయములలోను జనబాహుళ్యమును ఉర్రూతలూగించిన మహాపురుషుడు ఎచ్చటను గాన్పించడు. రాజకీయ రంగమందును, సాంఘికజీవనమందును, మతసంబంధమైన విషయములందును, విద్యావిధాన నిర్మాణమందును ఆయన ప్రభావము సముజ్జ్వలముగ ప్రసరించి

నది. ఒకప్పుడు నేను గాంధీమహాత్ముని దక్షిణాఫ్రికాఘట్టము రామాయణమును, హిందూదేశఘట్టము మహాభారతమును పోలియున్నవని వ్రాసియున్నాను. ఆ మహాభారతఘట్టము ఇప్పటికి సమాప్తిఅయినది. ఆయన రామాయణగాథను వర్ణించుటకు నాకు సాధ్యము కాదు. కాబట్టి మహాభారతగాథను వివరించుటకు ప్రయత్నించెదను.

౧౯౧౫ వ సంవత్సరమున గాంధీజీ భారతరాజకీయరంగములో ప్రవేశించుట మనమెరిగిన విషయమే. గోఖలే మరణశయ్యమీద నున్న సమయ మది. గోఖలేనాయకత్వమున నిర్వహింపబడుచున్న రాజకీయాందోళన జాతీయాశయములను సాధించలేదని గాంధీజీ తీక్ష్ణమే గ్రహించగలిగెను. అప్పటివరకును కాంగ్రెసు చట్టబద్ధమైన మార్గములలోనే ఆందోళన సాగించుచుండెడిది. పరతంత్ర దాస్య విమోచనకు చట్టబద్ధమైన ఆందోళన నిష్ప్రయోజనమని మహాత్ముడు వెంటనే గ్రహించగలిగెను. ప్రజల అభీష్టానుసారముగ ఏర్పడిన ప్రభుత్వమున్నపుడు మాత్రమే చట్టబద్ధమైన ఆందోళనకు అవకాశముండును. కాని, ఇచ్చటనో, ప్రజాసమ్మతితో ప్రసక్తిలేని పరదేశ ప్రభుత్వము పీఠమువేసుకొని కూర్చొనియున్నది. కాబట్టి సంస్కరణ సరియైన మార్గము కానేరదు. స్వాతంత్ర్య సాధనకు విప్లవమే ఏకైక మార్గమని గాంధీజీ గమనించెను. కాని విప్లవము జయప్రదము కావలెనన్న ప్రజలలో చైతన్యము కలిగించి, త్యాగశక్తిని ఉద్దీపింపజేసి, అవసరమయినయెడల బలప్రయోగమునకు వారిని సిద్ధముచేయవలసియున్నది.

ఈ విషయమును తిలక్ లోకమాన్యుడు గ్రహించి శివాజీ ఉత్సవములు, గణేశపండుగలు మొదలయినవి జరిపి ప్రజలలో సంచలనము కలిగించినాడు. పెక్కుమార్లు కారాగారమునకు వెళ్లి తన సర్వస్వమును ధారపోయుటయే కాక దాస్యవిమోచనమునకు బలప్రయోగమావశ్యకమని నమ్మినవాడతడు. ఆయన నిర్వహించుచుండిన కార్యభారమే గాంధీజీకి సంక్రమించినది. భారతదేశములోని అశాంతికి కారకుడు తిలక్ అని బ్రిటిషువారి భావము. భారతజాతీయోద్యమ నిర్మాత అతడని మన భావము. కాబట్టి స్వాతంత్ర్యోద్యమ నాయకత్వమును గాంధీజీ అందుకొనినది తిలక్ వద్ద నుండియే కాని గోఖలే నుండి కాదు. గాంధీజీ రాజకీయరంగమునందు అడుగు పెట్టుటకు ఎనిమిదేండ్లకు పూర్వమే సహాయనిరాకరణోద్యమ సమగ్ర స్వరూపమును తిలక్ ఊహించగలిగినాడు. ౧౯౦౭ వ సంవత్సరము జనవరి ఏడవతారీఖున కలకత్తాలో ఉపన్యసించుచు తిలక్ "మీ భవితవ్యము మీచేతులయందే యున్నట్లు మీరు తెలిసికొనవలెనని ఈ నూతన రాజకీయపక్షము కోరుచున్నది. మీరు స్వాతంత్ర్యమును వాంఛించినట్లయితే స్వాతంత్ర్యమును పొందగలరు. మీకు స్వాతంత్ర్యాభిలాష లేనియెడల అధఃపతనము చెంది కలకాలము అట్లే ఉండిపోయెదరు. మీలో అనేకులు సాయుధపోరాటము చేయలేకపోవచ్చును. కాని పరప్రభుత్వము మీమీద అధికారము చెలాయించుటకు వీలులేకుండ చేయగల వైరాగ్యము, త్యాగశక్తి మీలో లేవా? ఇదే బహిష్కార సాధనము, ఈ సాధనమును రాజకీయసంబంధములలో ఆయుధముగా ఉపయోగింపవలెనని మేము కోరుచున్నాము. పన్నులను వసూలు చేయుటలోను, శాంతి భద్రతలను కాపాడుటలోను ఈ విజాతీయులకు మనము తోడ్పడరాదు. విదేశాలయుద్ధములందు మన సైనికుల రక్తమును ప్రవహింపజేసి, మన ధనముతో వారు సాగించుచున్న యుద్ధములలో సహాకరించుటకు మనము నిరాకరించవలసియున్నది. న్యాయనిర్వహణలోకూడ వారికి మనము తోడ్పడరాదు. మన న్యాయస్థానములను మనమే ఏర్పరచుకొని [illegible] సమయములలో పన్నులను కూడ చెల్లించరాదు. మీరందరు ఏకమై ఈ [illegible] సిద్ధముగ లేరా? ఇది మీరు చేయగలిగినట్లయిన రేపటిదినము మీరు స్వతంత్రులు కాగలరు" అని చెప్పియున్నారు.

గాంధీజీ రాజకీయ రంగము ప్రవేశించుటకు ఎనిమిదేండ్ల పూర్వము, సహాయనిరాకరణోద్యమ ప్రారంభమునకు పదునాలుగేండ్ల ముందుగానే తిలక్ ఈ విధముగ ఉపన్యసించినాడనిన విషయము జ్ఞప్తియందుంచుకొనదగును. ఈ సంవత్సరమున మరొక విచిత్ర సంఘటనకూడ జరిగినది. గాంధీమహాత్ముడు సహాయనిరాకరణోద్యమమును ప్రారంభించిననాడే తిలక్ మహాశయుడు మరణించినాడు. ఇంత ప్రత్యక్షముగనే [illegible] ప్రాముఖ్యము సంక్రమించినది. [illegible] గాంధీజీ సత్యాగ్రహమును [illegible] అహింసాయుత [illegible] యుద్ధగాథ అందరికిని తెలిసియేయున్నది. [illegible] చరిత్ర [illegible] సంఘటన తిలక్ గాంధీల [illegible] ఘటించినది. [illegible] మార్గములో విశ్వాసమున్న తిలక్ సహాయనిరాకరణ [illegible] నమ్మకమున్న గాంధీ [illegible] పోలియున్నారు. [illegible] పోరాటసమయములో [illegible] గాంధీజీ కూడ [illegible].

గాంధీజీ కార్యరంగములో ప్రవేశించి తిలక్ వదలిన్న [illegible] సూత్రమును గ్రహించి కార్యక్రమములో కొన్ని ప్రధానమైన మార్పులను కల్పించినాడు. [illegible] బహిష్కరించుట, [illegible] విధానమును త్యజించుట ఈ సంవత్సరమందలి ముఖ్యమైన మార్పులు. తిలక్ [illegible] విధానమును అవలంబించుటకల్ల [illegible] ఏ మార్గమునైనను అనుసరించుటకు సందేహించువాడు కాడు. అప్పుడు తిలక్ గాంధీల మధ్య వాగ్వాదము జరుగుచుండెడిది. 'శఠం ప్రతి శాఠ్యం' (మోసానికి ప్రతిక్రియ మోసము) అని తిలక్, 'శఠం ప్రత్యపి సత్యం' (మోసమునకు ప్రతిక్రియ సత్యమే) అని గాంధీ తీవ్రముగ వాదించుకొనెడివారు. అంతేగాక గాంధీజీ [illegible] కార్యక్రమములో సత్య, అహింసలకు ప్రాధాన్యము నిచ్చియున్నాడు. అంతేకాక ఈ నవీన ప్రజాకోటిలో హిందూ - ముస్లిం ఐక్యతను నిర్మాణ కార్యక్రమమున గాంధీజీ చేర్చియున్నాడు. [illegible] తిలకునకు ఎంతమాత్రము విశ్వాసము లేదు. ముస్లిములకు సామా

పాయమువల్ల నచ్చజెప్పలేమని తిలక్ నమ్మిక. ఈ భేదమే గాంధీజీ ఆధిక్యకు దారితీసినదని నా అభిప్రాయము. గాంధీజీ హిందూ-ముస్లిం ఐక్యతను తన ప్రణాళికలో ప్రధానాంశముగా నిర్దేశించుటయే కాక ఆర్థికముగను, సాంఘికముగను ఐక్యతను సాధించుటకు నిర్మాణకార్యక్రమమును ఏర్పరచుకొనెను. దౌర్జన్యమును, అసత్యమును వర్జించి గాంధీజీ ఈ విధముగా తిలక్ ప్రణాళికను స్వీకరించెను.

గాంధీజీనిర్మాణకార్యక్రమ మనగా నేది? అయ్యది సాంఘిక, ఆర్థిక, విద్యావిషయప్రధానమైయున్నది. సాంఘికవిషయములో గ్రామస్థుల దారిద్ర్యమును పారద్రోలుట, అజ్ఞానమును నిర్మూలించుట, అస్పృశ్యతాపిశాచమును నాశనముచేయుట, స్త్రీజనోద్ధరణ మొదలైన అంశములకు గాంధీజీ విశేషప్రాముఖ్యత ఇచ్చియున్నాడు. ఈసందర్భమున శ్రీ వివేకానంద స్వామిని గాంధీజీ అనుసరించినాడని చెప్పవచ్చును. భారతప్రజానీకమును పీడించుచున్న దారిద్ర్యమును, అజ్ఞానమును, అస్పృశ్యతను రూపుమాపుటకే వివేకానందస్వామి తన జీవితమును వినియోగించినాడని అందరికిని తెలిసినదే. వివేకానందుని సంఘసేవాప్రణాళికను గాంధీజీ స్వీకరించి, గ్రామపరిశ్రమోద్ధరణ, ఖద్దరు, మద్యపాననిషేధములను దానికి జోడించి అమలుపరచియున్నాడు.

మతసంబంధమైన విషయములలో రామకృష్ణపరమహంసను గాంధీజీ అధికముగ అనుసరించియున్నాడు. పరమహంసవలెనే మహాత్ముడుగూడ మతములన్నియు ఒక్కటేనని బోధించియున్నాడు. రామకృష్ణుడు అన్నిమతములను కొంతకొంతకాలము అవలంబించి అవన్నియు సత్యమైనవనియు, ఉత్కృష్టమైనవనియు, ఒకే మహాసత్యమునకు చెందిన శాఖలనియు ప్రత్యక్షముగ తెలిసికొనగలిగినాడు. అదేవిధముగ గాంధీమహాత్ముడుగూడ బైబిల్, ఖొరాన్, భగవద్గీత, బౌద్ధసూత్రములు మొదలైన మతగ్రంథములను ఆధారములుగ గ్రహించినాడు. సర్వమతములకు చెందినవారితోను ఆయన సహవసించి మతములన్నియు ఏకస్వరూపములేనని గుర్తించగలిగినాడు. అదేవిధముగ మతములన్నియు ఒక్కటేనని గ్రహించియు కాళికాదేవిని నిశ్చలముగా నారాధించిన రామకృష్ణునివలెనే గాంధీజీకూడ మతసమత్వమును నమ్మినప్పటికిని తుదివరకును హిందువుగనే ఉండిపోయినాడు. ఆయనముస్లింస్నేహితులు గాంధీజీ ముస్లింకావలెననియు, క్రైస్తవస్నేహితులు క్రైస్తవుడు కావలెననియు కొంతకాలముపాటు ఆశలుపెట్టుకొన్నప్పటికిని మహాత్ముడు చివరవరకును సనాతనహిందువుగనే జీవయాత్ర సాగించినాడు. అందువలన ఆయనఅంత్యక్రియలు వేదవిహితముగ జరుగుట ఉచితముగ నున్నది.

తులసీదాసురామాయణము, భగవద్గీత గాంధీజీని అధికముగా ప్రబోధించి, ఆయనభక్తిశ్రద్ధలను చూరగొనినవి. జీవితములో చాల భాగము గడచినతరువాతనే ఈశావాస్యోపనిషత్తు ఆయనను ఆకర్షించినది. భగవద్గీతలో వివరించిన కర్మయోగమును గాంధీజీవలె అవలంబించిన కర్మయోగులు మన దేశములో కానరారు. ఆయనజీవితమే భగవద్గీతకు ప్రత్యక్షవ్యాఖ్యానము. ఆదిశంకర, రామానుజ, మధ్వాచార్యుల వ్యాఖ్యానములవలె పదభూయిష్ఠమయినది కాదు. క్రియారూపకమైన సజీవవ్యాఖ్యానము.

ఈవిధముగా గాంధీమహాత్ముడు రాజకీయములలో తిలక్ లోకమాన్యుని, సామాజికవిషయములలో వివేకానందుని, మతసందర్భములలో రామకృష్ణుని అనుసరించుటయేగాక అతిశయించగలిగినాడు. కాని విద్యావిధానములోను, ఆర్థికసమస్యలలోనుమాత్రము ఆయన ఎవరిని అనుసరించలేదు. ఆయన కాయనయే ఆదర్శకుడు. భారతదేశమునకంతటికి హిందీని జాతీయభాషగా చేయుటకు ఆయన చేసిన ప్రచారము, చేపరిశ్రమప్రధానమైన విద్యాప్రణాళికలు, గ్రామములు పట్టణములకు చేదోడుగా ఉండునట్లు చేయుటకు ఆయన చేసిన గ్రామోద్ధరణప్రయత్నములు—ఇవి అన్నియు ఆయన స్వయముగ కల్పించి నెలకొల్పినట్టివే.

ప్రజలలో గాంధీజీ కుండిన అపారమైన పలుకుబడికి మూలకారణము ఆయనగుణగణములే గాని రాజకీయాదివిషయములలో ఆయన చేసిన ఉద్ఘాటనలు గావు. ఆయననిష్కళంకజీవితము కోట్లకొలది జనుల హృదయఫలకములపైన చిత్రితమైయున్నది. ఆయనప్రకృతిలో నాలుగైదు వ్యక్తిత్వములు మిళితమైయున్నవి. మహాభక్తుడు, మహానాయకుడు, వీరుడు, కులపెద్ద, యతి—వీరందరి ముఖ్యలక్షణములు గాంధీజీలో గోచరించును. ఇట్టి విశిష్టవ్యక్తిత్వములను ఐక్యము గావించిన మహైకవ్యక్తి మానవచరిత్రలో నెచ్చటను కానరాడు.

గాంధీజీ ఏవిధముగ మహాభక్తుడు? భక్తులందరివలెనే గాంధీజీకి భగవంతునిలో సంపూర్ణమైన విశ్వాస మున్నవిషయము అందరు నెరిగినదే. భగవంతునిలో దృఢమైన విశ్వాస ముంచి సర్వము పరాత్పరార్పణము చేసిన వ్యక్తి తప్ప మరొకడు మహాభక్తుడు కాలేడు. గాంధీజీ ఆర్తవారిలో నొకడు. రామకృష్ణునిలో భగవంతు డేవిధముగ సన్నిహితుడైయుండెడివాడో గాంధీజీ హృదయసీమలోకూడ ఆట్లేగోచరించుచుండెడివాడు. ఇదియే ఆయన తరుచుగ చెప్పుచుండిన అంతర్వాణి. అంతర్వాణిప్రసక్తి వచ్చినపుడెల్ల కొందరికి హాస్యాస్పదముగ తోచినను గాంధీజీరచనలను చదివిన ప్రతివ్యక్తికి ఈయంతర్వాణి యథార్థమని తెలియకపోదు. ఆయన చేసియున్న నిరశనవ్రతము లన్నియు అంతర్వాణిప్రోద్బలమువల్ల జరిపినవే. అంతర్వాణియొక్క హెచ్చరికను ఒక్కక్షణము ముందుగనైనను తాను నిరశనవ్రతము పూనబోవుచున్నట్లు ఆయనకు తెలిసెడిది కాదు. ఆకస్మికముగ పిలుపు రాగానే ఉపవాసదీక్ష నుపక్రమించెడివాడు. కాబట్టి ఆయన నిస్సంశయముగ భక్తాగ్రేసరుడు. భగవంతు డాయనకు యథార్థముగ గోచరించెడివాడు. ప్రత్యక్షముగ ప్రబోధించెడివాడు.

భగవంతునియందు గాంధీజీకి దృఢమైన నమ్మిక యుండుటయేగాక, తోడిమానవులందరిని ఏలాటి పక్షతలు లేకుండ ప్రేమిం

చెడినాడు. ఆయనజీవితమంతయు పోరాటములతో నిండియున్నప్పటికి గాంధీజీకి శత్రువనువాడు లేడు. ఇది కేవలము అద్భుతమైన విషయము. బ్రిటిషుసామ్రాజ్యమును సమూలముగా పెకలించివేయుటకు అన్ని ప్రయత్నములు చేసినను ఆంగ్లేయు లాయనకు స్నేహితులే. దక్షిణాఫ్రికాలో ప్రభుత్వమును తీవ్రముగ ప్రతిఘటించినప్పటికిని స్మట్సుప్రధానికి గాంధీజీయన్న అధికమైన గౌరవము. అస్పృశ్యతను నిర్మూలించుటకు సనాతనులను తీవ్రముగ ఎదుర్కొనినప్పటికిని వారం దరు గాంధీజీని మహాత్ముడని, అవతారపురుషుని పరిగణించుచున్నారు. బాధ్యతాయుతప్రభుత్వమును స్థాపించుటె లేదని, ప్రజలే నిజమైన పరిపాలకులని మండలించినప్పటికిని దేశములోని సంస్థానాధీశులందరును ఆయనకు భక్తిమిత్రులే.

ఇట్టి విచిత్రసంఘటనలకు కారణ మేమి? ఆయన నిజమైన ఋషియగుటచేతను, తప్పును తప్పు చెప్పినవారిని నిందించక తోవుటవలనను ఇవి సాధ్యమైనవి. మానవులేగాక సకల జీవరాసులు ఆయనకు ప్రేమ పాత్రములే. గోవుప్రతిపత్తిని గూర్చి హిందువుల దృక్పథమును వివరించుచు ఆయన చెప్పినమాట అందరికి తెలిసిన విషయమే. ఆయన దృష్టిలో మానవేతరమయిన సకలజంతు జాలములకు గోవు ప్రాతినిధ్యము వహించినది. గోవును సంరక్షించి ఆరాధించినట్లయితే సర్వ జీవరాసులను దయతో గౌరవించుట యగు నని ఆయన చెప్పెడివాడు.

గాంధీజీకి 'నా' అనునది ఎద్దియును లేదు. ఆయన అహంకార మునకెప్పుడును తావిచ్చియుండలేదు. మహాత్ముడని సంబోధించినపుడు చిరాకు పొందెడివాడు. తన ఆశ్రమవాసులందరికిని తనను గాంధీజీ అని మాత్రమే పిలువుమని నిశితముగా హెచ్చరించెడివాడు. ఒక యూరిలో గాంధీ దేవాలయమును నిర్మించినారని తెలియగానే రక్ష ణము తన ప్రతిమను తీసివేసి భగవంతుని విగ్రహమును ప్రతిష్ఠించుమని ఎక్కువ కోపముతో తెలియజేసినాడు. భారతదేశమునకు స్వాతంత్ర్య ప్రాప్తిని సమకూర్చిన మూలపురుషు డాయనే అయినప్పటికిని పది హేనవ ఆగస్టునాడు ఢిల్లీలోని స్వాతంత్ర్యోత్సవములలో ఆయన పాల్గొనలేదు. అప్పుడాతడు నౌకాళీలో పల్లెపల్లెకు, ఇంటింటికి పోయి మత కలహముల ఫలితముగ కుమిలిపోవుచున్న హిందువులను ఆదరముతో ఓదార్చుచుండెనాడు. ఋషితప్ప మరెవ్వ రీపనిని చేయగలరు?


గాంధీజీ గొప్ప వీరుడని అందరు మనవిచేసియున్నారు. ఋషివంటి వీరుడుగాని, వీరుడైన ఋషిగాని ఉండుట చాల అరుదు. దీర్ఘమయిన తన జీవితకాలములో అనేకమైన బలవత్తర విషయము లను కేవలము ఆత్మబలముచేత ప్రతిఘటించినవాడు గాంధీజీ. అది నిజమైన వీరలక్షణము. ఆత్మశక్తితో బ్రిటిషుబలమును ఎదిరించగలిగి నా డీతడు. ఆత్మశక్తితోనే నౌకాళీలో ముస్లిం మతోన్మాదమును లొంగదీసినాడు. ఆత్మశక్తితోనే సనాతనులను ధిక్కరించినాడు. ఆ ఆత్మశక్తివల్లనే పదునైదు ప్రాయోపవేశ దీక్షలలో మృత్యువును జయించగలిగినాడు. బాహుబలమును జయించగలిగినది ఆత్మబలమేనని నిరూపించినాడు. ఇంతకంటె వీరలక్షణము మరొకటియుండదు. ఒక మహా సామ్రాజ్యమునకు ఎదురొడ్డి నిలబడుట, సింహపురుషులతో లల నూర్చినట్లు లక్షలాది మతోన్మాదులను ప్రతిఘటించుట వీరునికి తప్ప సామాన్యులకు సాధ్యమా?


అసంఖ్యాకమైన ప్రజానీకమును స్వాతంత్ర్య సమరములో నైపుణ్యముతోను, శిక్షణతోను నడిపించిన మహాసేనాని గాంధీజీ. దక్షిణాఫ్రికాలో భారతీయ కార్మికులను [illegible] [illegible] వరిహద్దులను [illegible] నాయకత్వము క్రింద దాటించెనో మనకుందరు ఎరుగుదుము. దండీ ఉప్పు సత్యాగ్రహయాత్రను ఆయన [illegible] నడిపించినది మనము మరచిపోజాలము. [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible], శక్తి సామర్థ్యములే గాక, [illegible] [illegible] [illegible] పెట్టి [illegible] [illegible] కార్యదక్షతతో [illegible] [illegible] [illegible] [illegible] మాత్రమే [illegible] చేయుచుండెడివాడు. [illegible] నాయకులందరు [illegible] [illegible] [illegible] కాని [illegible] [illegible] [illegible] పెట్టుచు; [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] కాని గాంధీజీ [illegible]

క్రమశిక్షణ విషయములో [illegible] [illegible] మాపించి నప్పటికిని గాంధీజీహృదయము నవనీతకోమలమైనది. చిన్నపిల్లలన్నను, ఖలోక్తులన్నను ఆయనకు అత్యంతమైన ప్రీతి. అనుచరులను కన్న బిడ్డలవలె ప్రేమించెడివాడు. తప్పు చేసినప్పుడు [illegible] పశ్చాత్తప్తులు కాగానే వారిని [illegible]. ఈ విషయములో ఆయన కులపెద్దవలె వ్యవహరించెడివాడు. చిన్నపిల్లలపట్ల గాంధీజీ ఎంత ఆప్యాయముగ [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] వినియేయుందుము.

హిందూజాతిని అధికముగా ఆకర్షించుచున్న లక్షణములు గాంధీజీలో మూర్తీభవించియుండుటవల్లనే ప్రజల అభిమానమును ఆయన అంత చూరగొనగలిగినాడు. ఋషులను, సన్యాసు లను భారతీయులు ఆదరముతో ప్రేమింతురు. గాంధీజీ గోచిక్క అంగవస్త్రము, నిరశనవ్రతములు, నిరాడంబరజీవితము ప్రజల హృద యములను ఆకర్షించినవి. అందుచేతనే "మానవ [illegible]

ఒక జాతీయ పరిశ్రమ
ఉన్నతస్థితికి వచ్చినది . . .






MANUFACTURED BY HIND CYCLES LIMITED

MC 25a.

బ్రాంచీలు: 11, బ్రాడ్వే, మద్రాసు. , 18, సిల్వర్ జూబిలీ పార్కు రోడ్డు, బెంగుళూరు సిటి.



భారతజాతిజనకుడు

గాంధీమహాత్ముడు




ప్రేమమూర్తి

చిత్రకారుడు : శ్రీ హెచ్. వి. రామగోపాల్.



మహాభినిష్క్రమణము



'బాపూజీ అమర్ హోగయే'

దేవతలలో కలిసిన దివ్యపురుషుడు

ఆయన సుగుణములు, నిత్యజీవనము మొదలయినవియే గాంధీజీని యావన్మందికి ప్రేమాస్పదునిగ జేసినవి.

వీటన్నిటిని మించెడి విశిష్టత గాంధీజీయందు మరొక్కటి ఉన్నది. అతడు ఏక శాంతిమూర్తి. అహింసా ధర్మబోధకుడు. దాని నుండి లోకోద్ధారకులలో అగ్రశ్రేణిని అలంకరించినవాడు. భారత దేశపు చరిత్రలోనే గాక విశ్వమానవ చరిత్రలో గూడ ఆయన యొక్క ప్రత్యేకస్థానమును ఆక్రమించినాడు. ఇంతకంటె మహత్తరమైన విషయము వేరొకటి గాంచబోము. ఈ సందర్భమున గాంధీజీ గౌతమ బుద్ధుని అనుసరించినాడని చెప్పవచ్చును. కొన్ని ఒడుదొడుకులు సంభవించినను మొత్తముమీద హిందూదేశములో అహింసావాదము అనాదినుండి నేటివరకును అభివృద్ధి పొందుచునే యున్నది. వేదముల నుండి ఉపనిషత్తులవరకును, ఉపనిషత్తులనుండి భగవద్గీతవరకును, భగవద్గీతనుండి బుద్ధునివరకును, బుద్ధునినుండి గాంధీమహాత్మునివరకును ఈ అహింసాసిద్ధాంతము నానాటికి ప్రవర్ధమానమైనది. దౌర్జన్య రాహిత్యమార్గముననే భారతీయులు అనాదినుండి ఇప్పటివరకును నడచుచున్నారు. ఆవేశము, వాంఛ లేకుండ నిరంతరము కృషిచేయమని భగవద్గీత ఉద్ఘాటించినది. ఈ సూత్రములో అహింసా సిద్ధాంతము లేదని ఎవ్వరనగలరు? "దారిదొంగలు మిమ్ములను చిత్రవధ చేసినప్పటికిని మీలో నెవ్వరైనను ఇసుమంతయినను కినుక వహించినట్లయిన అతడు నా అనుచరుడు కానేరడ"ని గౌతమ బుద్ధుడు చెప్పియున్నాడు. అహింసాసిద్ధాంతమును ఇంతకంటె విస్పష్టముగా ఎవరు వివరించగలరు? అవతార పురుషుడు గాంధీజీ. "నేను ఊహా ప్రపంచములో విహరించు వ్యక్తిని గాను. క్రియారూపకమైనవే నా ఆశయములు. అహింసా సూత్రము ఋషులకు మాత్రమే గాదు. సామాన్యజనులకు కూడ వర్తించగలదు. క్రూర మృగములకు హింస నచ్చెడి విధముననే మానవులకు అహింస సహజమైన ధర్మము" అని చెప్పియున్నాడు. భగవద్గీతనుండి గౌతముడు, గౌతముని తరువాత గాంధీజీ ఈ అహింసాధర్మమును ఏవిధముగ సిద్ధాంతీకరించినది గమనించవచ్చును. అందుచేతనే మానవోద్ధారకులలో గాంధీజీ ఒకడని మనవిచేసియున్నాను.

మానవచరిత్రలో ఒక విషమదశ జరుగుచున్నది. విభేదముల పరిష్కారమునకు యుద్ధసాధనమును వర్జించి గాంధీజీ బోధించిన అహింసాతత్త్వమును అవలంబించనియెడల మానవజాతికే ముప్పు వాటిల్లక తప్పదు. యుద్ధమువలన న్యాయము, ధర్మము సిద్ధించజాలవని ప్రజలు గుర్తించవలసియున్నది. అమెరికాదేశపు సుప్రసిద్ధ మతాచార్యుడు డాక్టరు హోమ్స్ ఇటీవల ప్రసంగించుచు లోకములో రెండే గత్యంతరము లున్నవనియు, అవి అటంబాంబు ఒకవైపు, గాంధీ మహాత్ముడు మరొకవైపుగా కనిపించుచున్నవనియు, ప్రజలు ఈ రెంటిలో ఒకదానిని కోరుకొనవలసియున్నదనియు చెప్పియున్నాడు.

మానవజాతి ఈ ప్రశ్నకు సమాధాన మివ్వవలసియున్నది. గాంధీజీయొక్క అహింసాసిద్ధాంతమును అవలంబించక అటంబాంబులకు సుముఖత చూపించెడి పక్షమున ప్రపంచములో మానవజాతికి వినాశము తప్పదు.

కాబట్టి గాంధీమహాత్ముడు ప్రస్తుత మానవ చరిత్రలో ప్రధానమైన వ్యక్తిగా పరిగణించవలసియున్నది. భూమిపై నుండు ప్రాణికోటి యావత్తును ప్రళయమునకు గురికానీకుండుటకు ఆయనఅహింసా మార్గమును జనులు ఆమోదించి అనుసరించకతప్పదు. పశుప్రాయత వలన ప్రయోజనము లేదు. ఇప్పుడిప్పుడు ఈ విషయమును ప్రపంచమంతటను గుర్తించుచున్నట్లు గోచరించుచున్నది. అహింసాసాధనమే ఏకైక మార్గమని తెలిసికొనుచున్నారు. ఐక్యరాజ్య సమితిలో నేడు పొడసూపుచున్న సంకుచిత పరస్పర ద్వేషములు మానవవినాశమునకు దారితీయగలవు.

ఈ సంక్షోభమధ్యములో గాంధీజీ హిమవత్పర్వతము వలె నిలిచి సుభిక్షమైన మార్గమును సూచించియున్నాడు. గాంధీజీని ముందు యుగముల జనులు మానవోద్ధారకుడుగ స్మృతిలో నుంచుకొందురని చెప్పవచ్చును. స్వరాజ్యమును సమకూర్చిన మహానాయకుడుగా కాకపోయినను, ఋషిగా కాకపోయినను, బుద్ధుడు, క్రీస్తులవంటి లోకోద్ధారకుడుగా మాత్రము ఆయన చిరంజీవి కాగలడు.

గాంధీజీమరణమును ఏసుక్రీస్తుమరణముతో అనేకులు పోల్చుచున్నారు. రెంటికిని కొంత పోలిక లేకపోలేదు. కాని వ్యత్యాసముకూడ ఉన్నది. ఆనాటి యూదుల జాతీయతత్త్వమును ఏసుక్రీస్తు ఎదుర్కొనవలసివచ్చినది. ప్రథమమున జాతీయవాదిగా ప్రారంభించి ఆయన క్రమముగ విశ్వమతానుయాయిగా మారియుండెను. Kingdom of God అను సిద్ధాంతమును స్పష్టీకరించి దాని ప్రచారమునకు పూనుకొనియున్నాడు. తమ సంకుచితజాతీయతత్త్వముతో ఏకీభవించనందున యూదు లాయనను తిరస్కరించిరి. చివరకు శిలువపై మరణించవలసివచ్చెను. అదేవిధముగ గాంధీజీకూడ సంకుచితహిందూ జాతీయతత్త్వముతో ఢీకొనవలసివచ్చెను. ఉదారబుద్ధితో యోచించినట్లయిన గాంధీజీహంతకుడు దేశవిభజనమును ద్వేషించుచు, ముస్లిములకు ఉచితమైన పద్ధతిలో బుద్ధిచెప్పక పక్షపాతము చూపుచున్నాడని ఆగ్రహించిన సంకుచితహిందూజాతీయతత్త్వప్రతినిధియని చెప్పవచ్చును. వీరి దృష్టిలో హిందువులు కానివారందరును అన్యదేశీయులే. హిందూదేశ మనగా హిందువుల రాజ్యమే యని వారి భావము. ఈభావమే గాంధీజీని తీవ్రముగా ప్రతిఘటించి తుట్టతుదకు ఆయన అసువులను గ్రోలినది. క్రీస్తును అధికసంఖ్యాకులగు యూదులు తిరస్కరించిరి. కొలదిమందిమాత్రమే ఆయనను అనుసరించి శిష్యులయిరి. గాంధీజీని అట్లుగాక దేశమందలి జనబాహుళ్యము అనుసరించినది. బహుకొలదిమందిమాత్రమే ప్రతిఘటించిరి. ఇదియే ఉభయుల విషయములో నున్న వ్యత్యాసము. వీరిలో మరొక భేద మున్నది. క్రీస్తువలె గాంధీజీ కేవలము మతప్రవక్త మాత్రమే కాదు. ముఖ్యముగా ఆయన రాజకీయవేత్త జాతీయోద్యమ మూలముననే సత్యఅహింసాసిద్ధాంత

ములను బోధించినాడు. భారతీయజాతీయతత్వమును గాంధీజీ ఆమోదించినాడు. యూదుల జాతీయతత్వమును క్రీస్తు తిరస్కరించినాడు. అంతర్జాతీయసంఘర్షణలకు అహింసామార్గమును అవలంబించి గాంధీజీ దానికి బద్ధమయిన జాతీయోద్యమమునకు ప్రోత్సాహమిచ్చియున్నాడు. అందువలన గాంధీజీ రాజకీయసూత్రములు మనకు శాశ్వతముగా మనసున నిలిచిపోగలవు.

గాంధీజీ మనకు స్వాతంత్ర్యమును సమకూర్చినాడు. ఆ స్వాతంత్ర్యమును మనము నిలబెట్టుకొనవలసియున్నది. ఆయన భావించిన పద్ధతిలో రాజ్యమును నిర్మించి నిర్వహించవలసియున్నది. కాబట్టి అందుకు మన ప్రస్తుతకర్తవ్య మేద్ది? గాంధీజీ తననిండుజీవితమును దేశమున కర్పించి, ప్రాణముల నాహుతిచేసియున్నాడు. మరణావస్థలో మందులను కోరలేదు; నీరసత పొందలేదు. చిరునవ్వుతో ప్రాణత్యాగము చేసినాడు. ఇక మన విషయ మేమి? మన విధ్యుక్తధర్మ మెయ్యది? పేదరైతుమొదలు మహారాజావరకును భారతీయులందరు ఏకమై నైతికశక్తిని ప్రయోగించి మతవిద్వేషములను నిర్మూలించవలెను. అదియే మన ప్రస్తుతకర్తవ్యము. ఆదినుండియు ఈ మతోన్మాదమే మన దేశమునకు అరిష్టములను తెచ్చిపెట్టినది. పరదేశప్రభుత్వ ముండుటవలన ఇంతకాలము మనలో సరియైన రాజకీయ వాతావరణము లేకపోయినది. దీనికి ఫలితమే ఈ మతవిద్వేషము. ఈ ఉన్మాదమును ఇతరులు మన శత్రువులు ప్రత్యేకించి రెచ్చగొట్టియున్నారు. ముస్లిముల మతద్వేషమునకు బ్రిటిషుసామ్రాజ్యవాదులే మూలకారకులని మన మెరుగుదుము. ఈ రెండు మతద్వేషములకు లోనయినవారు తారసిల్లినపుడు రక్తవాహినులు ప్రవహించుటలో ఆశ్చర్యములేదు. ఇప్పటికైనను హిందూముస్లింజాతీయవాదులు పరస్పరమైత్రితో మతద్వేషములను శాశ్వతముగా త్రొక్కివేయరాదా? హిందువులలో మాత్రము కులాభిమానము, కులద్వేషము అతిశయించుట లేదా? దక్షిణదేశములోని కులోన్మాదులు ఈ కులతత్వమును మరచిపోగలరా? ఉత్తరహిందూస్థానములోని మతద్వేషులలో పరివర్తన కలుగగలదా?

మన దేశములో నున్న విద్వేషములు చాలనట్లు రష్యాదేశము నుండి మరొక నూతనజాడ్యమును తెచ్చుకొన్నాము. నా దృష్టిలో కమ్యూనిజముకూడ ఒకవిధమైన మతోన్మాదమే. ప్రపంచమందలి కార్మికుల నందరిని ఏకముచేసి తదితరులపైన పోరాటమును సాగించుటయే కమ్యూనిజంయొక్క పరమలక్ష్యము. ఐక్యరాజ్యసమితిలో మన మిప్పుడు చూచుచున్న దేది? కాశ్మీరువిషయములో అచ్చట ప్రదర్శితమయిన గొడవలనుబట్టి అక్కడకూడ అంతర్జాతీయవిద్వేషము లున్నట్లు కనిపించుచున్నది. అచ్చట బలప్రధానమైన రాజకీయములు విజృంభించుచున్నవి. కుతంత్రములకు తప్ప న్యాయమునకు అవకాశమున్నట్లు తోచదు. దేశములన్నియు కొన్ని ముఠాలుగా విడివడి ప్రజల జీవితములతో చెలగాటలాడుచున్నారు. దీనివలన సంభవించెడి ఉపద్రవములనుగాని, ఫలితములనుగాని వారు గుర్తించుచున్నట్లు తోచదు. లేదా, స్వలాభముకొరకు అన్నిటిని నిర్లక్ష్యము చేసి దేనికైనను వెనుదీయరనియైనను భావింపవలసియున్నది. ఐక్యరాజ్యసమితిలోని ప్రతినిధులు శాంతి, న్యాయము, ధర్మము మొదలైనవాటితో ప్రసక్తి లేనట్లు ప్రవర్తించుచున్నారు.

నానాజాతిసమితివలె ఐక్యరాజ్యసమితికూడ నిర్వీర్యమైపోకుండుటకును, పరిపూర్ణదశ సిద్ధించకమునుపే మానవజాతి అంతమొందకుండుటకును ఒక్కటే మార్గ మున్నది. ప్రపంచములోని దేశములన్నియు గాంధీమహాత్ముని ప్రణాళికను అవలంబించుటయే ఆ ఏకైకమార్గము.

గాంధీమహాత్ముని ఉపన్యాసములను, రచనలను పవిత్రగ్రంథములుగా మనము పరిగణించవలసియున్నది. ఆయన బోధలను మనము అనవరతము హృదయములో పదిలపరచి మననముచేయుచు ఆచరణలో పెట్టుటకు ప్రయత్నించవలెను. మనలో ప్రతివ్యక్తియు తనదేశమును గాంధీజీఆదేశములప్రకారము సంస్కరించుట అత్యంతావశ్యకము. ఈ మార్గమునతప్ప ఆయన మనకు ప్రసాదించిన స్వాతంత్ర్యమును మనము నిలబెట్టుకొనలేము. ఈవిధముగాగాక మరొకమార్గమున భారతీయులను గాంధీజీ అభిలషించిన రామరాజ్యములో ప్రవేశపెట్టజాలము.



రెండు మంచిపనులు

★

శ్రీ పింగళి లక్ష్మీకాంతం

ఈ మాసములో కొంచెము వెనుకముందుగా రెండు శుభవార్తలు వినబడినవి. ఒకటి : ఆంధ్రు లెల్లెడల సలుపబూనిన శ్రీ వీరేశలింగముపంతులుగారి శతవార్షికజయంతి; మరియొకటి : మద్రాసు ప్రభుత్వము వహింపనున్న సమస్తపాఠ్యగ్రంథప్రకటనబాధ్యత.

ఆంధ్రప్రజాభ్యుదయమునకై తమ సర్వస్వమును వినియోగించిన మహామహులలో శ్రీ వీరేశలింగముపంతులుగారు ప్రథమగణ్యులు. వేరుకొని కరడుగట్టిన సాంఘికదురాచారము పేరి కశ్మలము నంతను కరగించి, క్షాళనము చేసి, నిర్మలజీవితప్రసారమునకు వారు తలపెట్టిన సంఘసంస్కారోద్యమము ఎంత మహత్త్వము గల కార్యమో తత్ఫల మనుభవించు నేటి ప్రజలకు అనుభవవేద్యమైనది. సారస్వతప్రపంచములో వారు సాగించిన ఉద్యమము అంతకంటెను మహత్త్వసంపన్నమైన మరొక మహాకార్యము. చాలవరకు వారి చేతిలో ఈ రెండు ఉద్యమములును పరస్పరాశ్రయములుగనే నడచినవి. వారి వ్యాసములు, ప్రహసనములు, కథలు లోనగు చిల్లర వాఙ్మయ మంతయు దురాచారనిరసనార్థమే వెలువడినది. వారు తాము చేయదలచిన సదుపదేశము లన్నియు ఆ రచనలలోనే వాచ్యముగానో, వ్యంగ్యముగానో చేసిరి. మరియు, ఆ రచనల కన్నిటికి విషయీభూతముగా ప్రత్యక్షగోచర మగుచున్న తత్కాలసంఘప్రవృత్తియే స్వీకరింపబడుటచేత విషయము, రచనయు నొండొంటికి పోషకములైనవి. ఆ రచనల కన్నిటికి వాఙ్మయమున నుత్తమస్థానము లభించుననిగాని, వాని యునికి శాశ్వతమగు ననిగాని పంతులుగారు ఎన్నడును ఆశించియుండరు. తాత్కాలికప్రయోజనాపేక్షచే నిర్మితమైనయే వాఙ్మయమునకైనను అదియే స్థితి యని వారెరుగకపోరు. కాని, ఒకానొకయెడ విషయప్రాధాన్యము నతిక్రమించి శైలీసౌందర్యము నెగడినచోట, తాత్కాలికప్రయోజకమైన సాహిత్యము గూడ ఆ సుందరశైలిని బట్టి శాశ్వతమే యగును. శైలీరామణీయకముతో పాటు విషయమునకుగూడ సార్వకాలిక మహత్త్వమేని, ఆ వాఙ్మయమునకు ముదిమియు, చావును ఉండవు. పంతులుగారి వచన వాఙ్మయములో ఈ రెండు జాతులును గలవు. కవుల చరిత్ర, స్వీయచరిత్ర, రాజశేఖరచరిత్ర మొదలైనవి తెనుగువాఙ్మయ మున్నంతవరకు ఉభయగుణప్రాధాన్యమునుబట్టి విస్మరింపరానివి. మరి, పైని పేర్కొన్న ప్రహసనాదులు శైలినిబట్టిమాత్రమే యెడనెడ దర్శింపదగినవి. పంతులుగారి సమగ్రగ్రంథసంపుటములు పదింటిలో మూడువంతులు పైగా వచనరచనలే. ఆ వచనబాహుళ్యమే వారికి 'గద్యతిక్కన' యను బిరుదమును సంపాదించి పెట్టినది. వారికి పూర్వమునగాని, పరమున నేటివరకుగాని అంత విరివి గల వచనవాఙ్మయనిర్మాత ఆంధ్రమున లేడు. ఈ ఘనతనుబట్టియే ఆధునికవాఙ్మయయుగమును 'వీరేశలింగయుగ' మని కొందరు పేర్కొందురు. యుగప్రవర్తకత్వమున కేమిగాని, ఆధునిక వాఙ్మయమునందలి పద్యకవితకు శ్రీ తిరుపతి వేంకటేశ్వర కవులును, వచనభాగమునకు శ్రీ వీరేశలింగముపంతులుగారును ప్రథమాచార్యు లని చెప్పుటకు నెట్టి సందియము నుండగూడదు.

మొదట ఆధునికవచనవాఙ్మయమునకు మంగళాచరణము చేసిన మహానుభావుడు పరవస్తు చిన్నయసూరి. ఆయన తలయెత్తు నాటికి, మన భాషలో విద్యార్థులు ఆధునిక పద్ధతుల ననుసరించి పాఠ్యగ్రంథములుగా చదువుకొనదగిన వాచకములు లేవు. మన సంప్రదాయమును బట్టి బాలరామాయణము, శతకములు మొదలయినవి ప్రారంభదశలోను, గజేంద్రమోక్షము, రుక్మిణీకల్యాణము మొదలైనవి ఆ తరువాతను సాహిత్యవాచకములుగా పాఠశాలలలో చెప్పెడువారు. ఆ పద్ధతిలో నొకవిధమైన మేలు లేకపోలేదుగాని, అది యీ కాలమునకు అక్కరమాలినదిగా పరిగణింపబడినది. అందుచేత ఆంగ్లేయ విద్యాధికారులు తమ దేశమందలి విద్యాబోధనసంప్రదాయానుసారము ఇచ్చుటను సుకుమారబుద్ధులైన బాలురకు భావనోద్దీపనమును గలిగించుచు, చక్కని వచనరచనకు అనువైన శైలిని అలవరచగల వాచకములను దేశీయపండితులచే వ్రాయింప తలకొనగా, నీతి

చంద్రిక యనెడి ఉత్తమఫలము లభించినది. అనగా ఈ వచనకావ్యము ఆనాటి తెలుగువాచక మన్నమాట. ఆనాడే కాదు, ఈ నాటికిని అది వాచకమయ్యే ఉన్నది. కాని, యితరవాచకములు ఒకటి రెండు ముద్రణావృత్తులతో అస్తమించుచుండగా నీతిచంద్రికమాత్రము ఎన్నటికిని ఆరని జ్యోతిగా వెలుగుచున్నది. దీనికి కారణము అందు గల కావ్యగుణ సంపద. ఆంగ్లమునగాని, సంస్కృతమునగాని పిట్ట కథలను అంత రసవంతముగా, అంత హృదయంగమముగా చెప్పిన వచనకర్త యింకొకడు లేడు.



శ్రీ వీరేశలింగం పంతులుగారు

చిన్నయసూరివలెనే వీరేశలింగము గారును ప్రభుత్వము వారి పాఠశాలలో తెనుగుపండితుడే. కావుననే నీతిచంద్రికలోని పరిశిష్ట భాగములగు సంధివిగ్రహములను ఆయన ప్రయత్నపూర్వకముగా పూర్తిచేసి చిన్నయసూరియంతవా డయ్యెను. కాని నిసర్గలలిత మును, సరళాతిసరళము నగు వీరేశలింగముగారి శైలికి అదిమాత్రము దృష్టాంతము కాజాలదు. వారి వచనరచనాస్వాదము చేయగోరువారు రాజశేఖరచరిత్రాదులను ఆశ్రయింపవలసినదే. అంతదూర మేల? పంతులుగారు వ్రాసిన చిన్న తరగతుల వాచకములలో గూడ ఆ స్వాదుత్వమే లభించును. గద్యతిక్కన అయిదు, ఆరు, ఏడు తరగతులకు వాచకములు వ్రాయబూనుట మహాభాష్యప్రవచనముచేయు పండితుడు శబ్దమంజరిని గూడ పాఠము చెప్పుటవంటిది. చిన్నపని యని ఈసడింపక, విద్యార్థిశ్రేయస్సును గోరి, ఆయన ఆ వాచకము లను వ్రాయదలకొనెను గావుననే, ఆనాటి విద్యార్థులు వారివారి వయోబుద్ధులకు అనుగుణమైన భాషను, విషయమును సముపార్జించు కొనగలిగిన భాగ్యశాలు రైరి.

వానితరువాత లెక్కపెట్టుటకే వీలులేనన్ని వాచకములు ఊరూర వెలసినవి. ఈ జాతిలో నొకటియు పంతులుగారి వచనరచన లతో సాటిరాను సరిగదా, దానిని చదివెడు బాలురకు ఉపకారక మును కాజాలకపోయె ననుటలో అతిశయోక్తి యేమియు లేదు. ఈ దుస్థితికి మొదటి కారణము వాచకకర్తలు వచనరచనాకౌశలము గలవారు కాకపోవుట. రెండవది: పిల్లల చిత్తవృత్తికి అనుగుణమైన విషయసంగ్రహణమును, భాషావివేచనయు లేకపోవుట. వీరు సాహిత్యపరులే కావచ్చునుగాని, వారి సాహిత్యములో ఏ పాలు ఏ మాత్రము ఏ తరగతికి వినియోగింపవలెనో వివేచించినవారు కారు. నేను అనేకవాచకములను ఈ దృష్టితోనే చూచుట తటస్థించినది. అన్నింటను ఇంచుమించు ఇదే లోపము. అయిదవతరగతివాచకము నకు, ఏడవతరగతి వాచకమునకు కథలలో క్రొత్తదనముతప్ప, సాహి త్యములో భేదమే కానరాదు. ముక్కుపచ్చలారని పసిపిల్లలకు నీతి పాఠము లను నెపమున పాతివ్రత్యమునుగూర్చి వ్రాసిన వాచకములు గలవు. మహాపురుషుల జీవితములు అనుపేర శంకరాచార్యజీవిత సంగ్రహము, అద్వైతమతస్థాపన మొదలగు మస్తిష్కభేదనాపాదకము లైన వ్యాసములు గలవు. [illegible] ఆవిర్భవించిన ద్వంద్వ ప్రభుత్వములో స్థానికపరిపాలన ప్రజాహస్తగతమగుటయు, విద్యా శాఖ స్థానికసంస్థల వశమగుటయు [illegible] ఈ యరాజకము సుమారు [illegible] విచ్చలవిడిగా జరుగుచున్నది.

ఇంతవరకు మన భాషల మేలు కోరని ప్రభుత్వము కాక పోవుట ప్రభుత్వవిద్యాశాఖ మన భాషావిషయకమైన శ్రద్ధను ఇంచు కైనా కన్నెత్తి చూపలేదు. ఇక నిప్పుడు మన పరాధీనత తొలగినది గనుక, ప్రభుత్వమే ప్రజలు, ప్రజలే ప్రభుత్వము అనదగిన శుభసమయము వచ్చినది గనుక, ప్రజాప్రతినిధులుగా అధికారనిర్వ హణముచేయుచున్న ప్రముఖులు ప్రజాజీవితమునకు సంబంధించిన ఏ యంశమునైనను ఉదాసీనులై యుండరాదు; [illegible] తగదు. ప్రజాజీవితములో అత్యంతముఖ్యమైనది విద్యావ్యాప్తి. ఆ విద్యాభ్యాసము మాతృభాషద్వారా జరుగవలసియున్నదిగనుక, మాతృభాషాశ్రేయస్సునకై విద్యాశాఖాధికారి [illegible] శము గలవాడై యుండవలెనని వేరే నొక్కి చెప్ప బనిలేదు. ప్రభుత్వ మునకు మన భాషావిషయములో అట్టి యభినివేశము కలిగిన దని చెప్పుటకు అనేకసూచనలు కానవచ్చుచున్నవి. వానిలో ఉత్తమ సాహిత్య గ్రంథములు వ్రాయించుట ఒకటి. ప్రభుత్వమునకు కలిగిన ఈ సత్సంకల్పము పత్రికలలో చదివినతోడనే, అదివరకే మనసులో మెలగుచున్న వీరేశలింగముపంతులుగారి సంస్మరణ మరికొంత [illegible] తరమై, చిన్ననాడు మేము చదివిన ఆయనవాచకములతో, [illegible] మా పిల్లలు చదువుచున్న వాచకశాఖోపనములకు గల వ్యత్యాసము

అకస్మాత్తుగా ఝటితిస్ఫూర్తి నొంది, "ఈ సమయమున ఆయనయే జీవించియున్నచో ఈ భారము నెంత అనాయాసముగా వహించి యుండునోకదా!" అనెడి వ్యర్థపు తలపోతలోనికి దింపినది. ఇది యొక అవివేకమైన భ్రమయే అయ్యు, ఆ తలపుమాత్రము అర్థవంతము కాకపోదు.

చిరకాలము నిద్రాణమై యుండి, పరతాడనపీడనాదులచే నైనను కన్నువిప్పియు, లేచి నడయాడలేని మన జాతీయప్రతిభను కొంచెముకొంచెము తప్పటడుగులు వేయించుటకైనను చేయూత నిచ్చిన ఉద్యమములు కొన్ని పంతులుగారి కాలములో ప్రవర్తిల్లినవి. వానిలో పెక్కింటికి వారి తోడ్పాటు ఎంతో కలదు. నేటికి ఆ జాతీయప్రతిభను తీవ్రవేగముతో పరుగులెత్తించవలసిన నూతనోద్యమములు కొన్ని రూపము దాల్చుచున్నవి. ఆనాడును ఈనాడును ఈ యుద్యమములో ముఖ్యమైనది విద్యావిధానసంస్కరణము. ఇప్పుడు జరుగబోవు ఈ సంస్కారమునకు మన జాతీయవిజ్ఞానచరిత్రలో ఇది రెండవ దశ. ఈ రెండవ దశప్రారంభమున ప్రథమదశా ప్రవర్తకులను స్మరించుటయు, వారు వేసిన బాటలను సముచితముగా చక్కజేయుటయు అవశ్యకర్తవ్యములు గనుక, అప్రతర్కితముగానైనను శ్రీ వీరేశలింగముజయంతి ప్రభుత్వము తలపెట్టిన విద్యాసంస్కరణకు ప్రస్తావనగా జరుగబోవనున్నదేమోయని నా కొక భావన కలిగినది. అందుచేతనే యీ రెండును ఈ మాసములో నేను విన్న శుభవార్తలు అని మొదట పేర్కొంటిని.

ఈ రెండును ఉద్దిష్టఫలప్రదములు కావలెనన్నచో, ప్రజలును, ప్రభుత్వములును అకుంఠితదీక్షతో, అనవద్యమైన కార్యక్రమమును నడుపవలెను. మనలో ఉత్సాహ మున్నంతగా కార్యసాధకత ఉండుట అరుదుగనుక, ఇవి యనుకొన్నట్లు కొనసాగునా అను సందేహముతో ఈ మాట లంటిని. జయంతిని ఊరూర జరుపవలెనని తహతహపడుచున్నారు. వారివారి శక్తిని, అవకాశమును బట్టి ఆయాయిచోట్ల ఉత్సవములు జరుగవచ్చును. కాని, అదంతయు వేడుకగా, వినోదముగామాత్రమే పరిణమించగూడదు. వీరేశలింగము గారు మరల ఆంధ్రదేశమున అవిర్భవించిరేమోయని అనిపించునట్లుగా వారి వాఙ్మయమునంతను పునర్ముద్రణమునకు దెచ్చి, ఆ సాహితీమూర్తిప్రతిబింబములను ఊరూర నెలకొల్పవలెను. ఇది వ్యయప్రయాసలకు లోనగు కార్యమే యైనను, ఆంధ్రులు చూపుచున్న నేటి యీ ఉత్సాహమునంతను ధనసంపాదనముఖమునకు మరల్చినచో సాధింపబడకపోదు. పంతులుగారి వచనరచనాక్షీరములను గ్రోలి పుష్టినొందవలసిన యావశ్యకత నేటి విద్యార్థిలోకమున కెంతో కలదు. విద్యార్థులకే గాదు, పెద్దల మనుకొనుచున్న రచయితలకును గలదు. మనము ఆ కొరత తీర్చుకొనుటయే వీరేశలింగము గారి నామపూజకు ఫలము.

౨

ఇక ప్రభుత్వమువారు సంకల్పించిన పాఠ్యగ్రంథముల సంగతి. ప్రస్తుతవిద్యావిధానములో ఏదో లోటున్నదనియు, ఏవో మార్పులు కావలెననియు చాలసంవత్సరములనుండి ప్రభుత్వమే ఆందోళన చెందుచున్నది. కాని, ఆ లోటు ఇట్టిదని స్పష్టముగా నిర్దేశించుటగాని, ఆ మార్పు ఇట్టిదని ఖండితముగా నిరూపించుట గాని యింతవరకు జరుగలేదు. ఏవో అలతియలతిమార్పులు అప్పుడప్పుడు జరిగినను, అవన్నియు తత్త్వదోషమును గ్రహింపక బాహ్యలక్షణములనుబట్టి రోగి కిచ్చు ఔషధములవలె నిష్ఫలము లైనవి. మన విద్యావేత్తలలో ఈ రోగనిదానము చేయగల మహామహులు లేకపోలేదు. వారి ప్రతిభయు రాణించకపోవుటకు కారణము నిన్నటివఱకు మనల నణచిపెట్టిన పరాధీనత. ఇప్పుడా ప్రతిబంధకము లేదుగనుక, జాతీయవికాసపరాయణముగా మన ప్రభుత్వము ఏ సంస్కారమైనను చేయవచ్చును; ఎట్టి మార్పులైనను కొనిరావచ్చును. ఆ సంస్కారములు పైపై పూతలతో సరిపెట్టరాదు. పునాదులనుండియు దృఢమైన నిర్మాణము జరుగవలసినదే. అందుకై యెంత ధనమైనను ప్రభుత్వము వెచ్చింపవలసినదే.

బాలసరస్వతి నర్తించు రంగమువలె నుండవలసిన ప్రాథమిక పాఠశాలలలో దేనిని చూడబోయినను, మన దేశములో, కళావిహీనమును, జీవరహితమునై వెలవెలబోవుచునే యుండును. కొన్ని పెద్ద పట్టణములలో గల యూరపియనుల ప్రాథమికపాఠశాలలలోనికిపోయి చూచితిమేని, మనవానిలోని దైన్యము అందులో కానరాకపోవుటయే కాక, ఆనందోత్సాహములు వెల్లివిరియుచుండును. ఈ తారతమ్యమును గుర్తించియే తమ పిల్లలను చిన్ననాడే నిస్తేజస్కులను జేయ మనసొప్పని కొందరు గృహస్థులు ఆ యూరపియన్ పాఠశాలలకు పంపుచున్నారు. వ్యక్తిగతముగా ఇది యే కొంతమందికో లాభదాయకమే అయ్యును, సమిష్టిమీద జాతికిమాత్రము దౌర్భాగ్యమే అగును. ఆ బడులలో ఇంగ్లీషుభాషకే ప్రాధాన్యము; మన భాషకు ఉండునది నామమాత్రస్థితి. కాని, ఆ యుపాధ్యాయులలో, ఆ వాచకములలో, ఆ బోధనాపద్ధతులలో ఏమి రహస్య మున్నదోగాని, ఆ పరభాషనుసైతము మన పిల్లలు ఒక యేడాదిలో చక్కగా చదువుట, వ్రాయుట, మాటలాడుట నేర్వగలుగుచున్నారు. ఎన్నడును చెవిని బడని క్రొత్తమాట చెప్పినను వర్ణక్రమము చెప్పగలుగుచున్నారు. ఇక మన బడులలో మన భాషకే ప్రాధాన్య మున్నను ఏ పిల్లనికిని చక్కని వర్ణక్రమముగాని, వ్రాతగాని రాదు. ఈ వర్ణక్రమలోపము బి. ఏ. పరీక్షకు పోవు విద్యార్థులకును గలదు. వింతయేమి? పునాదిలో లేని గట్టితనము పై యంతస్తులో నెట్లు వచ్చును? నిజమునకు మన భాషావర్ణక్రమము స్వరశాస్త్ర(Phonetics) సమ్మతమైనది. ఇంగ్లీషుభాషావర్ణక్రమము అంత నిర్దుష్టముగాదు. ఐనను దాని దశ

యున్నను, మన భాష దుర్దశ యిట్లును ఉండుటకు కారణ మేమి? ప్రభుత్వము దీనియెడ ప్రథమదృష్టిని లక్ష్యము చేసినగాని వారు తల పెట్టిన సంస్కారములు ఫలవంతములు గావు. రెండవది: మన భాషకు మొన్నటిదనుక ప్రభుత్వప్రణాళికలో సవతితల్లి భాష (second language) యని పేరు. నిన్ననేతో ఆ న్యూనతకూడ తొలగిపోయినది! సంతోషము. ఇక మాతృభాష మాతృభాషగానే సార్థకము కానున్నదిగనుక, ఆ సార్థకత కేవలవ్యావహారికముగనేగాక పారమార్థికముగకూడ నుండవలెను. ఆ దృష్టితోనే విద్యాప్రణాళిక నంతను పునర్నిర్మాణము చేయవలెను. ఆ నిర్మాణములో మాతృభాషాపరిజ్ఞానమునుపార్జనము నిర్దిష్టముగా మాత్రమేగాక సులభముగను, సుప్రదముగను కూడ నుండునట్లు చేయవలెను. ఆ పరిజ్ఞానము సర్వశ్రేణికాన్యాయమున ఉన్నతవిద్య పూర్తియగునాటికి సమగ్రమగునట్లు చూడవలెను. దేశచరిత్ర, భూగోళము మొదలగు భాషేతర పాఠ్యములలోగూడ విషయప్రాధాన్యముతోపాటు భాషాప్రాధాన్యముకూడ పోషింపవలెను. భాషావాచకములలో సాహిత్యముతోపాటు శ్రద్ధతో గమనింపదగిన అంశ మింకొకటి కలదు; అది పాఠ్యవిషయమునకు (subject matter) సంబంధించినది.

ఒక జీవియొక్క ఆత్మీయతాభివృద్ధిలో (development of personality of an individual) భావనాశక్తి, మనోవికాసము, బుద్ధియోజనయు నొకదాని తరువాత నొకటి అలవడదగినవి. ఈ చిత్తధర్మములను క్రమముగా బాల్యయౌవనకౌమారములలో పరిపోషితములు కావలెను. ఈ ధర్మము ననుసరించి ప్రాథమికవిద్యలో బాలబాలికలకు భావనాదీప్తియు, మాధ్యమికవిద్యలో మనోవిస్తృతియు, ఉన్నతవిద్యలో మేధాపటిమయు కలుగునట్లుగా ప్రణాళికను ఏర్పరచి, తదనుగుణములైన పాఠములనే వ్రాయించవలెను. అంతే కాని, కలగూరగంపగా ప్రయోజనరహితములైన యేవో కథలను, వ్యాసములను సంపుటీకరించి, వాచక మని పేరు పెట్టినంతమాత్రమున వాని పఠనము సార్థకము కానేరదు. అట్లే మరియు నీతిపేర, మతము పేర ఏవో కొన్ని పాఠము లుండవలె నను తలపున పెద్దలకే అగమ్యగోచరములైన ఉపదేశములతో లేత బుద్ధులను బాధింపరాదు. ఒకవేళ మతబోధ ఆవశ్యకమే యైనచో, ఆ యుపదేశములను వినుటకును, ఆచరించుటకును వారికి యుక్తవయస్సు వచ్చిన పిమ్మట ఆ పని తలపెట్టవచ్చును.

ఐహికసౌభాగ్యము నుజ్జగించి, ఆముష్మికమునకునై ప్రాకులాడుట చిన్నతనమునుండియు అభ్యసించుటకు ఏనాడు మన జాతి యారంభించెనో, నాటినుండియే మనము నిర్వీర్యులమై సమస్తసంపదలను చేజేత కోల్పోతిమి. నిజమునకు మన మతస్వరూప మట్టిది కానే కాదు. సారములేని ఆ మెట్టవేదాంతము మన పతనమును మనము సమర్థించుకొనుటకై మన మతమునకు కల్పింపబడిన వికృతస్వరూపము. దాని నింతతో వదలుట మంచిది. ఐహికాముష్మికములు రెండిటికిని సమప్రాధాన్య మిచ్చి, సమవడిని నెక్కుడిదిగుకొన్న జీవితము పూర్ణత్వము నందునుగాని, ఒకదానిని విడచి రెండవదానినే సేవించినది శోభావహము కానేరదు. బాలుర విషయములో మతము కంటెను శీలమునెడ ఎక్కువ శ్రద్ధ చూపవలెను. శీల మనగా పురుషుని జన్మ సార్థకమగుటకు వలసిన శక్తిసామర్థ్యములు, సాహసకార్యములు, దేశభక్తి, వీరపురుషోచితవర్తనము, త్యాగము, వినయవిధేయతలు, సహనము లోనగు సుగుణసంపద కలిగియుండుట. ఈ సంవిధానము సిద్ధాంతోపదేశముగా గాక, భావనాత్మకమైన కథాకల్పనద్వారా నెరవేరవలెను. భావిభారతప్రతిష్ఠకు కారణభూతమైన పౌరవర్గమును సృష్టించుటకు ఇదియే మేలైన దారి.

ప్రభుత్వము గట్టిగా పూనినచో ఇట్టి ప్రణాళికను సిద్ధము చేయించుట, దాని కనుగుణములైన వాచకములు వ్రాయించుట ఏ మాత్రమును కష్టమైన పని కాదు. అర్థించవలెనేగాని కోరిన సహాయము చేయగల సమర్థులు మన దేశమున ఎందరో కలరు.

అసలు దాటరాని వ్యాసఘట్టము ఏభాషలో ఈ వాచకములు వ్రాయవలెను అనునది. ఏ భాష అను వికల్పమునకు అర్థము గ్రాంథికమా, వ్యావహారికమా అని.

సుమారు నలుబది యేండ్లనాడు శ్రీ గిడుగు రామమూర్తి పంతులుగారు ప్రారంభించిన భాషాసంస్కారోద్యమము మొదట కొంతకాలము గ్రామ్యవాద మనుపేరను, ఆ పేరు న్యూనతాపాదకమని తోచినపిమ్మట వ్యావహారికవాద మనుపేరను మెల్లమెల్లగా సాగి సాగి, నేటికి మిక్కిలి ప్రబలమై, సాహిత్య ప్రపంచములో చాలన భూమినంతను చాలవరకు ఆక్రమించుకొన్నది. చారిత్రకముగా పరిశీలన చేసినచో ఈ భాషావాదమునకు కలిగిన బలమంతయును శ్రీ చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారు దీనిని ఆమోదించి అనుసరించిన నాటినుండియు అని చెప్పక తప్పదు. "యద్య దాచరతి శ్రేష్ఠః తత్తదేవేతరో జనః." నే నెరిగినంతవరకు ఈ వ్యావహారికభాషను కృత్రిమపదములు లేని నిసర్గశోభతో ప్రదర్శించిన రచయితలు ఇరువురే — శ్రీ రామమూర్తి పంతులుగారు, శ్రీ వేంకటశాస్త్రిగారును. మరి యొకరిద్దరు ఉండవచ్చునేమో. ఉన్నను చక్రము సర్వాశీలు. ఎక్కువ నాటి చేతులలో ఈ భాషకు గాలిగంగ కేరాలేనాని సువిన్యాసమే లేదు.

ఇక గ్రాంథికభాష యుద్ధరంగమునుండి విరమించి, తనకు దక్కిన భూమితోనే సంతృప్తిపడి, దానినే చక్కగా పరిపాలించుకొనవలెనని పాటుపడుచున్నది. నేటిదనుక ప్రభుత్వోపాదము అధికారరీత్యా గ్రాంథికమునకే పక్కున్నదిగాని వ్యావహారికమునకు పక్కలేదు. పాఠశాలలలోని వాచకములన్నియు గ్రాంథికములోనే వ్రాయబడుచున్నవి. వానినే ప్రభుత్వము సమ్మతించుచున్నది. బద్ధదీక్షుడైన వ్యావహారికవాదికూడ పాఠ్యగ్రంథము వ్రాయవలసి వచ్చినపుడు తన మతము మార్చుకొని గ్రాంథికమునకే తలయొగ్గుచున్నాడు.

కాని, వ్యావహారికమును ప్రభుత్వము మనసా నిరాకరించినట్లును లేదు. ఇది యేపక్షమునకును మొగ్గలేని అసహాయస్థితియో, లేదా సర్వసమాదరణ మనెడి ప్రభుత్వనీతియో ఊహించుట కష్టము. లోకమునకు దురవగాహమైన తమ వైఖరిని విస్పష్టము చేయవలసిన తరుణము ఆసన్నమైనదని ప్రభుత్వముకూడ గ్రహించియే ఉండును. "దానినిగాని, దీనినిగాని అధికారరీత్యా నిరాకరించుటకు ప్రభుత్వమునకు ఏమి హక్కు గలదు?" అను ప్రశ్న ఒకటి యున్నది. వాఙ్మయశిల్పనిర్మాతలను "నీవు ఈ భాషలోనే వ్రాయవలెను; ఆ భాషలో వ్రాయగూడదు" అనుటకు ఎవనికిని వాక్సమర్థత లేదు. ప్రభుత్వమునకే కాదు, దేవునకును లేదు. "నీవు ఈ రాగమునే ఆలపింపవలెను; ఈ కృతినే పాడవలెను; ఇంకొక రాగమును, ఇంకొక కృతిని ఆలపింపరాదు, పాడరాదు" అని ఒక గాయకునకు ఎవరు ఆదేశింపగలరు? ఎవరైన ఆదేశించిన అది పిచ్చితనమో, మరేమో అగును. ఈ ప్రశ్నలో కొంతవరకే సామంజస్య మున్నది. శిల్పసృష్టిని శిల్పముగా ఎవరును నిరోధింపలేరు; కాని, శిల్పము తన ప్రధాన ధర్మమైన ఆనందదాయకత్వమే కాక వేరొక ప్రయోజనమునుగూడ నెరవేర్చుచున్నపుడు, ఆ ప్రయోజనము సంఘమునకు సంక్రమించునప్పుడు, సంఘము ఉత్పథగామి కాకుండ పరిపాలింపవలసిన బాధ్యతగల ప్రభుత్వము సంఘశ్రేయస్సును గోరి, నిరుపయోగప్రయోజనముతోపాటు దాని కాశ్రయమైన ఆ శిల్పమునుగూడ అరికట్టవలసియుండును. ఇనుమునుబట్టి అగ్నికి సమ్మెటదెబ్బలు! "ఈ రాగము ఆలపింపు, ఆ కృతి పాడు" అని గాయకుని ఆదేశింపలేముగాని, బూతుకీర్తన పాడవలదు అని కోరగలముగదా! అది బూతుకీర్తనయైనను, భగవత్కీర్తనయైనను సంగీతమునకు గానకళగా ఏమియు లోపము లేదు.గాని, ఆ గానమాధుర్యమును గ్రోలుటతోపాటు కీర్తనయొక్క అర్థమును అవగాహనచేసికొను సభ్యులకు కొంతమందికైనని ఏవగింపు పుట్టదని ఎవరనగలరు? భరతనాట్యము ఎల్లరకు శిరోధార్యమేగదా! ఆ భరతనాట్యప్రదర్శనముకైనను వేశ్యాగణమును వివాహాదిశుభకార్యములకు పిలువరాదని ఆనాడు వీరేశలింగముపంతులుగారును, ఈనాడు అందరమును నిరోధింపనేల? అట్లే వాఙ్మయశిల్పిలు స్వీకరింపదగిన వస్తుస్వభావమును, భాషాస్వరూపమును సంఘసమ్మతముగా, అనగా ప్రభుత్వాదేశానుసారముగా ఉండి తీరవలెను. ఉండవలెననుటలో అపచారము లేదు. అట్లు కాని నాడు అనేకవిప్రతిపత్తులు ఏర్పడును. ఈ ధర్మమునుబట్టియే ౧౯౧౦ సంవత్సరములో ప్రభుత్వము తారాశశాంకాదిపచ్చిశృంగార గ్రంథములను నిషేధించుట జరిగినది. సంఘశ్రేయస్సు, సంఘక్షేమము అను దూరపుమాట లటుంచి, ప్రస్తుతపాఠ్యపుస్తకముల సంగతే విచారింతము. ఇది గ్రాంథికములోనే ఉండవలెనని ప్రభుత్వమువారి ఆదేశము. పఠనము, పరీక్షలిచ్చుట గ్రాంథికములోనే జరుగుచున్నవి. ఇంతమాత్రమున మన విద్యార్థులకు గ్రాంథికభాష అబ్బుచున్నదా? ఒకటవ తరగతినుండి బి. ఏ. వరకు వారు చదివెడి సమస్తగ్రాంథిక పాఠ్యభాగముకంటె ఎన్నిమడుగులో విస్తృతిగల వ్యావహారికభాషా వాఙ్మయమును కాలక్షేపార్థము, వినోదముకొరకు, ఆనందముకొరకు వారు చదువుచున్నారు. ప్రతినిత్యము దేశభాషాపత్రికలను ఆ భాషలోనే చూచుచున్నారు. ఆ బడిచదువునకును, ఈ బైటిచదువునకును భాషావిషయమున అన్యోన్యపోషకత్వము లేదు సరిగదా, విద్యార్థులకు హానియు కలుగుచున్నది. వారు ఎంత కష్టపడి గ్రాంథికభాషను బడిలో చదివినను, దానికి భిన్నమైన పాఠ్యేతరభాషా వాతావరణములో సంచరించుచుండుటచేత అది గ్రహించుటయు, వ్యక్తము చేయుటయు దుర్లభమై, చాలమంది పరీక్షలలో తప్పుచున్నారు. దీనివలన ప్రభుత్వమువా రాశించిన పరీక్షాప్రమాణములును, ఫలితములును వారికి తెలియకుండగనే వ్యర్థము లగుచున్నవి.

ఈ రెండిటిలో "వ్యావహారికమునే ప్రమాణీకరింతుము" అనుకొందము. ఆ ప్రామాణ్యము వచనమును మించి పద్యముదాక పోదు. పద్యకవిత్వము వ్యావహారికభాషలో చెప్పిన కవి యింతవరకు పుట్టలేదు; పుట్టడేమోకూడ. ఒకవేళ పుట్టునే అనుకొందము; పద్యగద్యవాఙ్మయమంతయు నిక వ్యావహారికభాషలోనే ఆవిర్భవించి, అదే ప్రమాణీకరింపబడి విద్యార్థులకు పఠనీయమగు ననుకొందము. అట్టి భవిష్యత్తే ఆవిర్భవించిననాడు, తొమ్మిది వందల సంవత్సరములనుండి నేటివరకు పెరిగిన మన పూర్వపద్యవాఙ్మయముగతి ఏమి కావలెను? అంతయు పనికిరాని పాతది అను నెపమున ఒకమూలకు త్రోసివేయబడునా? లేక, అదియు నిదియు నేర్వవచ్చునని ఆమోదింపబడునా? రెంటిని ఆమోదించుటలోని దోసము పైని నేను పేర్కొన్న ఇప్పటి దుస్థితిని మరింత యెక్కువచేయును. అనగా పద్యభాగమును బోధించుట కొక పద్ధతి; వచనభాగమున కింకొక పద్ధతి. రెంటికి రెండు వ్యాకరణములు. పాతదానిని మూలబెట్టినచో అట్టి ఉత్తమవాఙ్మయమును మనము ఎన్నివందల యేండ్లకు తిరిగి సృష్టింపగలము? తెనుగు దేశములో ఇప్పుడు సుమారు రెండువేలమందికి పైగా కవులున్నారు గనుక, అచిరకాలములోనే నూత్నభాషలో అంత వాఙ్మయమును సృష్టింపగల రనుకొందము. ఇప్పటి వ్యావహారికభాషాగమన వేగమును పట్టి చూచినచో నేటిది రేపటికే పాత దగుచున్నది. నూత్నసృష్టియంతయు ఈ శతాబ్దికే పాతబడి మూలకు నెట్టబడు నని ఏల భయపడరాదు? యుగయుగాంతముల ప్రళయమును, పునస్సృష్టియువలె మన భాషాప్రపంచమునకును అల్పాల్పకాలవ్యవధానములోనే ప్రళయమును, పునస్సృష్టియు వచ్చును కాబోలు! అమంగళము ప్రతిహతమగుగాక! ప్రభుత్వమువారు తమ ధీశక్తినంతను వినియోగించి పరిష్కారము చేయవలసిన సమస్య ఇది. దీని నుపేక్షించుటకు వీలులేదు.

మన భాషావనములో పుట్టుకదార్ఢ్యమును బట్టి పాతచెట్లు నేటికిని పుష్పఫలభరితములై యున్నవి; కావున వానిని నరికివేయరాదు. కొత్తమొక్కలు దోహదమునుబట్టి వేరు నాటుకొని పెంపునకు వచ్చినవి. వీనిని పెకలించి వైచుటకును వీలులేదు. ఈ రెండు కొమ్మల జంటను అంటుగట్టి క్రొత్తశోభయు, రుచియు గల వేరొక యుద్యానమును నిర్మింపవచ్చునేమో సమర్థులైన వనపాలకులు చెప్పవలెను.



శ్రీ కందుకూరి వీరేశలింగంపంతులు—వారి సతీమణి శ్రీమతి ఆదిలక్ష్మమ్మగారు.

TINY DROPS OF WATER

make the mighty

RIVERS FLOW

...చిన్న చిన్న జలకణములు చేరి మహానదులై మన మాతృభూమిని ప్రవహించి మనకు నీటిని, ఆహారమును, సర్వసౌఖ్యములను ప్రసాదించుచున్నవి.

ఇదేవిధమున ప్రతివ్యక్తియు తన జీవితముపైన చేయు భీమా ఎంత కొద్దిదైనను మన జీవితాభ్యుదయమునకు దోహదమిచ్చు మహోన్నత భీమా కంపెనీలను నిర్మించుచున్నది.

ఇరువది సంవత్సరముల క్రితము పట్టాదార్ల చేతనే స్థాపింపబడి నెం. 10, మౌంట్ రోడు మదరాసునందు హెడ్డాఫీసు కలిగియున్న **ఇండియన్ మ్యూచువల్ లైఫ్ అస్సోసియేషన్ లిమిటెడ్.,** నిరంతరాభివృద్ధినందుచు జీవిత భీమాయందలి ఉత్తమ ప్రయోజనములనన్నిటిని, అనగా **రక్షణ - భద్రత - సేవ - స్వపరిపాలన**-లను ఇచ్చుచున్నది.

మద్రాసులోనే హెడ్డాఫీసు కల **ఇండియన్ మ్యూచువల్ జనరల్ ఇన్సురెన్సు సొసైటి లిమిటెడ్** కూడ ఇదే విధముగ స్వపరిపాలితమైన సంస్థ. మోటారు, ప్రమాదములు, అగ్ని శాఖలలో మీకు భీమా రక్షణ మిచ్చుచున్నది. వీటినిగురించి మీరు ఎక్కువ వివరములు తెలిసికొనుట ప్రయోజనకరము.

వివరములకు వ్రాయగోరెదము :

INDIAN MUTUAL

LIFE ASSOCIATION LTD., &

GENERAL INSURANCE SOCIETY LTD.,...

10, MOUNT ROAD, ... MADRAS.

వ్యావహారికభాష - మంచిచెడ్డలు

శ్రీ గంకిపాటి కృష్ణమూర్తి

ఇప్పటికి ౩౦ సంవత్సరములనుండి తెలుగుదేశములో గ్రామ్యభాషావాదము బయలుదేఱి చెలరేగుచున్నది. ఆ ఫలములను ఇప్పుడనుభవించుచున్నాము గనుక, ఇప్పుడొకసారి వెనుకకు చూచి మన సారస్వతము దీనివలన ఎంత అభివృద్ధిలోనికి వచ్చినదో చూచిన మంచిది.

గ్రామ్యభాష అను మాటయే బాగుండలేదు. అంతకంటె నాగరికభాష అని వ్యవహరించుట మంచిది. వారు నాగరికులు అని గొప్పగా చెప్పుకొనుదురు గాని వారు గ్రామ్యులు అని ఎవరును గొప్పలు చెప్పరు. కాబట్టి భాషకు మంచి పేరిచ్చిన మనకు గౌరవ మెక్కువ. గ్రామ్యశబ్దముతో బాటు 'వ్యావహారిక'శబ్దమును కొందఱు ప్రయోగించుచున్నారు. వ్యవహారమునందు సాధువు, వ్యవహారమును చేయుచున్నాడు అను అర్థములలో ఠక్ ప్రత్యయము వచ్చి వ్యావహారిక శబ్దమగుచున్నది.

వ్యవహారమునందు సాధువైనది వ్యావహారిక భాష. వ్యవహార మనేకవిధములు. వ్యాపారము కావచ్చును, కోర్టు వ్యవహారము కావచ్చును, శాస్త్రీయమైన వ్యవహారము కావచ్చును. వ్యాపారమునకు, సాహిత్యమునకు ఎల్లప్పుడును సగమెఱుకయే. కోర్టు వ్యవహారములలో, ప్లయింటుస్టేటుమెంట్లలో వ్రాయు భాష సాహిత్యగ్రంథములలో ఇఱికించిన అది ఎవరికిని అర్థము కాకుండ పోగలదు. శాస్త్రీయ వ్యవహారములలో ప్రయోగించు భాష చాలామందికి తలబరువుగా నుండును.

ఈ బాధలన్నియును పడలేక ఈ మధ్యకాలములో వ్యావహారికభాష అని ఒకటి పెట్టి మనము మాట్లాడు పద్ధతినే వ్రాయవలెనను వాదమును చెప్పుచున్నారు. వ్రాయుచుండిరి కూడ. ఇవి చూచి సంతోషించుచున్నవారున్నారు. ఎవరు మాట్లాడే పద్ధతిని అవలంబించి వ్రాయవలెను అనే విషయము చాలామందిని కలవరపెట్టుచున్నది. తెలుగుదేశములో అనేకవిధములైన తెలుగుభాష ఉన్నది. తెలింగాణావారి మాటలు సగమర్థముకావు. రాయలసీమవారు తమ తెలుగే బాగుగా నుండునని ఎప్పుడూ మిగిలిన జిల్లాల వారిని ఆక్షేపించుచుందురు. కృష్ణా గుంటూరు గోదావరి వాళ్లకు తమ తెలుగే అంకమైనదని అహంకారము. వేదములోవలె స్వరము మన తెలుగులో లేదు గాని, ఉన్నట్లైన తూర్పువారి దీర్ఘములు, రాయలసీమవారి మూలుగులు, తెలింగాణావారి యాసలు వ్రాతలో కూడా చూపించుటకు వీలయ్యెడిది.

జిల్లా కొక భాష, ఆ భాషలో స్థానికమైన మార్పులు, స్వరములు ఉండుటయేగాక ఒకజిల్లాలో వారందఱూ ఒకే తీరుగా మాట్లాడుట లేదు. 'ఆ డెళ్లేడు' అనేవారిదగ్గఱనుండి 'వాఁడు వెళ్లెను' అని అఱపున్నలతో గూడ పలికేవారిదాకా ఉన్నారు. ఏరకము వారికి ఆరకము భాష ఉన్నది. మఱి వీనిలో, వ్రాయుట కే భాష నవలంబించవలెను? కొన్ని సంవత్సరముల క్రిందట ఉన్న వ్యావహారికభాషావాదులు శిష్టవ్యవహారములో ఉన్న భాషనే అవలంబించవలె నని చెప్పిరి. వెనుకటితరములోని శిష్టులను తీసికొనిన, 'నే నిషు వెశచాన్, తించాను' అని వ్రాయవలసివచ్చేది. ఈకాలపు వ్యావహారికభాషావాదులలో శిష్టప్రయోగము నవలంబించవలెనని చెప్పువా రున్నారా? నాకు నమ్మకము లేదు. ఇప్పుడు ఫలానావారు శిష్టుల్లు అని చెప్పుటకు

సాధ్యమగునా? ఇది ఎవరైన అంగీకరించెడి విషయమేనా? ఇప్పుడందఱును విశిష్టులే. వెనుకటి తరములోని వ్యావహారిక భాషా వాదులకు ఈ ఇబ్బంది లేకున్నది. అందుచే వారు ధైర్యముగా శిష్టవ్యవహారమని చెప్పుటకు వీలొచ్చినది. ఇప్పుడు కాలము మఱింత మాఱి అందఱూ విశిష్టులై, ఎవరి భాష వారు వ్రాసుకొనుచున్నారు. శిష్టవ్యవహార మనునది అర్థములేకుండ పోయినది. అక్షరములు వ్రాయుట, చదువుట వచ్చినవారందఱును తమ తమ భాషలలో వ్రాసుకొనుచున్నారు. వందలకొలది పత్రిక లున్నవి. వాని కాహారము కావలెను. అవి సరిగా నుండక పోవుటచే ఆకలి ఎక్కువై అవి భాషనే దిగమ్రింగుచున్నవి. చివరకు అంతా వెకిలి వ్యవహారభాషగా పరిణమించుచున్నది. వ్రాయగలవారిలో కూడ తాము చదివినదానిని మఱచి లోకసంగ్రహార్థము ఇట్టి వ్రాతనవలంబించినవారు గలరు.

తెలుగుభాషలో సహజముగా తెచ్చిపెట్టగలిగిన వెకిలితనమే గాకుండ, ఇప్పుడు తెలుగు పద్యములలో ఇంగ్లీషు భాషలోనుండి కొన్ని పదములను ఇఱికించి వాని వెకిలితనమును ఇనుమడింపజేయువా రున్నారు. ఉభయభాషలలోను అప్రవీణులైనవారు దీనిని పొగడుట కద్దు. కొందఱు బాగుగా సంస్కారము కలిగినవారు కూడ దీనిలో ఏదో విశేష మున్నదని చదివి ముగ్ధులై ఆహాహాకారములు చేయుచుందురు. దీనివలన తెలుగుకవిత్వము వృద్ధిచెందుచున్న దనువారితో మాటాడుట కష్టమే. ఈ ‘దుబాష్ కవిత్వము’ ను మెచ్చేవారిని వారి ఆనందమునకు విడచి తెలుగును తెలుగుతోనే గగ్గోలుపఱచువారిని చూచిన మంచిది.

తెలుగుభాష ఎప్పుడూ ఒక మాదిరిగా లేదు. దానిలో అప్పుడప్పుడు మార్పు గలుగుచున్నది. సరియైన వ్యాకరణము లేకుండ ప్రయోగములమీద ఆధారపడియున్న జీవద్భాష లన్నిటిలోను ఎప్పటికప్పుడు మార్పు వచ్చుచునేయుండును. ఇంగ్లీషు భాష ఎంత మాఱిపోయి ఎంత అభివృద్ధిలోనికి వచ్చినదో అందఱకూ తెలిసిన విషయమే. ఇంగ్లీషు అభివృద్ధిలోనికి వచ్చుటకు కారణము ఎవరిచ్చవచ్చినట్లు వారు వ్రాయుట గాదు; ఆ భాషలో వ్రాయువారందఱు తమ పూర్వకవులను చదివి, గ్రీకు లాటిన్‌లు చదివి, ఇతర యూరోపియన్ భాషలను చదివి వానిలో గల మంచినంతను తమ భాషలోనికి తెచ్చుకొని, ఇతర భాషలలో గల అర్థవత్తరములైన శబ్దములను తమ భాషలో చేర్చుకొని, దాని నొక అంతర్జాతీయ భాషగా చేసిరి. అది యొక సర్వ భాషాసమ్మిశ్రణమై అన్ని వ్యవహారములకును బహు యోగ్యముగా నున్నది. మన తెలుగుభాష వ్రాయువారుకూడ వారిని అనుసరించి ఇతర భాషలలో గల మంచినంతయు గ్రహించిన మన భాషకు మేలు. ఇతర భాషలనుండి గ్రహించమనినప్పుడు ఇంగ్లీషుమాటలను సగమునకు సగముగా తెలుగులో గుప్పవలసినదని కాదు నా భావము. మనకు సంస్కృతము ఒక పాతరవలె నున్నది. దానిలోనుండి మన మెన్నియైనను గ్రహింపవచ్చును. సంస్కృతములోనుండి గ్రహించమనినపుడు తెలుగు ద్రావిడజాతిది అని చెప్పువారు ఆగ్రహింపవచ్చును. కాని నా ఉద్దేశములో తెలుగు సంస్కృతమునుండి విభిన్నమైనది కాదు. తెలుగొక సంపూర్ణమైన భాష అని గర్వించువా రున్నారుగాని, ఏదో ఒక శృంగార కావ్యము వ్రాయదలచిన మఱియొక భాష నుండి మాటలను అప్పు తెచ్చుకొనకుండ సరిపడునేమో; శాస్త్రీయమైన విషయము వ్రాయవలెనన్న రాజకీయములు, ఆర్థికము, సైన్సులకు సంబంధించినవి వ్రాయవలెనన్న సంస్కృతమునకు పోవలసినదే.

ఇప్పుడు వ్రాయసగాండ్రు సంస్కృతమును విరివిగా ఉపయోగించుచునేయున్నారు. అదియునుగూడ తెలుగునకు వెకిలితనము తెచ్చిపెట్టునట్లు ఉపయోగించుచున్నారు. పెద్ద సంస్కృతసమాసమును ప్రయోగించి—ఇది విడదీసిన చాలవఱకు అర్థముండదు—చివర కొక తెలుగు ప్రత్యయమును చేర్చి దానికంతకును ఒక వికారమును తెచ్చిపెట్టుచున్నారు. భాషలో ఏదో కొంత మార్పు ఉండవలసినదేగాని ఇంతటి మార్పు ఉండవలెనా? గ్రాంథికభాష ఎవరును సరిగా వ్రాయలేరు గావున అందఱును గ్రామ్యమును వాడవలెనని వీరిలో కొందఱు పెద్దలు చెప్పియున్నారు. కాని నియమభంగ మొనరించినందున నిగమము అనుష్ఠేయము కాదని త్రోసివేయనగునా! వడగళ్ళవానకు

వెలుగొందె, గిడుక్కిందకుజేరి లోకముపై పిడుగులను విడువవనగునా! తెలుగువచనకావ్యములలో గట్టిగా చదువదగిన పుస్తకము కనబడుట లేదు. ప్రపంచములో గల సాహిత్యమంతయు ఇంగ్లీషు రాకపోయిన తెలుగువారికి అందుబాటులో లేదు. ఏభాషలో నైనను చక్కటి పుస్తకము అచ్చుపడినవెంటనే అది ఇంగ్లీషులోనికి తర్జుమా అగుచున్నది. తెలుగులో అట్టి ప్రయత్నమే లేదు. ఒకవేళ ఎవరైన ప్రయత్నించిన అది చదువుటకు వీలుకాకుండ వ్రాయుచున్నారు. ఈవిధముగా నుండుటకు కారణము ఎవరు మాట్లాడినట్లు వారు వ్రాయవలెనని ప్రయత్నించుటయే.

వ్రాయు భాషకు, మాట్లాడు భాషకు అన్ని దేశములలోను భేదము కన్పించుచున్నది. మనదేశము వారు ఇంగ్లీషు మాట్లాడిన, పుస్తకమునుండి చదువుచున్నట్లు మాట్లాడుదురని, సహజముగా ఇంగ్లీషు ఒకరితో నొకరు మాట్లాడుకొన్నట్లు మాట్లాడరని చెప్పుకొనుదురు. మనలోగూడ ఎవరింట వారు మాట్లాడుచున్నప్పుడు మాటను సగము మ్రింగినను రెండవవారికి అర్థమగును. అట్టి భాషను లోకము మీద పారవేసిన అది అందరకు అర్థమగునా? ఇంటివద్ద మాట్లాడినట్లు బయటకు వచ్చి మాట్లాడము. వ్రాసినప్పుడు, ఏశబ్దము ఏ అర్థమునందు నిశ్చితమైనదో ఆ అర్థమునందే ప్రయోగించి చదువుచున్నవానికి భాషయందు కొంత గౌరవము కలుగునట్లు వ్రాసిన మంచిది. విషయమునుబట్టి భాష మారవలసి వచ్చుచుండును. పిట్టకథలు, పిల్లకథలు, పిచ్చినాటకములు వ్రాసిన శయ్యలో ఉదాత్తములైన విషయములను పఱుండబెట్టిన అది దానికి గొయ్యి అగునుగాని వేరుగాదు. ఇప్పుడు జరుగుచున్న దదియే. మంచికిని, చెడుకును ఒకే భాషను ప్రయోగించుచున్నారు. పదికాలములపాటు పుస్తకము నిలచియుండి, అర్థమగుచుండవలెనని యున్న, భాషయందు మన కింకను కొంచెము గౌరవ ముండవలెను.

భాష మారకుండ ఉండవలెననిన, నన్నయకాలములోవలె ఫుల్‌స్టాప్ లేకుండ దండకమువలె ఉండవలెనని నా తాత్పర్యము గాదు. భాష మారవలసినదే. ఇప్పు డందఱును సమగ్రమైన తెలుగు వ్యాకరణము వ్రాయవలెనని ప్రయత్నించుచున్నారు. మనభాషలో కర్మణిప్రయోగము అరుదు. ఇది తెలుగు భాషాజీవమునకు సరిపడదని తెలుగువైయాకరణుల మతము. కర్మణిప్రయోగము లేకపోవుట మన భాషకు గౌరవము తెచ్చిపెట్టదు. కొంచెమాలోచించి శాస్త్రీయమైన విషయమేదైన వ్రాయవలెననిన కర్మణిప్రయోగము చాలా ఉపకరించును. మన భాషలో లేదని మానుకొనుట మంచి పని గాదు. మన పూర్వులుగూడ భాషను మార్చుచువచ్చిరి. నిండుసున్నను సగముజేసి నిండు ప్రాణమును సగముచేసిరి. వారు మ్రింగగా మిగిలిన సగమును మనము మ్రింగి పూర్తిగా లేకుండ జేసిన కొంత బాగుండునేమో. కొన్ని మాటలలో అర్థభేదము వచ్చునుగాని ప్రకరణవశముచే దానిని తెలుసుకొనవచ్చును. 'ఱ' ను గూడ బండి ఎక్కించిన నష్ట ముండదేమో! సమగ్రమైన తెలుగు వ్యాకరణము వ్రాయువారు ఇవన్నియు నిర్ణయించి లోకమునకు నుపకరింతురుగాక.

ఇది విసంధియుగము. పూర్వులమీద మఱీ కోపగించి మఱీ విసంధిగా వ్రాయుచున్నారు. పూర్తిగా సంధులను విడచుటలో గుణమేమియు లేదు. రెండచ్చులు దగ్గఱ జేరినపుడు అన్ని భాషలలోను ఏదియో ఒక ఆగమము వచ్చుచున్నది. ఇంగ్లీషులో చదువునప్పుడు ci అని రెం డచ్చులను కలుపుచుందురు. ఫ్రెంచిలో వ్రాయునపుడుకూడ తుగాగమము వచ్చును- a-t-on, a-t-elle· సంధి యంతయు ముఖసుఖోచ్చారణార్థమే. అసలు, సంధి ఉండకూడ దని చెప్పుట లేనిపోని కష్టము తెచ్చిపెట్టుకొనుటయే. అంతా సంహితగా వ్రాసినను చదువుట కష్టమే. వాక్యమందు సంహిత వివక్షాధీన మన్నారు సంస్కృతములో; అంటే మన తెలుగువారు వాక్యాంతమందు సంహిత వివక్షాధీన మన్నారు. దండకము వ్రాసే రోజులలో ఆ అర్థము చెప్పవచ్చును గాని ఇప్పుడు కుదురదు. కొన్ని మాటలు సంధిలో విపరీతార్థద్యోతకములుగా నుండును. అట్టి స్థానములలో దానిని సంధింపక విడచిన మంచిది. సంధిలేకుండ వ్రాయవలె ననుట యెంత విరుద్ధమో అంతయును సంహితగా వ్రాయుమనుట అంత విరు

ర్థమే. ఏదోయొక మధ్యమార్గమును త్రొక్కి భాష యొక్క గౌరవము పోకుండ చూడవలెను.

మన భాషలోని గొప్ప ఉచ్చారణానుసారముగా అక్షర ముండుటయే. ఇంగ్లీషుభాష పూర్తిగా తెలుసుకొనినగాని చదువుట కష్టమగును. అక్షరమున్నట్టు ఉచ్చారణ ముండదు. ఉచ్చారణము వారిలో చదువుకొనినవారి ఉచ్చారణము ననుసరించి యుండును. అది తెలిసినగాని సరిగా మాట్లాడలేము. ఫ్రెంచిలో వ్రాసిన అక్షరములలో సగముపాలు ఉచ్చరింపబడకుండును. ఈ బాధ లన్నియు మన తెలుగులో లేవు. అక్షరములు వచ్చినంతమాత్రమున అజ్ఞుడైనను వ్రాసినది వ్రాసినట్టు చదువవచ్చును. మనభాష యొక్క లిపి అంత చక్కగా సంస్కరింపబడినది. మన భాషలోను, సంస్కృతమునుండి జనించిన భాష లన్నిటిలోను గల సుగుణ మిదియే. దీనిని వదులుకొని రోమను లిపిని పెట్టమని కొందఱు పిచ్చిగోల చేయుచున్నారు. ఆ పని చేసిన సుఖముననున్న ప్రాణమును కష్టపెట్టుకొనుటయే. ఇప్పుడీ వ్యావహారికులు మన భాషలో గల ఈ సుగుణము విడిచి మఱియొక మార్గములో పడిరి. మనము మాట్లాడునపుడు అనేకమైన ధ్వనులను చేయుదుము. అవన్నియు అక్షరములో ఇమడవు. 'వెళ్లాడు' అని వ్రాసిన, మనము వ్రాసిన పద్ధతి యొకటి, ఉచ్చరించు పద్ధతి యొకటి. 'వెళ్లెను' అని వ్రాసిన వ్రాసినట్టు చదువగలుగుదుము. కాని ఇప్పుడు ఆ విధముగా వ్రాయక ఉచ్చారణోల్లేఖనములకు భేదము తెచ్చిపెట్టి భాషను ఎక్కువ కష్టముగా చేయుచున్నారు. ఇంగ్లీషు భాషలోగల అక్షరములను ఉచ్చారణానుకూలముగా సంస్కరింపవలెనని ఆదేశములోవారు కొందఱు పాటుపడుచుండిన సమయములోనే మనము మన భాషలో గల సౌలభ్యమును వదలి చిక్కులలో బడుటకు ప్రయత్నించుచున్నాము.

మన మెన్ని ప్రయత్నములు చేసినను, భాషను ఎన్ని విధములుగా మార్చినను శబ్ద మపభ్రంశ మొందకుండ చూడవలయును. తెలుగుభాషకు శబ్దములన్నియు సంస్కృతమునుండి వచ్చినవే. ద్రావిడభాషనుండి వచ్చినవని కాల్డ్వెల్ చెప్పినప్పటినుండియు కొందఱు ద్రావిడులు దానిని పట్టుకొని పాకులాడుచున్నారు. గ్రీకుభాషనుండి సంస్కృతము ఫోర్జరీచేయబడినదని ఒకప్పుడు ఒక ఇంగ్లీషుపండితుడనియుండెను. సంస్కృత మెంత ప్రాచీనమైనదో ఆయన ఊహించలేక ఇట్లనెను. అక్షర సమామ్నాయము సంస్కృతముతో సమానముగా నున్న భాష ఏదియైనను సంస్కృతజన్యము కాదనుట నాకంత వివేకముగా కనుపడుటలేదు. గ్రీకు మొదలైన భాషలన్నియుకూడ సంస్కృతమునుండియే జనించినవని చెప్పు సాహసికులు మనలో చాలమంది యున్నారు. గ్రీకులో ఉన్న 'గ్నో' అను ధాతువును సమానార్థకముగా సంస్కృతములో 'జ్ఞా' అను ధాతువును పోల్చి చూచిన దీనిలో దేనినుండియో ఒకటి వచ్చినదని చెప్పవలెనను భావము కలుగును. రెండుభాషలలోను ధాతువులు కలవు. శబ్దములు చాల వఱకు గ్రీకులో ధాతుజములే నట. సంస్కృతములో కూడ "సర్వం నామ ధాతుజ మాహ శకటస్య తు తోకమ్"-శకటముగారి తోకము (అపత్యము)-శాకటాయనుడు శబ్దములన్నియు ధాతుజ మనియే నని చెప్పియున్నాడు. మన కిక్కడ కావలసినది—తెలుగుభాష సంస్కృతభాషాజన్యమైన, తెలుగుశబ్దము అపభ్రంశ మొందకుండ ఉండవలయు నన్న మనము సంస్కృతము నభ్యసింపవలెనను మాటయే. శబ్ద మూలము తెలిసినవాడు ప్రకృతికి తగినంత సన్నిహితముగా వికృతిని ప్రయోగించును తెలియనివాడు తన కిచ్చ వచ్చినట్లు, తనకు వీలుగా నున్నట్లు వ్రాయును. శబ్దము నపభ్రంశ మొనరించుటయే మన తాత్పర్యము కాకపోయిన, ఎఱిగియుండి శబ్దము నపభ్రంశ మొనర్చకుండిన భాష ఎప్పటికైనను బాగుపడగలదు.


మన తెలుగు సంస్కృతమునుండి అపభ్రంశమును చెందిన భాష అని నిర్ధరించినవానికి తెలుగు ఇంకను అపభ్రంశము చెందుననుభయ మొందుకు అని ఎవరైనను ప్రశ్నింపవచ్చును. దేశభాష లన్నియు సంస్కృతజన్యములు, సంస్కృతమునుండి కొంత వఱకు జారి తెలుగుశబ్ద మైనది. ఎంతవఱకు జారినదో మనకు తెలియును. దాని అర్థము కూడ మనకు తెలియును. ఇంకను జారిపోవుచుండిన భాషలోని బిగువు గౌరవము పోవుటయేగాక, భాష అర్థము కాకుండ పోవును. శబ్దసంకేత మెవరికిని తెలియకుండ పోవును

వ్యవస్థ లేకుండ పోవును. ఈ అక్షరక్రమములో ఉన్న మాటలకీ యర్థము అని ప్రయోగముచే, నిఘంటువులచే తెలుసుకొనుచున్నాము. మన వ్యవహారము సరిగా నడువవలె నన్న శబ్దసంకేతము నిశ్చితమైయుండవలెను; స్థానికమైన ప్రయోగములను, అపభ్రంశాపభ్రష్టములను తెలిసినంతవఱకు పరిహరింపవలె నను ప్రయత్నము లేకుండిన అర్థము సర్వజనసాధారణముగా తెలియునా? శబ్దార్థసంబంధము సిద్ధమై నిత్యమై యుండవలెను. వ్యవహారమునందు అపశబ్దభూయిష్ఠముగా పల్కిన ఏ పనియును జరుగదు. మాట మంచిచేతనే, శబ్దసౌష్ఠవముచేతనే రాజకీయవ్యవహారములలో రాయబారులు తమ పనులను నెఱవేర్చుకొనగలరు. మన పూర్వులకు శబ్ద మెంత సుష్ఠుగా నుండిన అంత ఆనందముగా నుండెడిది. నాగరికులైన మనము సుష్ఠుశబ్దమునందు మనస్సును ప్రవర్తింప జేయవలదా? వ్యవహారము సాగుటకుగాను సుశబ్దమును ప్రయోగింపవలదా?

"యస్తు ప్రయుంక్తే కుశలో విశేషే
శబ్దాన్ యథావ ద్వ్యవహారకాలే;
సోఽనంత మాప్నోతి జయం పరత్ర
వాగ్యోగవిత్; దుష్యతి చాఽపశబ్దైః"

—"విశిష్టమైన వ్యవహారకాలమునందు వాగ్యోగవిదుడైనవాడు, జ్ఞానమే శరణముగాగలవాడు యథాయథముగా శబ్దములను ప్రయోగించి పరత్ర అనంతమైన జయమును పొందును వాగ్యోగవిదుడు కానివాడు, అజ్ఞానమే శరణముగాగలవాడు దోషము నొందును." అని వేదము.





శాంతమూర్తి

శ్రీ కొసరాజు రాఘవయ్యచౌదరి

౧


సత్యాహింసలు, ప్రేమసూత్రములు నీ సాన్నిధ్యలాభాన నౌ
న్నత్యమ్ముం గడియించుకొన్నవి, ప్రశాంతజ్యోతి నీ మోముపై
నిత్యానందముగా వెలింగె, ఘనసందేశాలు నీ నోటిలో
ముత్యాలై పులకించె, సాధుగుణసంభూతాత్మ ! గాంధిప్రభూ !

౨

తులువతుపాకిగుం డెడద దూసుకపోయిన శాంతమూర్తివై
కలగవు, కంట నీరిడవు, కాతరజెందవు, ప్రాణరక్షకై
పిలువవు, చేతు లడ్డవు, వివేకము గోల్పడ, వన్యచింతలం
దలపవు, రామనామజపతత్త్వము మాన వదేమి చిత్రమో !

3

ఓయి మహాత్మ ! నీమహిమ నూహయొనర్పక దుర్మదాంధుడై
మాయలమారి, ద్రోహి, కొరమాలిన గట్టిపకాసాకండు నీ
కాయము దూల్చెనే ! తనువు గాల్చిన నేమి పవిత్రబోధనల్
మాయునె ? అంతకంత కసమానముగా మహి ప్రాకకుండునే?



[కథ]

●

శ్రీ నోరి నరసింహశాస్త్రి

౧

ఇది యిన్నేళ్ళనాటి వృత్తాంతమని చెప్పలేను. కొన్ని వందల సంవత్సరముల క్రిందటిది కావచ్చును. వేలయేండ్లై యుండ వచ్చును. లక్షల యబ్దములను గడచి యుండవచ్చును. కాక ఈనాటి కథయే కావచ్చును! ఇకముందు వందల సంవత్సరములకో, వేల సంవత్సరములకో, లక్షల యబ్దములకో జరుగనున్న దనియైన నన వచ్చును. ఎప్పటిదైన నేమి? ఈ కథ సత్యమైనది! ఎప్పటిదైనను ఈ కథాప్రారంభమునాటికి హిమాలయ పర్వతముల నుండి గంగా యమునా సరస్వతీ నదులు తప్ప మరి యే నదియు సముద్రుని జేరలేదు. భరతభూమికి ఉత్తరభాగమున పశ్చిమపు సరిహద్దు లేదు. సింధు నది యను నామమే జను లెవ్వ రెరుగరు.

౨

హిమాలయపార్శ్వమున గంగాతీరమున హరిద్వార మును సమీపల్లె నొక టున్నది. దాని కులపతి పలితకేశోజ్జ్వలవృద్ధుడైన అంగిరస్సు. అందలి ఋషులు చేయు మహాసత్రముల యాజ్ఞికాగ్నిచే నానా టచ్చట శీతబాధ శమించి వాసయోగ్యముగా నుండెను. అంగి రసు ఇక్ష్వాకువంశీయులైన కింకరుల పరిరక్షచే నా చుట్టుపట్టుల దస్యుబాధ లేదు.

అంగిరస్సుపుత్రుడు అంబరీషుడు ఈమధ్యనే ఉపనీతుడై వేదాధ్యయనమునకై గురుకులము ప్రవేశించినాడు. అతనితో ఆట లాడ మరగిన యతని సోదరి పులోమకు భ్రాతృవియోగము దుస్సహ మైనది. అన్నతో తిరుగాడిన ప్రదేశములే ఇప్పు డొంటరిగా తిరు గాడును. ఇప్పుడు వనస్పతుల నీడ లామెకు సుఖ మీయవు. పర్వత సానువు లామెహృదయమును ఊర్ధ్వభాగములకు తీసికొని పో జాలవు. గంగాతీరమున శిలలును, సైకతములును ఆమె చిత్తమునకు శాంతి కల్పింపవు.

రాజహంసములు, కారండవములు వినువీథి పింఛములుగట్టి పఱచుచుండును. అవి కొన్ని వేళల ఉత్తరాభిముఖముగను, మరికొన్ని వేళల దక్షిణాభిముఖముగను ఆకాశగంగాప్రవాహమువలె ప్రసరించు చుండును. వానివంక చూచుచుండగా పులోమయూహలును ఆ హంసకారండవముల మార్గముననే ఒకమా రిటు, ఒకమా రటు నను సరించుచుండును.

పితృదేవులకు మాధ్యాహ్నికపూజార్థము పూలు తెచ్చుటకు పులోమ బయలుదేరినది. పూ లుంచిన తామరాకుసంపుటము చేత నుంచుకొని నడచుచు, మున్నంబరీషునితో పవిత్రప్రసంగములు తరు చుగా చేసిన ప్రదేశము దారిలో చేరినది. మందాకినీతీరము నంటి యున్న యున్నతశిల యాప్రదేశమున గలదు. ప్రశాంతిమగు నా స్థలము చేరగనే అంబరీషుని మాటలు జ్ఞప్తికి వచ్చెను. తా నుపనీతు డైనంతట అగ్నికార్యము నిర్వర్తించుచు ఎంత బ్రహ్మవర్చస్సు సంపాదించునలనా యను నూహయే వాడు పలుమా రామెకు వర్ణించు వాడు. వెంటనే యామెకును అగ్నిహోత్రతర్పణమే మధురభావ ముగా స్ఫురించును.

పులోమ తన చేతి నున్న యా పుష్పసంపుటము భూమిపై బెట్టి యా శిల కానుకొని కూర్చుండెను. ఆమె తలయెత్తగా ఆకసమున దక్షిణభాగమునుండి యొక రాజహంసమును, ఉత్తరదిశనుండి యొక కారండవమును వచ్చుచుండుట తిలకించెను. రాజహంసము ధీరగమన ముతో వచ్చుచుండెను. కారండవము ఆతురమై బాణవేగముతో పర తెంచుచుండెను. ఆ రెంటిని చూచుచు నామెమనస్సు శూన్య భావము నొందెను. ఆ కారండవమురవు వినవచ్చుచుండెను.

ఆమె సమాధిసదృశావస్థకు ఆకస్మికముగా భంగము వాటిల్లెను. అపూర్వమైన యొక కేక యామెచెవుల బడినది. అది వరాహ ఘుర్ఘురము ననుకరించుచు భయంకరమై యుండెను. మ్లేచ్ఛుడు ఉచ్చరింప యత్నించు దేవభాషావలె నది కర్ణకఠోరముగా నుండెను.

పులోమ భయ మెరుగదు. కాని పరధ్యానముగా నున్న యామె ఆ యకస్మాద్దారుణశబ్దముచే ఉలిక్కిపడెను. కాలు సడలి పుష్పసంపుటమునకు తగిలి యది మందాకినీప్రవాహములో పడెను. దానిని పట్టుకొనుటకు పులోమ చేతులు చాచుటలో యామె దేహము ఒరిగి మహావేగముతో ప్రవహించుచున్న యా మందాకినీప్రవాహము లోనికి జారి పడిపోయెను.

3

ఆ దారుణశబ్దము గావించిన వ్యక్తి ఆమె మాతృపక్షు బంధువు. అతని పేరు పులోముడు. అతని తండ్రి దనువు అధికారతృష్ణచే హిమాలయపర్వతము దాటి ఉత్తరమున మానససరోవర ప్రాంతమందు నివాసము కల్పించుకొని యచ్చటి పార్వతీయులకు ప్రభువయ్యెను. వైదికాచారములకు దూరుడైనందున నతనికి, నతనివారలకును ద్విజకర్మలు నామమాత్రావశిష్టము లయ్యెను. ఆ ప్రభునామము ననుబట్టి యా పార్వతీయులకుగూడ దానవనామము ప్రసిద్ధమైనది.

ఆ పార్వతీయులతో కలిసి పెరిగినందున పులోముని దేహము కూడ వ్యాయామకర్కశమయ్యెను. బిగిసికొనిపోవు చలిదేశములో బహుకాలము నివాసము చేసినందున నాతని చర్మము మనుష్యచర్మము వలె స్నిగ్ధముగా నుండక వరాహచర్మమువలె గరుకుపారినది. అతడు మాటాడునది దేవవాణియే. ఐనను చలికి మొద్దువారి సూక్ష్మమైన చలనములు మరచిన యా జిహ్వనుండి వెలువడుచుండుటచే నది యేదో క్రొత్తశబ్దముగా వినిపించుచుండెను.

అతడు తల్లిదండ్రులవెంట నా యుదయముననే అంగిరస్సుని యాశ్రమమునకు వచ్చియుండెను. ప్రాతస్సంధ్యావందనము నిర్వర్తించుకొని పులోముడు ప్రొద్దుపోక సహవాసమునకై అన్వేషింప సాగెను. ముందాతడు అచ్చటి విద్యార్థులతో కలసిపోవ ప్రయత్నించెను. కొందరు బ్రహ్మచారులు గురువులయొద్ద వేదపాఠము చెప్పుకొనుచుండిరి. వాడు వారి ప్రక్కను కూర్చుండెను. కాని గురువులు గాని, ఆ విద్యార్థులైనగాని అతనినింక తలయెత్తియైన తిలకింపలేదు. ఏమి యీ వింతవిద్యార్థులు! పార్వతీయులవలె తన్ను పలకరింపనైన పలకరింపక గురువు లుపదేశించు ప్రతిపాఠము తదేకనిష్ఠతో అధ్యయనము చేయుచున్నారే!

పులోము డది భరింపలేక మరియొకచోటికి పోయెను. అక్కడ బ్రహ్మచారులుమాత్రమే కలరు. వారంతకుముందే చెప్పికొనిన వేదపాఠము వల్లెవేయుచు మధ్యమధ్య ఒకరితో నొకరు సంభాషించుకొనుచుండిరి. ప్రక్కన గురువులు లేనందున పులోమునికి మరింత ధైర్యము కలిగి వారితో పోయి కూర్చుండెను.

ఈ నూతనయువకుడు వారందరకంటె పెద్దవాడు. అందుచే వారాతని నాదరించి వేదాధ్యయన మెంతవరకైనదని ముందు ప్రశ్నించిరి. ఉపనయనసంస్కారమే కాని యాతడధ్యయన మెరుగడు. అతనికి ఏమి ప్రత్యుత్తర మీయవలెనో తోచక కొంచెము వికటముగా నవ్వెను. ఇంకను వారాతని మాటాడింప ప్రయత్నించిరి. వాడు చిన్నచిన్న జవాబులును, ప్రక్కనుని మాటిమాటికి నవ్వు నవ్వుటగాక వేరుసంభాషణము చేయలేదు. వారును తుద కా ప్రయత్నము వదలి వల్లింపదొడగుచున్న సంథ కుపక్రమించుచు అతనిని కూడ కలిపి చెప్పుమని సాగించిరి.

ఆ బ్రహ్మచారులు అనర్గళముగా ఒక్కొక్క వాక్యమే పునః పునరావృత్తి చేసికొనుచు వల్లించుచుండిరి. వినగా వినగా పులోమునకది సులభసాధ్యముగా కనిపించెను. తుదకు ధైర్యము తెచ్చుకొని వాడును వారితో కలిపి చెప్ప ప్రారంభించెను. వారట్లు రెండు మూడు వాక్యములైన చెప్పకముందే సంగీతములో అపశ్రుతివలెనే పాఠములో నపస్వరము లాతని నోట వచ్చెను. ఆ బ్రహ్మచారులు నంత యాకస్మికముగా చాలించిరి. వారిలో పెద్దవాడు పులోముని కోపగించెను. చిన్నవారాతని యపశబ్దోచ్చారణము ననుకరించుచు పరిహసించిరి.


ఆ పులోమదానవుని ముఖము సిగ్గుతో కందగడ్డవలె యెఱ్ఱవారెను. నెమ్మదిగా కోప మావేశింపసాగెను. అతడు చివాలున నచ్చటనుండి లేచి ఆ యాశ్రమప్రదేశముల నిటునటు తారట్లాడి అంగిరస్సుల ధర్మపత్నియొద్దకు పోయి అంబరీషు డెక్కడ నున్నాడని యడిగెను. అతడు వేదాధ్యయనమునకై గురుకులమునకు వెళ్లినాడని యామె చెప్పగా విని, పులోమ యెక్కడ నున్నదని ప్రశ్నించెను.

“నీకు తోచుటయే లేదా నాయనా? అంబరీషుడు గురుకులము నకు వెళ్లినప్పటినుండి తోడులేక అమ్మాయి దిగులుతో అక్కడక్కడ అడవులలోను, మందాకిని ఒడ్డునను పూలుకోయుమిషతో వెళ్లి తిరుగుచుండునురా!” అని యామె ప్రత్యుత్తర మొసగెను.

పులోముడు వెంటనే పులోమను వెదకుటకు ఒక్కపరుగున బయలుదేరెను. ఆ సంతోషపారవశ్యముతో క్షణకాలములో నా యాశ్రమమునిపల్లెలో కుటీరము లున్న భాగ మతిక్రమించి బయటపడెను. అతని కది కారాగారమునుండి విడివడినట్లయ్యెను. అడవులలో దారి పోవుట, శిలలపైనుండి లంఘించుట యతని కర్తవ్యాసత్త్వమునకువలెనే బహుకాలాభ్యస్తమైనందున ఆశ్రమప్రాంతభూమి యంతయు నామెకై వెదకుచు నా దానవు డుల్లాసముగా పరిభ్రమించెను.


అవలీలగా నాతడట్లు గంతులు వేయుచు పోయిపోయి తుదకు మందాకినీతీరమున గండశిల నానుకొని ఆకాశమువంకకు తలయెత్తి అందు పారుచున్న హంసకారండవములను తిలకించెడి పులోమను ఉపలక్షించెను. సంతోషపారవశ్యముతో నా దానవుడు “పులోమా!” యని పెద్దపెట్టున కేక వేసెను. ఆ శబ్దమాతని నాభిస్థానము భేదించుకొని పుట్టి, అతని రెండుపార్శ్వముల మధ్య గుహాంతరము పూరించి, కంఠభేరిలో చేరి యినుమడించి, తాలుమధ్యప్రదేశము నిండిపోయి, పూర్తిగా తెరచిన యాతని ముఖవివరమునుండి తీవ్రవేగముతో వినిర్గత

మార్పులోనే మజా అన్నది
జీవితానికి మాత్రమే కాదు



మీ దుస్తులకు కూడా
అవసరమే. సూటింగులకు,
షర్టింగులకు మనోహరమైన రంగులు గల
కృష్ణామిల్స్ వారి బట్టలు మన్నికగలవి, నమ్మదగినవి.
హోల్ సేల్స్ :

మెసర్స్. ... బ్రదర్స్ లిమిటెడ్



KRISHNA Suitings & Shirtings

Manufactured by

SRI KRISHNA WEAVING MILLS, SUBRAMANYAPURA, BANGALORE CITY.

FAB-336

మయ్యెను. ఆ మహాధ్వని యొక్క క్షణములో గిరికందరములను, మందాకినీజలములను మార్మ్రోగి మరింత భయంకరశబ్దముగా మారి పోయెను.

౪

ఆ శబ్దము వినియే పరధ్యానముగా నదియొడ్డున గూర్చున్న పులోమ ఉలిక్కిపడి మందాకినీప్రవాహములో పడిపోయినది. అది చూచినవెంటనే పులోమదానవుడును ముందువెనుక లాలోచింపక ఒక్కగంతు వేసి ఆ మహాప్రవాహములోని కురికెను.

పులోమదేహము సుకుమార మయ్యును పటుత్వము కలది. చేపవలె నా మెకును ఈత చిరకాలాభ్యస్తము. ఐనను అంత యాకస్మికముగా నామె త్రుళ్లి జారి నీటిలో పడిపోయినందునను, శీతలజల స్పర్శవలనను ఆ మెయొడలు ఒక్కసారిగా జిల్లుమని కొయ్యవారి నిష్కంప మయ్యెను. ఆమె తెప్పరిల్లుకొని అంగచలనము ప్రారంభించు నప్పటి కప్పుడే యామెదేహము నొకసుడిగుండ మాకర్షించుచుండెను.

పులోమదానవు డీదుకొనుచు నామెను సమీపించునప్పటికి ఆమె యీదుచు నా సుడిగుండమునుండి తప్పించుకొనుటకు యత్నించుచుండెను. అట్లు మున్మూరామె యత్నించి మున్మూ రామె సుడితో పాటు తిరుగుడుపడెను.

పులోమ యది చూచి పెద్ద ఊపుతో తన దేహమును ముందుకు త్రోపుపెట్టుకొని పులోమను సూటిగా పోయి తాకెను. బలమైన యా త్రోపుతో వా రిద్దరు నాకస్మికముగా నా సుడివేగమునుండి బయటపడిరి. ఆ సుడియు ప్రక్క కొత్తిగిల్లెను. ఆ త్రోపులో పులోమదేహము పులోమదానవుని శిరస్సుపై బడెను. అత డంతట తన రెండు దీర్ఘబాహువులతో నామెశరీరమును పొదివెను. అట్లుండ మందాకినీ ప్రవాహవేగము వా రిద్దరను క్రిందికి లాగివేయుచుండెను.

ముప్పది వింట ప్రమాణము వా రట్లు కొట్టుకొని పోయిన పిమ్మట అదృష్టవశముచే పులోమదానవుని కాలికి నీటిలోనున్న యొక శిలపై పట్టు చిక్కెను. దానితో నాతడు పులోమకును ఒక్కక్షణము విశ్రాంతి యీయ గలిగెను. భూదేవిని సముద్రమధ్యమునుండి దంష్ట్రాకోటితో ఉద్ధరించుచున్న యాదివరాహావతారునివలెనే పులోమ నుద్ధరించుచున్న యా పులోమదానవుని యాకారమును ఆ ఒక్క క్షణకాలము భాసించెను.

వా రిద్దరు నంతట రొజుకొనుచు ఒడ్డు కీదుకొని రాగలిగిరి. ఒడ్డు చేరగానే పులోమ సొమ్మసిల్లిన ట్లయ్యెను. పులోమదానవుడును నీరుకారుచున్న తన వస్త్రములవంక నైన చూచుకొనక భస్త్రికవలె రొప్పుకొనుచు ఆ బాలిక వస్త్రములు పిండి తడియార్చి పాదములును, హస్తములును సంవాహన మొనర్చి యామెశరీరమునకు వేడి పుట్టించి తెలివి కలిగించెను. కొద్ది సేపటిలో పులోమకు నడచు నోపిక చేకూరినది. పులోమ డామెకు తన చేయ్యూత యిచ్చి పట్టుకొని మెమ్మదిగా నడిపించుకొనుచు నాశ్రమమునకు తీసికొనిపోయి యామెను తల్లికి దర్శింపజేసెను.

మధ్యాహ్న దేవతార్చనవేళ యతిక్రమించిన చాల సేపటికి పులోమ పూలులేకుండ పట్టి చేతులతో వచ్చుట చూచి తల్లి కాశ్చర్య మయ్యెను. మరియును ఉత్తరక్షణములో నామెవాలకము చూచి వ్యగ్రచిత్తముతో ఆ మునిపత్ని "ఇది యేమి?" అని వారల ప్రశ్నించెను.

పులోమ దుత్తరముగా ఫక్కుమని బిగ్గరగా నవ్వెను. ఆ నవ్వులో నాతని ముప్పదిపండ్లును బయటపడెను. ఆ కఠోరశబ్దమునకా మునిపత్ని ఉలిక్కిపడెను.

"అమ్మా, నేను ఒంటరిపాటున కూర్చుండి ఉండగా వీడు ఇట్లే భయంకర శబ్దము చేసెను. నీ వలెనే నేను కోసిన పూలు బుట్టయు, దాని వెంట నేనును త్రుళ్లిపడి ప్రక్కనున్న మందాకినీ ప్రవాహములో పడిపోతిమి. అందులో ఒక ఆవర్తములో పడి గిరగిర తిరుగుడు వడుచున్న నన్నుమాత్రము వీడు తన ముట్టెతో నెట్టి ఒడ్డు పట్టించినాడు."

ఇట్లు పులోమ చెప్పగా విని మునిపత్ని "తల్లీ, ఎంత గండము తప్పెనదే!" అనుచు దగ్గరకు తీసి కట్టిన తడివల్కలములు మార్పించి ఉపచరించెను.

ఈ కథ యాశ్రమమంతట వెంటనే ప్రాకిపోయెను. మునులు, మునిపత్నులు, మునిబాలురు, మునిబాలికలు, బ్రహ్మచారులు—అందరును వచ్చి పులోమను పలుకరించి యామెకు సాహసముతో ప్రాణదాన మొనర్చిన యా పులోమదానవుని బరిపరివిధముల శ్లాఘించిరి. ఆ యుదయవేళ నాతని యపశబ్దోచ్చారణకు పదరి పరిహసించిన బ్రహ్మచారులుగూడ నిప్పు డాతని నాదరదృష్టుల ముంచివేసిరి.

౫

ఆ పిమ్మట పులోమకు పులోముడు సంతతసహచారి యయ్యెను. ఆమెకు సోదరుని యెడబాటుచే గలిగిన చింతయు గొంత దూర మయ్యెను.

ఆమె కేమి పని యున్నది? తండ్రియగ్నిహోత్రములకు కావలసిన సమిధలు, కుశలు బ్రహ్మచారులే ప్రాంతాటవినుండి తీసికొని వత్తురు. ఆమెతల్లి యగ్నిహోత్రశాలయందు అన్నులు విహరించి దానితో మహానసమున హవిరర్థముగా పాకము చేయును. ఆశ్రమగోవుల నన్నిటిని గోపాలురే చూచుచుందురు. అంగిరర్షి హోమధేనువు నొకదానినిమాత్రము ఆ మునిదంపతు లిద్దరే ఉపచరింతురు. ఆ గోమాత యా యాశ్రమమున కంతటికిని తల్లియే! దాని పూజకు మాత్రమే పులోమనుగూడ అప్పుడప్పుడు నియోగించుచుందురు. మరి యిక అంగిరర్షి త్రికాలములయందును బ్రహ్మవిష్ణుశివాత్మకుడు పరమేశ్వరు నారాధించును. ఆ దేవతార్చనకు పూలుకోయు టొక్కటే పులోమకు నియతమైన పని. ఆ పూలుకోయు పని యామె కొక

యాట. అందుకై ఆమె యాశ్రమతరువులకడనే కాక ఉపాంతారణ్య భూములకూడ సంచరించును.

ఇప్పుడు పులోమ ఏపనిపై బోయినను చెలికాడగు పులోముడామె ననుసరించును. అతనికి మునిబాలురతో సాహచర్యము కష్టతర మయ్యెను. వారి కాతనియందు మిక్కిలి యాదర ముదయించినది. అతనిని చూడగానే వారు వరాహఘుర్ఘురము ననుకరింపు మని సూచించుచు అట్టి ధ్వని చేయుదురు. పులోము డొకసారి ఆనందముతోడను, మరియొకపరి కోపముతోడను భయంకరధ్వని చేయును. అది విని బ్రహ్మచారులు అందరు సంతోషముతో నవ్వుదురు. అంతేకాని వా రెక్కువగా నితనితో నేమియు సంభాషింపరు. అపరమిశ్రమైన పరిహాసమే వారు చేయునది. వేదాభ్యాసజడు డగు పులోమునితో నా బ్రహ్మచారులకు దీర్ఘసంభాషణ మెట్లు పొసగును?

కాని యాతనివెంట పులోమ యున్నవేళల వా రట్లు వాని బరియాచకమాడరు. కులపతికుమార్తె ఎంత చిన్నపిల్లయైనను బ్రహ్మచారు లందరకు మాననీయ. ఆమె వచ్చుచున్న వారందరు ప్రక్కకొదుగుదురు. ఆమెవెంట నున్న పులోమునిగూడ వా రట్టియెడ పలుకరింప స్వతంత్రింపరు. పులోమయందలి గౌరవభావ మాతనియందును సాహచర్యముచే సంక్రమించును.

అది పుష్యమాసము! దూరమున లీలగా కన్పించు హిమాలయ శిఖరముల శీతలదృష్టిపాతము హరిద్వారక్షేత్రమునగూడ తీవ్రముగా ప్రసరించు ఋతు వది. వివిధద్రుమగుల్మము లప్పుడే ఆకులు రాల్ప నారంభించును. పుష్పములు అరుదుగా లభ్యమగును. వానికై పులోమ వనభూముల దూరసంచారము లొనర్చును. తామరాకులతో కుట్టిన దొన్నెలలో వా రిద్దరు పుష్పములు సేకరింతురు.

పులోమ లేడివలె పరుగెత్తి వానికి కనబడకుండ దాగుకొనును. పులోముడు ముకుపుటములపై కెగుర వేయుచు పులోమ దేహమునుండియు, ఆమెచేతి నున్న సంపుటమునుండియు వీతెంచు పద్మాదిపుష్పసౌరభమునకై వెదకుచు కొంతవడికి నిర్వర్ణించి యామె దిక్కుకు అడవిపందివలె నిర్వక్రమైన పరుగున పరువెత్తును. ఇతర వేళల పులోమ దూరముతొలగి గాలివాలుకు పోయి చెట్టుకొమ్మల డాగి కోయిలవలె కూతవేయును. పులోము డది విని చెవులు రిక్కించి శబ్దము వచ్చుచున్న మార్గ ముపలక్షించి డేగవలె నటు శంకరు పరుగెత్తుకొనిపోయి యామెను కలసికొనును. మరియొకప్పుడామె యాతని నెట్లో తప్పించుకొని రాళ్లగుట్టల నడుమ దాగి యేదియో ఏకాంతమున ధ్యానించుచుండును. పులోము డామె కనపడకున్నచో ఎదురైన శిలలెల్ల దొర్లించుచు పెద్దవానిపైనుండి లంఘించుచు అలసట లేక పరిభ్రమించి తుద కామెసమీపము నెట్లయిన జేరుకొనును. ఆమె తన్నప్పుడు పలుకరింపనిచో నిశ్శబ్దముద్రా నామె మాట్లాడువరకు నామెపై పు చూచుచు ప్రక్కనున్న గండశిలలలో నొకడై నిలిచిపోవును.

వారు తరచుగా జలక్రీడ లాడుదురు. పులోమ చేపవలె నీటిలో దూటిపోవును. పులోము డామెను మహిషమువలె నీళ్ళు చిమ్ముచు వెంబడించును. వా డెంత మోటువాడైనను పులోమ కెట్టి బాధయు రానీయకుండ వర్తించును.

ఈ విధముగా నా చలికాలమంతయు గడచిపోయినది. పులోముని తలిదండ్రులు దానవరాజ్యమున శీతబాధ దుర్భరమైన సంవత్సరములలో హేమంతకాలముల నిట్లే హరిద్వారము వచ్చి బంధుదర్శనము చేసి మరల వసంతారంభమునకు ముందుగా స్వరాజ్యసీమ కట్టహాసముతో చేరుకొందురు.

దనువును, దనుపత్నియు అట్లా సంవత్సరము మరల స్వరాజ్యమునకు వెళ్ళబోవుముందు అంగిరోధర్మపత్నితో తమ కుమారుని వివాహవిషయము ప్రస్తావించి పులోమునికి వారి కుమార్తె పులోమ నిమ్మని యర్థించిరి. ఆ సాధ్వి యెంతయు సంతోషించి యా శుభాకాంక్ష కులపతులకు నివేదింప నాదేశించెను.

ఆ దంపతు లంతట కులపతి యంగిరర్షులను సందర్శించి పులోముని కొరకు వారి కూతు బులోమను వరించిరి. ఆ మాటలు వినిన యా యంగిరర్షి అంతరంగమున గలిగిన చిరునవ్వు అంతరంగమునందే అడంచుకొనెను.

"వీరు వేదమర్యాదలే యెరుగని ద్విజబంధువులు. మంత్రోక్తమైన కన్యావరణపవిత్రవిధానమే వీరు విస్మరించిరి. వేదాభ్యాసజడుడగుటే కాక దేవవాక్కు స్పష్టముగా నుచ్చరించుటకూడ మరచిన యీ పులోమదానవునికి హవిస్సువలె పవిత్రయగు పులోమను కన్యాదానము చేయ నే నిచ్చగింతునా? వీరి సర్వతోటవికరాజ్యసంపత్తి మాకు ప్రలోభము కలిగించు నని తలంచియుందురు. పాపము, వీరికి మారాలోచనయే యుండదు. కేవల స్త్రీబుద్ధి కంటె వీరి యూహలు దూర మధిగమింపలేవు."

ఇట్టి భావము లెన్నియేని ఒక్కక్షణములో అంగిరర్షి చిత్తరంగమున మెరసియుండును. అయినను అనవసరముగా ఇతరుల మనస్సు నొప్పించుట యార్యధర్మము కాదు. అందుచే క్లుప్తసరిగా, "ఆలోచింతము. తొందర యేమి?" అని మాత్రము కులపతి ప్రత్యుత్తర మిచ్చెను.

వారు సంతోషముతో తిరిగివచ్చి యీ విషయము నంగిరోధర్మపత్ని కెరిగించిరి. వారు మువ్వురు పులోమాపులోముల వివాహమునకు కులపతు లంగీకరించినట్లే భావించిరి. పులోము డది విని పొంగిపోయెను.

పులోమమాత్రము తల్లి మాటలు విని యాశ్చర్యపడెను. పులోముడు ఆటలాడుటకు సహచరుడుగా ఎంతయైన నుపయోగించును. కాని తా నాతని పాత్ర్యదైవముగా భావించి యర్చింప యోగ్యుడా? అంగిరర్షులే దీనం దంగీకరించియుందురా? అయినను మాతృవాక్య మును అనృతము లగునా? నిరంతరముగా వైశ్వానరపూజ చేయ

నన్ను అనర్హురా లని పులోమునితో నే నాడిన మాటలచే నిశ్చయించి యిట్లు కులపతులు చేసిరేమో !

ఈ విచారభారముతోడనే యామె యాసాయంకాలమున పరమేశ్వరార్చనసమయములో అంగిరర్షుల సన్నిధి నుపవిష్టయై యుండెను. అంగిరర్షులును పులోమముఖభంగిని సూక్ష్మముగా నుపలక్షించిరి. ఆమెముఖమున సంతోషచిహ్నములకు మారు తీవ్ర చింతామేఘములు స్పష్టముగా వారికి గోచరించెను. అదిచూచి వారికానందమయ్యెను. వారంతట పులోమను కటాక్షదృక్కులతో కరుణించిరి.

"పులోమా ! నిన్ను ఆ పులోమరాక్షసున కీయ నియ్యకొందునా ?"

ఇట్లు నోటితో చెప్పకయే వారు చెప్పినట్లు పులోమకు ద్యోతమై, యామెకు మనశ్శాంతి కలిగెను.

౬

ఆ మరునాటినుండియు పులోమలో నొక మార్పు సుస్పష్టముగా గోచరించెను. ఆమె కెన్నడవ మాట్లాడు స్వభావ మెన్నడును లేదు. ఇప్పుడసలే మాట్లాడదు. ఆటలు మరగి పూర్వము దూరము పరిశ్రమించును. ఇప్పుడాశ్రమవాటిక విడిచి యావల పోదు.

సమీపించుచున్న వసంతాగమనమునకు ఎదురుచూచుచు ప్రకృతి కాంత లజ్జాబాయత్నసన్నాహములో నున్నది. ఆశ్రమవనమంతయు పూవులతో, చిగుళ్లతో నిండి రంగారుచుండెను. నల్లని తొడిమలు ఎగువ తెలుపు కలిసిన వర్ణము కల పాటలీపుష్పముల మధువునకు తుమ్మెదలు మూగుచు ఝంకారములు ప్రారంభించెను. కర్ణికారపుష్పములు వర్ణప్రకర్షచే నిర్గంధములైనను జనుల దృష్టుల నాకర్షింపసాగెను. అశోకతరువులు పుష్పపల్లవితములై యానందము కలిగింప నారంభించెను. ఇంచుకంత చిలుకపచ్చరంగు కలసిన మోదుగులు పుష్పించి ఎర్రనికాంతులు వెల్లువ వెదజల్లుచుండెను. నువ్వుపువ్వుల శ్రీ గల పుష్పములు తిలకములకు పూచెను. అరటిని కొంచెము పోలియుండు నల్లని ప్రేంఖణలతలనుండి కుసుమవాసనలు దిక్కుల వాసింపసాగెను. ప్రియాళుద్రుమమంజరు లెంతయేని హృదయప్రీతి కలిగించుచుండెను. వాసంతవృక్షరాజములగు మామిడిచెట్లు ఎర్రని చిగురుటాకులమధ్య గుత్తులుగుత్తులుగా తెల్లగా పూసిన పూలతో దూరదేశములనుండి పుంస్కోకిలముల నాహ్వానించుచుండెను.

ఆనందతన్మయత కలిగించు నా వసంతాగమసమయమున చిత్రముగా పులోమ కుత్సాహ మేమాత్రము వ్యక్తము కాలేదు. శీతకాలమున నీరు తగ్గి తీవ్రవేగముతో ప్రవహించు మందాకినీనది యిప్పుడు ఒడ్లొరసికొని ప్రవహింప నారంభించెను. సూర్యరశ్మి ప్రభావముచే హిమాచలశిఖరములందుండి సెలయేళ్ళు రొదలు చేయుచు పరుగువారి మందాకినీనదిలో కలిసిపోవుచున్నందున నా ప్రవాహము పూర్ణమై గంభీరమంథర మగుచుండెను. పవిత్రమగు నా మందాకిని ననుకరించుచు పులోమ హృదయాంతరముకూడ గంభీరమంథర మగుచుండెను. పూజాపుష్పములు ఆశ్రమవృక్షలతలనుండి యామెకు పుష్కలముగా లభించుచుండెను.

చైత్ర శుద్ధ పంచమి వచ్చినది. ఆనాటి మధ్యాహ్నమున అంగిరర్షి వైశ్వదేవము నిర్వర్తించి అతిథ్యభ్యాగతుల యాగమనము నకై నిరీక్షించుచుండెను. ఆ సమయమున వేదవిదులగు బ్రాహ్మణోత్తములు నలుగురు కుశపాణులై వచ్చి యంగిరర్షిని సమీపించిరి. వారిని అంగిరర్షి అర్ఘ్యపాద్యాదుల నర్చించెను. అంతట వారు నూతనముగా సమావర్తనము చేసికొన్న భృగువరునకు ధర్మప్రజాసంపత్తి కొరకు అంగిరర్షిని వారి కన్య పులోమను వధువుగా నిమ్మని వరించుచున్నామని యథాశాస్త్రముగా నర్థించిరి. వారు వర్ణించిన బ్రహ్మవరుని కులగోత్రములు ఒక్క క్షణము విచారించి అంగిరర్షి సంతుష్టుడై "వృణీష్వం, దాస్యామి" అనుచు సమ్మతి తెలిపెను. ఇట్లు మున్నుగ కన్యావరణమును, అంగీకారప్రతివచనములును జరిగినంతట నా బ్రాహ్మణులు సమీపారణ్యభూమిని కూర్చున్న భృగువు నొద్దకు పోయి కృతార్థుల మైతి మని నివేదించిరి.

ఇంతలో అంగిరర్షి ధర్మపత్నీసమేతుడై వెంట నాశ్రమర్షులు స్వస్తివాచనము పలుపుచు రా బయలువెడలి భృగువును సమీపించి వరపూజ చేసి యాశ్రమములోనికి తీసికొనిపోయి నారాయణ స్వరూపుడగు నా యతిథికి పులోమను ధర్మప్రజాసంపత్త్యర్థము కన్యాదాన మొనర్చెను.

భృగువు మహాతేజస్వి ! అంగిరర్షి యెదుట నున్న భృగువును చూచిన భాగ్యశాలురకు మధ్యాహ్నమార్తాండుని యెదుట నిలిచి యున్న బాలభానునివలె భాసించెను. భృగువు తాను దాచబెట్టిన తనద్రవ్యము మరల గ్రహించినట్లే పులోమకరము గ్రహించి ప్రధాన హోమము చేసికొని అగ్నితోకూడ నామెను వెంటబెట్టుకొని తోడు వచ్చిన బ్రాహ్మణులతో కలసి తన యాశ్రమమునకు తీసికొనిపోయెను.

అక్కడ భృగువు సాంతముగా నొక్క సంవత్సరకాలము వివాహదీక్ష నిర్వర్తించి యగ్నిసాక్షికముగా పులోమను వివాహము చేసికొనెను.

౭

అంగిరర్షి పులోమను కన్యాదానము చేసి యెన్నో నెలలైనది. ప్రాణసమానముగా నంతకాలము పెంచిన యాపిల్ల నత డిన్నినెలలును మనస్సులో దలచినట్లయిన లేదు. భృగువునకు దాని నిచ్చినంతటనే యది భార్గవద్రవ్య మైనదని పులోమపై నాతనికి మమకారము వదలిపోయినది.

అట్టి స్థితి నొక్కనాడు దానవరాజ్యమునుండి తండ్రియనుజ్ఞనందిన పులోముడు పులోమను చూడదలచి అంగిరస్సునాశ్రమమునకు వచ్చెను. వచ్చిచూడగా పులోమ యందు లేదు. అంగిరోధర్మపత్ని

నడుగగా పులోమను కులపతు లొక బ్రాహ్మణునకు దానము చేసిరని యామె చెప్పెను.

ఆ మాటలు విని పులోముడు ప్రళయసముద్రునివలె మండిపడెను.

“నాకై వనుదంపతులు వరించిన పులోమను కులపతులు ఇతరుని కెట్లిచ్చిరి? కులపతులను అనృతమాడింపజేసిన యా బ్రాహ్మణాధము డెవరు?”

ఆ దానవు వాక్యము లాలకించి యా మునికాంత కోపగించియు స్త్రీసహజమగు మృదువాక్యములతో ఇట్లనెను:

“ఒరే, నీ కేమైనను పోయే కాలము వచ్చినదా, నాయనా? కులపతులు అనృతమాడి రంటివి, భృగువును బ్రాహ్మణాధము డనుచుంటివి!”

“అవును! కులపతు లనృతమే యాడిరి. నాకై వరింపబడిన పులోమను మరియొకని కిచ్చిరి. దీని కర్తయులకును శిక్ష చేసెదను!”

ఆ సాధ్వి పలుకుచున్న యుపశమనవాక్యము లాలింపక క్రోధతామ్రాక్షుడై పులోముడు కేకలు వేయుచు అంగిరర్షి తపస్సు చేయు నగ్న్యగారముపై ఉరుకు పరువెత్తెను. ఆశ్రమర్షు లందరు నా పశుసమానుని జూచి కేకలు వేసిరి. ఋషిపత్నులు హాహాకారము లొనర్చిరి. బాలురు, బాలికలు భయకంపితులై తల్లుల రొమ్ములలోనికి బోయి దాగుకొనిరి. వేదపాఠములు వల్లనవేయు బ్రహ్మచారులు సంత యాపి పులోముని కడ్డుపోయిరి. వాడు నిర్లక్ష్యముగా వారల నందర నెట్టుకొనుచు ముందుకు పోవుచుండెను.

పులోముడు అగ్నిశాల ప్రవేశింపబోవుచుండెను. సరిగా నప్పుడు కింకరు డొక డడ్డు నిలిచి యాతని రొమ్మున గ్రుద్ది వెనుకకు పడద్రోసివైచెను. మరియిద్దరు కింకరులు బలవంతముగా పులోముని రెండురెక్కలు పట్టుకొని, యాశ్రమమునుండి బయటికి లాగివేసి, “జీవితముపై నాశ యున్నచో నాశ్రమము పరిసరముల కికముం దెన్నడు రావ”ద్దని కఠినముగా ఆనచేసిరి.

పులోముడు ఆ కింకరుల శక్తిముందు తాళజాలడయ్యెను. దెబ్బలు తిని తోక ముడిచిన కుక్కవలెనే ఆతడు ముఖము ముడుచుకొని యటనుండి వెడలిపోయెను.

అప్పు డాతని కొక యూహ తోచెను:

“మోసగింపబడిన యీ అంగిరస్సుపై నా కెందు కీకోపము? దీని కంతటికి కారకు డా భృగువు! నా పులోమను హరించినది వాడు! కనుక వానిని శిక్షించి నా పులోమను నేను తెచ్చుకొందును గాక!”

కాని యీ భృగు వెవరు? అత డెక్కడ నుండును? ఇది చెప్పువా రెవరు? అంగిరస్సుని యాశ్రమమున కేగి తెలిసికొను నవకాశ మిక లేదే!

౮

పులోముని దృఢసంకల్ప మాతని శాంతచిత్తుని గావించెను. ఆత డంతట వినీతవేషుడై యా చుట్టుప్రక్కల నున్న మునిపల్లె లన్నియు పులోమకై వెదకెను. మునిపత్నుల చేతిచలువచే ఏ యాశ్రమమున కేగినను ఆతనికి ఆతిథ్యమునకు కొదువలేదు. ప్రతిదినమును దానికై కష్టింపకయే మృష్టాన్న మాతనికి వేళకు లభించుచున్నది.

ఆ మునిపల్లెల చుట్టును గల యరణ్యములలో నివసించుచు శరీరకష్టము చేయుట కిష్టములేక మునిపల్లెలకు ముష్టికై వచ్చుచు అవకాశము చిక్కినప్పుడెల్ల అందలి ధనధాన్యములు దోచుకొనిపోవు దస్యుజనము లుండిరి. పలువు రట్టివారితో క్రమక్రమముగా పులోమునకు పరిచయ మయ్యెను. వాడును మధ్య మధ్య వారితో నివసించును. మధ్యమధ్య మునిపల్లెల చుట్టును కొరాడుచు పులోమకై వెదకులాడుచుండును. అతని భుజబలమునకు తోడైన బుద్ధిబలముచేతను, సాహసకార్యములవలనను అచిరకాలములో నాత డా దస్యుజనమునకు నాయకు డయ్యెను.

పదియేండ్లపాటు వా డట్లు పులోమను వెదకుచు పరిభ్రమించెను. హరిద్వారమునుండి దక్షిణాభిముఖుడై యత డట్లు వెదకికొనుచు పోయిపోయి శతాధికయోజనములు గడచి పెద్ద మరుభూమి చేరుకొనెను. దాని నతిక్రమించి తుద కాతడు సముద్రతీరమున కేగెను.

సముద్రతీరమునగూడ కొన్ని యాశ్రమములు కలవు. అక్కడనే భృగ్వాశ్రమ మున్నది. తిరిగి తిరిగి యా పులోముడు ఒకనాడు భృగువునాశ్రమమునే ప్రవేశించెను.

౯

భృగు వా యాశ్రమము నిర్మించుకొని యెక్కువకాలము కాలేదు. వివాహమునకు ముందుగనే ఆ ప్రదేశము నిర్ధారణచేసికొని భృగువు పులోమను, అగ్నిహోత్రమును వెంట నిడుకొని యక్కడ నిర్మించిన కుటీరములో నూతనగృహప్రవేశము చేసి యగ్నిప్రతిష్ఠాపన మొనర్చి వివాహదీక్ష నిర్వర్తించెను. అంతట నల్పకాలముననే అత డగ్న్యాధాన మొనర్చి సోమయాగము చేసి యంతట క్రమముగా క్రతువులు నిర్వర్తింపసాగెను. ఆత డట్లు చేయుచున్న క్రతువులకు కావలసిన ఋత్విక్కుల నివాసములకును, సంభారములకును మాత్రమే కుటీరములు పెరిగినవిగాని ఆశ్రమ మింకను విస్తరింపలేదు.

కొంతకాలమునకు భృగుమహర్షికి సూర్యునివలె నుగ్రతేజస్వి యగు పుత్రు నుత్పాదింపవలె నను నిచ్ఛ జనించెను. తన కోరిక కనుగుణమైన సంస్కారములతో నాతడు పులోమయందు గర్భాధాన మొనర్చి నియతకాలమున పుంసవనవిధి నిర్వర్తించి సీమంతోన్నయనము లొనర్చెను. పులోమకు నవమాసములు నిండెను. మరి మూడు మాసములకు సూర్యసముడగు కుమారు డుదయింపగల డని భృగువు నిరీక్షించుచుండెను.

అట్టికాలమున పులోమదానవుడు పులోమాసాధ్విని వెదకుచు భృగుమహర్షి యాశ్రమమునకు వెళ్లెను. వాడు వచ్చు వేళకు భృగు మహర్షి స్నానార్థము ఆశ్రమసమీపమునందలి సానవొద్ద కేగెను. భర్త తిరిగివచ్చునప్పటికి అన్నలు విహరించియుంచు నుద్దేశముతో పులోమ యగ్నిహోత్రశాలలో నుండెను. ఆశ్రమమున కతిథి వచ్చినాడని విని యామె బయటికి వచ్చి యచ్చట నున్న పులోమదానవుని జూచి యాదరముతో వన్యఫలాదు లొసగి యర్చించెను.

పూర్ణగర్భిణి యగు పులోమాదేవిని జూచి పులోముడు గుర్తింప లేదు. అతనికి తనతో నాడుకొన్న పదేళ్ల కన్యకరూపమే స్మృతిలో నున్నది కాని, యిట్టి సర్వాంగసంపూర్ణమై అనింద్యమనోహరమైన సాధ్వీమూర్తి చిత్రితమై లేదు. కాని ఆమెను దర్శించినంతనే పులోముని దేహమున నాకస్మికముగా విద్యుత్తాడనమువలె కామము ప్రవేశించెను. తరువును దగ్ధముచేయుటకు తరుకోటరములో ప్రవేశించు నగ్నికణమువలెనే అది యతని హృదయము నావేశించెను. రొమ్ములో నాతనికి చేయిపెట్టి కలచిన ట్లయ్యెను. రక్తనాళములం దెల్లెడ ననేక కాలసర్పములు ప్రాకుచున్నట్లు తోచెను.

"ఇది భృగువునాశ్రమమై యుండునా? ఇది నాకై వరింపబడిన పులోమయై యుండునా?"

పులోమాదేవి యాతని కన్నెత్తియైన చూడలేదు. అతిథికి చూపవలసిన మర్యాదమాత్రము నిర్వర్తించినది. బాల్యస్నేహితుడైన పులోముడితడని యామెయు పోల్చుకొనలేదు. అతిథిసత్కారము లొనర్చి యామె తిరిగి యగ్నిహోత్రశాల ప్రవేశించి తొందరతొందరగా అన్నలను గార్హపత్యాహవనీయదక్షిణాగ్నికుండములలో విహరించుచుండెను.

పులోముడు తన సంశయము తీర్చుకొనదలచి యామెను వెరి చూచుచు నామెవెంటనే అగ్నిశాల సమీపించెను. చూచినకొలదిని వానికి కామ మెక్కువయ్యెను; ఈమె పులోమయే యను సందియము దృఢము కాజొచ్చెను.

ఆ అగ్నిశాలలో భృగు వుపాసించు నా యగ్నిహోత్రుడు మూడు శిరస్సులతో, ఏడు జిహ్వలతో ప్రజ్వలించుచు ప్రసన్నవదనుడై మూర్తిదాల్చి ప్రత్యక్షమయ్యెను. తన హృదయదాహము చేయుచున్న వైశ్వానరుడు ప్రేరేపగా పులోముడు భృగు వుపాసించు నా పావకునికి ప్రణమిల్లి యిట్లనెను :

"ఓ పావకుడా, నీవు సమస్తదేవతలకు ముఖమువుగదా? ఈ వరారోహ ఎవ్వరి భార్యయో చెప్పుము! ఋతమునకు బద్ధుడవై ప్రత్యుత్తర మిమ్ము. నాచేత నిది ముందు వరింపబడినది. పిమ్మట తండ్రి అనృతకారియగు భృగువు కీమె నిచ్చినాడు. ఆ బాధ యీ పదేళ్లనుండి శల్యమువలె నా హృదయమును వేధించుచున్నది. భృగువు పొందిన నా పూర్వవృతభార్య యిదియే యైనచో దీని నీ యాశ్రమమునుండి యెత్తుకొనిపోయెదను. కాబట్టి సత్యమే చెప్పు పావకా!"

పావకుడు ప్రత్యుత్తర మీయలేదు. పులోము నామాటలచే నావచ్చినది పులోముడని యెరిగి యాశ్చర్యపడి యాతని నైష్ఠురికి కొంచెము భయ మావేశించి మౌనము వహించి తన పని తాను చూచుకొనుచుండెను.

పులోముని సంశయము మరింత యెక్కువయ్యెను. అంతట నాతడు పావకుని పరిపరివిధముల ప్రశ్నించెను.

"ఓ అగ్నీ, నీవు నిత్యము సర్వభూతములకు అంతర్యామివై చరించుచుందువే! పుణ్యపాపముల కన్నిటికి సాక్షివై యుండు కపీశ్వరుడవే నీవు! సత్యము పల్కుము. ఇది అనృతకారియైన భృగువుచే పూర్వాపహృతయగు నాభార్య యైనచో ఆమాట నీవుచెప్పవలసినది. నీ వామాట చెప్పినచో నీయెదుటనే యీయామె నెత్తుకొనిపోయెదను. ఓ జాతవేదా, నేను చెప్పుమని యడుగుచున్నాను. నీవు తెలిసిన నిజము చెప్పకతీరదుసుమా!"

అగ్నిసాన్నిధ్యమున నాపులోముని మాటలు విని పులోమ యించుకంత సంచలించెను. కాని తన బాల్యమిత్రుడు సత్యమెరిగినచో దుర్మార్గము తలపెట్టడను నాశతో ధైర్యము పూనెను.

ధర్మబంధము తమ ప్రత్యర్థులకు తగిలించుటకేగాని రాక్షసులకు కాదనియు, వారు తమ వృత్తిలోమాత్రము విశృంఖలు లనియును పాప మామె కేమి తెలియును!

సర్వజ్ఞుడను పావకుడుమాత్రము దుఃఖించెను. అతని మూడు శిరస్సులను చింతాధూమము ఆవరించెను. ఒకవంక ననృతభయము! మరియొకవంక ఈ రాక్షసుడు దుర్మార్గము చేసినచో తన్నుపాసించు భృగువు కేమి కోపము వచ్చునో యను భయము! అయినను సర్వాంతర్యామి యగు నా యగ్ని సత్యవాగ్బద్ధుడై శాంతవచనము లిట్లు పలికెను :

"ఓయి దానవుడా, ఇది నీవు మున్ను వరించిన పులోమయే. కాని నీవు దీనిని మంత్రపూర్వకముగా గాని, విధిపూర్వకముగాగాని వరించలేదోయి! ఈమె తండ్రి వరలోభముచేనైన నీ కిత్తునని వాగ్దత్తము చేయలేదోయి! ఆ పిమ్మట దీనిని భృగువు వేదవిధిపూర్వకమైన కర్మయుక్తముగా వరించి తండ్రివల్ల పుచ్చుకొని నేను సాక్షిగా భార్యగా వివాహమాడినాడు. నే ననృతమాడను. ఇది భృగుధర్మపత్ని!"

౧౦

అగ్నిహోత్రు డా మాటలు పల్కినంతనే పులోమదానవు నొక్క యావేశము పూనిన ట్లయ్యెను.

"నీ వడిగినావే కాని దీనిని తండ్రి నీ కీయలేదు. నీ వడిగిన విధానమే సక్రమమైనది కాదురా! క్రమమార్గమున భృగువు దీని

తండ్రినడిగి యతనివల్ల పొంది అగ్నిసాక్షిగా వివాహమాడిన భార్యరా వానికిది! నీ కెట్టి సంబంధమును లేదు. నీ వెత్తుకొని పోవుట యధర్మమురా!"

ఈ యర్థములు సూచించిన యా ధర్మదేవతవాక్యముల విచారణ పులోముని తల కెక్కలేదు!

"ఇది నేను మున్ను వరించిన పులోమ! ధర్మదేవత యగు నగ్నియే ఇది యనెను. నా భార్యను భృగువు హరించినాడు! దీని నిప్పు డెత్తుకొని పోవలసినదే!"

ఇట్లా దానవుడు తన కామమున కనుకూలించునంతవరకే అగ్నిహోత్రుని వాక్యములు ప్రమాణములుగా గ్రహించెను. మిగిలిన మాటలతో నాతనికి నిమిత్తమేమి? "నాకోరిక కనుకూలించునంతవరకే ధర్మదేవత నాకు ప్రమాణము! తక్కినది వినిపించుకొనను!"

ఈ విధమగు మానసికప్రవృత్తి కలది దానవబుద్ధి! అందుచే పులోముని ముఖము వివర్ణమయ్యెను. చిన్నప్పుడు హరిద్వారమున మందాకినీజలావర్తములో పులోమాకన్య తిరుగుడువడుచుండగా తా నామె నుద్ధరించిన పరాహాకారమే ఇప్పు డాతని నావేశించెను.

పులోము డగ్నిహోత్రగృహములోనికి దూసుకొనిపోయి తన శిరస్సుతో పులోమాదేవి దేహమును క్రుమ్మి నెత్తిన వేసికొని అడవిపందివలె ఆ యాశ్రమమధ్యమునుండి పరుగువారెను. భృగువునాజ్ఞాకింకరు లడ్డువచ్చు నవకాశముగూడ లేకపోయెను. అంతయు మెఱపుమెరసిన ట్లొక్క త్రుటిలో జరిగిపోయెను. అరణ్యములో నాతడు ప్రవేశింపగనే పులోముని దస్యుసేవకు లాతని గలసి పరివేష్టించిరి.

పులోమాదేవి దిగ్భ్రాంతి నొందెను. ఆమెకు ప్రథమములో కలిగిన యాశ్చర్య మొకింత విరిసి కలయజూచునప్పటికే యాశ్రమము దాటిపోయి యరణ్యమున దస్యుగణముల మధ్యమందుండెను. ఆ దస్యులుగూడ క్రొత్తవారు కారు! వారిలో పలువు రామె యొద్దకు అన్నార్తులై యెన్నియోమారులు వచ్చి యాశ్రమమున మృష్టాన్నము కుడిచినవారే! కొంద రందులో తలలు వంచుకొనిరి. కొందరు పెడముఖములు పెట్టుకొనిరి. కాని పెక్కు రామెను జయోన్మాదముతో పరిహసించుచు పెద్దపెట్టున నవ్వసాగిరి.

అది చూచి పులోమకు సహజమగు ధైర్య మొక్కసారిగా సడలిపోయెను. ఆర్తకంఠముతో నామె బిగ్గరగా భృగువును కేక వేసెను. దూరమునుండి అరణ్యప్రతిధ్వనియే కాని భార్గవకంఠము వినిపించలేదు. మరల నామె యట్లే కేక వేసి భార్గవప్రత్యుత్తరమునకై చెవు లొగ్గి వినెను. మరల నరణ్యప్రతిధ్వనియే కాని భృగుకంఠము బదులు పలుకలేదు. మీదుమిక్కిలి దస్యుల పరిహాసశబ్దము లెక్కువ కాసాగెను. ముందు తలలు వాల్చినవారును, పెడమొగములు పెట్టిన వారునుగూడ ధైర్యము తెచ్చుకొని యా పరిహాసకులలో గలయుచుండిరి.

ఆమె మరల మూడవమా రట్లే కేక వేసి యాలించెను. మరల నంతకంటె నెక్కువప్రయోజనము లేకపోయెను.

పులోమాదేవి యంతట నా పులోమునికి ధర్మము నుపదేశించి యాతనిని తన్ను వదలుమని బ్రతిమాలుకొనెను. వాడు ధూమావృతముఖుడై యా మాటలు పెడచెవిబెట్టెను.

"నీవు చెడిపోదువు! కాల మాసన్నమైనది. నీ మృత్యువును నీవు వరించుచున్నావు!"

పులోమ ఇట్లు బెదరింపగా నదియు వాడు పెడచెవిబెట్టెను.

అంతట మరల నామె యాతని బ్రతిమాలి యాతని పూర్వపు మంచితనమంతయు స్మృతికి తెచ్చెను. వా డదియు వినిపించుకొనలేదు. మరల నామె యాతని నెన్నెన్నో విధముల బెదరించి చూచెను. బ్రతిమాలెను. అన్ని ప్రయత్నములును వ్యర్థమయ్యెను.

అంతట పులోమ ఉచ్చైస్స్వరముతో కేకలు వేయనారంభించెను. అది ఒకటే దీర్ఘప్లుతధ్వని! ఒక కేకయైన వెంటనే గుక్క త్రిప్పుకొనుటే వ్యవధానముగా మరల కేక వేయసాగెను. ఆ కేకలు అరణ్యభూమియంతయు నిండి దిగంతములకు బారుచున్నట్లు విన్నవారికి తోచెను. ఆ కేకలు వేయుచుండగా నామెకన్నులవెంట నీరు ఏకధారగా ప్రవహింపసాగెను.

కొంతసే పట్లామె కేకలు వేయగా ఆమెదీనాకారమును జూచి, యామె వేయుచున్న కేకలు విని పులోమరాక్షసునకు గూడ నొక యపూర్వమగు భయ ముదయించెను. వెంటనే దృఢకాయులగు నలువురు దస్యుల నామెదేహమును మోయ నియమించి తా నామె శిరోభాగము వహించుచు నుత్తరాభిముఖుడై పరుగెత్తిపోసాగెను. మిగిలిన దస్యులు స్త్రీపురుషులు వారి ననుగమింపసాగిరి.

ఇట్లు మూడురాత్రులు, మూడుపవళ్లు విధివిరామము లేకుండ భయవిహ్వలచిత్తులై వారు శీఘ్రయానమున బోయి తుదకు నాలవనాటి వేకువవేళకు ఒకానొక పర్వతపంక్తిమధ్యమున గల మహారణ్యమున నున్న సరోవర మొకటి దరిసిరి. అచ్చట పులోమను ప్రథమపర్యాయము దింపి పులోముడును, దస్యులును విశ్రమింపసాగిరి.

ఆ మూడు పవళ్లును, ఆ మూడురాత్రులును విరామము లేకుండ పులోమాదేవి యాక్రోశించుచు ఏకధారగా కన్నీరు కార్చుచునే యుండెను. ఆమెదేహమున నంతకంతకు బలము క్షీణించిన కొలది యామెకంఠస్వరమును క్షీణింపజొచ్చెను. తుద కామెకు బడలికచే మూర్ఛ వచ్చుచున్నట్లయ్యెను.

అట్టి సమయమున నామెకు ప్రసవవేదన మాకస్మికముగా నారంభించెను!

దస్యుకాంతలవలన పులోమ యది యెరిగి ఉప్పొంగి పోయెను.

"ఈమెగర్భములోని శిశువు పుట్టినంతనే ఆ భార్గవపిండము నీ సరోవారిలో పారవైచి భృగువుపై కోపము నిష్కృతి యొనర్చి నాపులోమను దానవరాజ్యమున కెత్తుకొని పోయెదను!"

౧౧

అంతలో నా యరణ్యతమస్సు నంతటిని ఉద్ద్యోతింప జేయుచు తూర్పున బాలసూర్యు డుదయించెను. ప్రాచీదిగంగన దివాకరుని బ్రసవించిన క్షణముననే కుక్షిచ్యుతుడై పులోమాదేవిగర్భము నుండియు అగ్నితేజస్కుడగు నర్భకుడు భూమిపై బడి రోదనము చేయ నారంభించెను.

అంతవరకు మిగిలిన దస్యులతో తొలగి విశ్రమించుచున్న పులోమదానవు డా రోదనధ్వని వినగానే ఉత్కంఠతో లేచెను. వెంటనే ఆ బాలకుని నీటిలో పారవేసి కసి తీర్చుకొనవలె నను నాతురముతో వాడు దస్యుపరివృతుడై అటువైపు వచ్చుచుండెను. గర్భచ్యుతుడైన యా బాలకుని రూపము పులోముని కన్నుల బడెను.

ఆ బాలుని తేజస్సు చూచి పులోముని కన్నులు మిరుమిట్లు గొనెను. ఆక్షణముననే వింతగా నా శిశువుసమీపమునుండి పుట్టి యొక యగ్ని పులోమాదిదస్యు లున్న వైపుకు ప్రసరించెను. అది మహాదావాగ్నియై ఒక్క క్షణములో నా వచ్చుచున్న పులోముని, నతనివెంట నున్న దస్యులను నిర్విశేషముగా దహించెను. అది చూచి వినువీథి వైతాళికు లిట్లు గానముచేసిరి:

"సముదితసూర్యసహస్ర
సమదుస్సహతేజా, జగదుపప్లవసమయా
సమదీప్తితీవ్రపావక
సము జూచుచు నసుర భస్మసాత్కృతు డయ్యెన్!"

మూర్ఛావిష్టమగు నవస్థలో నున్న పులోమాదేవికి ఆ సూర్యప్రభుడైన బాలకుని జూచినంతనే దేహమున నూతనశక్తి ప్రాదుర్భూత మయ్యెను. ప్రక్కనున్న దస్యుకాంత దంతములతో కొరికి యా బాలుని నాభిచ్ఛేదము చేసినంతనే పులోమ యా పిల్లవానిని తన యొడిలోనికి జేర్చుకొనెను. తన సమీపముననే పుట్టి యా కానన మెల్ల దహించుచున్న యా దావాగ్ని కామె యింతయు చలింపలేదు. భృగుపుత్రుని ఒడిలో ధరించిన యానంద మామెకు నిరతిశయనిర్భయస్థితి చేకూర్చెను. ఆ దావాగ్నికి దగ్ధుకాక మిగిలిన వా రామెయు, ఆమె పిల్లవాడును, అతని నాభిచ్ఛేద మొనర్చిన యా దస్యువనితయు మాత్రమే!

ఇరువది యొక్క దినము లా పులోమాసాధ్వి పుత్రమాత్రసహచరియై యా దస్యుకాంత చేయు నుపచర్య లందుచు ఆ పర్వతశ్రేణి యందలి ఆ అరణ్యమధ్యమున ఆ సరోవరతీరమున నివసించెను. ఆమెకు జ్ఞాతపూర్వములగు కందమూలములతో నామె శరీరధారణ చేయుచు ప్రక్కనున్న సరోవారితో స్నానపానములు జరుపుచు పిల్లవానిని పోషించుకొనెను.

భృగుపుత్రుని జన్మవేళను ఉదయించి ప్రచండముగా నచ్చట చెలరేగిన దావాగ్ని కొంతకాలమున కుపశమించెను. ఆ తీవ్ర తాపమునకు విరిసిన యా పర్వతభూభాగము అది చల్లారిన పిమ్మట నెమ్మదినెమ్మదిగా బిగిసికొనిపోవ నారంభించెను. దానితో నా పర్వతసానువులు బీటలువారజొచ్చెను. అట్టి బీటలలో నొక దాని నుండి యా సరోవరజలము పర్వతమధ్యమునుండి చిన్న జాలు చేసికొనెను. ఆ జాలు పులోమను దస్యులు తెచ్చినప్పుడు ఆమె కన్నీటితో తడిసిన మార్గముననే ప్రవహింప నారంభించెను.

పులోమాదేవి యది నిర్వర్ణించి బాలకుని ఒడిలో నిడికొని ఈమారు ఆనందబాష్పము లేకధారగా కార్చుచు ఆ జాలువెంట భృగ్వాశ్రమాభిముఖముగా మంథరగమనముతో నడువసాగెను. అది చూచి వెంటనున్న దస్యుకాంత భయపడి ఎండే పారిపోయెను.

౧౨

పులోమ నట్లు పులోముడు హరించిన కొద్దిసేపటికే భృగువు కృతస్నానాదికర్మకలాపుడై యాశ్రమమునకు తిరిగి వచ్చి జరిగిన వృత్తాంతము తలిసికొనెను. వెంటనే పలువురు కింకరుల బిలిపించి పులోముని దరిమి పట్టి తెచ్చుటకు పంపెను. నా రాహూహిప నాటి సాయంత్రము ప్రొద్దుపోయి దీనముగా తిరిగి వచ్చి పట్టుకొని రాలేకపోతి మనియు, ఎప్పటికప్పుడు వారి ఉనికి తెలియ వచ్చుచున్నను వారి వేగమును అనుగమింపలేక పోతి మనియు నివేదించిరి.

భృగువునకు కోప ముదయించెను. ఈ మూడు దినములును పత్ని సన్నిధి లేనందున నగ్ని లోపించెను. ఆ రాత్రి యంతయు [illegible] రోషారుణనేత్రుడై యాలోచించెను. నాల్గవనా డుదయమున పులోమరాక్షసదహనార్థము అగ్నిని మథింప నారంభించెను. ఇక్కడ నత డగ్ని యుత్పాదించిన క్షణముననే సరోవరతీరమున భృగుపుత్రుడు గర్భచ్యుతు డయ్యెను. ఆ సమయముననే ఆ బాలకుని కాంతికి దావాగ్ని పుట్టి పులోమరాక్షసుని సపరివారముగా దహన మొనర్చెను.

పులోమను రాక్షసుడు హరించిన పిమ్మట మాసమువరకు భృగువు వాయుభక్షణమాత్రవ్రతుడై పత్నీసమాగమము నిరీక్షించుచుండెను. నెల యగునప్పటికి తేజస్వి యగు నా బాలకుని ఒడిలో ధరించి పులోమాదేవి సరస్స్రుతమగు నా జలధారవెంట తానును కన్నీరు కార్చుచు వచ్చి భర్తకు కుమారుని దర్శించి, నమస్కరించి, నెమ్మదిగా జరిగిన వృత్తాంతము నివేదించెను.

భృగువు కోపోద్రిక్తుడై పత్ని నిట్లు ప్రశ్నించెను:

"అనిందితచరిత్ర వగు నిన్ను ఆ పులోమరాక్షసునికి గుర్తింప జెరిగించిన దుర్మార్గు డెవరు?"

"పూజ్యుడగు నగ్నిహోత్రుడే ప్రభూ!"

"ఈ అగ్నిహోత్రుడు సర్వభక్షకుడగుగాక!"

ఆ భృగుశాపమునకు సర్వాంతర్యామి యగు నగ్నిహోత్రుడు భయచలితు డయ్యెను. అపవిత్రమగు సర్వభక్షకత్వము సహింపలేక అగ్నిభట్టారకుడు తన తేజస్సు తనలో నుపసంహరించుకొనెను. మహర్షులకు నిత్యనైమిత్తికకర్మ లుడిగెను. యజ్ఞయాగము లన్నియు లోపించెను. అగ్నితర్పణము లేని కలికాలమునందువలెనే ముల్లోకములు లుప్తకర్మలై క్షోభించిపోయెను.

భృగుపితామహుడగు లోకపితామహు డది చూచి భృగువు నాశ్రమమునకు వచ్చి యగ్నిహోత్రుని బిలిచి యిట్లు వర మిచ్చెను:

"దివాకరుడు సమస్తమును స్పృశించుచున్నను తన తేజోవిశేషముచే పరమపవిత్రుడే! అట్లే నీవుకూడ సర్వభక్షకుడ వయ్యును నీ ప్రభావిశేషముచే సర్వశుచివై వేదముఖుడవు కమ్ము!"

అగ్నిహోత్రు డంతట ప్రసన్నుడై లోకములం దెప్పటివలె ప్రసరించి యనుగ్రహించెను.

అక్కడ కూడిన నరమునిసురసంఘసమక్షమున లోకపితామహుడు భృగువును, పులోమను, శిశువును ఎదుట నుంచుకొని యిట్లు సెలవిచ్చి కట్టడి చేసెను:

"పులోమా, ఈ బాలకుడు నీ గర్భచ్యుతు డగుటచే 'చ్యవను' డను నామముతో పరమతేజస్వియై కీర్తినొంది భృగువంశమును విస్తరింపజేయగలడు!

"ఆ రాక్షసుడు నిన్ను హరించి కొనిపోవునప్పుడు నీవు కార్చిన దుఃఖాశ్రువులతోను, పిదప విముక్తవై బాలకు నెత్తుకొని వచ్చుచు విడిచిన యానందబాష్పములతోను ఈ కనబడు నది పుట్టి సింధువులో కలియుచున్నది. వధూమణియగు నీ కన్నీటి ననుసరించి పుట్టి ప్రవహించు నీ నదికి 'వధూసర' యని నామకరణము చేయుచున్నాను. దీని యొడ్డుననే నీ కుమారుడు చ్యవను డాశ్రమము నిర్మించుకొనును.

"ఈ వధూసర పశ్చిమభాగము భార్గవపత్ని దుఃఖాశ్రువులతో నపవిత్రమైనది. కాని తూర్పుభాగము దాని యానందాశ్రువులతో పవిత్రమైనది. ఈ 'వధూసర' ఆర్యులకును, దస్యులకును ఇకముందు పశ్చిమమున సరిహద్దుగా నుండగలదు!"


* * * * *

ఈ వధూసర ఇప్పు డెక్కడ నున్నదని హారీతుడు ధ్యాననిమీలితలోచనుడై యొక్కక్షణ మాలోచించెను. ఇదియే ఈ కాలమున 'సింధునది' యను నామముతో జగద్విఖ్యాతమైన దని యతని విజ్ఞానచక్షుస్సునకు గోచరించెను. లోకపితామహుని శాసనముచే శిష్టులెవ్వరు నిప్పటికిని సింధునది పశ్చిమభాగమునకు దాటరు. అట్లు ప్రమాదముచేగాని, మోహముచేగాని దాటినచో తిరిగి వచ్చి సింధునది తూర్పుదరిని స్నానము చేసి ప్రాయశ్చిత్తము చేసికొందురు.



యాభై సంవత్సరాలకు పైగా

దేశసేవ





ఐశ్వర్యసంపదలు సహజంగావున్న మనదేశాన్ని మించినది వేరొకటి లేదు. కాని ఇంతే దేశమూ ఇంత దరిద్రస్థితిలో లేదు. స్వంతం అన్నసూత్రంమీద యాభై సంవత్సరాలక్రింద ఆదర్శాయుగల ఒక మూల పురుషుడు స్వర్గీయ శ్రీ ఎ. బి. గోద్రెజ్ స్థాపించిన సంస్థ దిగ్విజయంగా సాగిపోతున్నది. ఆయన చేసినది అపారం. అనేక సంవత్సరాలనుంచీ ఉక్కుసామగ్రి, సబ్బులు బహుకొద్దిగా దిగుమతి అవుతున్నవి. ఉక్కువంటి తప్పనిసరిగా కావలసిన ముడిపదార్థములు ఇవ్వబడినయెడల గోద్రెజ్‌వారు ప్రజం పర్యవసరమగు తమ సరుకులను అధికతరముగ ఉత్పత్తిచేసి సప్లయిచేసి దేశమున విస్తారముగనున్న గిరాకీని తీర్పగలరు. ఈ విధముగను, ఎగుమతి చేయుటవలనను జాతీయ ఆర్థికాభ్యున్నతికి తోడ్పడగలరు.

Godrej

గోద్రెజ్



చావి మార్కు

లోహపుసామానులు


సబ్బులు—షేవింగ్ సబ్బులు

గ్లిసరిన్


గోద్రెజ్ అండ్ బాయిస్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ, లిమిటెడ్.

గోద్రెజ్ సోప్సు, లిమిటెడ్.





నేటి తెలుగు నోటి తెలుగు



శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి

వెలయగలదు, నేడు కాకపోతే రేపు - వేరుగా ఆంధ్ర రాష్ట్రం తప్పక వెలయగలదు.

అప్పటినుండీ ఆంధ్రరాష్ట్రపరిపాలనాతంత్ర మంతా, భాషాప్రయోజనములన్నీ ఆంధ్రభాషా మూలకములుగానే సాగగలవు. లేఖనమూలముననే కాక వాఙ్మూలమునకూడా తెలుగురచన చాలా పెంపొందగలదు.

పరిపాలనాతంత్రమునకు ముఖ్యమైన కౌన్సిల్లు, డిస్ట్రిక్టు బోర్డులు, మునిసిపాలిటీలు, కలెక్టరు మొదలగు వారి ఆఫీసులు, కోర్టులు, విద్యాశాలలు, అక్కడి పాఠప్రవచనములు అన్నీ తెలుగుతో సాగితే, ఆయాచోట్ల ఉద్యోగులు, సదస్యులు తెలుగులోనే చర్చలు సాగిస్తే, ఆంధ్రదేశము నలుమూలలవారు, నానాజాతుల వారు సమానస్వాతంత్ర్యముతో వాగ్వ్యవహారములు ఆయాచోట్ల సాగిస్తే, వాటిని షార్టుహాండు రిపోర్టర్లు అట్లట్లే పత్రికలకు పంపితే, వారి భాషితములు మార్చవీలులేదు గనుక వాటిని అట్లట్లే పత్రికలవారు ప్రకటిస్తే చాలామట్టుకు నేటిది కాకపోయినా రేపటిదయినా తెలుగుభాష 'నోటితెలుగు' కాకతప్పదు.

మాట్లాడే భాషకూ, వ్రాసేభాషకూ ఐక్యమో, కాకపోతే సాన్నిధ్యమో అనివార్యం అవుతుంది. ఈ మార్పు రాకతప్పదు.

తెలుగు పుట్టిననాటినుండీ నేటిదాకా తెలుగువారు భాషాప్రయోజనాలను పెక్కింటిని పరభాషల ద్వారానే పడయడం సంభవిస్తూ వచ్చింది.

ఆదికాలంలో సంస్కృతప్రాకృతములు, తర్వాత తురక, ఇంగ్లీషు భాషలు తెలుగుప్రజలమీద వెల్లివిరిసి తెలుగుకు రూపేర్పఱిచి పెంపొందించి భాషాప్రయోజనములను పెక్కింటిని తమ మూలాన తెలుగుప్రజలకు ప్రసాదిస్తూ వచ్చినవి.

ఆయా కాలములలో భాషాప్రయోజనాలలో ఒక్కటయిన సాహిత్యప్రయోజనానికి మాత్రమే తెలుగు కొంత ఉపయోగపడుతూ వచ్చింది. కాని అందులోకూడా ఆయా కాలాలలో సంస్కృతప్రాకృతములయు, తురుష్కాంగములయు తాకిడి తెలుగు రచనలకు తగులుతూనే వచ్చినది. సర్వస్వాతంత్ర్యత తెలుగుకు పూర్వం కలుగనే లేదు.

అయిపోయిం దేదో అయిపోయింది. ఇప్పుడు దేశకాలముల తీరులు మారినవి. ఎప్పుడూ చవిచూచి యెఱుగని మార్పులు సమకూరినవి.

భారతదేశానికంతా ఏకమొత్తాన రాజ్యాంగ భాషగా, నవ్యనాగరకభాషగా నూరేండ్లపాటు తెగ వెలిగివెలిగి అనేకాపూర్వప్రయోజనములను సాధించి పెట్టిన ఆంగ్లభాష ఇక క్రమక్రమంగా తెరమరుగు

రావలసిన స్థితికి వచ్చినది. దాని స్థానమును కొంతవరకైనా హిందీ ఆక్రమించుకొనబోతున్నది.

అయినా అది సర్వభారత దేశ సామాన్య వ్యవహారమునకే పనికొంటుంది. కాని నేటిదాకా ఇంగ్లీషు పట్టినట్టు దేశభాషావ్యవహారాలపై కుత్తికపట్టు పట్టినట !

రాష్ట్రపాలనవ్యవహారాలన్నీ దేశభాషలలోనే జరుగును గనుక దేశభాషలకిక కుత్తికకోతలు కలుగవు.

కౌన్సిళ్ళలో, స్కూళ్ళలో, ఇళ్లలో, వాకిళ్లలో, రోడ్లలో, రికార్డులలో, కోర్టులలో, ఉపన్యాసాలలో, రాజ్యశాసనాలలో, గ్రంథపఠనరచనలలో తెలుగు దేశంవారు సర్వే సర్వత్రా తెలుగువాడుకనే సాగించగలిగినారంటే—ఆహాహా ! తెలుగుకు పలుకుబడీ, చెల్లుబడీ యెంతో సర్వోదయంగా సాగుతుందన్నమాట!

తెలుగువెలుగు లెంతో దేదీప్యమానంగా వెలయగలవన్నమాట !

ఇది సర్వోదయమే: సంతోషకరమే కాని—తీవ్ర యోచన గొల్పుతూ కొన్ని చిక్కులు దీనినుండీ యెగరేగుతున్నవి.

గ్రాంథికభాషనూ, ఇంకా ఇటీవల ప్రబలిన వ్యావహారికభాషనూకూడా ఇప్పటిదాకా ఏవో హద్దుపద్దులలో కొంతవరకైనా ఆచిపట్టుకుంటూ వస్తున్నారు—యూనివర్సిటీలవారు, గ్రంథరచయితలు, పత్రికారచయితలు, సుకవి పండితులూను.

ఇక దేశం నాలుగంచులవారిదాకా సర్వతోముఖమయిన స్వాతంత్ర్యం చెలరేగినదంటే హరిజనుల దగ్గఱనుండి భూసురజనులదాకా సర్వప్రజలూ సర్వస్వదేశవ్యవహారములలో సమానస్వతంత్రులూ, సమానభాగస్వాములూ నయి బుజాలు కలుపుకొని వర్తిల్లనూ వర్ధిల్లనూ సాగించినారంటే, వారివారి భాషలు మాత్రం కలగాపులగములు కాకుండా దూరదూరములుగానే ఉండిపోగలవా! 'మీజాతి తక్కువది, మా జాతి యెక్కువది' అనరానట్టే, 'మీ పలుకుబడి తక్కువది, మా పలుకుబడి యెక్కువది' అని యిక అన వీలుండదు.

కుల్లూకభట్టీయాన్ని బట్టి వర్ణాశ్రమ ధర్మాలనూ, నన్నయభట్టీయాన్ని బట్టి ఆంధ్రభాషావ్యవహారాలనూ ఆచిపట్టినటె ననేవారు నాలుకలు కఱచుకోవలసిన స్థితి వస్తుంది, తప్పదు.

ఇది పెద్ద యుగపరిణామం వంటిది.

భాషావిషయంలోనే ఆయెను—ఈ మహత్తర పరిణామంలో రేపు ఇటువంటి స్థితి యేర్పడుతుందని నిస్సంశయంగా నిరూపించడం ఎవరికిగానూ కాదు. అసలు ఆంధ్రభాషావృక్షం ఎన్ని చిలవలు పలవలు వేస్తూ పెరుగుతూ వచ్చిందో, యే కొంతయినా దాని విజృంభణ పూర్వం యెట్లా వుండేదో, ఇప్పుడెంత వుందో పరిశీలించి గుర్తించి చూచినవా రెవ్వరున్నారు ?

పై పై జాతులవారి తేరుకొన్న భాషల మెఱుగులే ఇంతదాక సారస్వతరచనలలో సాగుతున్నవిగాని దేశంనాలుగంచులా తిరిగి భాషను సర్వేచేసి దాని సర్వాంగసౌందర్యమును గుర్తించినవా రెవరున్నారు ?

జరిగితే ఇకమీదనే ఆ పని జరుగవలెను—ఆంధ్రులే ఆంధ్రదేశాన్ని పాలిస్తారు గనుక !

నాళ్లు, ఊళ్లు, గుళ్లు, కొండలు, నదులు, చెరువులు మొదలగువాని పేర్లు, వాని పుట్టుపూర్వోత్తరాలు, తచ్చరిత్రలు, జాతులు-తచ్చరిత్రలు, ఆయా నాళ్ళలో ఊళ్ళలో ప్రఖ్యాతులైనవారి చరిత్రలు, గ్రంథాలు, శాసనాలు, విగ్రహాలు-వాటి కథలు, నోటిపాటలు, పద్యాలు, నానుళ్లు, పలుకుబళ్లు, అపూర్వపదాలు, వాక్యవిన్యాసాలు వగైరాలు, బహుజాతులవారి, బహుదేశభాగములవారి భాషాభేదములు, ఆచారవ్యవహారములు—అన్నీ సమాకలనం చేసి సముద్ధరిస్తూ వాటిలోని గుణాగుణాలను గుర్తించి నిరూపిస్తూ ఉంటే సర్వప్రజలలోనుండీ, వారిభాషలనుండీ సారాంశములుపదగినట్లు ప్రజలూ, వారిభాషలూ మెఱుగులు దేరితేరి బహుముఖముల, బహువిధముల భాషారచన స్వాతంత్ర్యంతో సాగిసాగి కొంతకాలం గడిస్తే ఆ బహుత్వంలోనుండి సారభూతమైన యేకత్వము నెలకొనగలుగుతుందేమో ! ముందు ముందు కాని, అట్టి స్థితి యేర్పడక పూర్వం, అంటే

యిప్పుడే, ఇటువంటి భాషనే 'ఈ విధంగానే వాడవలసింది' అని శాసించడంకూడా ఎవరికీ తరముగాదు.

పుర్రెకో బుద్ధి, నోటికో మాట! మాటాడే భాషకు విలువ యేర్పడ్డప్పుడు మనిషి మనిషికీ భాషా భేదాలు మరీ యేర్పడగలవు.

ఒక్కడేకూడా విషయభేదాలనుబట్టీ, సమయ సందర్భాలను బట్టీ, గ్రాంథికవ్యావహారిక రూప ద్వయంలో కూడా అనేకాంతరాంతరభేదములను వాడుకచేస్తూ ఉంటాడు.

నామట్టుకు నేనే యెఱిగి యెఱిగి అనేకసందర్భాలలో అనేకవిధభాషలను వాడే స్థితిలో ఉంటాను.

ఏటి పరిణామాలన్నీ శుభపర్యవసాయులు కాగలవనే ఆశిస్తున్నాను గాని, కొన్ని సందర్భములలో దిగ్భ్రమ కూడా చెందుతూ ఉంటాను.

ఇప్పటికే సంస్కృతసమాసాడంబరంబుల డంబుతో పరమచ్ఛాందసముగా వచనరచన చేసేవారు కొందఱు—

ముద్దులుగొలిపే పలుకులతో ఇది గ్రాంథికమని కాని, వ్యావహారికమని కాని నిరూపింప వీలులేనంత సున్నితముగా, సులభముగా వచనరచన చేసేవారు కొందఱు—

ఒడుపులు, ఒయ్యారములు గల వాడుకభాషలో బాంగరమును త్రిప్పినట్లు పొంకముగా వచనరచన చేసే వారు కొందఱు—

మాటాడేటప్పటికంటేకూడా పలుకులను అరగదీచి గాలికి తూలిపోయేటంత తేలికగా వచన రచన చేసేవారు కొందఱూ ఉన్నారు.

కాని వ్యావహారికరచన పెంపొందసాగిన కొద్దీ నుడికారములు, నానుడ్లు, పలుకుపొంకములు, కాకువులు తెలుగురచనలో వెల్లివిరియ సాగినవి.

హృదయములకు హత్తుకొనునట్లు, స్వభావానుసరణము చేసినవి, సంస్కృత సమాసములు సన్నగిల్లిపోవచ్చినవి.

పుస్తకతోనే సంగీతవాసనతో కొంచెం పోలు పొందుతూ ఉండేట్లు సంస్కృతసమాసభావంతోనే జన్మించి చదువుకొనడం లంతగా లేనిపోయినా అతి మనోజ్ఞరచనలు సాగిస్తున్న వారి వల్లనే తెలుగు తియ్యదనం మట్టిది!

కష్టపడి గట్టిగా వ్యాకరణాలను చదివించి కూడా, పద్యరచన లేవో సంస్కృతం కాదా సమాసంతో కొందఱు అందమయిన వచనరచనలు సలుపుచుకో జాలక పోతున్నారు.

'పత్రికా విలేఖరులు', 'ప్రాముఖ్యతను', 'విభాగిత భారతదేశమును', హిందూమహాసముద్రీయ 'సఖ్యతను'— ఇక కాదన వీలులేదు కాబోలును.


ఇట్టి పదాలను పత్రికలే కొంతవఱకు పుట్టించి పోషిస్తున్నవి. 'లోకనాయక' లోనుండి వచ్చినవి కావు పయిపలుకులు.

శయ్యలో వైవిధ్య ముండవలెను! గ్రాంథికమున గాని, వ్యావహారికమున గాని పదముల నుపయోగించుటలో భాషాలోకజ్ఞుల ననుసరించుటావశ్యకము గాదా! అదిపట్టువా రెవ్వరు?

వివిధత యింత విచిత్రగా విజృంభిస్తున్నా, కొన్నాళ్ళకు దీనిలోనుండి యింకా నిర్దుష్టమయిన వచనపు నడక నెగడగలదు.

వైవిధ్యమే మెఱుగులు దేరి తేరి తనలోనుండి హార్దమహితమయిన యైకవిధ్యము నవతరింపజేయగలదు.





[ఏకాంకరూపిక*]

శ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి

●

ఆముఖం

వెలుకువింటు వెన్నెల కలువతామరపూల - చిలుకు తగిలే వలపు పరమహంస ;

చలువపందిరికన్ను గీటులో మోసులు - గ్రొప్పి సన్ను సుమనసేవు సెంతు.

●

— ఒ క ట వ దృ శ్యం —

[గంగానదీతీరం. మరీచిమహర్షి తపోవనం. బ్రాహ్మముహూర్తం. సుస్నాతులైన మునికుమారకంఠాలనుంచి శాంతమధురంగా—]

అసతో మా సద్గమయ
తమసో మా జ్యోతిర్గమయ
మృత్యోర్మాఽమృతం గమయ

(క్రమంగా వల్లగా ఉపనిషద్గానం ఆగినతరువాత. ఒక దేవదారువృక్షచ్ఛాయలలో భగవాన్ మరీచి మహర్షి—శిష్యుడు వామదేవుడు గీతాధ్యయనం ఉపక్రమిస్తారు)

మ హ ర్షి

చిరంజీవీ! చదువు—

వా మ

చిత్తం.

యతతో హ్యపి కౌన్తేయ పురుషస్య విపశ్చితః,
ఇన్ద్రియాణి ప్రమాథీని హరన్తి ప్రసభం మనః.

మ హ ర్షి

నాయనా, భగవానుడు పరమసత్యం చెప్పాడు. ఇంద్రియాలు పెంకిగుర్రాలు. మనస్సు రథం. బుద్ధి సారథి. చోదకుడు పగ్గములు పట్టడంలో కుశలుడై అశ్వహృదయం ఎరిగి నడిపితే మానవుడు ఉద్దిష్ట ప్రాప్యాన్ని సురక్షితంగా చేరగలడు. లేక......

వా మ

(సంకోచంగా) గురుదేవా! నా అల్పబుద్ధిలో అనేకసంశయాలు... అణచబడ్డ ఇంద్రియాలు ఏదో ఒక ఏమరుపాటులో జీవితాన్ని కూలదోస్తాయేమో అని ఎప్పుడూ భయపడుతూంటాను.

(ఆశ్రమోపాంతంనుంచి ఒక అవ్యక్తకంఠం)

"తప్పదు. తప్పదు. తమ కృపావీక్షణం నన్ను రక్షించక తప్పదు."

(సర్వాంగసుందరి ఒక యువతి ఆందోళనగా వచ్చి మహర్షి పాదాలమీద పడి ఏకధారగా కన్నీరు విడుస్తుంది.)

మ హ ర్షి

(అలజడిగా) అమ్మా! ఎవరు నీవు? ఎందు కింత వేదనపడుతున్నావు? వచ్చిన ఆపద ఏమిటి తల్లీ!

యు వ తి

(గద్గదకంఠంతో) ప్రభూ, ప్రభూ, ఈ పతితురాలికి తమ శీతలపాదచ్ఛాయలలో...(మాట తెమలిరాదు)

మ హ ర్షి

(జాలిగా) బిడ్డా, ఏబాధలలో నలిగి ఇంతగా వాడిపోయావు? స్థిమితపడి చెప్పు.

తల్లీ, చెక్కిళ్లమీద కన్నీటిచారికలు తుడుచుకో—భూళికొట్టుకున్న వేణీబంధం సరిచేసుకో—

యు వ తి

(లేచి నిలుచుని కళ్లు తుడుచుకుని) మహాత్మా, వద్దు...దయ ఉంచి నే నెవరో అడగకండి. తెలిస్తే నన్ను ఒకక్షణంకూడ మీ పవిత్రపాదతలంవద్ద ఉండనివ్వరు. మరకొంతసేపు మాలిన్యాల నన్నింటిని ప్రక్షాళనంచేసే మీపుణ్యసాన్నిధ్యంలో ఈ ప్రశాంతవాతావరణంలో తేరుకోనివ్వండి.

మ హ ర్షి

(ఆశ్చర్యపడుతూ) ఎందు కింత బెంగపడతావు పిచ్చితల్లీ! నిర్భయంగా చెప్పు. ఏమాలిన్యమూ చూచినంతలో, సమీపించినం

---

*శ్రీ మహాకవి దండికి కృతజ్ఞతా నమస్కృతులు

తలో అంటుతుందనే భయం నాకు లేదు. మనలో కొంత మాలిన్యం ఉంటేతప్ప ఎవరికీ మలినత్వం అంటుతుందనే భయం కాంచేను.

యు వ తి

(ఇంకా సంశయిస్తూ) కాదు ప్రభూ...కాదు. ఈ దేవ రాలు ఏ కులశీలములు గలవారి మన్ననకూ పాత్రురాలు కాదు. ఇక క్షమవంటి ఆపోశనము పొందనూలేని తాకరానిదైనా......

మ హ ర్షి

కల్యాణీ! నే నభయమిస్తున్నాను. నీ వృత్తాంతం చెప్పు.

యు వ తి

ప్రభూ, నా సౌందర్యయౌవనాలను నాకు ప్రియుడైన ఒక్క పురుషునికి అర్పించి బతికే అదృష్టం నాకు లేదు.

నా శరీరపు లావణ్యంకోసం, కన్నుల వినీలసౌందర్యం కోసం, పెదవుల మాధుర్యంకోసం నాచుట్టూ మూగి సువర్ణరాసులు కుమ్మరించే పురుషకిరాతకుల బారికి తాళలేక...అన్ని ఆశలను చంపుకొని అడవులవెంట పరుగెత్తుకువచ్చాను.

నా ఇహలోకయాత్ర ఎంత దుఃఖభాజన మయిపోయింది స్వామీ! (పొంగే కన్నీటిని కొంగుకొనతో చిమ్ముకుంది.)

(ప్రవేశం : వృద్ధవేశ్య కామమంజరి, ఇద్దరు పరిచారికలు...ఎవరినో వెదకుతూ)

కా మ మ ం జ రి

రాగిణీ, రాగిణీ, కన్నతల్లి అనే కనికరమైనా లేకుండా ఈ ముసలిబతుకును ఎన్ని శ్రమల పాలు చేస్తున్నా వమ్మా...అబ్బా... ఈ కాళ్ళల్లో ఎన్ని ముళ్లు! అయ్యో! అడుగుపడడం లేదు.

౧ ప రి చా రి క

అమ్మా! అదిగో మన రాగమంజరి...మహర్షి పాదాలవద్ద తల వంచుకొని నిలుచునిఉంది.

కా మ

(ఆతురతతో) నాతల్లి రాగిణి కనపడ్డదా? ఏదీ ఏదీ, పదండి పదండి శ్రీవారి పాదసన్నిధికి.

(మహర్షిని సమీపించి) మహర్షి దేవా! నమస్కారం.

మ హ ర్షి

కల్యాణప్రాప్తి రస్తు. ఎవరమ్మా మీరు? ఇంత శ్రమపడి ఈ అరణ్యసీమలకు ఎందుకు వచ్చారు? పాపం! చాలా అలసిపోయినట్టు కనబడుతున్నారు.

కా మ

దేవా! ఏమి చెప్పను? ఈ ముసలితనంలో అందరివలె సుఖించే యోగం నా ముఖాన లేదు. మీవద్ద నిలిచిఉన్న ఆ కఠిన రాలు...ఈ అభాగ్యురాలి ఏకైకపుత్రిక...

మ హ ర్షి

ఓహో, అట్లాగా...అయితే...

కా మ

ఉత్తరకోసల రాజ్యజనపదంలో ఉన్న చంపానగరం మా నివాసం. మేము...మహర్షులకు ఏమి మనవిచెయ్యను...

మ హ ర్షి

సరే సరే. మీరు రూపజీవికాకులానికి చెందినవారని సపుత్రిక మాటలబట్టి గ్రహించాను. తరవాత—

కా మ

నాపేరు కామమంజరి. నాకు ఈమె ఒక్కతే బిడ్డ. పేరు రాగమంజరి. అన్ని ఆశలూ ఈమెమీద పెట్టుకుని సంతోషకాంక్షతో బతుకుతున్నాను.

మ హ ర్షి

సరే. ఇప్పు డేమి విరుద్ధసంఘటనం జరిగింది?

కా మ

మనవి చేస్తున్నాను.

పసిపాపగానుంచే అవునేతితో తలలంటి మంచిగంధపు పూతతో నలుగుపెట్టి పన్నీటితో జలకమాడించాను స్వామీ!

మ హ ర్షి

పాపం...పుత్రికాస్నేహం అంత చిక్కనిదకదా. ఆపైని...

కా మ

చెంపలలో వింత కాంతీ, సోగకళ్లల్లో చంచలశోభా పొడచూపగానే అద్దాలమేడలో పట్టుదిండ్ల తూగుటుయ్యాలలో ఉంచి కన్నతండ్రికంటనైనా పడనీయక చిలకలా పెంచి పెద్ద చేశాను.

మ హ ర్షి

(చిత్రమైన మాపుతో) ఊహూ—

కా మ

పిమ్మట నారద తుంబురులవంటివారిచేత సంగీతమూ, భరతాచార్యులవంటివారి చేత నృత్యమూ అద్వితీయంగా నేర్పించాను తండ్రీ!

మ హ ర్షి

ఔను. మాతృధర్మం పూర్తిగా నెరవేర్చావు.

కా మ

ఉత్సవసమయాల్లో రత్నాభరణా లలంకరించి నా సౌధోప భాగంమీద నిలిపితే స్వర్గభూమినుంచి సరిగా ఆ మేడమీదకి

పార్వతీ దిగవచ్చినట్లు నాటి పట్టాభిషేకమంతా ఉత్సాహాలాడి నాయింట్లో ఉంచిన కనకరాసులు కుమ్మరించడానికి సిద్ధంగా ఉన్న ప్పుడు—నా అదృష్టం బద్దలైంది. నా ఆశలు మట్టిపాలయాయి గదా! (కన్నీరు తుడుచుకుంటుంది)

మహర్షి

(పరుషపడి) ఏమి జరిగింది?

కామ

ఒక బ్రాహ్మణ యువకుడు కొంతకాలం మా పట్టణానికి వచ్చి ఉండి నా పుత్రికహృదయం దొంగిలించాడు. నేను నా బిడ్డను "పణ్యస్త్రీకి ప్రణయప్రవృత్తి కూడదే" అని శతవిధాల బోధించాను. వినలేదు. తుదకు ఈ విషయం ఎవరితోనూ చెప్పకుండా ఈ అడవుల వెంట పరిగెత్తుకొని వచ్చి తమ ఆశ్రమానికి చేరింది.

ప్రాణాలు పెట్టుకొని బతుకుతున్నాను. నా బిడ్డను నా కప్పగించండి మహర్షీ!

మహర్షి

(రాగిణితో) అమ్మా, ఇంత సుకుమారివి. ఈ వనవాసక్లేశాన్ని ఎట్లా భరించగలవు?

నాకు తెలుసు. ఇక్కడే నిలువలేవు. నీ తల్లి వెంట వెళ్ళు. నీ మాతృమూర్తిని బాధపెట్టకు.

స్వాతంత్ర్యంలో నా ఇష్టం నా మేలు.

నీ తల్లిమాట విను.

రాగమంజరి

ప్రభూ, ఈ మధుర ఆశ్రమసాన్నిధ్యంలో నాకింత శాంతి దొరుకు తుందనుకున్నాను. ఒక్క పతితురాలిని రక్షించలేరా? ఆమెతో తిరిగి నన్ను ఆ నరకానికే పంపదలుస్తే—అదిగో ఆ గంగానది మాతయినా, అగ్నిదేవుడైనా ఆదరించక పోతారా? (మహర్షి పాదాల వద్ద వాలిపోతుంది)

కామ

అమ్మా, ఈ ముదిమిలో... నీ ఎడబాటుతో కుమిలి కుమిలి నశించిపోవలసిందేనా?

౧ పరిచారిక

అమ్మా, నీవు లేక చిన్నబోయిన మేడకు మళ్ళా ఎట్లా వెళ్ళ మన్నావు?

౨ పరిచారిక

నువ్వు పెంచిన చిలకాగోరువంకలు నీకోసం బెంగపెట్టు కొని, మేతలు మాని దిక్కు మొగంతో చూస్తున్నాయి. వాటికైనా ఒక్కసారి వచ్చి చూడవా తల్లీ!

రాగి

అమ్మా, తుదిమాట వినండి. నన్ను బాధించక, మీరు బాధ పడక తిరిగి వెళ్ళండి. నేను రాను. యూత్రకు రాను. మనమంతా ఈ లోకయాత్రలో కొంతకాలం నడచిన తోడు ప్రయాణికులం. ఎవరి దారి వారిది. నా యాత్రకిక్కడే విశ్రాంతి. మీదారి వెళ్ళవచ్చు.

మహర్షి

కామమంజరీ, ఇక వాదంలో ప్రయోజనం లేదు. మనస్సులో పరిణామం రావాలి. నీవు వెళ్ళు. ఈ అరణ్యవాసం మధురమయి రాగిణి నీ చెంతకు వస్తుంది. భయం లేదు.

కామ

చిత్తం. ఇది నాకు అరణ్యవాసం—కాదు, వరప్రదానం. నాకు సెలవిప్పించండి.

మహర్షి

మంచిది.

—రెండవ దృశ్యం—

[శరదృతువు. వెన్నెలపండురాత్రి. మర్రిచెట్టు మహర్షి ఆశ్రమం. వెన్నెలతో వెలుగుతోంది. శిష్యులు అధ్యయనం చాలించి పర్ణశాలల్లో విశ్రమించారు. మహర్షి ఇంకా ధ్యానముద్ర విడిచినట్టు లేదు. రాగమంజరి ఆశ్రమంలో తాను పెంచిన పూలమొక్కలకు నీళ్ళు పోస్తూ వెన్నెల ఇచ్చిన ఉత్సాహంతో పాడుతుంది]

(గీతం)

పరకాని చుక్కల సఖ్యము మరగిన
చందమామా రావోయీ!
దిక్కుదిక్కుల తెలిమువ్వలతో
తిరిగే రాజా దిగవోయీ. చ॥

జాజిపొదల సంపంగియల
తేజు విరిసె నీవరకు
రేజవరాలు లీలామల్లిక
మోజుపడెను నీకొఱకు. చ॥

వెన్నెలబాటల పున్నమిరేల
విహరించే దొర! ఏమోయీ!
గుండెగుండెలో కోర్కెల తేనెల
కురియించుట ఏమరకోయీ. చ॥

మహర్షి

(తపస్సు చాలించి బయటికి వచ్చి)

రాగిణీ! ఇంకా విశ్రమించలేదూ? ఈ వృక్షసేచనం ఉదయం జరుపుకోకూడదా?

రాగ

అమ్మయ్యో—గురుదేవులు !! నా పిచ్చిపాటలతో ఆచార్య దేవుని తపోభంగం చేశానుగాబోలు......

మహర్షి

లేదు. లేదు. నీవల్ల నాకు తపోభంగమా ? (నవ్వి) పిచ్చి దానా, ఎంతమాత్రం కాదు. వచ్చిన ఆరునెలలనుంచీ తరిపిప్పరుండా నావల్కలములు ఉతికి ఆరవేసి, సర్ణశాల అరికి పలుగ్రుగ్గులు తీర్చి, దినదినమూ ప్రభాతకాలానికి నా దేవార్చనకు వింతవింత పుష్పాలు అనుర్చి నా ధర్మదీక్షకు నిత్యం ఎంత సహాయపడుతున్నావు ! నీ సుకుమారశరీరం ఈ వనవాసక్లేశానికి ఎంత నొచ్చుకుంటున్నదో అని బాధపడుతూంటాను.

రాగ

ప్రభూ, తమ అనుగ్రహంవల్ల నా కట్టి వ్యథ ఏమీ కలుగటం లేదు. ఈ చర్మపు నునుపు చెరుగుతుండనికాని, ఈ కన్నుల మెరుపు తరుగుతుండనికాని నాకు విచారం లేదు. ఈ అరణ్యమూ, తమ పవిత్రసాన్నిధ్యమూ నా కెంతశాంతి నిస్తున్నాయో ఎట్లా చెప్పను!

మహర్షి

కాదు రాగిణీ! నీవు పొరపడుతున్నావు. కుసుమసుకుమార మైన నీ శరీరం, తలిరువిల్లివంటి నీ కోమలపాదాలు, ఈ అడవిరాతి నేలలో ఎంత చిక్కుపడుతున్నాయో నాకు తెలుసు. పట్టణ సౌధాలు, సౌభాగ్యాలు నీవంటి పుష్పశీలలకోసమే ఏర్పడినాయని ఇప్పుడు నిశ్చయంగా అనుకుంటున్నాను సుమా—

రాగ

గురుదేవా ! ఈనాడు వింతగా సెలవిస్తున్నారు.

మహర్షి

రాగిణీ, అతిశయోక్తి కాదు. వచ్చిననాటినుంచీ నీ శరీరాన్ని ఎన్ని శ్రమలకు అగ్గంచేసి ఈ తపస్విసేవ్రత్తిని సాగిస్తున్నావు! ఇ నప్పటికీ—అన్ని టికీ ఓర్చి నీనవ్వులతో, పాటలతో ఈ ఆశ్రమాన్ని ఎంత ఉత్సాహభరితం చేశావు ! నిజం చెబుతున్నాను. విను. నీ సాహచర్యంవల్ల ఇంతవరకూ నేను నా జీవితంలో చూడని ఒక సుందర లోకపు ద్వారం హఠాత్తుగా తెరుచుకున్నట్టయింది. నీ వీఆశ్రమంలో అడుగుపెట్టేవరకూ పూవుల్లో ఇంత పరిమళం ఉంటుందనీ, పాటల్లో ఇంత తీపి ఉంటుందనీ నాకు తెలియదు. నిరంతరతపస్సాధనలో ఈ అనుభవాలు నాలో మూర్ఛిల్లి ఉన్నట్టుగా ఇపుడు నీవల్ల మేలు కున్నాయిగాబోలు—నా బుద్ధికి ఊపిరాడటం లేదు.

రాగ

నాకేమీ అర్థంకాక సిగ్గుపడుతున్నాను ప్రభూ !

మహర్షి

పిచ్చివాళ్ళు ఎవరో తపస్సుకు స్త్రీ విఘ్నకారిణి అంటే నిజమే అనుకున్నాను. ఇప్పుడు అసత్యం అని గ్రహించాను. సుందర దేహవల్లితో నీ వీ ఆశ్రమంలో కదలుతూ, ఏవో తీయనిపాటలు పాడుతూ ఇటుకటి ప్రతిఅణువుపై నీ అపూర్వసౌందర్యం వర్షించి ప్రేమిం చుతూంటే ఈ నీరస కర్కశవనవాసం, నిష్ఠురతపశ్చర్య సార్థకమవుతూ, మనోహరంగా నాకిప్పుడు తోస్తున్నది నమ్ము. అందుకే—ఈ అలసటలో ఎంత అలసిపోయినావూ ! మాటిమాటికీ నాకు నీ రూపం కనుపించి చిక్కుబడి ఎట్లా ఆలోచించలేకపోయానో చూశావా ?

రాగిణీ! ఈ శిరీషవృక్షంకింద కూర్చుని విశ్రాంతిగా గాలిపాటలో వచ్చు.

ఏం—నిద్రవస్తున్నదా ? ఈ శరీరం అలసి ఎట్లా ఉన్నదో చూశావా ?

రాగ

నిజం. తమకు శ్రమ కాకపోతే... ఇవ్వాళ రాత్రిలో నాకు నిద్ర ఉండదు స్వామీ.

(శిరీషవృక్షంకింద ఆప్యాయంగా కూర్చుంటారు)

రాగ

గురుదేవా ! నాకు ఈ లోకంమూర్ఖుల మాటలు వింటే నవ్వువస్తుంది. సర్వోత్తమమైన ధర్మాన్ని అర్థకామాలతో కలిపి ఎందుకు ఉచ్చరిస్తారో తెలియదు.

మహర్షి

రాగిణీ! నీ బుద్ధివిశేషం చూస్తే నాకు ఆశ్చర్యమూ, సంతోషమూ కలుగుతాయి. అయితే, చెప్పు చూదాం. అర్థకామాలకంటె ధర్మం ఎందుచేత గొప్పది ?

రాగ

సకలశాస్త్రకోవిదులు—తమకు నేను చెప్పడమా ? ఏమీ తెలియని గురుస్వామీ—అయినా, తమఆజ్ఞ. తోచినది మనవిచేస్తాను.

ధర్మం లేనిదే అర్థకామాలు పుట్టవు. ఇవి లేకపోయినా ధర్మం స్వతంత్రంగా నిలిచి వెలుగుతుంది. తత్త్వజ్ఞానంలో బలపడిన ధర్మాన్ని అర్థకామాలు బాధించజాలవు. ఒకవేళ వాటివల్ల బాధ కలిగినప్పటికీ కొద్దిప్రయత్నంతో ధర్మం నిలదొక్కుకొని ఉత్తమ సిద్ధిని పొందితీరుతుంది.

మహర్షి

ఎట్లాగో చెప్పు.

రాగ

ఏమి ప్రభూ—తిలోత్తమను కామించిన విధాత, వేయి మంది మునిపత్నులను కామసేవకు పురికొల్పిన పరమశివుడు, గంగా

నదీతీరాన కైవర్తకన్యతో సుఖించిన పరాశరుణ్ణి ఏమని మహాను భావులంటారు?

మహర్షి

(పకపక నవ్వి) ఎన్నడూ లేనిది ఈ జాహ్నవి నీ ప్రలమారుతం చక్కిలిగింతలు పెడుతున్నది. సరేగాని—మాకు అచుంబిత విషయం గనుక కుతూహలంకొద్దీ అడుగుతున్నాను.

కామపురుషార్థరహస్యం ఏమిటి రాగిణీ!

రాగ

(సిగ్గుతో నవ్వుతూ) ఈనాడు నిజంగా గురుదేవులు నన్ను పరీక్షచేస్తున్నారు.

తెలిసినంత విన్నవిస్తాను.

ప్రేమగల ఇద్దరు స్త్రీపురుషుల హృదయాలలో పొద్దువించిన ఒక మధురకాంక్షాభావం. అన్యోన్యప్రియసల్లాపాల్లో, సరిమళాల్లో, విహారాల్లో విజృంభించి ఒక ఆనందసామ్రాజ్యానికి సృష్టిచేస్తుంది. ఆ సుఖంకోసం ఎన్ని యజ్ఞాలు, తపస్సులు, దానాలు, యుద్ధాలు. సముద్రలంఘనాలూ ప్రవర్తిల్లినవో తమ కెరుగరా గురుదేవా?

మహర్షి

(చిత్రమైన మానసవికారానికి లొంగి)

ఎంత విజ్ఞానవతీవి రాగిణీ! ఇంతవరకూ నేను నీకు గురువును. ఈ పైని నీవు నాకు.

అపూర్వ జ్ఞాన శోభతో వెలిగే నీ కన్నుల అందాన్ని సమీపంలో చూడనీ—దగ్గరగా, ఇంకా దగ్గరగా రా...అయ్యో! శిరీష కేసరాలు ఎన్ని చిందరవందరగా నీ తలపై పడ్డాయో చూశావా? ఏమీ శ్రద్ధచెయ్యవు.

రాగ

ఆచార్యదేవా! వద్దు. వద్దు. ఈ పాపాత్మురాలిని తాకకండి. నరకంలోకి జారిపోయే ఈ దీనురాలిని రక్షించండి.

మహర్షి

తృతీయపురుషార్థఆచార్యాణీ! నరకనాకములకు ఏది ప్రమాణం?

రాగ

(తప్పించుకుంటూ) గురుదేవులు పరిహసిస్తున్నారేమో. ఆఁ ఆఁ, ధర్మం కాదు.

మహర్షి

ఔను రాగిణీ! నాకు కావలసింది ధర్మం కాదు.

రాగ

మౌనిదేవులు నిశ్చయంగా తృతీయపురుషార్థంద్వారా ఈ దాసిని అనుగ్రహించదలచితే—మా చంపానగరసౌధానికి దయచేయండి స్వామీ—కర్ణీరథం సిద్ధంగా ఉంది.

మహర్షి

(తృప్తిగా) సర్వోత్తమం. పద.

—మూడవ దృశ్యం—

[అంగరాజధాని చంపానగరం. దేశమంతటా వసంతోత్సవం. అంగరాజోద్యానంలో వసంతోత్సవకలకలం. మహారాజు రత్నసింహాసనాసీనుడు. కలకంఠాలు కలిపి వారవిలాసినులు నృత్యంచేస్తూ పాడుతూంటారు]

(గీతం)

మరల వచ్చె నియ్యదిగో—మానినులారా!
మన వసంతమదనోత్సవము—
తరళతరళమంజరులు చరచరా
విరిసి పుష్పాఞ్జలు కురిసినవి
నవరసాల మృదుకిసలయకబళము
మేసి కోయిలలు కూసినవి॥ మ॥

కుసుమకోమలుల రసహృదయమ్ములు
క్రోలి మధుపతతులూగ—
చైత్రములో మధుజైత్రయాత్రలో
చెఱకువిల్లు మ్రోగె॥ మ॥

(పాట క్రమంగా ఆగిన తర్వాత)

మహారాజు

శశికళా! వాస్తవానికి ఇంకా రాగిణి రాలేదేమి? ఆమె పద మంజీరధ్వనీ, మధురకంఠమూ కలిస్తే ఈ మహోత్సవం ఇంకా వేయి రెట్లు రక్తిగా సాగుతుందని నా అభిప్రాయంసుమా—

శశి

చిత్తం ప్రభూ, సందేహ మేమి? ఇంకా ఎందుచేతనో రాలేదు. (కొంటెగా నవ్వి) ఆమెసంగతి నాకంటె మదనమంజరికి బాగా తెలుస్తుంది మహారాజా!

(అన్ని స్త్రీకంఠాలూ ఒక్కసారిగా)

అదిగో రాగిణి! గెలిచింది. గెలిచింది.

ఒకగొంతు

ఎంతటి జాణ! మనోహరంగా అలంకరించుకొని ముసిముసి నవ్వులతో ఎవరినో వెంటబెట్టుకొని వస్తున్నది.

(ప్రవేశం: ఉత్సవ ఉజ్జ్వలవేషంతో రాగమంజరి, విలాస పురుషవేషంతో ఋష్యశృంగ మహర్షి.)

రాగ

(మహారాజును సమీపించి) భూలోకదేవేంద్రా! అంగ ప్రభూ! నమస్కారం.

రాజు

ఇదిగో రాగిణి! చాలా సంతోషం. సమయానికి వచ్చావు. వరేగాని నీవెనుక ఆ నవీనవిలాసి ఎవరు ?

రాగ

చిత్తం చిత్తం రెండుగడియలలో అన్నీ ప్రభువువారికి విశద మవుతాయి. (విజయగర్వసూచకంగా మదనమంజరివైపు చూస్తుంది.)

రాజు

(చిరునవ్వుతో) మదనా, ఏమిటే గాథ ?

మ ద న

(గంభీరంగా) మహారాజా, కథ ఏమీ లేదు. నేను ఆరునెలల కిందట రాగిణితో పందెంవేసి ఇప్పుడు ఓడిపోయాను. నిశ్చయంగా రాగిణి గెలిచింది. నేను ఆమెప్రజ్ఞను మెచ్చుకుంటున్నాను.

మహారాజు

రాగిణీ, నీ విజయగాథ ఏమిట్లో వివరించు.

రాగ

చిత్తం మహారాజా. సుమారు ఆరునెలలకిందట ఒకనాడు మేమంతా గోష్ఠిలో ఉండగా, పురుషులూ, ఇంద్రియనిగ్రహం ప్రసక్తి వచ్చింది.

అప్పుడు మదన అంది అచ్చమైన ఇంద్రియవిజేతలు - మహర్షులు ఎంతటి లావణ్యనిధి కంటపడినా కన్నెత్తి చూడరని ప్రతిపాదించింది. నేను, పూర్వం స్త్రీసౌందర్యాగ్నికి ఆహుతులైన మునుల కథలు చెప్పాను.

మదన కథలు నమ్మనంది. నా పట్టుదల హెచ్చింది. మదన తుద కిట్లా అంది: 'వృథావాదాలు ఎందుకూ? నువ్వు ఆరునెల్లలో గంగాతీరతపోవనవాసి మరీచిమహర్షిని నీసౌందర్యసమ్మోహితుని చేసి ఈ చంపానగరానికి తెస్తివా, నీకు నేను దాసి నవుతాను. ఓడితే నీవు నాకు కావాలి' అని. ఒప్పుకున్నాను. ఈరోజు తుదిగడువు. ఇదుగో మహర్షులవారు నన్ను అనుగ్రహించారు.

(మహర్షి అచ్చెరువులో మునిగి తలవంచుకుంటాడు)

రాజు

రాగిణీ, తక్కిన విషయా లట్లా ఉంచి, నీకౌశలానికి ఎంతైనా మెచ్చుకుంటూ ఈ జాతిముక్తాహారం నీకు బహుమానం ఇస్తున్నాను. ఎవ రక్కడ?

పరిచారిక

చిత్తం. ఏమి సెలవు?

రాజు

రెండు దుకూలవస్త్రాలు. నూటపదారు దీనారాలు. ఒక కర్పూరతాంబూలం ఊఁ, వెంటనే—

పరిచారిక

ఏలినవారి ఆజ్ఞ.

(బహుమానసామగ్రి తెచ్చి ఎదుట ఉంచుతుంది)

రాజు

రాగిణీ, ఇదిగో మా వసంతబహుమానం.

రాగ

(కృతజ్ఞతగా) మహాప్రభువుల అనుగ్రహం. (స్వీకరిస్తుంది)

రాజు

ఈవినోదములతో ఇప్పటికి సభ చాలిస్తున్నాం.

దాసికలు

జై. అంగమహాప్రభువులకు జై.

(అందరూ వెడలిపోగా-రాగిణి, మహర్షి)

రా గ

మహర్షి దేవా! ఈ దాసిని ఇన్ని సన్మానగౌరవాలకు పాత్రురాలిని చేసినందుకు కృతజ్ఞతతో నమస్కరిస్తున్నాను. (పాదాలమీద పడుతుంది)

మ హ ర్షి

(ఆశ్చర్యంతో చలించిపోతూ)

రా...గి...ణీ, రా...గి...ణీ—నీవే మాట్లాడుతున్నావా? ఎంతటి నటనాకౌశలం చూపావు! నీ మోహినీనేత్రశోభకు నా చిరసంచిత తపోధనమంతా చూరయిచ్చి నీకంటిరెప్పల్లో నడచివచ్చానే! లోకంలో ఇంత వంచన ఉంటుందా? ఏమిటే!...నామాటలు గాలికి విడిచి నడిచిపోతున్నావా? చండికా!

నిన్ను విడిచి ఎట్లా బతకను? ఎక్కడికి వెళ్ళను?

(దిగ్భ్రమగా నిలుచుంటాడు)

రా గ

గురుదేవా! వెళ్ళండి. ఇప్పటికైనా కామపురుషార్థంలోని క్షుద్రత్వం, పతనం గ్రహించి ఏ యువతీలావణ్య సంమోహానానికీ లొంగని బలిష్ఠమైన ఆత్మనిగ్రహసంపత్తిని వహించి ఉత్తమసిద్ధిని పొందండి. ఇదిగో, ఇదే తమ ఆశ్రమానికి రాజమార్గం.

ఇక నాకు సెలవు.

స్వార్థంకోసం ఇంతటి అమాయికసాధుమూర్తిని వంచించిన నా పాపానికి నిష్కృతి ఉండదు.

(పశ్చాత్తాపంతో, తిరిగిచూడకుండా వెళ్ళుతుంది)

మ హ ర్షి

(పెద్దగా నిట్టూర్చి)
ఔరా! స్త్రీహృదయం అమృతమా?
హాలాహలమా??
కాదు. అది సముద్రం!!

(నిష్క్రమణం)

మన క్రొత్త రాజ్యాంగప్రణాళిక

శ్రీ మామిడిపూడి వెంకటరంగయ్య

౧౯౪౮ డిసెంబరులో సమావేశమైన రాజ్యాంగపరిషత్తులో జరిగిన చర్చలను ఆధారముచేసికొని డాక్టరు అంబేద్కర్ కమిటీవారు చిత్తు (Draft) రాజ్యాంగప్రణాళికను ఈమధ్య ప్రచురణచేసిరి. త్వరలోనే ఈ ప్రణాళికను పరిషత్తువారు విమర్శించి ఆమోదించగలరు. బహుశః పరిషత్తువారు ఇందులో గొప్పమార్పు లేవియు చేయరని చెప్పవచ్చును. ఆ కారణముచేత ఈ ప్రణాళికయే మన భావిరాజ్యాంగప్రణాళిక కాగలదు. మార్పులు కొన్ని జరిగినను అవి స్వల్పమార్పులుగానే ఉండును.

దేశపరిపాలనకు ఏలాటి మూలసూత్రములును, సిద్ధాంతములును ఆధారములుగ నుండవలెనో నిర్ణయించి, వాటిని ఆచరణలో నుంచుటకు కావలసిన అధికారవర్గము ఎట్టిదిగ నుండవలెనో, ఆ వర్గములోని అంగములకు గల పరస్పరసంబంధ మెట్టిదో వివరించు ప్రణాళికయే రాజ్యాంగప్రణాళిక. ప్రతి దేశమునకు, రాజ్యమునకు ఏదో ఒక రాజ్యాంగప్రణాళిక ఉండుట అవసరము. అందులోని పరిపాలన విధాన మంతయు ఈ ప్రణాళికను అనుసరించియుండును.

మన ఈ రాజ్యాంగప్రణాళికకు ఒక విశిష్టత ఉన్నది. ఈ రాజ్యాంగము స్వతంత్రభరతఖండమునకు అనువర్తించునది. గత ౧౫౦ సంవత్సరములనుండి మన దేశమును పాలించుటకు బ్రిటిషువారు అనేకరాజ్యాంగప్రణాళికలను అప్పుడప్పుడు తయారుచేయుచుండిరి. వారు ఆఖరున తయారుచేసినది ౧౯౩౫ సం॥పు ఇండియాపరిపాలన చట్టము. కాని ఈ ప్రణాళిక లన్నియు పరాధీనమగు భరతఖండమును ఏలాగు పాలించవలెనో నిర్ణయించినట్టివి. బ్రిటిష్‌వారి అధికారము నిలుచుటకు ఏలాటి ఏర్పాటులు, సూత్రములు, కీలకములు అవసరములో నిరూపించినట్టివి. ఇప్పుడు మనము ఏర్పరచుకొన్న రాజ్యాంగప్రణాళిక అట్టిది గాక స్వతంత్రభరతఖండము ఎట్లు పాలింపబడవలెనో నిరూపించుచున్నది. ఇది ఇందులోని మొదటి విశేషము. రెండవ విశేష మేమనగా: ఇది మనమే తయారుచేసికొన్నది. ఇదివరకు అమలులో నుండిన ప్రణాళికలన్నియు బ్రిటిష్‌వారు తయారుచేసినవి. వాటిని సృష్టించుటలో మన కెట్టి జోక్యము లేకుండెను. కాని దీనిని స్వేచ్ఛగా, మన అవసరానవసరములను ఆలోచించుకొని మన పెద్దలే తయారుచేసిరి. కనుక ఇది స్వదేశీ రాజ్యాంగ ప్రణాళిక.

ఈ ప్రణాళికకు మరొక విశేషముకూడ కలదు. ఇందులో ఉద్దేశింపబడిన రాజ్యము ప్రజారాజ్యము. అనగా ఇందు సర్వస్వామ్యము ప్రజలదే. ప్రజల దృఢసంకల్పమే దీనికి మూలమని ప్రణాళికలోని ప్రస్తావనావాక్యములు ఘోషించుచున్నవి. ప్రస్తుతము ప్రపంచములో రెండువిధములైన రాజ్యాంగవిధానములు పరస్పరము పోటీచేయుచున్నవి. ఒకటి నిరంకుశవిధానము; రెండు ప్రజాస్వామ్యము. నిరంకుశ విధానములో రాజ్యాధికారమునకు హద్దు, నియమము అనునది ఉండదు. అధికారములో ఉన్నవారు ఏది చేసినను చెల్లును. అది చెల్ల దనికాని, చెల్లకూడ దనిగాని చెప్పగలవా రెవ్వరు ఉండరు. అందుచేతనే నిరంకుశ మను పేరు దానికి సార్థకమగుచున్నది. ప్రజాస్వామ్యము ఇట్టిది కాదు. ఇందు అధికారములో నుండువారు కొన్ని విషయములందే అధికారము వహించియుందురు. అందుచేతనే వారి అధికారము పరిమితమైన దని చెప్పబడుచున్నది. రాజ్యాంగ ప్రణాళికయొక్క ఉద్దేశములలో ఈ హద్దులను నిర్ణయించుట ఒకటి. నిరంకుశప్రభుత్వములో అధికారమంతయు ఒక నియంతయొక్కగాని, ఒక రాజకీయపక్షముయొక్కగాని వశమం దుండును. నిరంకుశుడు ఒకేవ్యక్తి అయినను, ఒకే పక్షమైనను దానికి ఒక లక్షణ ముండును. అల్పసంఖ్యాకులు అధికసంఖ్యాకులను పాలించుటయే ఆ లక్షణము. హిట్లరుకాలమున జర్మనీయందు, ముసోలినీకాలమున ఇటలీలో ఉండినట్టి, ప్రస్తుతము స్టాలిన్ అధీనమున రష్యాలోను, తూర్పుయూరపులోని ఇతరకమ్యూనిస్టు దేశములలోను ఉండు నిరంకుశప్రభుత్వము అల్పసంఖ్యాకులు అధికసంఖ్యాకులపై చేయుచుండు ప్రభుత్వము. ఇది ప్రజాస్వామ్యము కాదనుట కిది యొక కారణము. నిరంకుశప్రభుత్వమును నియమించుటకుగాని, అధికారమునుండి తొలగించుటకుగాని, దాని చర్యలను విమర్శించుటకుగాని ప్రజలకు అధికార ముండదు. ప్రజాస్వామ్యములో ఇట్లుగాక అధికసంఖ్యాకుల చేతులలో అధికార ముండుటయేగాక, ఏ మంత్రివర్గమువారుకూడ శాశ్వతముగ అధికారములో నుండ వీలుండదు. అప్పుడప్పుడు ఎన్నికలు జరుగుటయు; ప్రజలు స్వేచ్ఛగ ఓట్లను ఇచ్చి, ఎవరు అధికారములో ఉండుటయు మానుటయు నిర్ణయించుట కవకాశ మున్నది. అందుచేత ప్రజాభిప్రాయమును గమనించకగాని, దానికి విరుద్ధముగగాని రాజ్యమును పాలించుటకు వీలుండదు. ఈ రెంటిలో ఏదో ఒక రాజ్యాంగవిధానమును మనము ప్రస్తుతము అనుసరించవలసియున్నది. మన రాజ్యాంగపరిషత్తువారు ఆమోదించబోవు ప్రణాళిక నిరంకుశ ప్రభుత్వమును నిరసించునట్టిదియు, ప్రజాస్వామ్యమును సంస్థాపనము చేయునట్టిదియుగ నున్నది. ఇదియే ఇందులోని మూడవ విశేషము.

మన క్రొత్త రాజ్యాంగ ప్రణాళికకంతకు చాలవరకు వ్యక్తిత్వము ఆధారము. ఇది కూడ ఒక ప్రధానమైన లక్షణము. దీనిప్రాధాన్యమును గ్రహించుట సులభము కాదు. తత్వవిమర్శము లన్నిటివలె ఇందులో క్లిష్టాంశము లనేకము లున్నవి. రాజకీయతత్వములు మొత్తముమీద

రెండు రకములుగ విభజింపదగియున్నవి. వ్యక్తితత్వ సమిష్టితత్వములే ఇవి. జాతి, మతము, వర్ణము, కులము, వర్గము—వీటిని ఆధారముచేసి కొని వ్యక్తికి వ్యక్తికి మధ్య వివక్షను కల్పించి రాజ్యమును పాలించుట ఒక విధానము. అదియే సమిష్టితత్వవిధానము. అందు వ్యక్తికి స్వతస్సిద్ధమైన ప్రాధాన్యము నుండదు. అతనికి పరిపాలకుల దృష్టిలో గల ప్రాధాన్యము వాని మతమునుబట్టియో, వర్ణమునుబట్టియో, వర్గమును బట్టియో నిర్ణయ మగుచుండును. ఒక మతమునకు చెందినవా డన్న కారణము చేతనో, ఒక వర్ణమునకుగాని, వర్గమునకుగాని చెందినవా డన్న కారణముచేతనో అతనికి పరిపాలనాధికారులు ఎక్కువ సదుపాయము కల్పించుటయు, కల్పించక పోవుటయు జరుగు చుండును. జాతి, మతము, వర్ణము, వర్గము—ఇవి అన్నియు సమిష్టిని (Group) సూచించు మాటలు. సమిష్టితత్వములో సమిష్టియే సత్యమనియు, వ్యక్తి మిథ్య అనియు, సమిష్టికే విలువగల దనియు, వ్యక్తికి స్వతహాగా విలువ లేదనియు, సమిష్టిలో ఒక అంగమగుటయే వ్యక్తి వాంఛింపతగిన పరమార్థ మనియు ప్రతిపాదిత మగుచుండును. ప్రాచీన కాలపు భారతరాజ్యాంగవిధానమున కంతకు వర్ణధర్మము మూలము. వ్యక్తి ఏ వర్ణమునకు చెందినవా డన్న సూత్రము ననుసరించి అర్థానర్థములు రాజులు కల్పించుచుండువారు. వర్ణహీన మైనట్టిగాని, వర్ణసంకరము కలిగినట్టిగాని సంఘము వర్జనీయ మనియే అప్పటి తత్వము. మహమ్మదీయపరిపాలనకాలములో మతతత్వమే పరిపాలనకు ఆధారము. బ్రిటిష్‌పాలనలో జాతి, మతము, కులము, వర్ణము, వర్గము—ఇవన్నియు వారు వారి చిత్తానుసారము ఆధారములుగ చేసికొని, అంతర్విభేదము లనేకములను కల్పించి వారి అధికారమును నిలబెట్టుకొనిరి. ప్రస్తుతము రష్యాదేశమందును, కమ్యూనిస్టుపాలనకు లోబడిన ఇతరదేశములందును పరిపాలనకు వర్గతత్వము మూలాధారము. కూలిపని చేయువాని కుండు సదుపాయములు తదితరుల కుండవు. ప్రాచీనభరతఖండములో బ్రాహ్మణవర్ణము అగ్రస్థానము వహించినట్లు కమ్యూనిస్టుదేశములలో కాయకష్టము చేయు కార్మికులకు అగ్రస్థానము, వర్తకవ్యాపారములు చేసి జీవించువారికి స్థానమే లేదు. వ్యక్తితత్వమును ఆధారముగ చేసికొన్న ఇంగ్లండు, ఫ్రాన్సు, అమెరికా మొదలైన ప్రజాస్వామ్యదేశములలో వ్యక్తి సత్య మనియు, సమిష్టికి ప్రత్యేకత లేదనియు, అది మిథ్య యనియు ప్రజ లంగీకరించుచుందురు. రాజ్యాంగదృష్టిలో వ్యక్తులందరు—జాతిమతకులవర్ణవర్గవివక్షత లేక—సమానులు. ఎన్నికలలో పాల్గొనుటకుగాని, పరిపాలకవర్గములో సభ్యు లగుటకుగాని, ఉద్యోగముల ననుభవించుటకుగాని, వారివారి ఇష్టమువచ్చిన వృత్తుల ననుసరించుటకుగాని, వ్యక్తులందరికిని సమానమైన హక్కు ఉండును. రాజకీయముగ వ్యక్తుల కుండవలసిన అవకాశములు, సదుపాయములు జాతి, మతము మొదలైన బాహ్యచిహ్నములను బట్టి నిర్ణయింపబడవు. అన్నిటికిని వ్యక్తియొక్క నిశ్చితమైన అర్హతానర్హతలే ఆధారములు. మన మిప్పుడు తయారుచేసికొన్న రాజ్యాంగప్రణాళికకు వ్యక్తితత్వము ఆధారము. సమిష్టితత్వమును అది నిరాకరించినది. ప్రాచీనహైందవసంప్రదాయమైన వర్ణధర్మము ననుసరించి ఇప్పటి భరతఖండము పాలింపబడవలెనని మన రాజ్యాంగపరిషత్తులో ఎవ్వరును వాదించియుండలేదు. అందరు ఆ సమిష్టితత్వమును నిరాకరించినవారే. మతజాతికులవివక్షత లేని సర్వసమత్వమును ప్రతిపాదించు రాజ్యాంగప్రణాళికయే మనది. ఇదికూడ ఈ ప్రణాళికకు ఒక ప్రత్యేకతను కల్పించుచున్నది.

ప్రాథమికహక్కులు (Fundamental Rights)

ఈ కారణముచేతనే ౧౨ పర్వములతో కూడిన మన రాజ్యాంగప్రణాళికలో ౩ పర్వములు (అనగా, ౩, ౪, ౧౪ పర్వములు) వ్యక్తుల హక్కులకు సంబంధించి యున్నవి. వ్యక్తియొక్కడే సత్యపదార్థ మనియు, కష్టసుఖములను అనుభవించువారు వ్యక్తులేగాని సమిష్టిసంస్థలు కావనియు ఆధారముచేసికొన్న మన రాజ్యాంగప్రణాళిక ఈ మూడు పర్వములలో ఇకమీదట ఏర్పడబోవు పరిపాలకవర్గము ఎట్టి నియమములకు బద్ధమై తన కర్తవ్యమును నిర్వహించవలెనో చెప్పుచున్నది. వ్యక్తుల హక్కులకు విరుద్ధమైన చట్టములను ప్రభుత్వమువారు సాధారణముగ చేయరాదు. దేశమున కేదైన గొప్ప ప్రమాదము జరుగ నున్నప్పుడును, శాంతిభద్రతలను కాపాడవలసినప్పుడును తప్ప తక్కిన సమయములలో ఈ హక్కులను ప్రభుత్వము వారు భంగపరచరాదు. ఇతరు లెవరైన వాటికి భంగము కలిగించిన యెడల అది నేరముగ పరిగణింపబడును. అట్టివారు శిక్షాపాత్రు లగుదురు. ఈవిధముగ నిర్ణయింపబడిన ప్రాథమికహక్కులలో (౧) సర్వజనసమత, (౨) వాక్స్వాతంత్ర్యము, సంఘముల నేర్పరచుకొను స్వాతంత్ర్యము, సమావేశముల స్వాతంత్ర్యము, మతస్వాతంత్ర్యము, వైజ్ఞానికస్వాతంత్ర్యము ప్రధానములైనవి. అంటరానితనము ఉండరాదు. దుకాణములు, రోడ్లు, పాఠశాలలు, బావులు, మొదలైన బహిరంగప్రదేశములలోనికి అందరు రావచ్చును. ఈలాటి హక్కులకు విరుద్ధముగ శాసనసభవారు చట్టములు చేసినను, మంత్రివర్గమువారు వాటిని అమలులో ఉంచినను వాటిని రద్దుచేయుటకు న్యాయస్థానములకు సర్వాధికార ముండును. ప్రాథమికహక్కులకు సంబంధించిన భాగము ఇంతకుపూర్వపు రాజ్యాంగ ప్రణాళికలలో ఉండలేదు. అట్టి భాగమును చేర్చుట అనవసర మనియు, నష్టకర మనియు కూడ బ్రిటిషువారు వాదించుచుండిరి.

ఆదర్శములు

ప్రభుత్వమువారు వ్యక్తుల హక్కులకు విరుద్ధముగ ఎట్టి చట్టములను చేయరాదని చెప్పుటయేగాక, వ్యక్తుల శ్రేయోభివృద్ధికై వా రెట్టి పనులను చేయవలసి ఉన్నదో, దానినికూడ మన ప్రణాళిక స్పష్టపరచుచున్నది. ఇదికూడ ఇందులో కనిపించు విశేషములలో ఒకటి. దేశములోని ప్రజలు ప్రస్తుతము అనేకవిధములైన కష్టము లనుభవించుచున్నారు. దారిద్ర్యము, అజ్ఞానము, అనారోగ్యము ఈలాటి కష్టములలో కొన్ని. వీటి నన్నిటిని తొలగించుటకే మన రాజ్యాంగ మేర్పడిన దనియు, వీటిని తొలగించుటకు పరిపాలకులు సమస్తప్రయత్నములను చేయవలసి ఉన్న దనియు నాలవ పర్వములో రాజ్యాంగ ప్రణాళిక ఉద్ఘాటించుచున్నది. జీవనోపాధి లేని వ్యక్తి ఒక్కడుకూడ ఉండరాదు. దేశములోని ధనమంతయు ఎవరో కొందరి అనుభవములోమాత్ర ముండక, అందరి అనుభవమునకు యోగ్య మగునట్లు ఏర్పాట్లు జరుగవలెను. అవినీతికరములును, అనారోగ్యమును వృద్ధిచేయునట్టివియు అగు వృత్తులు దేశమం దుండరాదు. నిరుద్యోగులకును, రోగపీడితులకును, ఆశ్రయములేని వృద్ధులకును, వికలాంగులకును ప్రభుత్వము సహాయము చేయవలెను. అందరికి ప్రాథమికవిద్య లభ్యము కావలెను. ప్రపంచశాంతికై ప్రభుత్వము పాటుపడవలెను.

వెనుకబడినవారిని ముందుకు తేవలెను. ఈలాటి గొప్ప ఆదర్శములను సాధించుటయే ఈ క్రొత్త ప్రణాళికమూలమున ఏర్పడబోవు రాజ్యాంగముయొక్క కర్తవ్యము. ఇది వెంటనే జరుగుటకు సాధ్యము కాక పోవచ్చును. కాని వీటిని సాధించుటయే దాని ధర్మము.

ఈ ప్రాథమిక హక్కులు సంపూర్ణములా, లేక వాటియందేమైన లోపములున్నవా అను విషయమై ఒక మాట చెప్పవలసియున్నది. ఇది చాలవరకు సంపూర్ణమైనదేగాని, రెండు మూడు విషయములలో మాత్రము కొంత సవరణ అవసర మని తోచుచున్నది. ఇవి (అ)మత ప్రచారము, (ఆ) అల్పసంఖ్యాకుల భాషకు, విజ్ఞానమునకు సంబంధించిన హక్కులు, (ఇ)కొందరు అల్పసంఖ్యాకులు, వెనుకబడిన వర్గములవారికై కేటాయింపుచేయబడిన ప్రత్యేకసభ్యత్వములు, ఉద్యోగములు.

మతప్రచారము

ఎవరి మతమును వారు అనుసరించుటకు ప్రతివ్యక్తికి హక్కు ఉండవలె నని అందరు అంగీకరించుచున్నారు. కాని పరమతముల ననుసరించువారిని తమ మతములో చేర్చుకొనుటకై స్వమతప్రచారము చేయుటకూడ ప్రాథమికహక్కులలో నొకటిగ పరిగణింపబడవలె నని రాజ్యాంగప్రణాళికలో ఉన్నది. కాని స్వీయమతప్రచారముద్వారా ఇతరమతములవారిని తమ మతములో చేర్చుకొనుటకూడ ఒక హక్కేనా, ఇట్లు చేయకూడదని ప్రభుత్వమువారు చట్టము గావింప రాదా అన్నది కొంత విమర్శించదగిన విషయమే. మన దేశములోని ప్రస్తుతకల్లోలమున కంతకు మతద్వేషమును, ఒక మతమువారిని మరొక మతములో చేర్చుట కవకాశ ముండుటయు ప్రధానకారణములు. మతగ్రంథములను సమగ్రముగ పరిశీలించి, ఒక మతము మరియొక మతముకంటె ఉత్కృష్టమైన దను విశ్వాసము కలిగినప్పుడు మతమును మార్చుకొనుటలో లోపము లేకపోవచ్చును. కాని గత వేయిసంవత్సరములమధ్య—అనగా మహమ్మదీయులు మన దేశమును ప్రవేశించినతర్వాత—హిందువులు లక్షలాదిగ మహమ్మదీయు లగుటకును, కొందరు ఇటీవల క్రైస్తవు లగుటకును ఇట్టి పరిశీలన కారణము కాదు. హిందూమతవిషయమై వారు గావించిన దుష్ప్రచారము, బలాత్కారము, ధనమును ఇచ్చుట—ఈలాటి సాధనములద్వారా హిందువు లనేకులను వారు మహమ్మదీయులుగను, క్రైస్తవులుగను చేసిరి. ఈ కారణముచేత మతసమస్య దేశములో తీవ్రరూపమును ధరించి ప్రస్తుతదేశవిభజనకును, అశాంతికిని కారణ మయ్యెను. ఈ సందర్భములలో మతప్రచారమును ఒక ప్రాథమికహక్కుగా మనము అంగీకరించుట ఉచితము కాదు. ఏ మతస్థులు ఆ మతస్థులకు వారి వారి మతధర్మములను బోధించుకొనవచ్చునేగాని, ఇతరులకు కూడ వాటిని బోధించి మతములను మార్చరాదు. ఇంతకును అన్ని మతములలో ఉండు ప్రధానసత్యము లొక్కటే. వాటిలో ఏలాటి భేదములు లేవు. కావున, దుర్వినియోగము చేయుట కవకాశ ముండుటచేతను, అట్టి దుర్వినియోగము ఇదివరకు జరిగియున్నందునను, దానిమూలమున రాజకీయపరిస్థితులు క్లిష్టము లగుట తప్పని కారణముచేతను మతప్రచారస్వాతంత్ర్యమును ప్రాథమికహక్కులనుండి రద్దుచేయుట అవసరము. ఒక మతమును వదలి మరియొక మతములో చేరినవారిని తిరిగి వారి మొదటి మతములోనికి వచ్చుటకు కావలసిన ప్రచారము మాత్రమే అవసరము.

అల్పసంఖ్యాకుల భాషావిజ్ఞాన హక్కులు

ఎవరి భాషను, విజ్ఞానమును వారు రక్షించుకొనుటకు హక్కు ఉండవలె నని ప్రణాళిక స్పష్టపరచుచున్నది. ఇది చాల ప్రధానమైన విషయము. దేశమంతయు భాషాప్రయుక్తరాష్ట్రములుగా విభాగము కానున్నది. అట్టి సందర్భములో మన మెంత జాగ్రత్తగను, నిష్పక్షపాతముగను ప్రవర్తించినప్పటికి ప్రతిరాష్ట్రమందును రాష్ట్రభాషను మాట్లాడని అల్పసంఖ్యాకులు కొందరు ఉండుట తప్పదు. ఉత్కళములో ఆంధ్రులు; ఆంధ్రరాష్ట్రములో ఉత్కళులు, కర్ణాటకులు, అరవలు; అరవరాష్ట్రములో కొందరు ఆంధ్రులు ఉండుట తప్పదు. అల్పసంఖ్యాకులగు వీరు వీరి మాతృభాషను తమ పిల్లలకు నేర్పుటను కోరుట సహజమే. అట్టి కోరిక రెండు విధములుగా సఫలము కావచ్చును. వీరు స్వంతద్రవ్యము ఖర్చుపెట్టుకొని, ప్రత్యేకపాఠశాలలను స్థాపించుకొని, తమ పిల్లలకందులో చదువు చెప్పించుకొనుట ఒక మార్గము. ఇట్లుగాక రాష్ట్రప్రభుత్వమువారే ఇట్టి పాఠశాలలను స్థాపించి, ఇతరపాఠశాలలకు ద్రవ్యము ఖర్చుపెట్టినట్లు వీటికికూడ ద్రవ్యము ఖర్చుపెట్టి అల్పసంఖ్యాకుల మాతృభాషను పోషించుట మరియొక మార్గము. మొదటి మార్గమును గురించియే మన రాజ్యాంగప్రణాళికలో ప్రశంస ఉన్నది. అదిమాత్రము చాలదు. ప్రత్యేకపాఠశాలలను స్థాపించి నడుపుకొనుటకు కావలసిన ద్రవ్యవసతులు, అవకాశములు అల్పసంఖ్యాకులకు లేకపోవచ్చును. అట్టి సందర్భములో రెండవ మార్గమే అనుసరణయోగ్య మగును. కనుక వారివారి సంఖ్యను బట్టి ప్రతిరాష్ట్రములోని ప్రభుత్వము విద్యకై చేయు ఖర్చులో ఒక భాగమును అల్పసంఖ్యాకుల విద్యాభివృద్ధికై కేటాయించవలెను. అందుకై ప్రభుత్వసహాయ ముండుట వారి ప్రాథమికహక్కులలో ఒకటిగా పరిగణింపబడవలెను.

శాసనసభలలో ప్రాతినిధ్యము

వ్యక్తితత్త్వము ననుసరించి తయారుగావింపబడిన ప్రణాళికలో కులమునుబట్టియు, మతమునుబట్టియు శాసనసభలందును, ఉద్యోగములందును ప్రాతినిధ్య ముండవలె నని చెప్పుట అసంగతము. వారివారి సంఖ్యను బట్టి మహమ్మదీయులకును, హరిజనులకును, ఇండియన్ క్రిస్టియనులకును శాసనసభలలో కొన్ని ప్రత్యేకస్థానములు ఏర్పాటు గావింపబడి ఉన్నవి. ఇట్టి ఏర్పాటు అనుచితము. ఇది కులతత్త్వమును, మతతత్త్వమును బలపరచు విధానము. అయితే, శాసనసభల విషయములో మాత్రము ఈ ఏర్పాటు పది సంవత్సరములు మాత్రమే ఉండును. అటుపిమ్మట శాసనసభవారు ఆమోదించినగాని ఇది ఆచరణలో ఉండజాలదు. పది సంవత్సరములు మాత్రమే అమలులో నుండగల ఏర్పాటు ఎంత అసంగతమైనదైనను, దానిని రద్దుచేయవలసిన దని ఆందోళన చేయుట అవసరము లేదని కొందరు అభిప్రాయపడవచ్చును. కాని విషబీజమువలన కలుగు ఫలితము పది సంవత్సరముల కాల ముండుటకూడ అనర్థమే. కనుక దానిని రద్దుచేయుట మంచిది.

ఉద్యోగములలో ప్రాతినిధ్యము

సర్కారు ఉద్యోగములలో వారి సంఖ్యనుబట్టి హరిజనులకు, వెనుకబడిన వర్గములవారికిని ప్రాతినిధ్య ముండవలె నని రాజ్యాంగ ప్రణాళిక చెప్పుచున్నది. ఇదికూడ ప్రమాదకరమైనట్టియు, ప్రజాస్వామ్యసిద్ధాంతమునకును, వ్యక్తితత్త్వమునకును విరుద్ధమైనట్టియు

మాత్రము. వెనుకబడిన కులము అన్నమాటకు నిర్ణీతమైన అర్థము లేదు. సర్కారు ఉద్యోగములలో కులసంఖ్యకు తగినంత ప్రాతినిధ్యము లేని కులము వెనుకబడిన కుల మని భావించరాదు. అట్టి కులములోని వారు వర్తక వ్యాపారములు చేసియు, భూస్వాములయ్యు ఎంతో ధనము గడించుచుండవచ్చును. దానితోపాటు వారికి ఉద్యోగాలలో కూడ ప్రాతినిధ్య ముండుట అనుచితము. అన్ని వృత్తులలోను, సమస్త ఆర్థిక వసతుల ననుభవించుటలోను కులవారీగా పంపకము జరిగినప్పుడు ఉద్యోగాలుకూడ కులవారీగా పంపకము కావలెనని వాదించుట సందర్భముకాని, ఉద్యోగాల విషయమందుమాత్రమే ఈ పంపక ముండవలె నని వాదించుట సబబు కాదు. హరిజనుల విషయములో కూడ ఇదే గమనించవలెను. ఏ ఉద్యోగమునకు ఎవడు అర్హుడో వాడు ఆ ఉద్యోగమును చేయవలసినదే గాని కులము ననుసరించి ఉద్యోగముల పంపకము జరిగినయెడల ప్రభుత్వసౌష్ఠవము, బెట్టు తగ్గి పోవును. కనుక ఉద్యోగములలో ప్రాతినిధ్యముండుట ప్రాథమిక హక్కులలో నొక్కటిగా పరిగణింప రాదు.

మనది ఎంతవరకు స్వదేశీ రాజ్యాంగము?

వ్యక్తితత్వము నాధారముచేసికొని, వ్యక్తుల ప్రాథమికహక్కులను గమనించి ప్రజలందరి శ్రేయస్సును అభివృద్ధిచేయు ఉద్దేశముతో నిర్మాణము గావింపబడిన ఈ రాజ్యాంగప్రణాళిక స్వదేశీరాజ్యాంగ ప్రణాళిక యని చెప్పుటకు ఎంతవరకువీలున్నది? దీనిని నిర్మాణము చేసినవారు మనవారేగనుక అంతవరకు ఇది స్వదేశీప్రణాళిక అని చెప్పుటకు అర్హమగుచున్నది. కాని దీనిని నిర్మించుటయందు ఎక్కువగా పాల్గొనిన ప్రజాపరిషత్తుసభ్యులు, కాంగ్రెసునాయకులు, ప్రణాళికరచనకై ప్రత్యేకముగ ఏర్పడిన డాక్టరు అంబేద్కరు కమిటీవారు ఈకాలపు పాశ్చాత్యరాజకీయచట్టములందును, సంప్రదాయము లందును మునిగి తేలినవారు; వాటియందు పరమవిశ్వాసము గలవారు; గ్రంథములద్వారా పాశ్చాత్యప్రజాస్వామ్యసిద్ధాంతములను అవగాహనము చేసికొని, అవియే మన దేశమునకుకూడ వర్తించు నను దృఢ నమ్మకముతో నుండువారు. కనుక శరీరతః వారు భారతీయులైనను వారి బుద్ధి, మనోభావము, రాజకీయతత్వము పాశ్చాత్యవిజ్ఞానమును అనుసరించినవి. ఈ ప్రణాళికను తయారుచేయుటకు కావలసిన అంగములనన్నిటిని వారు పాశ్చాత్యప్రపంచమందుండి సంపాదించిరి. ఇంగ్లండు, అమెరికా, కనడా, ఆస్ట్రేలియా మొదలగు దేశములలో నొక్కొక్కదానినుండి వారికి రుచించిన అంగములను కొన్నిటిని మన దేశమునకు తెచ్చి, వాటి నన్నిటిని కూర్చి సమగ్రమైనట్టియు, సంపూర్ణమైనట్టియు స్వరూపము గల ప్రణాళికను నిర్మించుటయే వారు చేసిన పని. ఇదివరకు ఇట్టి అంగముల సమకూర్పు బ్రిటిషువారు బ్రిటనులో చేసి దాని మూలమున ఏర్పడిన రాజ్యాంగమును మన దేశమునకు తెచ్చి ఆచరణలో ఉంచు చుండిరి. ఇప్పుడవే అంగములను మనవారు ఢిల్లీకి తెచ్చి, ఇచ్చట వాటి నన్నిటిని సమకూర్చి ఈ ప్రణాళికను తయారుచేసిరి. ఇందులో భరతఖండపరిస్థితులను ప్రత్యేకముగ మనస్సునందుంచుకొని వాటికి తగినట్లు ప్రణాళికను సవరించిన భాగములు చాల స్వల్పములు. మహాత్మాగాంధీ గారి పంచాయతీరాజ్యలక్షణములు ఇందు ఏవియు లేవు. ఈ ప్రణాళికలో నూటికి డెబ్బది అయిదు వంతులు బ్రిటిషు వారు ౧౯౩౫ లో నిర్మించిన ఇండియాపరిపాలనచట్టముయొక్క నమూనా. ఆ చట్టములోని సెక్షనులు, క్లాసులు ఏలాటి మార్పులు లేక, తుక్కకు తుక్క అన్నట్లు ఇందులో చేర్చబడినవి. దానికి, దీనికి ఒక అంశమందుమాత్రమే భేదము. ౧౯౩౫ చట్టములో బ్రిటిష్ అధికారమును నిలుపుకొనుటకు అవసరములైన సెక్షన్లు, క్లాసులు అనేకము లున్నవి. అవన్నియు ఇప్పుడు రద్దు కావింపబడినవి. అవి మినహా తక్కిన భాగములన్నియు మనవారు ఇప్పుడు తయారు చేసిన రాజ్యాంగప్రణాళికయందు ప్రధానభాగము లైనవి.

మనది వికేంద్రీకృతమైన సంయుక్తరాజ్యాంగము

క్రొత్త ప్రణాళికమూలమున ఏర్పడబోవు రాజ్యమునకు సంయుక్తభారతఖండము (The Indian Union) అను పే రుండును. అనేకరాజ్యములుకలిసి ఏర్పడిన మహారాజ్య మను అర్థము "సంయుక్త" (Union) అన్న మాటవల్ల స్పష్ట మగుచున్నది. అనగా దేశములో ఏర్పడినట్టియు, ఇకమీదట ఏర్పడబోవునట్టియు రాజ్యములకు ఒక ప్రత్యేకతయు, స్వతంత్రాధికారమును ఉండును. అవి కేంద్రప్రభుత్వమునకు సంపూర్ణముగ అధీనమైన రాజ్యములు కాజాలవు. అనేక వ్యవహారములలో వాటి ఇష్టానుసారముగా ప్రవర్తించుటకు అధికారము గల రాజ్యములుగా నుండును. ఇవి రెండు తరగతులుగా విభజింపబడియున్నవి. మొదటి తరగతిలో గవర్నరుల అధీనమునకు లోబడిన మద్రాసు, బొంబాయి, మధ్యరాష్ట్రము, ఉత్కళము మొదలైన రాజ్యములును, రెండవతరగతిలో సంయుక్తఇండియాలో చేరిన సంస్థానములును ఉండును. ఇప్పుడు తయారైన ప్రణాళికలో గవర్నరురాజ్యములు తొమ్మిదియు, సంస్థానములు పందొమ్మిదియు ఉదాహరింపబడినవి. ఇందులో ఆంధ్రరాజ్యము పేర్కొనబడ లేదు. ఈ ప్రణాళికను రాజ్యాంగపరిషత్తువారు ఆమోదించులోపల కేంద్రప్రభుత్వమువారొక సరిహద్దుసంఘమును నిర్మించి, ఆంధ్ర రాజ్యపు హద్దులను దృఢపరచినయెడల ఆంధ్రరాజ్యముకూడ గవర్నరుల రాజ్యపట్టికలో చేర్చుట కవకాశ ముండును. మన మేర్పరచు కొనబోవు సంయుక్తరాజ్యము వికేంద్రీకృతమైన దని చెప్పుటకు గల కారణములు సులభగ్రాహ్యములు. పరిపాలనవ్యవహారము లన్నిటిపై ఒక కేంద్రప్రభుత్వమునకేగాక, కొన్ని వ్యవహారములపై కేంద్రప్రభుత్వమునకును, తక్కిన వ్యవహారములపై రాజ్యప్రభుత్వములకును అధికార ముండుటచేత మన రాజ్యాంగము వికేంద్రీకృతరాజ్యాంగ మని చెప్పదగియున్నది. ఏ వ్యవహారములలో కేంద్రప్రభుత్వమునకును, వేటిలో రాజ్యప్రభుత్వములకును, వేటిలో రెండింటికిని అధికార ముండవలెనో ప్రణాళికలో వివరింపబడియున్నది. ఈ మూడింటిలో చేరని వ్యవహార మేదైన ఉన్నయెడల దానిపై కేంద్రప్రభుత్వమునకు అధికార ముండును. ఆ అధికారమునకే శేషించిన అధికారము (Residuary Power) అని పేరు. ఈ అధికారము సంయుక్త ప్రభుత్వమున కుండవలెనా, రాజ్యప్రభుత్వముల కుండవలెనా అన్న విషయమై తెగనట్టి వాదప్రతివాదములు ఇదివరలో జరుగుచుండెను. మహమ్మదీయు లొకవాదపు పక్షమునను, తదితరులు ఇంకొకవాదపు పక్షమునను ఉండిరి. పాకిస్థాననిర్మాణముమూలమున ఈ వాదము ఉపసంహరింపబడెను. సంయుక్తకేంద్రప్రభుత్వమునకే ఈ శేషించిన అధికార ముండవలయు నను వాదము గెలిచెను.

బలిష్ఠమైన కేంద్రము

మొత్తముమీద ఈ ప్రణాళికవలన ఏర్పడబోవు సంయుక్త కేంద్రప్రభుత్వము మిక్కిలి బలిష్ఠమైనదిగా నుండును. రక్షణ, విదేశ రాజ్యాంగవ్యవహారములు, రాకపోకల సాధనములు అను వ్యవహారములపైననేగాక భరతఖండమున కంతకు సమిష్టిప్రయోజనము చేకూర్చగల బ్యాంకింగు, చెలామణి, ఆర్థికనిర్మాణము మొదలైన వ్యవహారములపైగూడ కేంద్రమునకు అధికార ముండును. అవసరమైనప్పుడు రాజ్యవ్యవహారములలో దేనినైనను తన అధికారములోనికి తెచ్చుకొనుటకుకూడ కేంద్రమునకు అవకాశము కల్పింపబడియున్నది. కేంద్రశాసనసభలో ఒక శాఖగా నుండు రాజ్యప్రతినిధుల సభయొక్క ఆమోదముతో ఇట్టి మార్పు జరుగవచ్చును. కనుక మొత్తము మీద బలిష్ఠమైన కేంద్రము ఏర్పడినదని చెప్పవచ్చును.

మనది ప్రజాస్వామ్య రాజ్యాంగము

కేంద్రమందుగాని, రాజ్యములందుగాని అధికారమందుండు వారిని ఎన్నుకొను హక్కు స్త్రీపురుషభేదముగాని, జాతిమతకులవర్గ వివక్షగాని లేక యువజనమునకంతకు ఉండును. ౨౧ సంవత్సరముల కంటె ఎక్కువ వయస్సు గలవారందరు ఎన్నికలలో పాల్గొనగలరు. ధనికులకంటె దరిద్రుల యొక్కయు, సాహుకార్లకంటె కార్మికుల యొక్కయు, ఉన్నవారికంటె లేనివారి యొక్కయు సంఖ్య అత్యధికముగ నుండుటచేత ఈ ఎన్నికలలో కార్మికులు, దరిద్రులు, లేనివారు—వీరి మాటయే సార్థకమగును. వీరు నిలబెట్టిన అభ్యర్థులే గెలువగలరు. వయోజనవోటు మూలమున కలుగబోవు లాభ మిదియే. స్త్రీల ఇష్టానిష్టములను గుర్తెరుగక, వారికి నష్టము కలిగించు చట్టములు చేయు పురుషు లొక్కరే ఈ సభలలో ఉండుట జరుగదు. స్త్రీలుకూడ ఎందరో సభ్యురాండ్రై వారి సౌఖ్యమునకు కావలసిన చట్టములను చేసికొనవచ్చును. ప్రత్యేక నియోజకవర్గము లికమీదట ఉండవుగనుక వారివారి జాతికిమాత్రమే లాభము నపేక్షించు శాసనసభ్యుల సంఖ్య తగ్గిపోవును. కనుక దేశమునకంతకు, రాజ్యమునకంతకు సమిష్టిమీద ఉపచరించు ప్రభుత్వమేర్పడుటకు మన ఈ క్రొత్తప్రణాళిక అవకాశము కల్పించినది. ఇదే నిజమైన ప్రజాస్వామ్యము.

రాజ్యాంగశాఖలు

ఇప్పుడు తయారైన ప్రణాళికప్రకారము రాజ్యాంగమంతయు సంయుక్తరాజ్యాంగము, రాజ్యరాజ్యాంగము అని రెండు భాగములలో పనిచేయును. ఇందులో ఒక్కొకదానియందు శాసనశాఖ, కార్యవర్గశాఖ, న్యాయశాఖ, ఉద్యోగశాఖ అని నాలుగు శాఖలుండును. ఈ ఒక్కొకభాగమునకును, శాఖకును సంబంధించిన వివరములన్నియు ప్రణాళిక పేర్కొనుచున్నది. ఇదిగాక ఆదాయ వ్యయములకు సంబంధించిన భాగమొకటియు, కొండజాతులకు సంబంధించిన భాగ మింకొకటియు కలదు.

కార్యవర్గశాఖ

సంయుక్తరాజ్యము (The Union)యొక్కయు, ఒక్కొక గవర్నరు రాజ్యము (The States) యొక్కయు పరిపాలనమును నడుపువారు కార్యవర్గశాఖకు చెందినవారు. ఈ పరిపాలనముల వైఖరిని నిర్ణయించుచు, విదేశసంబంధములను పరిష్కరించుచు, శాసనములను అమలులో నుంచుచు, దినచర్యలన్నియు సక్రమముగ జరుగుచున్నవా లేవా అని పైవిచారణ చేయుటయే సంయుక్తకేంద్ర కార్యవర్గమువారి పని. ఇందులో విదేశసంబంధములుతప్ప తక్కిన వ్యవహారము లన్నిటిని తమ తమ రాజ్యములకు సంబంధించినంత వరకు చక్కబెట్టుటయే గవర్నరురాజ్యకార్యవర్గమువారి పని.

సంయుక్త కార్యవర్గశాఖ (Union Executive)

సంయుక్తరాజ్యమున కంతకు ఒక అధ్యక్షు డుండును. ఇతనిని ౫ సంవత్సరముల కొక పర్యాయము కేంద్రశాసనసభల సభ్యులు, ప్రత్యేకరాజ్యములందలి శాసనసభలలో ప్రజలచే నెన్నుకొనబడిన సభ్యులు కలిసి ఎన్నుకొనెదరు. ఇతనికి ౩౫ సంవత్సరములకంటె తక్కువ వయస్సు ఉండరాదు. ఎవరుగాని రెండు పర్యాయములకంటె ఎక్కువ అధ్యక్షపదవికి ఎన్నుకొనబడరాదు. ౫ సంవత్సరములమధ్య అధ్యక్షపదవినుండి ఇతనిని కేంద్రశాసన సభవారు తొలగించవచ్చును. కాని అతడు రాజ్యాంగచట్టమును ఉల్లంఘించెనని రుజువైనప్పుడే అట్లు తొలగించుట కవకాశము కలదు. ఇతనికి నెలకు రు ౫,౫౦౦ లు జీతము. (ఇప్పటి గవర్నరు జనరలుకు నెలజీతము రు ౨౦,౦౦౦.)

ఇదిగాక సంయుక్తరాజ్యమున కొక ఉపాధ్యక్షుడుకూడ నుండును. ఇతనిని కేంద్రశాసనసభ్యులు మాత్రమే ౫ సంవత్సరముల కొకపర్యాయము ఎన్నుకొనెదరు. అవసరమువచ్చినప్పుడు అధ్యక్షస్థానమునకు వచ్చుటయేగాక ఇతడు కేంద్రశాసనసభ కొక శాఖయైన రాజ్యప్రతినిధుల శాఖకు అధ్యక్షుడు.

సంయుక్తరాజ్యమునకు సంబంధించిన కార్యకలాపముపై అధికార మంతయు (పేరునకు) అధ్యక్షునిదే. కాని ఈ అధికారమునంతను అతడు మంత్రుల సభయొక్క సలహాను అనుసరించి నడుపవలసినవాడేకాని వారిని కాదని స్వతంత్రించి నడుపుటకు వీలులేదు. అధికారమంతయు మంత్రుల సభదే. ఈ మంత్రులు శాసనసభలోని ప్రజాశాఖయొక్క విశ్వాసమునకు పాత్రులుగ నున్నవారే. అందుచేత ఈ విధానమునకు బాధ్యతాయుతప్రభుత్వవిధాన (Responsible Government) మని పేరు. అనగా, శాసనసభకు బాధ్యులైన మంత్రుల ప్రభుత్వ మని దీని అర్థము. బ్రిటిషుసంప్రదాయ మిదియే. వారివద్దనుండి మన మీ విధానమును స్వీకరించితిమి.

మంత్రుల సభలో ఒక ప్రధానమంత్రియు, తక్కిన సామాన్యమంత్రులును ఉందురు. ప్రధానమంత్రిని అధ్యక్షుడు నియమించును. తక్కిన మంత్రులనుగూడ అతడే నియమించును గాని ప్రధానమంత్రిసలహామీదటనే వారిని అతడు నియమించవలెను. ఈ మంత్రులు ప్రధానియొక్క నాయకత్వమున సమిష్టిబాధ్యతతో వ్యవహారములను జరుపవలెను. సాధారణముగ కేంద్రశాసనసభలో సభ్యులు కానివారు మంత్రు లగుటకు వీలులేదు. ఒక్కొక్కసమయమున అట్టివారు మంత్రులైనను ౬ నెలలలోపల వారు శాసనసభలో సభ్యులు కావలెను. అట్లు కానప్పుడు వారు మంత్రిపదవులను వదులుకొనవలెను. వారి జీతములను నిర్ణయించుటకు కేంద్రశాసనసభకే అధికారము.

(గవర్నరు) రాజ్యకార్యవర్గశాఖ

సంస్థానముల వర్గమునకు చెందని ప్రతిరాజ్యమునకు ఒక గవర్నరుండును. ఇతని నియామకమునుగురించి ప్రణాళిక ఇదమిత్థమని నిర్ణయించలేదు. రాజ్యములోని ప్రజలందరు కలిసి ఎన్నుకొనుట ఒక మార్గ మనియు, రాజ్యములోని శాసనసభవారు నలుగురిని ఎన్నుకొనుట, ఆ నలుగురినుండి ఒకనిని సంయుక్తాధ్యక్షుడు గవర్నరుగ నియమించుట మరియొక మార్గ మనియు ప్రణాళిక సూచించుచున్నది. ఇందులో రెండవమార్గమే అనుసరణీయము. బాధ్యతాయుతులగు మంత్రుల ద్వారా రాజ్యపరిపాలనము జరుగ వలసియున్నప్పుడు ప్రజల మూలమున అధికారములోనికి వచ్చినవారిద్దరు కార్యనిర్వాహమునకు బాధ్యులై ఉండుట ప్రమాదకరము. వారిమధ్య సంఘర్షణ తప్పదు. కనుక ఒకరు ప్రజామోదమును పొందినవారు, రెండవవారు మరొక మార్గమున అధికారములోనికి వచ్చువారుగను ఉండుట మంచిది. బ్రిటిషుసంప్రదాయము ననుసరించిన కనడా, ఆస్ట్రేలియా మొదలగు దేశములందు ఇదియే ఆచారము. మంత్రులు ఎలాగైనను ప్రజామోదమును పొందినవారుగ నుండుట తప్పదుగనుక గవర్నరును ప్రజ లెన్నుకొనుటకు బదులు సంయుక్తాధ్యక్షుడు నియమించుట ఉత్తమము. అట్టి సందర్భములో రాజ్యశాసనసభ నలుగురిని ఎన్నుకొనవలె ననుసూచనకూడ అనవసరము. గవర్నరు ఉద్యోగపరిమితికూడ ౫ సంవత్సరములే. ఎవరుగాని రెండుపర్యాయములకంటె ఎక్కువ గవర్నరుగా నుండరాదు. వయస్సు ౩౫ సంవత్సరములకు తగ్గరాదు. ౫ సంవత్సరములమధ్య గవర్నరును ఉద్యోగమునుండి తొలగించుటకు అవకాశ మున్నది.

కేంద్రమున మంత్రుల సభ ఉన్నట్లే ప్రతిరాజ్యమందును ఒక మంత్రులసభ ఉండును. ప్రధానమంత్రిని, తక్కిన మంత్రులను నియమించుటలో అధ్యక్షునికంటె గవర్నరుకు ఎక్కువ స్వాతంత్ర్య మున్నట్లు ప్రణాళిక సూచించుచున్నదిగాని స్పష్టముగ చెప్పుట లేదు. కాని మొత్తముమీద రాజ్యప్రభుత్వముకూడ బాధ్యతాయుత ప్రభుత్వమే. శాసనసభయొక్క విశ్వాసము లేనివారు మంత్రు లగుటకు వీలుండదు. సామాన్యముగ వారి సలహాను అనుసరించియే గవర్నరు రాజ్యమును పాలించవలెను.

సంయుక్తాధ్యక్షునికిని, గవర్నరుకును ఒక విషయములో కొంత భేద మున్నది. మంత్రుల సలహాలను అనుసరించక అధ్యక్షుడు ఎట్టి పరిస్థితులలోకూడ వ్యవహరించుటకు వీలులేదు. గవర్నరు అట్లుగాక కొన్ని పరిస్థితులలో మంత్రుల సలహాను అతిక్రమించి నడుచుకొనవచ్చును. రాజ్యముయొక్క శాంతికి భంగకరమైనట్టి ప్రమాదస్థితి వచ్చినదనిగాని, రాబోవుచున్నదనిగాని తోచినప్పుడు మంత్రుల సలహానుగాని, రాజ్యాంగప్రణాళికలో రాజ్యమునకు వర్తించు తక్కిన చట్టములనుగాని గమనించకయే గవర్నరు సర్వాధికారమును తానే చలాయించవచ్చును. యుద్ధకాలమందు రాష్ట్రములనుండి కాంగ్రెసు మంత్రివర్గమువారు ౧౯౩౯ లో రాజీనామా ఇచ్చిన తర్వాత గవర్నరులు సర్వస్వతంత్రులైనట్లే స్వతంత్రభరతఖండమందుకూడ గవర్నరునిరంకుశత్వమున కవకాశ మున్నది. కాని ఇట్టి ప్రమాదస్థితి సంభవించినట్లు అతడు సంయుక్తాధ్యక్షునికి వెంటనే తెలియజేసి అతని ఆజ్ఞానుసారము ప్రవర్తించవలెను.

శాసనశాఖ

ఈ కాలపు పరిపాలనవిధానమునకంతకు క్రొత్త క్రొత్త శాసనములను, చట్టములను చేయుచుండుట ఒక లక్షణము. మన పూర్వులు ఇట్లు చేయువారు కారు. సనాతనముగ వచ్చుచున్న సంప్రదాయములను, ఆచారములను మార్చకూడదనియే వారు భావించుచుండువారు. శాసనములను చేయదగినవారు ప్రజాప్రతినిధులే అని అనుకొనుటకూడ ఈ కాలపు రాజ్యాంగమున కొక లక్షణము. దీని ననుసరించి సంయుక్తకేంద్రమం దొక శాసనసభయు, ప్రతి గవర్నరు రాజ్యమం దొక శాసనసభయు ఉండును. కేంద్రశాసనసభలో ప్రజాశాఖ అని, రాజ్యముల శాఖ అని రెండు శాఖలు తప్పక ఉండవలెను. రాజ్యశాసనసభలో రెండు శాఖలు ఉండవలసిన జరూరు లేదు; ఆయా రాజ్యములవారి ఇష్టానుసారము వారు చేయవచ్చును. అందుచేత కొన్ని రాజ్యములలో రెండు శాఖలతో కూడిన శాసనసభలు, కొన్నిటిలో ఒకే శాఖగల సభలు ఉండును. కేంద్రమందును, రెండు శాఖలు గల రాజ్యములందును ఒక శాఖలో వయోజనులందరు సమిష్టినియోజకవర్గములద్వారా ఎన్నుకొనిన ప్రతినిధు లుందురు. అట్టి శాఖకు ప్రజాశాఖ యను పే రుండును. కేంద్రమందలి రెండవది యగు రాజ్యప్రతినిధిశాఖలోని సభ్యులలో ౧౫ మందిని మాత్రము సంయుక్తాధ్యక్షుడు పేర్కొనును. తక్కిన ౨౩౫ సభ్యులను వారి నిర్ణీతదామాషాప్రకారము ఒక్కొక్క రాజ్యములో ప్రజలచే ఎన్నుకొనబడిన శాసనసభాసభ్యులు ఎన్నుకొనెదరు. ఇదే విధముగ రెండు శాఖలతో కూడిన శాసనసభలు గల రాజ్యములందు ప్రజాశాఖలోని ప్రతినిధులను రాజ్యములోని వయోజనులందరు ఎన్నుకొనెదరు. రెండవ శాఖలోని సభ్యులలో మూడవవంతును ప్రజాసభవారు ఎన్నుకొనెదరు. తక్కినవారిని గవర్నరు పేర్కొనును.

కేంద్రమందును, రాజ్యములందును ఉండు రెండు శాసనసభాశాఖలయొక్క నిర్మాణమందును, అధికారములందును కొంత భేద మున్నది. ప్రజాశాఖకు ౫ సంవత్సరముల కాలపరిమితి కలదు. అటు తర్వాత ఆ శాఖ రద్దగుటయు, అందులో సభ్యుల నందరిని ప్రజలు తిరిగి ఎన్నుకొనుటయు జరుగును. రెండవ శాఖకు కాలపరిమితి లేదు. అది శాశ్వతముగ నుండునది. ఎప్పుడుగూడ అందులోని సభ్యులందరు ఏకకాలమున సభ్యత్వమును వదలుకొనరు. మూడవవంతు మాత్రము కేంద్రమున ౬ సంవత్సరముల కొక పర్యాయమును, రాజ్యములలో ౩ సంవత్సరముల కొక పర్యాయమును సభ్యత్వమును కోల్పోయెదరు. ఆ ఖాళీలు మాత్రమే భర్తీ అగుచుండును. అధికారములో కూడ ఈ రెండు శాఖలకు భేద మున్నది. ఆదాయ వ్యయములకు సంబంధించిన చట్టములన్నిటిలో ప్రజాశాఖకే సంపూర్ణాధికారము. రెండవ శాఖయొక్క ఆమోదము అంత అవసరము కాదు. తక్కిన చట్టముల విషయమున మాత్రము రెండు శాఖలకు సమానత్వ మున్నది.

శాసనశాఖనుగురించి పేర్కొనవలసిన విశేష మింకొకటి మాత్రమే కలదు. కేంద్రమందు శాసనసభవారు ఆమోదించిన చట్టములు అధ్యక్షుని ఆమోదము పొందిన తర్వాతగాని శాసనములు కాజాలవు. కాని సాధారణముగ అతడీ చట్టములకు సమ్మతి చూపుట అవసరమగును. లేని పక్షమున బాధ్యతాయుతప్రభుత్వవిధానము

జరుగజాలదు. ఇదేవిధముగ గవర్నరుఆమోదము లేక సాధారణముగ రాజ్యశాసనసభవారి బిల్లులు చట్టములు కాలేవు. కాని కొన్ని సందర్భములలో అతని ఆమోదము లేకున్నను, అతని ఆక్షేపణలను విమర్శించి శాసనసభవారు బిల్లులను చట్టముల జేయవచ్చును. కొన్ని వ్యవహారములకు సంబంధించిన బిల్లులను గవర్నరు సంయుక్తాధ్యక్షుని ఆమోదమునకుకూడ పంపవచ్చును.

ఈ వివరము లన్నియు శాసననిర్మాణసందర్భములో కొన్ని చిక్కులను కలిగించునవిగా నున్నవి. శాసనసభవారు ఆమోదించిన బిల్లులను ఆక్షేపించుటకుగాని, పునర్విమర్శచేయమని అడుగుటకుగాని అధ్యక్షునికి, గవర్నరుకు అధికారము లేకుండుటయే ఉత్తమ మార్గము. ప్రజలు ఎన్నుకొన్న ప్రతినిధులతో కూడుకొన్న శాసనసభలును, వాటికి బాధ్యులుగ నుండు మంత్రులును కలిసి ఆలోచించి ఆమోదించిన చట్టములను మరెవ్వరు ఆమోదించవలసిన జరూరు ఉండరాదు.

న్యాయశాఖ

ప్రతిరాజ్యాంగమందును న్యాయశాఖ ఒకటి ఉండవలెను. శాసనసభవారు గావించిన చట్టములు ఎవరెవ్వరి విషయములో, ఎట్టి సందర్భములలో, ఏ విధముగా వర్తించునో నిర్వచించుటయే ఇది చేయవలసిన పని. వికేంద్రీకృతసంయుక్తరాజ్యములో న్యాయశాఖ చేయవలసిన పని ఇంకొకటి ఉన్నది. కేంద్రప్రభుత్వమువారు చేయు చట్టములు రాజ్యముల అధికారమునకు విరోధము కాకుండునట్లును, రాజ్యములలోని శాసనసభలు చేయు చట్టములు కేంద్రపు అధికారమునకు విరోధము కాకుండునట్లును వాటివాటి హద్దులలో వాటిని ఉంచుటయే ఈ పని. ఇదిగాక రాజ్యమునకు రాజ్యమునకును, కేంద్రమునకు రాజ్యమునకును వివాదములు సంభవించి, ఆ వివాదములను చట్టానుసారముగ పరిష్కరించవలసిఉన్నప్పుడు ఆ పని చేయగలది ఒక న్యాయశాఖయే. ప్రజల ప్రాథమికహక్కులకు విరుద్ధముగ శాసనసభలుగాని, కార్యనిర్వాహకశాఖవారుగాని ప్రవర్తింపకుండ, ఆ హక్కులను కాపాడుటకుకూడ న్యాయశాఖ అవసరము. ఈ అవసరముల నన్నిటిని గుర్తించి రాజ్యాంగప్రణాళికలో న్యాయశాఖకు సంబంధించిన ఏర్పాటు లనేకములు చేయబడినవి. వీటిలో కేంద్రమందు స్థాపింపబడిన సుప్రీంకోర్టు, ప్రతిగవర్నరు రాజ్యమందు స్థాపింపబడిన హైకోర్టులు ముఖ్యముగ గమనింపదగియున్నవి.

సుప్రీంకోర్టు కోర్టులన్నిటిలో అగ్రస్థానము వహించినది. ఇందు ఒక ప్రధానన్యాయమూర్తియు, ఏడుగురికి తక్కువగాక తక్కిన న్యాయమూర్తులు ఉండెదరు. ఇంతకంటె సంఖ్య హెచ్చు కావలసినపుడు కేంద్రశాసనసభ దానిని హెచ్చుచేయవచ్చును. న్యాయమూర్తులను నియమించు అధికారము అధ్యక్షునికి ఇయ్యబడినది. ఈ నియామకము చేయుటలో అతడు తక్కిన న్యాయమూర్తులతోను, రాజ్యములలోని హైకోర్టులందలి న్యాయమూర్తులతోను సంప్రతించవలెను. ఒక పర్యాయము నియమింపబడిన న్యాయమూర్తి ౬౫ సంవత్సరముల వయస్సు వచ్చువరకు ఉద్యోగములో ఉండవచ్చును. ఉద్యోగమునుండి ఏ న్యాయమూర్తినిగాని తొలగించుటకు అధ్యక్షునికి అధికార మున్నను ఆ అధికారమును అతడు కేంద్రశాసనసభవారు కోరినప్పుడే చెలాయించుటకు వీలున్నది. కనుక న్యాయమూర్తులకు తమ ఉద్యోగము పోవు నను భయము ఉండవలసిన జరూరు లేదు. వారి జీతములను ఈ రాజ్యాంగప్రణాళికయే నిర్ణయించుచున్నది. అందులో శాసనసభ మార్పులు గావించవచ్చును గాని, ఆ మార్పులు అప్పట్లో అధికారమందుండు న్యాయమూర్తులకు నష్టకరముగ వర్తించరాదు. కనుక తమ జీతములు తగ్గిపోవు నన్న భయముకూడ న్యాయమూర్తులకు ఉండవలసినది లేదు. ఇట్టి సదుపాయము లుండుటచేత న్యాయమూర్తులు వారి విధులను నిష్పక్షపాతముగను, నిర్భయముగను నిర్వర్తించువారగుచున్నారు. రాజ్యములలోని హైకోర్టులలోని న్యాయమూర్తుల విషయములో ఈలాటి ఏర్పాటులే చేయబడియున్నవి. ఈ హైకోర్టులనుండి అప్పీళ్లు సుప్రీం కోర్టుకు పోగలవు. ఇంగ్లండులోని ప్రీవీకౌన్సిలుతో మన కేలాటి సంబంధము ఉండదు.

కెనడా, ఆస్ట్రేలియా మొదలగు రాజ్యములలోని హైకోర్టులకు సంబంధించిన మంచి ఏర్పాటులను కొన్నిటినికూడ మన రాజ్యాంగప్రణాళికయందు చేర్చియున్నారు. మొత్తముమీద న్యాయపరిపాలన చక్కగ జరుగు నను నమ్మకము కుదురుచున్నది.

తక్కిన శాఖలు

ఉద్యోగశాఖనుగురించిగాని, ఆదాయవ్యయవ్యవహారములను గురించిగాని ప్రత్యేకముగ నిచ్చట పేర్కొనదగిన విశేషములేవియు లేవు. ౧౯౩౫ సం.పు చట్టము ననుసరించియే ఈ సందర్భమున మన రాజ్యాంగప్రణాళిక తయారుచేయబడినది. ఆదాయవ్యయములను గురించి ఏవైన మార్పులు అవసరమైనయెడల వాటి నన్నిటిని పరిశీలించుటకు ౫ సంవత్సరములైనతర్వాత ఒక సంఘమును సంయుక్తాధ్యక్షుడు నియమించవలసినదిగా ప్రణాళిక సూచించుచున్నది. ఆ సంఘముయొక్క సిఫార్సులనుబట్టి మన భావిఆర్థికపద్ధతి నిర్ణయమగును. ఇదేవిధముగ మద్రాసు, అసాం మొదలగు రాష్ట్రములలోని మన్యప్రాంతములలో నివసించు కొండజాతులవారి రక్షణకై అత్యావశ్యకములైన ప్రత్యేకఏర్పాటులు కొన్ని చేయబడినవి. ప్రజలందరి యోగక్షేమముల ననుసరించి ఈ ప్రణాళిక తయారుచేయబడిన దని అనుకొనుటకు ఇది యొక ఉదాహరణము.


ఉపసంహారము

మొత్తముమీద మన క్రొత్తరాజ్యాంగప్రణాళిక తృప్తికరముగ నున్నదని చెప్పవచ్చును. ఇందులో లోపములు లేకపోలేదు. ఇప్పుడు మనకు కనిపించని లోపము లనేకములు కాలక్రమమున కనిపించవచ్చును. అనుభవముమీదగాని ఏయేలోపము లున్నవో చెప్పలేము. లోపములు కనిపించినప్పుడు వాటిని సవరించుకొనుటకు ప్రణాళిక మార్గము నొకదానిని సూచించియున్నది. అది సులభమైన మార్గము. దాని ననుసరించినయెడల ప్రణాళిక కాలానుసారముగ మన అవసరములనుబట్టి మారగలదు. ఈ ప్రణాళికను ఆధారము చేసికొని దీని ఉద్దేశముల ప్రకారము అధికారమునకు వచ్చువారు వారివారి విధులను నిర్వర్తించినయెడల ప్రజలందరికి సుఖము కలిగి, వారి శ్రేయస్సు, భోగభాగ్యములు వృద్ధికాగలవు.

500 పౌనుల బహుమతి

24 గంటలలో యువకుడవు గమ్ము

పార్కర్ & డేవిస్ వారిచే తయారుకాబడిన "ఓటోజన్" (వనమూలికా బలవర్ధకౌషధము) మొదటి 24 గంటల లోనే అత్యాశ్చర్యకరముగ జీవశక్తి, బలమును పెంపొందించును. దీనిని సేవించిన పురుషులైనా స్త్రీలైనా వారి నిజమైన వయసు కన్న 15, 20 ఏండ్లు పడుచుగ కనిపింతురు. బలక్షీణత, జ్ఞాపకశక్తి లేకుండుట, శరీర బలహీనత, రక్తహీనత్వము, చర్మరోగము, విచారము, నిద్రపట్టకుండుట, తలతిరుగుట, శారీరక మానసిక బడలిక మొదలైనవాటికి ఉపయోగకారి. 2 మొదలు 4 అంగుళముల వరకు ఎత్తు పెంచును. తూకము 5 మొదలు 10 పౌనులవరకు పెంచును. చెక్కిళ్ళు కాంతిమంతమగును. మీ ఆకారము 100% బాగుపడును. చిన్ననాడు యౌవనంలోవలె మీ ముఖమండలము కాంతిమంతమై సంపూర్ణత జెందును. మీ కండ్లకు తేజస్సు నిచ్చి దృష్టి నభివృద్ధిచేయును. మీ చెక్కిళ్లకు, పెదవులకు గులాబివర్ణము నొసగును. జీవితములో శాశ్వతముగ తెల్లవెంట్రుకలు జుట్టును నల్లపుచేయును. వృద్ధుల స్వాభావికమైన క్రొత్తపళ్లు రావడము, జుట్టురాలుట, చుండ్రు, బట్టతల తీవ్రముగా సన్నపుచు "ఓటోజన్" (టానిక్) వాడుక ఎక్కువగా సిఫారసు చేయబడినది.



ఓటోజన్ ఇండియాలో వ్యాప్తి చెందించుటకు గాను కొద్దికాలమువరకు, డైరక్షనులతో పెట్టె 1-కి వెల 5/- మాత్రమే. ఆటుతర్వాత దాని అసలుధర రు. 30/- ఛార్జి చేయబడును. ఆలస్యమైతే చాలా ఆలస్యం కావచ్చును. గనుక నేడే ఆర్డరు చేయండి. ప్రస్తుత పరిస్థితుల మూలముగా స్టాకు పరిమితముగా వున్నది.

గ్యారంటీ: మా అత్యాశ్చర్యమైన నూతన ప్రక్రియ నిష్ఫలమైనదని ఋజువు చేయు ఏ శాస్త్రజ్ఞునికైనా, వైద్యునికైనా లేదా ఏ మనిషికైనా 500 పౌనుల రొక్కపూర్వకముగా బహుమతి ఈయగలము.

గమనింపు: ఇతర రెజువినేటర్లవలె గాక, "ఓటోజన్" దానికదే సాటి. శీతల, సమశీతల వాతావరణములలో వలె ఉష్ణదేశపు వేసవిగాడ్పులలో గూడ సమానముగ నుంచి ఫలితముల నొసగును.


ఉడుకులెత్తే వేసవి తీక్ష్ణపు ఎండలలో మీరు అతిగా నీరసపడినప్పుడు "ఓటోజన్" మంచి బలవర్ధినిగా పని చేయును.

లాహోరు నుంచి మా బ్రాంచిని ఎత్తివేసితిమి. మరియు మా ఆఫీసును ఇంగ్లండు నుండి 1948 ఆగస్టు 15 వ తేదీనుండి ఇండియాకు మార్చితిమి.

ప్రఖ్యాత కెమిస్టుల వద్ద దొరకును. లేదా సరాసరిగా దిగువ వారివద్ద లభించును.

"ఓటోజన్ లాబొరేటరీస్"

ఇండియా ఆఫీసు: పోస్టుబాక్సు నెం. 447, బొంబాయి.



స్వతంత్ర భారత

ప్రథమ ఉగాది శుభసమయమున

మా ఖాతాదార్లకు,

అభిమానులకూ,

మా అభినందనలు

వివాహ సంబంధములకు

For Matrimonial Offers Consult Reg. No. 171.
Prop: The Hindu Matrimonial Bureau, Pezwada

వివాహ నిమిత్తం **14** సం॥ నుండి **25** సం॥ వరకు ఆడవారను, **20** సం॥ నుండి **40** సం॥ వరకు మగవారను, వధూవరుల సంబంధములు కోరువారు మా హిందూ వివాహ బ్యూరో (రిజిష్టర్డు నెం. **171**) వారితో సంప్రదింపుడు.

ఈ సంగతి మీ బంధుమిత్రులకు తెలుపుడు

☞ కడు బీదకుటుంబీకుల ఆడపిల్లలకుమాత్రమే మా స్వంత ఖర్చులతో వివాహము చేయబడును. వివరములకూ, మీ అడ్రసుగల పోస్టుకవర్లు పంపుడు.

ఆఫీసు
రాజారాం ఫాక్టరీ మేడమీద
బెజవాడ


టి. జ్వాలా నరసింహం.
ప్రొప్రయిటరు.

Praiseworthy in more ways than one!



CAVALRY WATCHES

Sentinels of Time



BY APPOINTMENT

'కావల్రీ' గడియారములు ఉత్తమమైనవి మాత్రమే కాక, ధరించిన మణికట్టునకు శోభ చేకూర్చునవి. ధునిక పద్ధతులతో, డిజైన్లతో తయారుచేయబడిన శ్రేష్ఠమైన పనితనమును తెలిపే ఈ గడియారములు, చిరకాలము పని చేయును ఈ దేశముయొక్క అత్యధిక శీతోష్ణస్థితుల కనుగుణముగా తయారు చేయబడినవి. 'కావల్రీ' గడియారములు ఆధునాతనాలంకరణ విధానమున అగ్రశిఖర మంటినవి.

ANGLO-SWISS WATCH Co.

6-7, DALHOUSIE SQUARE, CALCUTTA

ఆంగ్లో - స్విస్ వాచ్ కంపెనీ,

6-7, డల్‌హౌసీ స్క్వేర్, కలకత్తా.

భూమిశిస్తు, భూమిసాగు సంస్కరణాలు

శ్రీ కళా వెంకటరావు

విధానములోని మార్పులును, నాగరికతా పరిణామమును రైలుపట్టాలవలె ఒకదానిని ఇంకొకటి అనుసరించి పోవుచుండుట ప్రపంచచరిత్ర నిరూపించుచున్నది. ప్రాచ్యదేశములలో అనుశ్రుతమైన పద్ధతి భూములను వంశపారంపర్యా ఎక్కువగా పంపకము చేయుటకు అనుకూలముగా ఉండుటయేగాక మేతబయళ్లు, చెరువులు, నీటిపారుదల సాముదాయికముగా ఉపయోగించుకొనుట సాంప్రదాయసిద్ధమైనది. భారతదేశములోని ప్రజాసామాన్యము భూమిపైననే ఆధారపడి, గ్రామపంచాయతీ మూలముగా కార్య నిర్వహణ సాగించుకొనుచుండును. పరిపాలనలోని మార్పులవలన ఈ స్థిరసంస్థలు కాలగర్భములో ఇమిడిపోయినవి. సాముదాయికస్వామ్యమను సమిష్టిపద్ధతిపైన నిర్వహించబడు సాముదాయికపు ఆస్తులన్నియు నశించుటతోడనే రైతు అనాథయై ఒకవైపు శిస్తుగ్రాహకుని యొక్కయు, రెండవవైపు అప్పుఇచ్చువానియొక్కయు మధ్య పడి నలిగిపోవుట తటస్థించినది. రైతునకు కావలసిన కార్యసాధనములు (నాగళ్లువగైరా), మంచివిత్తనములు, ఆదాయము నిచ్చు పంటలు దూరమైనవి. అతని ఆస్తి చిన్నదైయుండుటయు, అతని పరపతి స్వల్పమైయుండుటయు ఈ పరిస్థితికి కారణము.

కాలము, ఋతువులు, వర్షపాతము చేరి మనుష్యుని దైనికస్వభావనిర్ణయమునకు కారణభూతము లగును. జపానుదేశములో నాల్గింట మూడువంతులు పర్వతప్రదేశము. మిగిలిన కాలుభాగము పంట కొరకు. అత్యద్భుతమైన శ్రద్ధతోను, మంచి పట్టుదలతోను పండించుటకొరకు ఆ దేశస్థులు కృషిచేయుచున్నారు. ఈ కష్టపరిస్థితులవలన వారిలో మితవ్యయము, సహనశక్తి, స్వశక్తిపై ఆధారపడుట మొదలగు సుగుణములు పెంపొంది రైతుయొక్క గౌరవమును అభివృద్ధి చేసినవి. ఇండియా, ఇండోచీనా, కొరియా, జపాను, తూర్పు దక్షిణభూభాగములోని ద్వీపములు మొదలగు ప్రాచ్య రాజ్యములన్నింటిలో ప్రపంచములోని మొత్తము జనాభాలో సుమారు సగముమంది నివసించుచున్నారు. కాని ఈ భూభాగము ప్రపంచవైశాల్యములో పదింట ఒక భాగము అయియున్నది. అందువలన మనుజుని బుద్ధికుశలత చేకూర్చగలిగిన హస్తకళాకౌశల్యమంతయు ఈ ప్రాంతములో వ్యవసాయపురోభివృద్ధికి

వినియోగించబడుచున్నది. ఈ జాతులన్నియు సహజ స్వభావపరిస్థితులను, పంటలనన్నింటిని ప్రాంతీయ స్వభావ పరిస్థితులకు అనువర్తింపజేసినవి. హెచ్చు జనాభా గల ప్రదేశములకు ధాన్యపుపంటయే ఉత్తమమైన పంట యని చరిత్ర నిరూపించుచున్నది. తక్కువ జనాభా గల ప్రదేశములలో ధాన్యపు పంట అభివృద్ధి చెందనేరదు. ఎందువల్లననగా, పంట పండించుటకు అనువైన కాలము పరిమితము. పరిమితకాలములోనే హెచ్చుమంది ప్రజలు కాయకష్టపడి పంట పండించవలసియుండును. గ్రామపంచాయతీలు ఏర్పడి, సాముదాయిక ప్రయోజనముకొరకు ఇట్టి భూవిధానమును ఏర్పాటుచేయుటలో తోడ్పడినవి.

మన కర్తవ్యము

నేడు ఈ పరిస్థితులన్నియు మారినవి. నాగరికతాప్రవాహము మారినది. సంస్కృతియొక్క స్వభావము మారినది. పరిస్థితుల మార్పుల కనుగుణముగా కాలప్రవాహముతోబాటు మన భూములను, పంటలను, పరిపాలనావిధానమును, శిస్తువిధానమును మార్చుకొనుటయే లాభకరము. కావున ఈ మార్పుల స్వభావమును గుర్తించి మనము ఒక సమగ్రమైన భూమిశిస్తువిధానము సృష్టించుకొనుట చాల అవసరము. భూమిశిస్తును పండిన పంటలో రాజభాగము అని నిర్వచించవచ్చును. రాజభాగ మనగా పండిన పంటలో రాజువల్ల తీసుకొనబడు భాగము. మొగలాయి రాజ్యము వచ్చిన పిమ్మట ఈ వస్తురూపకమైన భూమిశిస్తును ధనరూపకముగా మార్చిరి.

భూమిశిస్తువిధానములను పలువిధములుగా విభజించవచ్చును.

I పన్ను ఎవరివద్దనుండి వసూలు చేయబడుచున్నదో వారియొక్క ప్రతిపత్తినిబట్టి విభజించవచ్చును:

(౧) రాజుతరఫున రైతునుండి పన్ను వసూలు చేయుటకొరకు మధ్యవర్తి ఉన్నచో దానిని జమీందారీపద్ధతి అనెదరు.

(౨) భూమిని పట్టాలక్రింద విభజించి అట్టి పట్టాదారువద్దనుండి పన్ను వసూలుచేయుచో రైతువారీ పద్ధతి అనెదరు.

II నిర్ణయింపబడిన శిస్తు స్థిరరూపకమైనదా, కొన్ని సంవత్సరములకు మాత్రమే నిర్ణయింపబడినదా అనే విషయముపైకూడ భూమిశిస్తు విధానము ఆధారపడియున్నది.

జమీందారీలు

జమీందారీలలో రెండురకములు గలవు—బంగాళము, బీహారు, మద్రాసు, సంయుక్త రాష్ట్రములలో కొన్ని భాగములలో స్థిరరూపకమైన శిస్తువిధానము గల జమీందారీలు ఉన్నవి. సంయుక్త రాష్ట్రములలో చాల భాగము ఆస్తులు జమీందార్లకు చెందినను సెటిల్మెంటులు మాత్రము ప్రతి ౨౦, ౩౦ సంవత్సరములకు చేయబడుచున్నవి గలవు. వీనిని తాలూకాదారీలు అనెదరు. మధ్య రాష్ట్రములలో 'మాల్‌గుజారి' అనే పద్ధతి ఉన్నది. ఇక్కడ సెటిల్‌మెంటు ఎస్టేటులపైగాక గ్రామములవారీ చేయబడియున్నది.

భూమిశిస్తువిధానమునకు సర్వే సెటిల్‌మెంటులు ముఖ్యమైన ఆధారములు. భూమి సర్వేని కెడస్ట్రల్ (Cadastral) సర్వే అనెదరు. ఈ సర్వేలో భూమియొక్క నిమ్నోన్నతములను, పర్వతములను, అడవులను, రాస్తాలను, కాలువలను, చెరువులను, తోటలను, గృహములను, పంటభూములను, పోరంబోకలను నిర్ణయించెదరు. ప్రతి పొలముయొక్క సరిహద్దును సుస్పష్టము చేసెదరు. పొలమనగా సాధారణముగా ఒక యకరము మాగాణిగాని, రెండుయకరముల మెట్టగాని అయియుండును. ఇంతకంటె తక్కువ విస్తీర్ణము గల భూములను సబ్ డివిజనులుగా గుర్తించెదరు. స్థిరమైన సర్వేరాళ్ళను వేసినపిమ్మట ప్రతి పొలమును సూచించు గ్రామముల ప్లానులను, తాలూకామ్యాపులను తయారు చేసెదరు.

సెటిల్మెంటు

పైన చెప్పబడినట్లు సర్వేచేయబడిన పొలములపై పన్ను విధించు విధానమునే సెటిల్‌మెంటు అనెదరు. మద్రాసు రాజధానిలో సెటిల్‌మెంటు పద్ధతిని చాల శాస్త్రీయముగా చేయవలసియున్నది. ఒక పొలముపై పన్ను విధించుటకు ముందు అనేక విషయములపై పరిశోధన చేయవలసి యుండును. భూములను వానియొక్క సారమునననుసరించి కొన్ని తరగతుల క్రింద

విభజింపవలెను. ఇట్టి భూములలో వేయు పంట, పంట పరిమాణమును నిర్ణయింపవలెను. పలురకములైన సారము ననుసరించి ఇందులో పండు పంటను కొన్ని ప్రదేశములలో కొలచికూడ చూడవలెను. పంటపండు భూములకుదగ్గరగా రోడ్లు వగైరా వసతులు, నీటిపారుదల వనరులు ఉన్నవో, లేవో చూడవలెను. కాలములోని మార్పులవలన, అతివృష్టి అనావృష్టి దోషములవలన కలుగబోవు నష్టములనుకూడ ఈ సందర్భములో గుర్తింపవలెను. ఇట్లు అంచనా వేయబడిన పంట మొత్తమునకు ధర నిర్ణయింపవలెను. అట్టి ధర సెటిల్ మెంటు జరుగు సంవత్సరమునకుముందు ౨౦ కరువు కాని సంవత్సరముల సగటుధరలపై ఆధారపడియుండును. ఇట్లు నిర్ణయింపబడు మొత్తములో వ్యవసాయపు ఖర్చులను తీసివేసి మిగిలిన మొత్తములో సగము భాగమును ప్రభుత్వము పన్నుక్రింద తీసుకొనవచ్చును. కాని రీసెటిల్ మెంటునకు, అనగా 30 సంవత్సరముల తరువాత తిరిగి సెటిల్ మెంటు జరుగునప్పుడు హెచ్చు చేయవలసిన మొత్తము మాత్రము నూటికి ౧౮-౧౨-౦ కి మించకూడదని నిర్ణయింపబడినది. ఇచట వివరించిన సంగతులు స్పష్టమైనవి. ఇట్లు ౧౮౬౦ సం. మొదలు ౧౯౩౭ వరకు శాస్త్రరీత్యా రైతువారీ సెటిల్ మెంటు జరిగినది. కాని ౧౯౩౭ సంవత్సరము తరువాత సర్వే సెటిల్ మెంటులు నిలిపివేయబడినవి. కొలది జమీందారీలలో మాత్రమే సర్వే సెటిల్మెంటులు గలవు. జమీందారీలలో చాలభూభాగములు సర్వేకూడ కాలేదు.

ఈ వ్యాసములో జమీందారీ విధానమును గురించి హెచ్చుగా వ్రాయదలచలేదు. దీనికి ముఖ్యమైన కారణము జమీందారీవిధానము త్వరలో రద్దు కానున్నది. కనుక మద్రాసు ప్రభుత్వము జమీందారీలలోని సాముదాయికభూములను, కమతంభూములను ఇతరులకు అన్యాక్రాంతము చేయకూడదని చట్టము చేసినారు. తరువాత జమీందారీగ్రామములలోని పన్నురేటును అతరాపు రైతువారీ భూముల పన్నురేటుకు తగ్గించు చట్టముకూడ చేయబడినది. అసలు జమీందారీ రద్దుబిల్లు శాసనసభయెదుట ఉన్నది. త్వరలో శాసనము కాగలదు. అందువలన వాటినిగురించి తిరిగి ఈ చిన్నవ్యాసములో పునర్విమర్శించు ఆవశ్యమును ఎంచలేదు.

[illegible]

ఈ రాజధానిలో రైతువారీ ప్రదేశము ౨ కోట్ల ౧౦ లక్షల ఎకరము లున్నది. ఈప్రదేశమంతయు సర్వే చేయబడి సెటిల్ మెంటు చేయబడినది. ఇచట భూములు రెండుతరగతులుగా ఉన్నవి—జలాధారములుగలవి; జలాధారము లేనివి. కొన్ని భూములు వర్షాధారములు. వానిని 'మానవరి' అనెదరు. ఈ ప్రదేశములలో సుప్రసిద్ధమైన గోదావరి, కృష్ణ, కావేరి మొదలగు నదులపై ఆనకట్టలు నిర్మించి నీటి పారుదల సౌకర్యములు కల్పింపబడినవి. ఇంతేగాక పలు చిన్ననదులపై కల్పింపబడిన నీటివనరులుగలవు. ఈ వనరులు సరిపోక ఇంకను పలు కార్యక్రమములను అమలులోనికి తీసుకొని రావలెనని ప్రభుత్వమువారు ప్రయత్నించుచున్నారు. తుంగభద్ర, రామపాదసాగర్, కృష్ణ, పెన్నార్, లోయర్ భవాని, పేరూరు మొదలగునవి పెద్ద స్కీములు. వంశధారా, నాగావళీ మొదలగు స్కీములు కూడ ఆలోచనలో ఉన్నవి. కొన్ని జిల్లాలలో ముఖ్యమైన నీటివనరులు కల్గించగల్గిన జీవనదులు లేవు. స్కీములలో మైనర్ ఇరిగేషన్, మేజర్ ఇరిగేషన్ అను రెండురకములు గలవు. ప్రభుత్వమువారు ఈ సంవత్సరము మైనర్ ఇరిగేషన్ నిమిత్తము గత సంవత్సరపు బడ్జెట్టులోకంటె రెట్టింపు మొత్తమును ప్రత్యేకించినారు. అసలు తటాకములను తిరిగి మరమ్మతుచేయుటకు టాంక్ రెస్టోరేషన్ స్కీము (Tank Restoration Scheme) ను అమలులోనికి తెచ్చుటకు ప్రభుత్వము నిర్ణయించినది. గత 3 సం. ల నుండియు నూతులను త్రవ్వుటను ప్రోత్సహించుటకు ప్రభుత్వము సాలునకు ఒక కోటి ౬౦ లక్షలు ఖర్చుపెట్టుచున్నది. రాష్ట్రము మొత్తముమీద అనేక నూతులు త్రవ్వబడినవి. ఇంకను ఈ స్కీము వచ్చేసంవత్సరముకూడ అమలులో ఉండగలదు. కరువు, కాటకము, పంటనష్టము వచ్చినప్పుడు జమీందారీ గ్రామములలో శిస్తురెమిషన్ లేదు. కాని రైతువారీ గ్రామములలో అవసరమునుబట్టి ప్రభుత్వమువారే శిస్తురెమిషన్ ఇచ్చుటయు, ప్రతిసంవత్సరము జమాబందీ జరిగించుటయు చేయుచున్నారు.

ఈనాములు

ఈ సందర్భములో ఈనాములను గురించి కూడ చెప్పవలసియున్నది. ఈనాములు ముఖ్యముగా రెండురకములుగా ఉన్నవి: (౧) ఈనాం గ్రామములు (Whole Inam Villages)—ఈ గ్రామములలో పెచ్చు భాగము ౧౯౦౮, ౧౯౩౬ ఎస్టేటులాండ్ ఆక్టుక్రింద ఎస్టేట్లుగా అయినవి. ఇచట భూస్వాములు పన్ను వసూలు చేసుకొను హక్కు కలిగియున్నారు. రైతు భూమికి హక్కుదారుడు అయియున్నాడు. (౨) మైనరు ఈనాములు—వీనిలో కేవలమూరు తరగతులు ఉన్నవి. వీనిలో ౧౮౬౦ సంవత్సరములో జరిగిన ఈనాం సెటిల్మెంటు క్రింద ప్రభుత్వమునకు రావలసిన పన్నులో కొంత భాగమును వసూలు చేసుకొనుట భూమిని పండించుకొను హక్కు ఈనాందారునికే వదలివేయబడినది. ఇట్లు ప్రభుత్వమునకు ఇచ్చు పన్నును 'క్విట్ రెంటు' అనెదరు. అనగా నామమాత్రపు పన్ను. మిగిలినవి అనేక ఈనాములు గలవు—దశభంగ ఈనాములు, జోడి ఈనాములు వగైరా. ప్రభుత్వముచే ఎస్టేట్లుగా పరిగణించబడిన ఈనాములన్నియుకూడ జమీందారీలతో బాటు రద్దుచేయబడుచున్నవి. మిగిలిన మైనరు ఈనాములను ప్రస్తుతపు ఈ శాసనము ముట్టుకొనుట లేదు.

కాని భూమివిధానముయొక్క స్వరూపమును ఇంతటితో మనము వదలిపెట్టిన అసలు సంగతిని మరచుటయే యగును. వ్యవసాయక చరిత్ర ప్రథమ ఘట్టములో భూమిని వ్యవసాయదారుడే స్వాంతముగాగాని, గ్రామములో ఉన్న కుటుంబమువారుగాని, గ్రామములోని జనాభా అంతయు సాముదాయికముగాగాని పంట పండించుకొనెడివారు. కాలక్రమేణ వచ్చిన మార్పులలో ఈ పంట పండించు రైతుకు పట్టణవాసము అలవడుటద్వారాను, ఇతర వృత్తులలో పాల్గొనుట మూలముగాను భూమిని ఇంకొకరికి కౌలుకు ఇచ్చు పద్ధతి అమలులోనికి వచ్చినది. ఈ కౌలువిధానములో రెండు ముఖ్యవిధానములు గలవు. ఒకటి వారంపద్ధతి; రెండవది గుత్తపద్ధతి. వారంపద్ధతి యనగా కొంత పెట్టుబడి భూస్వామి ఇచ్చి, పండిన పంటలో నిర్ణీతభాగము సగమునకు మించకుండ తీసుకొనుట. మిగిలిన సగముభాగమునుండియే భూమిని పండించు కౌలుదారే వ్యవసాయఖర్చులు భరింపవలెను. సమానముగా పంచుకొను పద్ధతిని శుద్ధవారము అనెదరు. ఈపద్ధతి కాలమానపరిస్థితులపై ఆధారపడు ప్రదేశములలో అమలులో ఉండును. గుత్తకౌలుపద్ధతి అమలులో ఉన్న ప్రదేశములలో పంటపండినను ఎండినను ఒక నిర్ణీతమైన మొత్తమును కౌలుదారు భూస్వామికి చెల్లించవలసి యున్నది. ఈ కౌలు ఎన్ని సంవత్సరములు అమలులో ఉండవలెననను విషయము మొదట నిర్ణయించుకొన్న షరతుపై ఆధారపడియుండును. ఈ కౌలునిర్ణయము చాలవరకు మూజువాణీ. అనగా వాగ్రూపకము. కొన్ని విషయములలో కౌలు రిజిస్టరు చేయబడుచున్నది. రిజిస్టరుకౌలుకు సాధారణముగా ౬ సం. ముల కాలపరిమితి ఉన్నది. రైతులు శిస్తులు చెల్లించకపోయినచో అటువంటి రైతును పొలమునుండి వెడలగొట్టుటకు భూస్వామికి శాస్త్రరీత్యా అధికారమున్నది. ఇట్లు కౌలుపైన జీవనము చేసుకొనువారు దేశములో చాలమంది యున్నారు. భూమిపై స్వయముగా వ్యవసాయము చేసుకొనువారి (అనగా పట్టాదార్ల) సంఖ్య తగ్గుచున్నది.

ఈ తరగతులేగాక నిత్యము భూమిపై కూలినాలి చేసుకొను జనముకూడ చాలమంది యున్నారు. వారిని వ్యవసాయకూలీలనెదరు. వారికి సంవత్సరము పొడుగునను పని ఉండదు. ఊడ్పులు, కోతలు వగైరా సమయములోనే పని దొరకును. వారికి చాలమందికి ధాన్యరూపములో కూలి ఇవ్వబడుచున్నది. కొంతమందికి ధనరూపకముగా ఇవ్వబడును.

భూమిపై హక్కు ఎవరికుండవలెను?

భూమి దున్నుకొనువారికే భూమిపై హక్కు ఉండవలెనుగాని భూమిని పెట్టుబడిక్రింద వినియోగించుకొనువారికి భూమిపై హక్కు ఉండరాదను వాదన దేశములో దినదినాభివృద్ధి చెందుచున్నది. ముఖ్యముగా భూమిపై జీవనము చేసుకొనువారి సంఖ్య పైన వివరించిన రీతిని దిన దినము హెచ్చు అగుచుండుటయే దీనికి ప్రధానకారణముగా ఎంచవలసియున్నది. గ్రామములలో గ్రామోపయోగమునకు పనికివచ్చు చిన్నవృత్తులు సన్నగిలుటవలనను ఈపరిస్థితి ఏర్పడుచున్నది. ఇప్పుడు ఈ సమస్యాపరి

ష్కారము చాల కష్టమైనసంగతి. ఎందువల్లననగా గ్రామములలో చాలమందికి అతిస్వల్పమైన భూమి గలదు. పలుగ్రామములలో ఇట్టి స్వల్పభూమి యున్న వారు వారే వ్యవసాయము చేసుకొనుచుందురు. రైతునకు స్వల్పము, పరిమితము అయినభూమి ఉండుటవలన ఎరువులు వేయుటకు, నూతనవ్యవసాయపద్ధతులకు పెట్టుబడి పెట్టుకొనుటకు శక్తి లేక భూమిపైన పండించు పంటకూడ అల్పమగుచున్నది. ఈ రోజున దేశములో ఉన్న జనాభా కంతకు సరిపోయిన భోజనము లేకుండుటకు ఇది యొక్కటియే ప్రధానకారణముగా ఎంచవలసియున్నది. ఈ పరిస్థితులలో మన మొక నూతన విధానము సృష్టించుకొనుట అత్యవసరము. ఈ సందర్భములో ఈ దిగువసమస్యలు ప్రస్ఫుటమగుచున్నవి.

(౧) రాష్ట్రములో కొలదిమందికి వేలాది యకరముల భూమి యున్నది. తంజావూరుజిల్లాలో ఒకరికి ౯ వేలయకరముల రైతువారీభూమి కల దను ప్రతీతి. పశ్చిమగోదావరిజిల్లాలోకూడ ఇంకొకనికి ఉన్నట్లు తెలియుచున్నది. ఇదేగాక ౧౦౦ మొదలు వెయ్యిఎకరముల భూమి గలవారు పలువు రున్నారు. ఇంత హెచ్చుభూమిని స్వయముగా పండించజాలరుగనుక కష్టించువారికే ఈ భూమిపై హక్కు కలుగజేయవలె నను వాదన ఒకటి యున్నది. సాగు లేని వ్యవసాయక భూములనన్నింటిని బీదవారికి ఇవ్వవలె నను వాదన యున్నది. అసలు తానే స్వంతముగా వ్యవసాయము చేసుకొనని పట్టాదారుని భూమిని అచట వ్యవసాయము చేసుకొనుచున్న రైతునకు ఇవ్వవలె నను వాదన యున్నది.

(౨) మన రాజధానిలో పలువురు చిన్నచిన్న భూస్వాములగుటవలన వీరి ఆస్తిని ఇంకొకరికి సంక్రమింపజేయుటకు వీలు కాదు. ఇటువంటి చిన్న భూస్వాములు అనేకమంది కలిసి సహకారసంఘముగా ఏర్పాటై తమతమ భూములపై హక్కులను పోగొట్టుకొనకయే పాటుబడి వ్యవసాయము సాముదాయికముగా చేసుకొని ఖర్చులు పోను మిగిలిన పంట పంచుకొనుచో దానిని సహకారవ్యవసాయపద్ధతి అనెదరు.

(3) పట్టాభూమినంతను సమిష్టిచేసి, అనగా ఏ ఒక్కరిపేరను పట్టా లేకుండ చేసుకొని పంట పండించి పంచుకొన్నచో సమిష్టివ్యవసాయ మనెదరు.

ఈ మూడు పద్ధతులలో ఏది దేశమునకు అనుకూలించు ననువిషయము చాల జాగ్రత్తగా యోచించవలసియున్నది. ఈ మూటిలోను సహకారవ్యవసాయపద్ధతియే అనుకూలమైన దని మన దేశపరిస్థితిని బట్టి అనుకొనవలసివచ్చుచున్నది. అందువలన స్వల్ప భూపరిమితి గల వ్యవసాయదారునకు పెట్టుబడి యెరువులు, నూతనవ్యవసాయపద్ధతులను అవలంబించు సావకాశము దొరకును. తమ భూమిని పోగొట్టుకున్నానే అను విచారము కూడ లేకుండును. ఏ ఒక్కరికిని ఒక నిర్ణీతమైన విస్తీర్ణముకంటె హెచ్చు భూమి ఉండరాదనే నిర్ణయము చేయవలసిన దని హెచ్చుఆందోళన గలదు. ఈవిషయమునుగూర్చికూడ ప్రభుత్వము యోచించవలసియున్నది.


త్వరలోరానున్న శాసనములు

మద్రాసు రాజధానిలో ప్రస్తుతము రైతువారీ భూమికి సంబంధించిన శాసనము లేదు. త్వరలో జమీందారీ భూములన్నియు రైతువారీభూములు కానున్నవి. అందువలన రాజధానికంతకు పన్నులకు సంబంధించిన శాసనము చేయుటకు ప్రభుత్వమువారు కృషి చేయుచున్నారు. ఈ శాసనము అమలులోనికి వచ్చునరికి పైన వివరించిన భూమిశిస్తు సంస్కరణకు సంబంధించిన శాసనము, రైతుకు భూస్వామికి మధ్యగల సంబంధమును నిర్ణయించు చట్టము చేయవలసిన అవసరము గలదు. మరియు వ్యవసాయ కూలీకి కనీసకూలీ నిర్ణయించు చట్టము చేయవలసిన అవసరముకూడ కలదు. ఈ అన్ని కార్యక్రమములు సర్వతోముఖముగా జరిగించుటకు కృషి జరుగుచున్నది.

అన్నిటికంటె ముఖ్యమైనది ప్రస్తుతము పన్నువసూలుచేయు పద్ధతిని మార్పు చేయవలసియున్నది. ఇప్పుడు స్వల్ప విస్తీర్ణము గల భూస్వామి, అత్యధిక భూవిస్తీర్ణము గల ఆసామి ఒకే రేటున పన్ను చెల్లించుచున్నారు. ఈ పన్నును క్రమాభివృద్ధిగతమైన పద్ధతిని నిర్ణయింపవలసిన ఆవశ్యకత ఉన్నది. ఈవిషయమును

కూడ ప్రభుత్వము అనతికాలములో ఆలోచించవలసిన పరిస్థితి ఏర్పాటైనది.

ఏది ఎట్లున్నను భారతదేశ భావిభాగ్యోదయము కృషీవలునిపైననే ఆధారపడియున్నది. పైన చెప్పబడిన విషయములను సమగ్రమైన స్వరూపమునకు తెచ్చి సాధ్యమైనంత హెచ్చుపాటను సాధించుకొనవలసిన సమయము, సన్నివిధానములను సంస్కరించుకొను సమయము ఇదే. ఈ విషయములో తగు సలహాలు ఇచ్చుటకు అఖిలభారత కాంగ్రెసు సంఘము ఒక ప్రత్యేక కమిటీని నియమించియున్నారు. వారు తమ నివేదికను జూనునెలాఖరుకు ప్రచురించెదరు. వారి నివేదిక వచ్చిన వెంటనే మన రాజధానిలో తీసుకొని రావలసిన సంస్కరణలను తీసుకొనివచ్చుటకు కృషి చేయవలసియున్నది. రైతు భూమికి రాజు. ఇట్టి రైతు రాజ్యాంగనిర్వహణలో తనయొక్క ఉత్తమస్థానము అలంకరించునట్లు చేయుటయే మనయొక్క ముఖ్యమైన విధి. నాడే దేశము సౌభాగ్యవంతమగును.



హంపీశిథిలములలోని గంట స్తంభము
చిత్రకారుడు: శ్రీ పి. వి. రామారావు

అపేక్ష - ఉపేక్ష

శ్రీ పప్పూరి రామాచార్యులు

అపేక్ష యనగా కోరిక. ఉపేక్ష యన అశ్రద్ధ. మన కపేక్షలు మెండుగా నున్నవి. కాని ఉపేక్షగూడ మనలో నధికయమే. ఈ యుపేక్షవలన అపేక్ష లడుగంటుచున్నవి. ప్రజలకు సంభవించు దుర్దశలేగాదు. ఈ యుపేక్ష కారణముగా సామ్రాజ్యములు తలక్రిందైనవి. జనపదములు నాశమైనవి.

ఉపేక్ష లోశత్రువు. బయటిశత్రుల నెందరినైన జయించవచ్చును కాని ఈ యంతశ్శత్రువును జయించుట కష్టము. సముద్రముల నెగురజాలిన హనుమంతుడు తన నీడను దాటజాలడా? ఈ యుపేక్ష మనలోనే పుట్టి పెరుగుచున్నది. తెలియకనే మనము దానికి దోహద మిచ్చుచున్నాము. మొదట నది సుఖస్వరూపముతో ప్రత్యక్షమగును. తుదిని సర్వనాశము చేయు కాళమూర్తిగా పరిణమించును.

పరీక్షలో తప్పుట, ప్రమోషను రాకపోవుట, రైలు అందకపోవుట, బస్సు చిక్కక దాటిపోవుట, పత్రములు వాయిదాపోవుట, జీవితభీమాలు రద్దగుట, పైరు చెడుట, ఆస్తి నశించుట, రోగము పెరుగుట, అగ్నిఋణ చోరభయములు అన్నియు ఉపేక్షవలననే.

తీగకు చీడ, పైరునకు తెగులు, కాయకు పుచ్చు, వజ్రమునకు దోషము, సంగీతపాఠకుని కపస్వరము వంటి దీ యుపేక్షాగుణము మానవులలో.

ఇంటిలోని వస్తువు లుండవలసిన చోట లేక అన్నియు తికమకగా నుండుట యజమాని ఉపేక్షవలన. గ్రామములు దుర్గంధనిలయములై వీధులు కాలుపెట్టరానివై గ్రామజనులు కలహశీలురై చేవచెడియుండుటకు ఊరిపెద్దల యుదాసీనత కారణము. బడిపిల్లలు తగవరులై అల్లరిపిల్లలుగా మారుటకు ఉపాధ్యాయుని అశ్రద్ధ హేతువు.

తిద్ది తీర్చిన దేవాలయగోపురముల మీద అశ్వత్థవృక్షపు మొలక మొలచి పెరిగి పెంపొంది కోమలముగా కన్పడును. కొంత కాలమున కది వేళ్ళుబలిసి గోపురమునే చీల్చి కూలద్రోయును. ధర్మకర్తల యుపేక్ష దేవాలయశిథిలమునకు కారణమైనది.

కోటగోడలమీద చీమలు పెట్టిన రంధ్రములో నీళ్లుదిగి శత్రువుల ఫిరంగిలు చేయజాలని వినాశమును అవలీలగా చేసినవి. కావలివారి యుపేక్ష అందునకు కారణము.

పుత్రుని మీది ప్రేమతో వాని అవినయమును మొదట మన్నింతుము. తర్వాత సహింతుము. పిమ్మట దానికే లొంగుదుము. కాని అది మితిమీరి 'ప్రాణగొడ్డమై' వచ్చినప్పుడు నిరోధింపజాలక వెతబొందుదుము. ధృతరాష్ట్రుని పశ్చాత్తాపము తర్వాత పనికిరాలేదు. 'అనయము పుత్రు జూదమున కొప్పుట యెంతయు' జిచ్చుపెట్టి కాల్చినయది ! యుపేక్షయ అని సంజయుడు ధృతరాష్ట్రునిఎదుట వాపోవుటలో నిజము తప్పక యున్నది గదా!

ఉపేక్షాపరుడగు ప్రభువురాజ్యములో శాంతి యుండదు. వాని ప్రజలకు సౌఖ్యము లేదు. వాని స్వాతంత్ర్యము నిలువదు. రాజ్య ముండదు.

ప్రక్కయింటివానిమీద జరుగు పరుల దౌర్జన్యమును మన ముపేక్షించిన క్రమముగా నది మన మీదికి వచ్చుట నిజము. ఆవిధముగనే పొరుగున నున్న రాజువినాశమును చులకనగా చూచు రాజులుగూడ త్వరలో విపద్దశ నొంది యుందురు.

* * *

ఇండియామీద దండెత్తినవారిలో ప్రథముడు అలెగ్జాండరు. వాని సైన్యమును ఒక్క పురుషోత్తముడుతప్ప తక్కిన రాజులు విరోధింపదలచ లేదు. ఆ యిరువురి పోరాటమును వా రుపేక్షతో చూచుచుండిరి. దాని ఫలితమును పురుషోత్తము డొక్కడే అనుభవించలేదు. చుట్టుపట్ల రాజులును, క్రమముగా ప్రాచ్యభారత మంతయు యవనులకు లొంగక తప్పదయ్యెను.

హిట్లరుదౌర్జన్యమును జర్మనుప్రజలు మొదట మెచ్చుకొనిరి. చుట్టు రాజ్యములవారు సహించిరి. ఇంగ్లాండు ప్రధాని ఉపేక్షించెను. ఈ యుదాసీనత జర్మనీవినాశమునకు తుదిని కారణమైనదేకాక ప్రపంచమునంతయు కలగుండుపెట్టి తీరని కష్టనష్టములకు గురిచేసినది.

భారతదేశచరిత్రయం దిట్టి యుదాహరణము లెన్నియో కలవు. తెల్లవారి నీదేశమున నడుగుబెట్టను, కోటలు కట్టుకొనను, సైన్యముల కూర్చుకొనను, అనుజ్ఞనిచ్చి వారి ఆక్రమణను, బలుపును విరోధింపక ఉపేక్షించిన ఫలమును మొగలుపాదుషాహాలేగాక, హిందూచక్రవర్తులుగూడ అనుభవించిరి. అంతేకాక అదుష్ఫలమును భారతదేశప్రజలు రెండు శతాబ్దములకాలము దుఃఖదారిద్ర్యరూపమున అనుభవింపక తప్పదయ్యెను. మహాత్ముని మేలుకువ లేకున్న మన మావిపద్దశనుండి వెలివడియుండగల మనుట యనుమానమా?

* * *

ఇప్పుడున్న కాంగ్రెసుమంత్రులు గాఢమగు దేశభక్తి కలవారగుట వాస్తవమే, కాదనలేము. కాని ప్రజలలో పెల్లురేగిన అపేక్షల నన్నింటిని ఈ మంత్రుల యుపేక్ష నలిపివేయుచున్నది.

రాజధానిలో నంతయు మద్యనిషేధము నమలుపరుపవలె నను అపేక్ష మంత్రులకును కలదు. కాని దానిని కార్యరూపమునకు తెచ్చుటలో గల యుపేక్షవలన అందువలని ప్రయోజనము సున్నయగుటయేగాక ప్రమాదములుగూడ పెరిగివచ్చుచున్నవి.

జనుల సంఖ్య పెరుగుదలతోపాటు వారికి విద్య కఱపు పాఠశాలల సంఖ్య పెరుగుట లేదు. కాక తక్కువయగుచున్నవిగూడ. నిరక్షరతను రూపుమాపు నపేక్ష మంత్రులకును లేకపోలేదుగాని మరల జనగణనసంవత్సరమునాటికి మన దేశ జనులకును,అక్షరజ్ఞులకును ఇప్పుడున్న దామాషా సైతము తగ్గిపోవునేమో? యథాతథపద్ధతిలోనే ఇంకను ఈ విద్యాశాఖను నడపించు ఉపేక్షవలన ముందు నిరక్షరత పెరుగు ప్రమాదమునకు దేశము గురియగుట కాంగ్రెసుప్రతిష్ఠకు హానికరముగాదా?

కాంగ్రెసుమంత్రుల కార్యాకార్యములను విమర్శించు వ్యాఖ్యానముగా దిది. పడిసెము, తలనొప్పి ఉపేక్షించినచో క్రమముగా పెరిగి తొలగని జాడ్యముగా పరిణమించునట్లే పరిపాలనలోని చిన్న లోపములు తర్వాత సవరింపరాని రీతి పెరిగి జాతికి మచ్చగా, దేశమునకు కళంకముగా నేర్పడవచ్చును. కావున మంత్రులు మెలకువతో వర్తించుటయు, దీర్ఘదృష్టితో కార్యారంభములకు పూనుటయు, ఉపేక్షాపరులు గాకుండుటయు అత్యవసరము.

అధికారవర్గమునకే ఉపేక్షనంతయు అంటగట్టుట పక్షపాతపు తెఱగగును. మంత్రులేమైన చేయనిమ్మని తమకు కాబట్టనిరీతి ఉపేక్షతో ప్రజలు వర్తించుటవలననే మంత్రులకు మాంద్యము హెచ్చును. నూరిననే గాని కత్తి పదునెక్కదు రాచినగాని గంధము పరిమళింపదు. ప్రజలు అధికారుల అరుణ కటాక్షములకు వెఱచి విమర్శకు దూరమై వందిమాగధుల చందము వహించినయెడల ప్రభుత్వము పేరుకొని, మంత్రులు నియంతలై, అభివృద్ధి కాటంకమేర్పడును.

కాంగ్రెసుమంత్రుల సంచారకార్యక్రమములోగూడ విందులు, విహారములు, స్తుతిపద్యములు, సన్మానపత్రములే కనుపించుచున్నవి. ఖడ్గహస్తులైన విజాతిప్రభువుల విశ్వాసము గడించుటకు పరాధీనప్రజలు భయముతో చేయు మర్యాద లివి. ప్రజాప్రతినిధులగు మంత్రుల సందర్శనకార్యక్రమము ఆ ప్రాతమార్గముల నడువరాదు. పరిపాలనలోని లోపము లేవి యున్నవో, వానిని వారించుతెరగు లెవ్వియో అన్వేషించి అట్టి లోపములు ముందు జరుగనియట్లు ఏర్పాట్లు కావించుటకు మంత్రులు సమ్మతించుటయు, ప్రజానీకము ఆయుద్దేశమునకు సాయపడుటయు జరిగినచో నదియే మంత్రులకు గొప్ప సన్మానము.

అట్లుకాక లోపముల నణచిపెట్టి మంత్రులను గురించిన స్తుతిసన్మానములను స్వర్ణాక్షరములతో ప్రకాశింపజేసినచో అది మంత్రులను భ్రమలో నుంచుటయేగాక-దానివలన ప్రజలును ఆత్మవంచనదోషమునకు గురియై అధర్మప్రాబల్యమున నలిగి నశింతురు,

అకార్యములను, కార్యదోషములను వ్రేలుపెట్టి ప్రజలు మంత్రులకు చూపని యుపేక్ష ఉభయులకును తుదిని ముప్పుదెచ్చును.

ఉపేక్ష పూర్తిగా నశించినగాని అపేక్షలు అనుభవమునకురావు.






ఉగాది
అభినందనలు



మీరు ఉగాదికి జేకే ఉన్ని బట్టలు కొనాలి. ఇవి ఉత్తమమైన అతి శ్రద్ధగా బ్లెండుచేయబడిన ఉన్నితో నేయబడినవి దీర్ఘకాలం మనునవి పరిశుద్ధమైన రంగు, సహజమైన అందము కలవి!
దయచేసి మా వర్ స్టెడ్ సూటింగులు, యూనియన్ సూటింగులు, పాంబీచ్, సూపర్-ఫైన్ శాలువలు, షర్టింగులు, లోహీలు, స్పోర్ట్ దుప్పట్లు, రగ్గులు, అల్లికవస్త్రాలు, హోజయిరీలను చూడండి.





A J.K. INDUSTRY

THE RAYMOND WOOLLEN MILLS LTD.
BALLARD ESTATE, BOMBAY — MILLS AT THANA


రేమండ్ వులెన్ మిల్సు లి॥

బల్లార్డు ఎస్టేటు, బొంబాయి — మిల్లులు థానావద్ద

చీఫ్ ఏజంట్లు:

హిందుస్తాన్ టెక్స్టయిల్ కార్పొరేషన్,

9, గోడౌను వీధి, — మద్రాసు.



విశిష్టమైన

శక్తి
సామర్థ్యము
ప్రతిభ
సాధనసంపత్తి
ప్రవీణత

ఇవన్నియు చేరి

ఇంగ్లీష్ సైకిల్ & మోటార్ ఇంపోర్టింగ్ కంపెనీ, లిమిటెడ్

వారి పేరు ప్రతిష్టలు నిర్మించినవి

నాణ్యతకు

ప్రతినామము

ఇంగ్లీష్ సైకిల్ & మోటార్ ఇంపోర్టింగ్ కంపెనీ, లిమిటెడ్

2 & 4/9, బ్రాడ్వే, జి. టి.

మదరాసు 1.

టెలిఫోన్: 3168. తంతి: "CYCLES."



కావ్యహరిశ్చంద్రము ౧

నాటిక



శ్రీ విశ్వనాథ సత్యనారాయణ

[పాత్రలు—హరిశ్చంద్రుడు; మాతంగకన్యలు; విశ్వామిత్రుడు; నక్షత్రకుడు; చంద్రమతి; లోహితాస్యుడు; కాలకౌశికుడు; వీరబాహుడు; రాజభటుడు.]

మాతం : అయ్యా! హరిశ్చంద్రమహారాజా! మేము గాయనులము. నాట్యవిద్యాపారంగతలము. మావిద్య మీయందు నెఱపి తమ దయ పడయ నేతెంచినారము.

హరి : లతాంగులారా! మీరెవరు ?

మాతం : మహారాజా! మేము విశ్వామిత్రమహర్షి కూతుండ్రము. కులముచేత మాతంగకన్యలము. మీ యౌదార్యము, మీ పాండిత్యము విని మీదర్శనార్థము వచ్చినారము. మహారాజా! మీ కీవనమునకే విచ్చేయుట మా యదృష్టము. వ్యయప్రయాసల కోర్చి మీ అయోధ్యాపురికి మే మెట్లు రాగలము ? ఒకవేళ వచ్చినను మేము మాతంగకన్యలమని మమ్ము మీసభలోనికే రానియ్యరు.

హరి : ఓ లతాంగులారా! మీరు మాతంగకన్యలని మీరు చెప్పవనే తెలియవలయును. బ్రహ్మర్షి యైన విశ్వామిత్రుని బిడ్డలగుట మీ మహిమను చెప్పుచున్నది. ఓహో! మీ సౌందర్యము అప్సరస్త్రీలను తలదన్నుచున్నది. మీ విద్యాప్రదర్శనము తప్పకుండ జూచెదను. మిమ్ము గౌరవించుట శ్రీ గాధేయులను గౌరవించుటగా నెంచుచున్నాను.

మాతం : దేవర కనుగ్రహము సంపూర్ణముగా గలిగినది. మేము భయలుదేరిన వేళావిశేషము.

(పాట)

కలితమధుమాసనవయామినీ
రతిసమయ రసభావగామినీ !
కోర్కెమై పతి చూరగొనగ తన యౌవనము
కనరాక కప్పె రెక్కల చక్రవాకీ. కలిత........
చట్టుపట్లు చరించి జరుగు పతి గని దాగె
గుట్టుగా జివురాకు గుమ్ము వెన్క శుకీ. కలిత......
మింటిలో పతి వెంటవెంట రాచుక తిరుగ
దంటమబ్బుల్ల తెరల దాగెను బలాకీ. కలిత.....

హరి : కన్యలారా! శహబాసు! ఔచిత్యము చెడకుండ మీరు చేసిన వర్ణన మిక్కిలి ప్రశస్తముగ నున్నది. మీగొంతులు శ్రుతిపరమావధులుగా నున్నవి. మీ ప్రయోగము దోషరహితముగా నున్నది. మీ యభినయము భరతాచార్యులు గాంచినచో తమ శాస్త్రము ఫలవంతమైన దని భావింతురు.

మాతం : ప్రభూ! విద్యయొక్క చారితార్థ్యము తమవంటి సునిశితమేధావంతులైన రసజ్ఞశేఖరులయందు ప్రదర్శించుట. ధన్యలము. సెలవు తీసికొందుము.

హరి : అదియేమి! ఊరకే పోవుదురా! మావలన నేదైన బహుమతి గ్రహించిపోవలయును. అట్లు చేయనిచో మమ్మగౌరవపరచిన ట్లగునుగదా! విశ్వామిత్రమహర్షి కూతుండ్రేమి! మాకడకు వచ్చి యిట్లు రిత్తచేతులతో దిరిగిపోవుట యేమి!

మాతం : మహారాజా! మీ ప్రశంసయే మాకు బది వేలు. మరియు మే మేమి యడిగిన మీ రిత్తురు ?

హరి : మీ రేది యడిగిన నది యిత్తును.

మాతం : మహారాజా! తొందరపడి యేదియు ననరాదు. సత్యము మిక్కిలి చెడ్డది. అన్నమాట తీర్చుకొనలేకపోయినచో మృషాఫలితము వచ్చును. అది జీవునకు ముక్తిహేతువు కాదు.

హరి : అవునమ్మ! నే నసత్య మాడను. ఆడజాలను. సత్యమార్గము నే యవలంబించుచున్నాను. సత్యముగా జెప్పుచున్నాను. సత్యమైన మీకోర్కె యేదైనను తీర్పగలను. అడుగుడు.

మాతం : మహారాజా! ఇది చెప్పుము. సంగీతాభినయములందు మాకంటె నధికులను మీ రెచ్చటనైన జూచితిరా ?

హరి : చూడలేదు. యథార్థము.

మాతం : సౌందర్యమునందు మాకంటె నధికులను మీ రీ భూలోకమందు చూచితిరా?

హరి : మాతంగకన్యలు, నిజము.

మాతం : మేము కన్యలము. నవయౌవనాభిరాములము. అనన్య లగ్నమానసలము.

హరి : నిశ్చయము.

మాతం : తన తపోమాహాత్మ్యముచేత మరొక స్వర్గము సృష్టించిన విశ్వామిత్రుని తపస్సుచేత మేము రక్షితలము.

హరి : ఆహా ! మీ భాగ్యము.

మాతం : మా కొక్కటియే కోర్కె యున్నది. అది తీరుచు తీర్తుమన్నచో మనవిచేయుదుము.

హరి : నే నింతవరకు కథ వినుటకేకదా వేచియుంటిని?

మాతం : చిత్తము. మేము మాతంగకన్యలము ! విశ్వామిత్రుని చేత సృష్టింపబడినవారము. మాయందు కులదోషము లేదు.

హరి : నిజముగా లేదు.

మాతం : ఇట్టి మాకు బతి కాదగినవా డీభూలోకమున లేడు.

హరి : లేడు.

మాతం : కాని, ఉన్నాడు. ఆయన మీరొక్కరే. మహా రాజా ! మాయం దేదోషమును లేదు. మీరు మమ్ము స్వీకరించి మా జన్మలను చరితార్థములను జేయుడు. మే మడిగినాము. ఏది యడిగిన నది యిత్తునని మీరన్నారు.

హరి : ఓ లతాంగులారా ! నేనన్నాను. నిజమే కాని, నే నేమన్నాను? సత్యమైన కోరిక కోరవలయు నన్నాను. ఇది సత్య మార్గమునందు లేదు. నేను వివాహితుడను. ఏకపత్నీ వ్రతస్థుడను.

మాతం : మా యింతటి సౌందర్యముచేత నీ వాకర్షింపబడుట లేదా ?

హరి : సౌందర్యము నేత్రములతో జూచి యానందింపదగినది. నట్టి శరీరగతమైనది.

మాతం : మహారాజా ! మా శరీరము లెంత యందమైనవో మా మనస్సులు నంత యందమైనవికదా ! మా విద్యాప్రకాశనము నీ విప్పుడే కదా చూచితివి?

హరి : మీ శరీరము లెంత యందమైనవో మీ మనస్సు లంత యందమైనవి. మీ మనశ్శరీరములందు లౌకిక ధర్మము పరాకాష్ఠ నందియున్నది. కాని మీ యాత్మలు ధర్మేతరముగా నున్నవి. నేను వయసుమీరినవాడను. మీరు బాలికలు. నేను గృహస్థుడను. మీ కనురూపులైన భర్తలను వెదకికొనవలయునుగాని—

మాతం : మా మనస్సులు తమయందే తగిలినవి.

హరి : వివాహమునకు మనస్సులు తగులుట కాదు. ఆత్మ తగులవలయును. మనస్సు చంచలము. నేడు తూర్పునకు తిరుగును;

మాతం : ఆ యాత్మను సరిదిద్దుట యెట్లయ్యా ?

హరి : ధర్మముచేత !

మాతం : మా కిది ధర్మమే యనిపించుచున్నది. నీవు మే మేది యడిగిన నది యిత్తునంటివి. అడిగితిమి. నీవు కాదంటివి. నీ వసత్య మాడుచుంటివి.

హరి : సత్యాసత్యనిర్ణయ మీమాత్రమున కాదు.

మాతం : ఏమాత్రమున నగును ?

హరి : అది మహర్షులు నిర్ణయింపదగినది.

మాతం : అరుగో మా తండ్రిగారు. మహర్షులు. బ్రహ్మర్షులు. వారినే చేయనిండు.

విశ్వామిత్రుడు : ఓయి హరిశ్చంద్రుడా ! మాకు తెలిసినది. నే నీసత్యనిర్ణయమును చేయుచున్నాను. నీవు నాకూతుండ్రను బెండ్లి యాడినచో నీ వసత్యమార్గమున నేగినట్టివాడవు కావు.

హరి : బ్రహ్మర్షీ ! నీ వాగ్బల మట్టిదేకాని నీమాటయందే యది యసత్యమని స్ఫూర్తియున్నది కదా !

విశ్వా : ఓయీ ! సత్యాసత్యము లట్లుంచుము. ఈ లోకము నందే సౌఖ్యము సంపాదింపదగినది. అర్థకామముల వెంట బరితృప్తి లేనివానికి ధర్మమోక్షములందు బరమసాయుజ్యము లేదు. అర్థము నీయందు రాజ్యాధీనమై యెక్కువ పండినది. కామతృప్తి నీకు ఈ నా కూతుండ్రయందుబోలె వేఱుచోట్ల జరుగదు. అందానికా— పుట్టెనందము. విద్యకా—చెప్పరానంత విద్య. ఖినయవతులు. వేనె పెరలవంటివారు. ఈ కామదేవత నుపాసింపుము.

హరి : స్వామీ ! నన్ను శత్రువుల కప్ప జెప్ప నెంతువేమి ?

విశ్వా : అదియేమి ! నా కూతుండ్రు నీకు శత్రువులా ?

హరి : స్వామీ ! కామక్రోధాదు లరిషడ్వర్గము. ఈ యార్గురు శత్రువుల బారి బడక ప్రభూ ! మోక్షమార్గగామినగు జీవుడను నేను. నన్నేల యిట్లు లాగెదవు ?

విశ్వా : ఓరి పిచ్చిజీవుడా ! ధర్మకామమున నీకు జంద్రమతి యున్నది. ఆ బలమున నీ కామము నొకవేళ గెలిచితివే యనుకొందము. తక్కిన యైదుగురు శత్రువుల గెలువ సాధ్యము కాదు. కనుక వీరిని వివాహమాడి శరీరసౌఖ్యమును బూర్తిగా వైవసము చేసికొమ్ము.

హరి : ప్రభూ ! తక్కిన యైదుగురిని గెలువలేముగదా యని గెలిచిన యొకరికిగూడ లొంగిపొమ్మనుట న్యాయమా ?

విశ్వా : నీ యుద్దేశములో నీ వప్పుడే యీ కామమును గెలిచి నట్లే అనుకొనుచుంటివేమి ? వీరిని నీవు పెండ్లియాడక తప్పదు. నీమీద నింత యాస పెట్టుకొనివచ్చిన వీరిని తిరస్కరించుటకు నీకు హృదయ మున్నదా ! నీది మనసా, రాయా !

విశ్వా : ఇంకేమి నీ కష్టములేమి చెప్పు? దుర్మార్గుడా! నా కూతుండ్ర కన్నీరు నేను చూచితిని. అయ్యో! వారిని నీవిట్లు పరాభవింపగా నా కెంత యేడ్చుచున్నారో చూడుము.

(మాతంగకన్యల యేడుపు)

విశ్వా : ఎందుకమ్మా, అంత యేడ్చుచున్నారు?

మాతం : తండ్రీ! మా గోడేమని చెప్పుము? నీవంటివానికి గూతుండ్రమైనను మా కీగతి పట్టినది. తండ్రీ! మేము హరిశ్చంద్ర మహారాజును మనసార ప్రేమించితిమి. ఆయన మమ్ము నిర్దయముగా బాధించుచున్నాడు. అయ్యో! మా యొడళ్లు చూడుము. కండెలు కట్టినవి. వాతలు పెట్టినట్లు మా శరీరములు చూడు మెట్లున్నవో! మా జడలు ముళ్ళూడినవి. పూవులు రాలిపోయినవి. ఒడలి గంధమంతయు విచ్చిపోయినది.

విశ్వా : ఏమోయి రాజా! మాపిల్లలను ప్రేపబెత్తములతో గొట్టినావా?

హరి : స్వామీ! నే నేపాప మెరుగను.

విశ్వా : ఓరి దుర్మార్గుడా! ఏమి నక్కవినయము! నీ వేపాప మెఱుగ ననగా నిన్నెవరు నమ్ముదురు? దీనికి ప్రతీకార మేమి చేయుమందువు?

హరి : మీ చిత్తము వచ్చినది చేయుడు.

విశ్వా : ఇదిగో నీశిరస్సునందు దన్నుచున్నాను.

(ఠక్కుమని తన్నిన ధ్వని)

ఓయి హరిశ్చంద్రా! ఇప్పుడైనను నీకు బుద్ధివచ్చినదా?

హరి : స్వామీ! క్షమింపుము.

పచ్చని వింటి జోదు శర పంజర శేఖరమూర్ధవంబునా
నచ్చరయైన మేనక కుచాంతరసీమ సుఖించి మెత్తనల్
మచ్చికపడ్డ నీదు పదమండలి రత్నశిలాగ్రకర్కశం
బిచ్చటి నాశిరస్సున మ రెంతటి బాధను పొందియున్నదో?

విశ్వా : ఏమోయి, నీ యాక్షేపణ? మేము కామదూషితులము, నీవు కామమును జయించినవాడవునా!

హరి : ప్రభూ! నే నన్నమాట కిది న్యాయమైన యర్థము కాదు.

విశ్వా : సరే! నీపాదము సర్వసామంతుల శిరస్సుమీద. మా పాదము నీశిరస్సుమీద.

హరి : చిత్తము. విధేయుడను.

విశ్వా : అరరే! ఉప్పుకారము తినవా. చీమునెత్తురులు చచ్చినవా? నీశిరస్సున దన్ని తినిగదా! క్రోధము లేదా?

హరి : స్వామీ! నాకు గామ మెప్పుడు చచ్చినదో, క్రోధము నపుడే చచ్చినది.

విశ్వా : ఓరి దుర్మార్గుడా! నాతో మాటాడుము మాటాడు చునే క్రోధమునుగూడ గెలిచితినని చెప్పుచున్నావు! ఒకవేళ నీ రెంటిని గెలిచినను మిగిలిన శత్రువులు ఇంకను నున్నారు. నా బలమే యెక్కువగా నున్నది.

హరి : స్వామీ! ఎప్పుడును అరిషడ్వర్గముయొక్క బలమే యెక్కువ. నావంతయు నీదయామహిమవలన ప్రయత్నమే.

విశ్వా : ప్రతిపదము నాయాజ్ఞ తిరస్కరించుచు నా దయా మహిమ యందువు. సరే, కామక్రోధములు గెలిచితివి. లోభము నెట్లు గెలువగలవో చూచెదను. లోభమును గెల్చుట సామాన్యమైనది కాదు. నాపాదముం చేత దన్నబడిన శిరస్సు గలవాడవు నీవు పోయి మరల నెట్లు రాజ్యమును జేయుదువు? సిగ్గుమాలి నీవు పల్లినను నీ సామంతరాజులు నీపాదములవద్దకు జేరుదురా? నీ మూర్ధాభిషేక మేమైనది? నా కాలుతగులుటచేత మహిమపోయిన నీ కిరీటమును ధరిత్రి యాదరించదు. నీ కింక రాజ్యార్హత లేదు.

హరి : బ్రహ్మర్షిచంద్రమా! ఇదిగో నారాజ్యమును సమర్పించుచున్నాను.

మునుపు సహస్రముల్ నృపులు పొంది సుఖించి త్యజించి యీవసుం
జనిన ధరిత్రి విప్పి, రససౌఖ్యము నాకును లేదు రాజ్యలో
భనియతి నిన్నువంటి ఋషి వచ్చి యొసంగు మనంగ, కాదుకా
దను మతిహీనతం జనెడునంతలగ నాయొదలేదు సూ ప్రభూ!

విశ్వా : ఏమి, నిజముగా నీరాజ్యమును నాకిచ్చితివా!

హరి : స్వామీ! నిజముగా నొకటియు, సబబుగా నొకటియునా!

విశ్వా : మరి అట్లయినచో నీభూషణములు, నీవల్వలు, నీ రాజచిహ్నములు నన్నియు నిక్కడ నుంచుము.

హరి : చిత్తము. ఇవిగో.

విశ్వా : నీ వింక బోవచ్చును.

హరి : పోవుచున్నాను.

విశ్వా : కాదు. ఆగుము. అరే! నేను నాకీ రాజ్యము వచ్చిన దన్న సంతోషములో మరచిపోయినాను. ఏమి, నీవు కామక్రోధ లోభములను మూటిని గెలిచితివా?

హరి : స్వామీ! నేను గెలుచుట యేమున్నది? నేను గెలుచుటయు లేదు, ఓడుటయు లేదు.

విశ్వా : ఓయీ! నీవు భయపడుచుంటివి.

హరి : దేనికి?

విశ్వా : మోహము, మదము, మాత్సర్యము నని యింకను మూడున్నవి. వానిని జూచి.

హరి : ప్రభూ! నేనే యేమి! సర్వజీవకోటియు వీనినిగూర్చి భయపడదగినదే. ఈ యారుగురు శత్రువులేనా? ఈషణత్రయము

లేదా! దారేషణ, పుత్రేషణ, ధనేషణములు. ఇవి యెల్లప్పుడు సర్వజీవులను బాధించుచునే యుండునుగదా!

విశ్వా: చక్కగా జ్ఞాపకము చేసితివి. ఈ శత్రువు లార్వురు; ముగ్గురను నీవు గెలిచితివి. సమానబలవంతుల మైతిమి. ఎట్లా అను కొనుచున్నాను. అసలు మా బలము తొమ్మండుగురు. నీవు ముగ్గురినే గెలిచినావు. ఇంక మా వార్గు రున్నారు. మా బలమే యెక్కువ యున్నది. ఏమి చేయుదువు?

హరి: ప్రభూ! యేమి చేయగలను?

నాకు నీ రెండె దిక్కు కంఠస్థకాల
కూట మను తేజమును మహానికోటిదయయు
నఖిలజీవాళి బంధక మైనయట్టి
యీ విరోధి చమూరోధి త్రోవయందు.

మరియు నా స్వామీ! ఇతరసద్విప్రుల దయయు నొకయెత్తు. నాకు నీదయ యొక యెత్తు.

విశ్వా: ఎందుచేత నేమి?

హరి: బ్రహ్మర్షీ! నీవు నా వంశీయుడవు. ఈ శత్రువులను నీవలె గెలిచినవా డెవడు? ఓహో! యేమి గెలుపు గెలిచినాడయ్యా విశ్వామిత్రుడీ శత్రువులమీద? ఇతరుల కలభ్యమైన బ్రహ్మర్షిత్వమును సంపాదించినాడు.

విశ్వా: అట్లే సంతోషించుచుండుము. మరి నీకిపుడు రాజ్యము లేదు. ఎట్లు బ్రతుకగలవు? ఊరూర బిచ్చమెత్తుకొని బ్రతికెదవా?

హరి: "ఆయురన్నం ప్రయచ్ఛతి"—ఆయువున్నచో నన్న మదియే దొరకును.

విశ్వా: ఈ భార్య చంద్రమతి, కొడుకు లోహితాస్యుడు వీరి నెట్లు పోషింతువు?

హరి: స్వామీ! నే నెవరను పోషించుటకు? పరమశివునిదయ.

విశ్వా: అడవుల వెంట బడిపోవుచో బులులు, తోడేళ్లు, ఎలుగు బంట్లు. భేతాళాదిగ్రహములు. వీని వలన మీ రెట్లును నాశన మయ్యెడిదే.

హరి: ప్రభూ! శివుని యాజ్ఞ లేక చీమయు కుట్ట దందురు. ఆ ప్రభువునాజ్ఞ యయినచో నేను పట్టి నిలుపదగినదియు లేదు.

విశ్వా: నీవు భార్యాపుత్రులను పోషించవలయునన్న ప్రేమ యున్నవాడయినచో రాజ్యమే వదలిపెట్టవు. నీ జోలి నాకెందుకు? పదియాళ్లలో దిరిపమెత్తుకొను జోలె. పో. పో.

హరి: స్వామీ! సెలవు.

విశ్వా: మరి మరచిపోయితిని. వెనుక నేను వచ్చి "నే నొక యజ్ఞమును చేయదలచితిని. దానికి కొంత సొమ్ము కావలె"నని యడిగి తిని. నీ విత్తు నంటివి. జ్ఞాపకమున్నదా?

హరి: చిత్తము.

విశ్వా: ఆ సొమ్ముమాట యేమి? నీ వద్ద రాగిదమ్మిడీ లేదే, ఎట్లు తీర్చెదవు? (నవ్వి) చూచితివట్రోయి, రాజా! ఏమో సత్య వ్రతము పాలింతు ననుకొన్నావు. ఇప్పు డేమైనది? ఆ ధనము నీ వెట్లు నీయలేవు. అందుచే నబద్ధమాడిన ట్లయినది. సత్యవ్రతము పోనేపోయి నది. కనుక నా కూతుం డ్రను పెండ్లియాడుము. నీరాజ్య మంతయు నీకు వరణముగా నిచ్చెదను. మహారాజవుగా నుండువుగాని.

హరి: ప్రభూ! నాకొక నెలనాళ్లు గడువిమ్ము. నీ ఋణ మును దీర్చెదను.

విశ్వా: ఋణము దినములతో దీరదు. ధనముతో దీరును.

హరి: నా త్రిప్పలు నేను పడెదను.

విశ్వా: నిన్ను నమ్మి వదలిపెట్టుమందువా?

హరి: నా వెంట నెవరినైన బంపింపుడు.

విశ్వా: తా మూర సంక లేదు, మెడ కొక డోలట! నీ పెండ్లమును బిడ్డలను బోషించుకొన్న జాలును. వానిని గూడ నెక్కడ పోషించెదవు?

హరి: మేము పస్తుండినయైనను వాని నారగింపజేసెదను.

విశ్వా: సరే. మా కొక శిష్యుడున్నాడు. వానిపేరు నక్షత్ర కుడు. బహుసుకుమారి. వానిని నీవెంట బంపెదను. ఒక నెలనాళ్లలో మా సొమ్ము వాని చేతి కిచ్చి పంపింపుము. వా డావులించినచో ప్రేవులు లెక్క పెట్టెడువాడు. వానిని మోసముచేయ జూడకుము. వాడు నీవంటివారికి వందమందికి చదువు చెప్పగలవాడు.

హరి: చిత్తము. మావెంట బంపించుడు.

విశ్వా: నీవు పోవుచుండుము. అతడు దారిలో వచ్చి మిమ్ము కలిసికొనును. నేను పోవుచున్నాను.

హరి: ఆహా! విశ్వామిత్రఋషి వెళ్లిపోయెను. చంద్రమతీ! నావెంటనే వచ్చుచున్నావా!

చంద్ర: వచ్చుచున్నాను మహారాజా!

హరి: బిడ్డా లోహితా! నీవును నావెంట వచ్చుచున్నావా!

లోహి: వచ్చుచున్నాను నాయనగారూ!

హరి: నాయనా! ఆనక్షత్రకు డన్నాయన వచ్చెనా?

లోహి: ఎవరో వచ్చుచున్నారు. ఆయనయే కాబోలును.

నక్ష: నే నేనయ్యా! నక్షత్రకుడను. నీవేగా హరిశ్చంద్రుడవు?

హరి: చిత్తము.

నక్ష: నీవు కామక్రోధలోభములను గెలిచితి వటకదా!

హరి: అది యేమియు లేదు ఋషికుమారా! విశ్వామిత్రఋషి కూతుండ్రు మాతంగకన్యలను నన్ను పెండ్లాడుమనెను. నే నిష్టపడ లేదు. అంతే.

నక్ష : తలమీద దన్నిగా నీకు కోపము రాలేదట గదా !

హరి : కోపమా ? యెవరిమీద ?

నక్ష : తన్నినవారిమీద.

హరి : తన్నిన దెవరు ? విశ్వామిత్రఋషి. ఆయనమీద గోపమా ?

నక్ష : నేను తన్నెదను. వచ్చునా ?

హరి : స్వామీ ! నీవు ఆ ఋషితరువాత నాఋషియంతటి వాడవు. నీమీదమాత్ర మెట్లు వచ్చును ?

నక్ష : మరి యింకెవరిమీదనయిన వచ్చునా ?

హరి : ఎందుకు రావలయును స్వామీ ! ఆతలివానికి గోపము వచ్చియేకదా తన్నుట? ఆ కోపము చాలదా : ఒక జీవి కలుషిత మార్గమున బోవుటకు. మరియు నింకొక జీవి యా కలుషపథమునసే యేల పోవలయును?

నక్ష : అట్లనెడువాడవు నీవు తప్పక యూరకుందువు—సరె. కామక్రోధలోభములను గెలువలే దందు వేమి ? గెలిచితిని, గెలువ లేదు. అది నా కెందుకు ? నీవు మా గురువుగారి కప్పుపడినావట. నన్ను వసూలుచేసికొని రమ్మన్నారు.

హరి : ఒక నెలనాళ్లు గడువడిగినాను. ఈ నెలనాళ్లు మీరు మాతో కలియో, గంజియో త్రావియుండవలయును.

నక్ష : ఈ యడవిలో నదికూడ దొరకునా ?

హరి : అంతకంటె మంచివియే దొరకును. ఆరమగిన ఫలములు, సెలయేటినీళ్లు దొరకును. అంతకంటె గావలసినదేమి ?

నక్ష : నాలుక కొక రుచి. అదియుగాక రాజా ! నీవు సర్వ భోగము లనుభవించినవాడవు. అందుచేత నీకు విసుగెత్తి యడవిజీవి తమునం దభిరుచి యేర్పడియుండవచ్చును. మేమెప్పు డడవిలోనే యుంటిమి. మాకు రాజభోగములు కావలయు ననిపించును.

హరి : మీ కీకష్టము మాతో నొక్క నెలనాళ్లుమాత్రమేకదా !

నక్ష : ప్రాణములు పోవుటకు నొక్క నెల చాల యెక్కువయినకాల మది తెలియునా ?

హరి : పరమేశ్వరుని దయ లేనిచో నంతియే స్వామీ !

నక్ష : సరే, చాలదూరము నడచితిమి. ప్రొద్దు క్రుంకినది. ఈ యడవిలో ప్రొద్దు క్రుంకకముందే క్రుంకునయ్యా ! ఈ యడవిలో పండుకొనున దెక్కడ ?

హరి : ఈ చెట్టుకొమ్మలు వ్రాలి జీబుగా నల్లి యిల్లు కట్టి నట్లున్నది. ఈలోపల బాగుచేసెదను. మీరు మువ్వు రిందు నిద్రించుడు. నేను రక్షించుచుందును.

నక్ష : మరి తిండిమాట యేమి చెప్పితివి ?

హరి : ఇవిగో ఫలములు. సుంతదూరాన జలము ప్రవహించు సవ్వడి వినవచ్చుచున్నది. పోయి జలము తీసికొనివత్తును.

నక్ష : ఈలోపుగా మ మ్మెపులియైన వేసికొనిపోవుచో ?

హరి : స్వామీ ! పులులు మనుష్యుల జోలికి రావు. వానిని జూచిన మనుష్యుల కెంత భయమో, మనుష్యులను జూచిన వానికి నంత భయము. ఇంతలో వచ్చెదను.

(పెద్ద కేకలు, అరపులు)

నక్ష : అమ్మయ్యో ! దయ్యాలు. భూతాలు. నే నీచెట్టుక్రింద నిదురపోను.

హరి : ఎందు కీభయము ఋషికుమారా !

నక్ష : ఎందుకేమిటయ్యా ! కనులు లేవా ? వాడెవడో భేతాళుడు. అంత కోరలు. అంత కనులు. చేతిలో నంత కత్తి. అమ్మయ్యో !

హరి : నక్షత్రకా ! భయపడకుము. నీవు దయ్యము లను చుంటివి. భేతాళు డనుచుంటివి. నా కెవ్వరును కనిపించుటలేదు.

నక్ష : కనిపించుట లేదా ! నేనబద్ధము చెప్పుచుంటి నందువా?

హరి : శివశివా ! నే నామాట యందునా ! నాయనా, లోహితా ! నీ కాదయ్యములు కనిపించుచున్నవా !

లోహి : నాయనగారూ ! మొదట గనిపించినవి. ఇప్పుడు కనిపించుట లేదు.

హరి : దేవీ చంద్రమతీ! నీ వాదయ్యములను జూచితివా ?

చంద్ర : స్వామీ ! ఈ కర్రవా డరచుచుండగా దూర దూరాన నేవో వికారాకారములు భాసించి మాయమైన ట్లున్నది.

నక్ష : ఓయి హరిశ్చంద్రుడా ! మా ముగ్గురకు గన్పించెను గదా ! నీ కేల కన్పించలేదు?

హరి : ఇది వట్టి మోహము.

నక్ష : అనగా ?

హరి : భ్రాంతి.

నక్ష : అనగా నీవు దయ్యాలు లేవందువా !

హరి : భ్రాంతిమతుల కుండును.

(పాట)

గళదసృక్సంఘాతకంఠాంతరప్రాణ
దళనఘోరమ్ము మద్దంష్ట్రాప్రమాణమ్ము
వక్షోవిమర్దనభ్రష్టాంత్రమాలికా
నిక్షిప్తశీర్షమ్ము నిస్త్రింశకము నాది
త్రుణ్ణాంగసంచయక్షోదనాదార్భటీ
దణ్ణంధణధ్వానదర్పమ్ము నాగద.

నక్ష : ఓరి బాబోయి ! యీ భేతాళుడు తన కోరలతో, కత్తితో, గదతో నాప్రాణములు లాగునట, నాగుండె క్రుమ్మునట, నాశరీరము చిదుకబొడుచునట.

హరి : వటూత్తమా ! భయపడకుము.

నక్ష : హరిశ్చంద్రా ! నీ కాళ్ళూతములు కనిపించలేదు సరే. ఆ ఘోరాళు పన్న మాటలు నీకు వినిపించనే !

హరి : నాకు వినిపించలేదు.

నక్ష : ఓయిరాజా ! నీకు కను లున్నవా ! చెవు లున్నవా ! నీవు మనుష్యుడవేనా ! నీవు బ్రతికియున్నావా !

హరి : ఓయి బ్రాహ్మణబాలుడా ! నాకు కను లున్నవి, లేవు. చెవులున్నవి, లేవు. బ్రతికియున్నాను, లేను. ఇదియంతయు భ్రాంతి కదయ్యా ! కను లేమి చూచును. చూచునది లోనున్న జీవుడు. బ్రదుకుట యేమి, చచ్చుట యేమి ? ఈశరీరమునుండి జీవుడు తనదారి తాను పోగా చచ్చిపోయె ననుకొనుదురు. ఎవడు చచ్చిపోవును ? ఇది యంతయు నొక మహామోహము.

నక్ష : అయ్యో ! నాగురువు నాతో నబద్ధము చెప్పెను గదయ్యా !

హరి : ఆయన యేమి చెప్పెను ?

నక్ష : నీవు కామక్రోధలోభములను మూడింటినే గెలిచితి వని చెప్పెను. అయ్యో ! నీవు మోహమునుగూడ గెలిచితివి. ఓయి ! రాజా ! మోహమును గెలిచినవాని కరిషడ్వర్గ జయము సులభము. మదమాత్సర్యములను గెలుచుట నీ కెంతటి పని ?

హరి : తెల్లవారవచ్చుచున్నది. బయలుదేరిపోదమా ?

నక్ష : ఎక్కడకు ?

హరి : స్వామీ ! ఎక్కడకా ? ఎల్ల జీవులు-ముక్తి వాంఛించు నెల్ల జీవులు ఎప్పటికి బోదురో అక్కడకు. కాశికాక్షేత్రమునకు. అవిముక్తభూమికి. శ్రీ విశ్వేశ్వర సన్నిధానమునకు.

నక్ష : శివుడు నీకేమైన బాకీయున్నాడా ?

హరి : ఆయన నాకేమియు బాకీలేడు ప్రభూ ! నేనే ఆయనకు బాకీయున్నాను.

నక్ష : ఈమాట నాకు గురువు చెప్పలేదే. ముందు మా బాకీ తీర్చి తరువాత నాయనబాకీ తీర్చుము. నీవు సంపాదించెడు ధనమంతయు నాయనఋణమునకే సరిపోయినచో నేనేమి చేయగలను ?

హరి : బ్రాహ్మణవటూ ! ఆయనఋణము ధనఋణము కాదు. మాయ యను నొకవస్తువుకాని వస్తువు నా కాయన యిచ్చినాడు. మరల నాయనది యాయన కిచ్చివేయవలయును.

నక్ష : అయినచో నిన్నుగురించి మే మెక్కువ జాగ్రత్త పడవలయును. సరేగాని హరిశ్చంద్రా ! ఇదిగోనయ్యా ! కాశికాపురము. అదిగో మందాకినీనది.

హరి : అదుగో శివుడు మహాకాలుడు.

నక్ష : మహాకాలు డనగానేమి ?

హరి : వటూత్తమా ! కాలము ఖండకాలము, అఖండకాలము అని రెండు. సూర్యాదిగ్రహచారముచేత కలుగునది ఖండకాలము, నిత్యమయినది, మార్పు లేనిది అఖండకాలము. పరమేశ్వరుడు తత్స్వరూపము.

నక్ష : దినములు, నెలలు, సంవత్సరములు ఇవన్నియు నబద్ధమన్నమాట.

హరి : నిజము వటూత్తమా. పరమమైన యసత్యము.

నక్ష : అయినచో నీవు మాగురువు గారి కిత్తునన్న ధనము వెంటనే యిమ్ము. అసత్యమైన కాలపు గడువు పెట్టిన దెగవేయుటకా ?

హరి : కాదు, స్వామీ !

నక్ష : అయినచో వెంటనే యిమ్ము.

హరి : స్వామీ ! నావద్ద నేమి యున్నది ? నాకు మిగిలిన యాస్తి యీ యిద్దరు—నా భార్యయు, నా పుత్రుడును. ఈరి నమ్మి నీ ఋణమును తీర్చుకొనుము.

నక్ష : నే నమ్ముట యెందులకు ? నీవే యమ్ముము. నా కిదొక బాధయా ?

హరి : చిత్తము స్వామీ ! నేనే యమ్మెదను.

నక్ష : అమ్మకో ! ఏమని యమ్మెదవు ?

హరి : ఈమెను దాసిగా నిచ్చెదను, కొనుమని యడిగెదను.

నక్ష : ఈమె యెవరు ?

హరి : నా భార్య.

నక్ష : నీ పేరు ?

హరి : నాపేరు హరిశ్చంద్రుడు. నేను పూర్వ మయోధ్యా రాజను. నా రాజ్యము పోయినది. నేను విశ్వామిత్రునికి ఋణపడి యా ఋణము తీర్చలేక నాభార్య నమ్ముచున్నాను.

నక్ష : ఛీ ! ఛీ ! నీవేమిటి ! హరిశ్చంద్రమహారాజు వేమిటి ? ఈమె నీభార్య కాదు. ఎవరినో యెత్తుకొనివచ్చి యిట్లమ్ముచున్నావు. పద, నిన్ను రాజభటుల కప్పజెప్పెదను.

హరి : కాదు స్వామీ ! నేను హరిశ్చంద్రమహారాజునే. ఈయన, యిదుగో, నక్షత్రకుడు. విశ్వామిత్రుని శిష్యుడు. ఆ ముని తన ఋణధన మీయనచేతి కిమ్మని నావెంట బంపినాడు;

నక్ష : ఈ దొంగవటువు వీడెవ్వడు ? వీడు నీతో సరికా ! నడువుడు నడువుడు. ఇద్దరును రాజసన్నిధికి నడువుడు.

హరి : ఓయి నక్షత్రకా ! అందరును ఇట్లే అందురా ! కొందఱెవరో యందురు. నిజముగా హరిశ్చంద్రమహారాజే నేమో. లేనిచో నింత ధైర్యముగా దన భార్యయని యమ్మజూపునాయని.

నక్ష : అట్టివారేమి, యిట్టివారు నుండవచ్చును. ఓరీ ! యీ హరిశ్చంద్రు డెంత సిగ్గులేనివాడు ? ఎంత రోషములేనివాడు ? ఎంత లజ్జాభిమానములు చచ్చినవాడు ? ఇంత బ్రతుకు బ్రతికి ఛీఛీ యీ

పనియా చేయుట? ఏమొగము పెట్టుకొని భార్య నమ్ముదును అని యయిన ననుకొనలేదేమిరా యని.

హరి : వటూత్తమా ! మద మనగా నెట్లుండునో తెలియునా !

నక్ష : ఎట్లుండును ?

హరి : సరిగా నీవన్నట్లుండును. నే నింతవాడను, నావద్ద నింతధన మున్నది, నే నింత విద్యావంతుడను, ఇది చేయుట నాగౌర వమునకు తక్కువ—మదముకలవా డిట్లూహించును.

నక్ష : అనగా నీవట్లూహించ వన్నమాట.

హరి : పూర్వ మెప్పుడో నేను హరిశ్చంద్రమహారాజును. అప్పుడెప్పుడో నాకు రాజ్యమున్నది. రాజ్యమున్నచో భార్యనే అమ్మనక్కరలేదు. రాజ్యము లేనపు డిట్లూహింపనేల ?

నక్ష : ఇప్పు డిట్లూహించుట మదమా, అప్పు డిట్లూహిం చుట మదమా ?

హరి : అప్పు డిట్లూహించుట మదము. ఇప్పు డిట్లూహించుట మదముయొక్క ఆభాసము.

నక్ష : ఆభాస మనగా ?

హరి : అదియు నటువంటిదే ! అంతకంటె హీనమైనది.

నక్ష : ఆహా ! నాకు తెలిసినది.

హరి : ఏమి తెలిసినది వటుసార్వభౌమా !

నక్ష : నీవు మదమునుగూర్చి గెల్చితినని చెప్పుచున్నావు.

హరి : అట్లు చెప్పుట లేదయ్యా స్వామీ ! నాకు మద మున్నచో సాగుట యెట్లని మనవిచేయుచున్నాను.

నక్ష : ఓయి బాబోయి ! ఇంత డొంకతిరుగుళ్లు నాకు మాటలతో చేతగావుకాని నీభార్య నమ్మి నా అప్పు నామొగాన బారవేయుము.

(కీర్తన)

హరి :

నే హరిశ్చంద్రమహారాజన్
నీరజాతాక్షి యిది నెలత నా కో ప్రజలు-నే హరి-
గాధిజున కే నప్పుపడితిన్
నా ధరిత్రికి నెల్ల జెడితిన్.
మునిఋణము తీర్పజాలను లేక యమ్ముకొం
చున్నాను దయచూడు డన్నా నయా ప్రజలు-నే హరి-
గతిమాలితే హరిశ్చంద్రా
మతిపోయెనా తమస్సాంద్రా
అందురా నిజముగా ననదగినవాడనే
సుందరాంగిని వచ్చి చూచి కొను డో ప్రజలు-నే హరి.

నక్ష : మహారాజా !

హరి : ఆ. ఏమి స్వామీ !

నక్ష : ఆ వచ్చుచున్నాడే బ్రాహ్మణుడు. ఆయనను నే నెరు గుదును. ఆయనపేరు కాలకౌశికుడు. ఓరి వాని దుంప తెగ! వాని యంతలోభి వాడేనయ్యా! వాడు కొనునట్లు చేయవలయును. ఎవరినో యొకరిని మోహపెట్టవలయును. లేనిచో నెవరు కొందురు ?

హరి : స్వామీ ! మోస మెందుకు? నే నాయనను పిలిచి యడిగెదను.

నక్ష : అయినచో బేరము కుదిరినట్లే !

హరి : ఆతలివానిని మోసముచేయబోకుము. నీవు మోసపడ వచ్చును. నీవు న్యాయముగా నుండుము. ఆతలివాడును నీయందు మోసము త్యజించును.

అయ్యా ! కాలకౌశికా !

కాల : ఎవరయ్యా మీరు ?

హరి : స్వామీ ! నాపేరు హరిశ్చంద్రమహారాజు.

కాల : ఛీ ఛీ ! నీవా ! నీ మొగము చూడరాదు.

హరి : ఏమి ప్రభూ ! ఏమి తప్పు చేసితిని ?

కాల : అయ్యో ! అంతకంటెనా ! మన ప్రతిష్ఠ మనకంటె ముందే కాశికాపురము ప్రవేశించినది. విశ్వేశ్వరస్వామియాలయ ములో జేగంటగా మ్రోగుచున్నది.

హరి : అయ్యో ! ఇంతమాత్రమునకేనా ! గుడిలోన నేక దా ప్రవేశించినది. స్వామిలో ప్రవేశింపలేదు కదా ! అట్టి పనినికూడ జేయుచున్నాను. బ్రాహ్మణోత్తమా! ఈమె నాభార్య, పేరు చంద్ర మతి. నేను విశ్వామిత్రమహర్షికి ఋణపడ్డాను.

కాల : చదువకు. చదువకు. నాకంతయు దెలియును. మరి యిపుడు భార్య నమ్ముచున్నావా !

హరి : చిత్తము.

కాల : చిత్తము. భార్య నమ్ముచున్నావూ ! ఓరి ఘట కుడా ! నేను వచ్చితినిగనుక సరిపోయినది. కానిచో మాలవానికైన నమ్మెడివాడవే !

హరి : ఏమి విప్రోత్తమా ! మాలవాడు మనుష్యుడు కాడా !

కాల : అయ్యో : ఎందుకు కాడు ? నీవే యయినపుడు వాడేల కాడు ? వాడు నీకన్న వేయి రెట్లు నయము. వాడు పెండ్లాము నమ్మడు.

హరి : అవును స్వామీ ! నాకంటె నీ దృష్టిలో ... నెవ్వడు నయము కాడు ?

కాల : ఈమెవెల యెంత ?

హరి : ఇదిగో ఈ నక్షత్రకునకు తెలియును.

కాల : సరే ! ఇంతటి యందకత్తె కెంత యిచ్చిన సరియు వచ్చును. ఇత్తును. మరి భార్య నమ్ముట యనగా నేమో తెలియునా!

హరి : అదియేమో అదియెందుకోలో నున్నది.

కాల : నీకు తెలియదు. తెలియజేసెదను. ఒసేవు చంద్రమతీ! యిట్లు రా.

చంద్ర : స్వామీ! చిత్తము.

కాల : ఓసి దురాత్మగురాలా ! నీకు బుద్ధిలేదా ! నీవు మనిషివా ? పసువవా ?

చంద్ర : స్వామీ ! ఆజ్ఞాపింపుడు.

కాల : ఆజ్ఞాపింపవలయునా ! బుద్ధిలేనిదానా ! చెప్పకుండ తెలిసికొనలేవటే మందమతీ! నా కాలిన మన్నున్నది. కడుగ నక్కరలేదా ?

చంద్ర : చిత్తము.

కాల : ఓసి చవటదద్దమ్మా ! పైటతో తుడిచెదవేమే ! ఓ యమ్మ సుకుమారీ ! చేతులేమి విరిగిపోయినవా ! రోగమా ! నడుము వంచలేవా ! రాచకూతురయ్యా, రాచకూతురు ! మహారాణి ! పూట కూటికి టికాణాలేదు. నాజూకు పోవుచున్నది. వీపు పగులునట్లు వేయురా ! ఏయి ! తెలిసినదా ! మనదగ్గర నీయాటలు సాగవు. బోలెడంత డబ్బు పోసి కొన్నాను. ఇదిగో గడ్డితిను అన్నచో దిన వలసినదే. ఉచ్చనీచాలు ఇటువంటివి మనదగ్గర లేవు. నాకు కోపము వచ్చినచో గొడ్డును బాదినట్లు బాదినానే. ఓసి నక్కా ! ఏమిచూపులే. అబ్బో ! వంగనాచి రా ! మాటంటే సహదు. ఏమి రోషము! రోషమేమిటే ! రోష మెందుకు! దమ్మిడీకి అమ్ముడువచ్చినదానవు. నేను చేతులార బోసిన సొమ్ము నీయమ్మ మగనిసొమ్మనుకున్నావా ! అంతే ! ఏమనిననుసరే. కుక్కిన పేను వలె జచ్చిపడియుండవలసినదే. కుయికుమన్నావా ! వెన్నుపాము విరుగును. మాడుచెక్క పగులును. చావు. అంతే. ఏమి దయా ! నీవనగా ! దయ యెందుకు? నీవొక పనిముట్టువు. పూచికపుల్లలూడినచో నెంత దిగులో నీవు దుఃఖపడినచో నా కంత దిగులు. నీవు శ్రమపడినచో నా కంతదిగులు. ఏమిటి ! యేడ్చుచున్నావా ! నోటిలో రోకలిబండ క్రుక్కెదను. ఏదీ, యేడుపు బయటకు రానీ, చెప్పెదను.

నక్ష : కాలకౌశికా ! చాలులేవయ్యా ! నట్టనడివీథిలోననే యింత చేయుచున్నావు, ఇంటికి దీసికొనిపోయి యింకెంత చేసెదవో ?

కాల : చేయక ముద్దుపెట్టుకొనెదరయ్యా ! హరిశ్చంద్రమహారాజా ! భార్య నమ్ముట యనగా నేమో తెలిసినదా !

హరి : తెలిసినది మహాస్వామీ !

కాల : తెలిసికూడ నమ్మెదవా !

హరి : తెలిసికూడ నమ్మితిని స్వామీ !

కాల : ఓరీ బ్రతికి లేనివాడా ! తాను పెంచుచున్న కుక్క నెవరైన క్షేమైన వనిసను లోక మోర్వలేదే ! చేసికొన్న భార్యను నే నిట్లు చేయుచుండగా నీ మొగముకూడ గందలేదు. అరే! యెంత మాత్సర్యము లేనివాడవు. మన వస్తువును పెఱవాడు తనదిగా జూడగా నిరాకరించగా నిరస్కరించగా కొంచెము కాకపోయిన గొంచెమయిన ను మత్సరత్వము పూననివానిలో బ్రాణమున్నదని చెప్పుటకు వీలు లేదు.

నక్ష : ఓయి కాలకౌశికుడా ! నీ వింక చంద్రమతిని తీసికొని పొమ్ము. హరిశ్చంద్రా! నే నెంత బుద్ధిహీనుడను.

హరి : ఏమి నక్షత్రకా ! అట్లనెదవు ?

నక్ష : పోనీవే, నా గురువుకన్న బుద్ధిహీనుడను కాలేదు.

హరి : శివ శివ ! అవి యేమిమాటలు ?

నక్ష : సరేలే. నాగురువుయొక్క కనులయెదుటనే నీవు కామక్రోధలోభములను ముగ్గురను గెలిచితివి. నా యెదుట మోహ మదమాత్సర్యములను గెలిచితి వనుట తప్పేమి ? ఆయనముందు నే నెంతవాడను! ఆయనకే పోరాగతము లేదు, నాకా ?

హరి : ఏమి నక్షత్రకా ! నామీద గోపముగా నున్నదా ?

నక్ష : కోపముగా నున్నదా ! నెమ్మదిగా నడుగుము. సరే. నీ కుమారు డేడి?

హరి : వాని తల్లి వెంట బడి పోయినాడు.

నక్ష : ఓహో ఆలాగా? భార్య నమ్మితివా; కొడుకును గూడ నమ్మితివా !

హరి : స్వామీ ! నాభార్య నన్ను పరిత్యజించిపోయినదా ! నా కొడుకును నాకు వదలిపెట్టి పొమ్మనుటకు?

నక్ష : ఏమిటి? చెప్పవు ! ఇంకను నీభార్య నీకు భార్యయని యేనా నీ యూహ ?

హరి : స్వామీ ! ప్రాణమున్నంతవరకు నా భార్యయే.

నక్ష : ఆమాత్రమైన నున్నావు. అక్కడ నాగుము.

హరి : సరి నేను సెలవు తీసికొందునా ?

నక్ష : సెలవా ! విశ్వామిత్రుని ఋణము మాట యేమి ?

హరి : కాలకౌశికుడు తీర్చెనుగదా ?

నక్ష : ఇదుగోనయ్యోయి ! నీకు బ్రతికియుండగా బ్రపంచ జ్ఞానము కలుగదు.

హరి : బ్రాహ్మణాశీర్వచనము.

దూరదృష్టి:

చైనాదేశస్థుడు తను సుఖంగా ఉన్నప్పుడు వైద్యుడికి డబ్బు చెల్లిస్తూ జబ్బుగా ఉన్నప్పుడు చెల్లించటం మానుకుంటాడు. ఇది హేతుబద్ధంగానే కనిపిస్తుంది.

వ్యాపారస్థులు, అంతా అయి వ్యవహారం పేచీలలోకి దిగినప్పుడు కాక ముందుగానే చట్టసమ్మతంగా తాము చేయదగినది తెల్పేందుకు లాయర్లకు డబ్బు చెల్లిస్తారు.

ప్రమాదాన్ని నివారించేందుకుగాను నౌక హార్బరులోనికి ప్రవేశించుటకు ముందే పైలటు నౌకలోకి ఎక్కవలెనని నావిక శాసనం నిర్దేశిస్తుంది.

అనుభవజ్ఞానం తెల్పే దేమంటే **జీవితభీమా** చేసేందుకు సమయం దానితో మీ కవసరం కల్గటానికి పూర్వం, మీకు మంచి ఆరోగ్యం కలిగి దానిని పొందగలిగి ఉన్నపుడు. మీ జీవితనౌక గట్టు తప్పేవరకు గాని, గుట్టలకు కొట్టుకునే వరకు గాని విలంబనం చెయ్యకండి. నేడే పూర్తి చెయ్యండి, ఏమంటే రేపు అనేది రాకపోవచ్చు.

ఇండస్ట్రియల్ అండ్ ప్రూడెన్షల్ అష్యూరెన్సు కంపెనీ, లిమిటెడ్

(స్థాపితము 1913)

హెడ్డాఫీసు:
ఇండస్ట్రియల్ అష్యూరెన్సు బిల్డింగ్,
ఫోర్టు, బొంబాయి.

మద్రాసు బ్రాంచి:
బ్రాంచి మేనేజరు,
10, లింగిచెట్టివీధి, జి. టి.



రుద్రజట

RUDRA JATTA

తలనూనె

వెండ్రుకలను పోషించును, పెంపుచేయును. నెరసిన జుట్టును నల్లగ నిగనిగలాడునట్లు చేయును.

సోల్ ఏజంట్లు:

వసుంధరాస్

91, తైయప్పమొదలివీధి జి. టి. మద్రాసు.

JAI HIND PUBLICITIES.

స్వతంత్ర భారతం

1947వ సంవత్సరం ఆగస్టు 15[illegible] స్వతంత్ర [illegible] భారతదేశ [illegible] అత్యంత శక్తివంతమైన [illegible] తెలుపబడినది.

రాజ్ – జ్యోతిషి

పండిత్ హరిశంకర శాస్త్రి, జ్యోతిష్య, తాంత్రికాచార్య, [illegible] జాలీ [illegible].

హవుస్ ఆఫ్ ఆస్ట్రాలజి

141/1C. [illegible] కలకత్తా 26

([illegible])

ఫోను: [illegible]

ప్రాచ్య ప్రతీచీ ఖగోళ, జ్యోతిష, ఆధ్యాత్మిక [illegible] మీ భూత భవిష్యత్ వర్తమాన ఫలము [illegible] మీ [illegible] తాంత్రిక [illegible] వ్యక్తికి [illegible].

శాంతి కవచ [illegible] 5/- [illegible] స్పెషల్ ([illegible])

బగళ కవచ [illegible] ప్రయోజనము పొందడానికి, [illegible] ఉపయోగిస్తుంది. సాధారణపుది రూ 12/-లు స్పెషల్ (శీఘ్ర ఫలము [illegible])

నృసింహ కవచ శ్రీ[illegible] బుద్ధిమాంద్యము [illegible] రూ 10/-లు. స్పెషల్ (శీఘ్రఫలము [illegible]) రూ 29/-

ఆకర్షణ కవచ ఏ స్త్రీ [illegible] అసాధారణ [illegible] సాధారణపుది రూ 12/-లు స్పెషల్ (శీఘ్రఫలము గలది) రూ 50/-మాత్రమే.

ఈ తాయెత్తులు, తాంత్రికవిధులు మొదలైన వాటివల్ల పూర్తిగా తృప్తినొందిన వారిలో కొందరు:

మిస్టర్ ఫజుల్ హక్, [illegible] ప్రధానమంత్రి, బెంగాల్; [illegible] ఎ. [illegible] బహదూర్, నేపాల్ రాణా; మిస్టర్ పి. ఆర్. దాస్, బార్-ఎట్-లా, పాట్నా; మిస్టర్ జె.డి. టాటా, బొంబాయి; శ్రీయుత ఆనంద ప్రసాద్ సింఘా ఎం.ఏ.,బి.ఎల్., కలకత్తా, బర్ద్వాన్; శ్రీ యుత రోహిణికుమార్ చౌదరి, మెంబర్, కాన్స్టిట్యూయెంటు అసెంబ్లీ; శ్రీయుత ఉపేంద్రనాథ్ బర్మన్, మెంబర్, కాన్స్టిట్యూయెంటు అసెంబ్లీ; మిస్టర్ రామేశ్వర్ లాల్, బికనీర్ స్టేట్; డాక్టరు కలనల్ పి. చౌదరి, అలహాబాద్; పండిత [illegible], ఎఫ్. ఐ. సి. [illegible] లాహోర్, ఎఫ్. ఎఫ్. ఆర్. ఎస్. (లండన్); మిస్టర్ రఘునాథ్ సింఘా, ఢిల్లీ; మిస్టర్ ఎ. చాండ్లర్, ఇంగ్లండు; మిస్టర్ ఎఫ్ జి. వైట్, దక్షిణాఫ్రికా; మిస్టర్ డబ్ల్యు హెచ్ [illegible] 826, వాషింగ్టన్ అవెన్యూ యు. ఎస్. ఎ., నిట్ హైదరాబాద [illegible], [illegible]; రామశరణదాస్, [illegible], వె[illegible]లాల్ వకీలివాల్, జయపూర్ సిటీ, ఇంకను చెప్పను వేలకొలది.

హౌస్ ఆఫ్ ఆస్ట్రాలజి వారితో సంప్రతించి దేశభక్తి సృష్టించును సమర్పించండి.



దేవాలయ ప్రాంగణాన



ధూర్తభ్రమరము

చిత్రకారుడు : శ్రీ కౌతా రామమోహనశాస్త్రి

నక్ష : అది చాల సమృద్ధిగా నున్నది. నాసంశేమి? ఆ ధన మంతయు నా భృత్యుపు బిర్చుక్రింద నేను తీసికొన్నాను. మునిఋణ మట్లే యున్నది.

హరి : స్వామీ! నన్నేమి చేయదలచినావు?

నక్ష : నీవు బ్రతికియు జచ్చినట్లేగదా! చచ్చినవాని నేమి చేయుదురు?

హరి : కల్లకాటికి జేర్చుదురు.

నక్ష : సరిగా నదియే చేయబోవుచున్నాను.

హరి : చేయుము

నక్ష : నిన్నమ్మి విశ్వామిత్రుని ఋణధనము సంపాదింతును.

హరి : అమ్ముము.

నక్ష : నాచేత గాదు. నీవే నిన్ను అమ్మిపెట్టుము.

హరి : చిత్తము.

(కీర్తన)

చచ్చెనో బ్రదికెనో జనపాలు డీతండు
వచ్చి జనములు వెల యిచ్చి కొనండీ!
కచ్చెపట్టిన వానిని గాధిజు ఋణధన
మిచ్చి జనములు వెలతెచ్చి కొనండీ—చచ్చెనో!
మచ్చర మెఱుగడు మమకార మెఱుగడు
ఇచ్చిన వెల తిరిగివచ్చినట్లే యెల్ల—చచ్చెనో!

నక్ష : హరిశ్చంద్రా! కేకలు వేయుచు నెచ్చటికి వచ్చితిమో తెలియునా? సరిగా శ్మశానమువరకు వచ్చితిమి.

హరి : నీవు కోరినదియు నదియేకదా!

నక్ష : ఈ శ్మశానమునకు నే నొక నామకరణము చేయుచున్నాను.

హరి : మహర్షి శిష్యుడవు. నీ మాట కెదు రెవరాడుదురు?

నక్ష : దీనికే పేమని పెట్టితినో యడుగవేమి?

హరి : చిత్తము. చెప్పుడు.

నక్ష : హరిశ్చంద్రఘట్టమని

హరి : హరిశ్చంద్రఘట్టమా! వటువా! యెందుకయ్యా నన్నవహేళనము చేయుదువు?

నక్ష : నీ వేమి తక్కువవాడవా! శివునియంతవాడవు.

హరి : వటూత్తమా! నేను దరిద్రుడను. మీ యప్పు తీర్చజాలకున్నాను. నన్నెవడును వచ్చి కొనడాయెను. మీ యప్పు తీర్పజాలమి నీవు నన్నింత వెక్కిరించుచున్నావు.

నక్ష : ఏమి నీవు శివునియంతవాడవు కాదందువా!

హరి : స్వామీ! నీదయ. నన్నెవరిచేతనైన గొనిపింపుము. నాభార్యను గొనిపించితివి. నా ఋణమును నీవే విమోచనము చేయ గలయును.

నక్ష : అయ్యో! నీ కోసమా? నా కోసమే. ఇచ్చట వీరబాహుడని యీ శ్మశానపాలకు డున్నాడు. అతడు కల్లు సారాయము లమ్మి చాల సంపాదించినవాడు. ఇంతటివాడు మరియొక్క డీయన గలడు? ఈ ముక్తిక్షేత్రములో నే నెఱుగనివారు లేరు-తెలియునా!

హరి : సర్వతపోమూర్తిశిష్యుడవు. నీకు ముక్తిక్షేత్రము తెలియదని నే నెట్లనుకొనెదను?

నక్ష : అడుగో వీరబాహుడు.

వీర : ఏందయ్యది!

నక్ష : ఈయన పేరు హరిశ్చంద్రుడు.

వీర : ఇంకేం? తన గట్టంలోకే వొచ్చాడు.

హరి : నక్షత్రకా! నమస్కారము.

నక్ష : ఎందుకయ్యా!

హరి : ఓయి స్వామీ! నీవు ఋషిశిష్యుడ వనుకొన్నాను. నీవు మహర్షి వే. నీ సంకల్ప మిట్లు సమకాలమున భూతకోటికి విదితమగుచున్నది.

వీర : ఏంటంటాడు, అరిచ్చంద్రయ్యా?

నక్ష : ఈయన విశ్వామిత్రఋషికి ఋణపడినాడు. నీ వీయనను దాసునిగా గొని ఆ ధన మీయవలయును.

వీర : దరిద్రపోణ్ణి తెచ్చావు! చరే! లేకపోతే ఋణం ఎట్టా తీరుతుంది? పో. ఇచ్చేస్తాలే. ఇదిగో సంచోయి! దొరగారూ! అరిచ్చంద్రమారాజుగారూ! సీసీ! నీవు నాదాచుడవేటి, నిన్ను దొరా యేటి! ఇదిగో అరిచ్చంద్రయ్యా! ఈ కాటికి నీ వింక అతికారివి. చవం దగలేత్తే నాకు రొండుమూడు లొత్తాయి. నీకు చవం మీది గుడ్డపీలి కొత్తది. ఒక చోలెడు గింజ లొత్తయి. నాయంగా బతుకుచుమా. నేను మా పెద్దోణ్ని. ఎనుకుదినుసొచ్చిందా, మెడకాయమీద తలకా యుండదేయి! పోతుండా. ఒళ్లు దగ్గరెట్టుకు బతుకేం! తెలిచిందా!

హరి : చిత్తము. నన్నేలినవాడా!

వీర : సెబాస్. అదీ తరహా! పోతుండా.

హరి : వటూత్తమా! ఇంక సెలవు. సర్వఋణవిముక్తుడ నయితిని గదా!

నక్ష : అప్పుడే యెక్కడ తీరినది? మునిఋణము తీరినది. మరి క్రొత్తఋణ మేర్పడినది కదా! వీరబాహుని సేవాఋణము. అది యీగవలయును.

హరి : స్వామీ! దీనిని నా శరీరముతో నీగెదను.

నక్ష : ఓయి శ్మశానవాసీ! నీ శరీర మెవరికి గావలయు నయ్యా! పోయి మా గురువుతో జెప్పెదను.

హరి : ఏమని?

నక్ష : మన ఋణము మాత్రము తీరినదని.

హరి : నా కర్ధమగుట లేదు.

నక్ష : దరిద్రున కర్థమెట్లగును? సంపూర్ణ మే యగును. నేను పోవుచున్నాను.

హరి : ఆహా! నక్షత్రకుడు వెళ్లినాడు. ఇది చిత్రముగా నున్నది. భార్యాపుత్రులు వెళ్లి రనిపించలేదు. ఈ బ్రాహ్మణవటువు

వెళ్లినా కనిపించుచున్నది. నిజమే, అతడు చెప్పినదానిలో గొంత నిజమున్నది. భార్యావియోగము, శ్మశానవాసము. అందులో గాశీ క్షేత్రమున. ఇది యొక శివయోగము.

మరి కాలకౌశికు డేమన్నాడు?

అకట శివుగుడి వ్రాగె నా యప్రతిష్ఠ
నాదు హృదయంబునను మ్రోగు నాప్రతిష్ఠ.
చంద్రమతి యేమి యయ్యెను జంటివాడు
లోహితుం డేమియయ్యె నా లోహితుండు?

ఆ మూరాన నే నెఱుగని మంట యెక్కడిది? నాకు దెలియకుండ నెవరైన శవదహనము చేయుచున్నారా! ఓహో! ఎవరు వారు? ఎవరమ్మా నీవు? ఈ యర్ధరాత్రమున నిచట నేమి చేయుచుంటివి? ఇది వీరబాహుని శ్మశాన వాటిక. ఆయనయాజ్ఞ వినా యిచట పురుగు మెదలరాదు. కాటిసుంకము చెల్లించకుండ నిట శవము దహించరాదు. కాటి సుంకము రెండుమాడలు. నా కొక సోలెడు గింజలు. శవముపైని గుడ్డకూడ నాకే వచ్చును.

చంద్ర: అయ్యా! నేను పరమదరిద్రురాలను. వీడు నా కొడుకు. పాము కఱచి చచ్చిపోయినాడు. నే నేమి చేయుదును?

హరి: నేనుమాత్ర మేమి చేయుదును? అంత దరిద్రురాలైనచో నాకు రావలసినవి వదలుకొనెదను. మా యజమానికి పోవలసిన రెండుమాడలు చెల్లించితీరవలయును. అకే! నీకుగాదా చెప్పెడునది? లాగివేసిన కట్టెలు మరల నంటించెదవేమి! ఇదుగో చెప్పుచున్నాను. ధర్మభంగమువలన నాకు గోపము రాగలదు.

చంద్ర: ఏమి, ధర్మభంగమువలని కోపమా! శ్మశానములో నిట్లు మాటాడువా రెవరు?

హరి: ఏమమ్మా, అంత యాశ్చర్యము! పరమశివ నిలయము, సర్వసర్మచరమభూమియయిన శ్మశానమున ధర్మశబ్దశ్రవణ మంత యబ్బురమా!

చంద్ర: అయ్యా! కాదుకాదు. నాదే పొరపాటు. క్షమింపుము. అయ్యా! ఈ బిడ్డతండ్రి యొకనాడు మహారాజు-నే డిట్లయినాడు.

హరి: ఒకనాడు మహారాజు. నే డిట్లయినాడు.

చంద్ర: రెండు మాడలు తేలేను.

హరి: పోయి నీ భర్త నడిగి తెమ్మా.

చంద్ర: అయ్యా! నా భర్త ఋణవిముక్తికై నన్నమ్మినాడు.

హరి: ఎవరికి?

చంద్ర: ఒకబ్రాహ్మణునకు.

హరి: ఆ బ్రాహ్మణు నడిగి తెమ్మా.

చంద్ర: ఆయన యీయడు.

హరి: పాలించుచున్న బ్రాహ్మణు డీయడు. పాలింపని కాటినాయకు డిచ్చును. పో.

చంద్ర: అయ్యో! అంత కఠినత యేలనయ్యా! కొంచెమయిన దయ లేదా!

హరి: నాకా దయలేదు? నిర్గతునకు దయ లేదు.

చంద్ర: ఇది రెండవ మాట.

హరి: నీ వేమనుమానపడుచున్నావో నాకు దెలియును.

చంద్ర: ఏమనుమాన పడుచున్నాను?

హరి: అనుమానము కాదు. నిజమే.

చంద్ర: ఓయి స్వామీ! కడుపున పుట్టిన బిడ్డమీద దయ లేదా!

హరి: చంద్రమతీ! కొంచెమునెప్పు మాటాడించకుము.—

మోహాటవి జరించు సుతుల కోనగిరి
నెత్తమ్మలంపున నృత్యమాడు
ఆశామహాశాఖలందు భ్రమించు బు
త్రులటన్న ఫలముల రుచి మెలంగు
నోయి కపాలి! భిక్షూ! యీ మనస్సన్న
చపలాతిచపలంబు కపివరంబు
శక్తిసేరిట రజ్జుబంధంబునం గట్టి
నీ యధీనంబున నిలుపుకొనవె

బాలచంద్రమః శేఖర! పర్వతేంద్ర
దుహితృ తేజఃకుటుంబి, నిధూతకలుష
పశుపతీ! పల్పు ద్రెంచుక పారపోవు
పసుల బందము లుంచి కాపాడుమయ్య.

ఏమన్నావు? పిల్లవానిని పాము కరచినదా!

చంద్ర: అవునయ్యా! మహారాజా!

హరి: శివాజ్ఞ.

చంద్ర: మరి యిప్పు డేమి చేయుదను?

హరి: ఓసి సర్వదరిద్రుని పెండ్లమా! వీరబాహుడు నాకు పాలకుడు. నీవును, నీ కొడుకును నా పాలనములో లేరు. మీ రితరులు. ఇతరుల కొరకు నేను వీరబాహు నెట్లడుగుదును? నీవు పోయి కాలకౌశికు నడిగి రమ్మా. దయపుట్టి యిచ్చునేమో!

చంద్ర: ఈయనిచో?

హరి: ఈయనిచోనా! మనము పరమశైవులము. శైవుల కీనాటినుండి దహనముకాక ఖననమే ధర్మముగాక.

చంద్ర: పోయి యడిగివత్తును.

హరి: సరే. చంద్రమతి వెళ్లినదా! లోహితుని శవ మిచట నున్నదా! వీడు నాలోనున్న మాయాజీవునకు కొడుకన్న భ్రాంతి కలిపించినవాడా! (నవ్వుచుండును).

రాజభటుడు: ఓయోయి! శ్మశానములోని సంతోషీ! నేను రాజభటుడను. ఈ యాజ్ఞ వినుము.

హరి: నీవు రాజభటుడవా? నీరాజాజ్ఞతో నాకేమియు సంబంధము లేదు. నేను వినను. వినవలసిన పని లేదు. పో.

రాజ: ఇది రాజాజ్ఞ కాదు. వీరబాహుని యాజ్ఞ.

హరి: శిరసావహించుచున్నాను. చెప్పుము. వెంటనే నిర్వహించెదను.

రాజ: ఓయీ! యీమె బాలఘాతకి. నగలమీది యాసచేత రాజశిశువును వధించినది. పరమదురాత్మగురాలు. రాజప్రాసాదమునకు కన్నము వేసి నిదురవోవుచున్న రాజశిశువు నెత్తుకొనిపోయి వాని కంఠము నులిమి చంపినది. వెంటనే సూర్యోదయాత్పూర్వమే దీని శిరశ్ఛేదము చేయవలయునని రాజాజ్ఞ. వీరబాహుడు నీ కీపని నియమించినాడు. ఇదిగో వధ్యురాలు. నేను పోవుచున్నాను.

హరి: ఓసి ధనాశాదూషితురాలా! రమ్ము. ఈ వధ్యశిల నధిరోహింపుము.

చంద్ర: మహారాజా!

హరి: ఎవరు చంద్రమతీ!

చంద్ర: అవును స్వామీ! నేనే. పిల్లవానిని పాము కరచిన నెవరిని నిందింతుము? ఇట్లన్యాయముగ రాజశిశువధ నామీద బెట్టుట కెవరినో నిందించుటకు?

హరి: ప్రియురాలా! నిజమే. ఇది సవ్యాజముగ గనిపించును. కాలకౌశికునింటికి బోనేలేదా?

చంద్ర: లేదు. దారిలోనే యిది జరిగినది. రాజభటులు నన్ను పట్టుకొన్నారు. రాజువద్దకు నను గొంపోవుటయు, మరణశిక్షయు నిమేషములో జరిగినది.

హరి: చంద్రమతీ! నీవు కాశిరాజదుహితవు. నిన్ను రాజు గుర్తుపట్టలేదా?

చంద్ర: ఓయి ప్రభూ! కాశికాపురి తన కూతు నన్నును, అల్లుని నిన్నును బట్టపగలే గుర్తుపట్టలేదు. అర్ధరాత్రమున రాజు తన సోదరెనిగుర్తు పట్టునా?

రాజు: నీవు చెప్పికొనలేదా!

చంద్ర: స్వామీ! నీలోనున్న యాంతరవస్తువునకు జీవలక్షణము పోయి లోకజ్ఞానము లోపించినది.

రాజు: నిజమే. ఎట్లు చెప్పికొందువు?

చంద్ర: మహారాజా! సూర్యోదయము కాకముందు నా శిరశ్ఛేదము చేయవలయును. లేనిచో ధర్మభంగ మగును.

రాజు: నిజమే. కాని యిది చూచితివా! ఇది యెప్పటి కప్పుడే క్రొత్తసుమా. పుత్రేషణము గెలుచుటకు భగవంతుడు సర్పరూపమున సాయముచేసినాడు. దారేషణము గెలుచుటకు సాధ్యము కాని స్థితి కల్పించినాడు. అట్లే నిన్ను రాజభటులే వధింపక పోయిరో! నేను చేతులారా వధింపవలయునా? నిజమే. నాగెలుపు సంపూర్ణమైనది కావలయును. సవ్యాజ మేల గావలయును?

ఇట్లు రమ్ము. ఈ వధ్యశిల నధిరోహింపుము.

ఈ దుఃఖమే మోహము. అవిముక్తభూమియందు మరణించిన నా భార్యాపుత్రులకు శివసాయుజ్యము కలుగును.

విచారించవలసిన పనిలేదు.

ఇదిగో నాకత్తిచివర దారేషణనిరాసము లగ్నమైయున్నది.

శివశివ శంభో మహాదేవ!

విశ్వా: రాజా! ఆగుమాగుము.

రాజు: ఎవరు నీవు?

విశ్వా: నేను విశ్వామిత్ర మహర్షిని. శునశ్శేపుని జీవరక్ష చేసినవాడను. త్రిశంకునికొఱకు రెండవ స్వర్గము నిర్మించినవాడను. సర్వదేవతలను దిరస్కరించి బ్రహ్మర్షినైనవాడను.

రాజు: ప్రభూ! తూరుపురేక లాడుచున్నవి. కొంచెము తొలగి నిలువుడు. ఈ ధర్మనిర్వహణము సూర్యోదయాత్పూర్వము చేయదగినది. తరువాత భవత్సపర్యాబుద్ధి నగుదును.

విశ్వా: ఏ ధర్మనిర్వహణము? భార్యను వధించుటయా!

రాజు: స్వామీ! భార్య యెవరు? భర్త యెవరు? ఇది యొక పెద్ద భ్రాంతి.

ఈ శరీరంబు లేదను మెట్టులుండు
నపుడు జీవుడు వాని భార్య యని యెవరు?
కొడు కెవరు? తత్స్వరూప మే కడిది; దేహ
గత పరిభ్రాంతి కల్పితాగత మఖిలము.

విశ్వా: సర్వధర్మము శరీరస్థితి కల్పితము. నీవు ధర్మమని దేవులాడుచున్నావు గదా!

హరి: అట్లు లేదు. బ్రహ్మర్షీ. సర్వము శివాధీనము. శివకైంకర్యము. శివతేజోవిక్రియావిశేషమే. నేను చేయునది లేదను నిశ్చయమే యున్నది.

విశ్వా: మరి యపుడు భార్యను జంపనక్కరలేదు. ధర్మము చేయుచున్నా ననుటయు భ్రాంతియే. నీ కొడుకును బ్రతికింతును. నీ రాజ్యము నీకిత్తును. లేచిరా. అంతటి రాజ్యభోగ మేల వదలికొందువు? నా కూతుండ్రను మాతంగకన్యలను వివాహమాడుము. భ్రాంతియని తెలిసి చరించుటలో భ్రాంతి లేదుగదా.

హరి: ఇది యంతయు సౌఖ్యము కావలయు ననుకొనినగదా కావలసినది. ఈ సౌఖ్యము భ్రాంతిజన్యమని తెలిసినపుడు సౌఖ్యమే లేదు. మరి దేనికోసర మీ సంత.

విశ్వా: నీ వరిషడ్వర్గము గెలిచితివి. ఈషణాత్రయమును గెలిచితివి. నీవు జీవన్ముక్తుడవు.

హరి: స్వామీ! నాకదియేమియు దెలియదు. నేనా! నేను లేనే. ఓహో యిది యేమి. ఇది శ్మశానము కాదు, కైలాసమా? ఈ వధ్యశిల నందిమూపురమా? ఈ చంద్రమతి పార్వతీ దేవియా? ఈ లోహితుడు విఘ్నేశ్వరుడా?

విశ్వా: నీవు శివైకదేశమవు.

హరి:

శివోఽహం శివోఽహం శివోఽహం శివోహం
నతోఽహం నతోఽహం గతః ఽహం స్థితోఽహం
యదా భ్రాంతిమచ్చేతసాఽహం విధూతః
తదా జీవఏవాహ మద్యాభవోఽహం.

ఓం.

కథానిక

తొలిచూలు

'శ్రీపతి'

"ఏమయ్యా...అత్తయ్యా...ఏమంటోంది కోడలు? మరిడెగాగి పక్కింటు వెళ్ళారా...వూళ్ళోనే ఉన్నారా?"

"వాడి కేమే...ఈ కట్టె కదలాడుతూ ఉన్నంతకాలం వాడికి ఇంటిగొడవే పట్టదు. వాడేమో, వాడి ఉద్యోగమేమో! కాస్త ఇంటిసంగతి చెప్పుకుందామన్నా క్షణం ఇంటిపట్టున ఉండడు. ఏం చెప్పినా 'ఆఫీసుజవాను వస్తాడు' అని దులపరించుకుపోతాడు."

"అవునత్తా! మావారూ అంతే. ఏమన్నా అంటే 'నువ్వు పోయి సంపాయించుకురా. నేను ఇంట్లో మహారాజులాగా కూర్చుంటాను. ఆఫీసుకు పోతే ఆగొడవ, ఇంటికి వస్తే ఈ గొడవ! సంపాయించుకువచ్చి పోస్తుంటే సంసారం నడుపుకునే వోపికలున్నా లేదు' అని నానాతాపనార్థాలూ పెడ్తారు"

"ఎంత ఉద్యోగాలు చేస్తేమటుకు కొంపా గోడూ అక్కర్లేదా? సీతమ్మకొడుకు చూడరాదూ! వాడు తాసిల్దారట్ట. గడప కదిలినట్టే ఉండడు. సమస్తం సప్లయి అవుతయి. జీతంకూడా ఎక్కువేట......"

"ఆ మాట అన్నాననే మొన్న నీకొడుకు తింటూ తింటూ ఉన్న విస్తరి వదిలి, కస్సుమని 'అయితే వాణ్ణే కట్టుకోలేకపొయ్యావు?' అని అష్టమైన తిట్లూ తిట్టి, రెండురోజులదాకా కొంపచాయలకన్నా రాలేదు. ఉద్యోగం పెద్దదైతే ఎక్కువ జీతం, తక్కువ పని ఉంటుందట."

"అవున్లే.మన కేం తెలుసు? పాతకాలంవాళ్ళం. ఇప్పుడంటే కొడుకుల్తోబాటు కోడళ్ళూ ఉద్యోగాలు వెలగబెడుతున్నారు. అత్తమామలకు ఉద్యోగా లేవిటే అంటే, అటు ఆవిడా, ఇటు ఈయనా కూడా ధంయిమని లేస్తారు. ఇప్పుడు నీ తోడికోడలు సంగతి చూడరాదూ..."

"ఏమోలే, మన కాలం ఎట్లాగో వెళ్ళిపోతుంది. నాకోడలు కాపరాని కొచ్చేసరికి కొడుకు ఎక్కడో ఉద్యోగం చేసుకుంటూ ఉంటాడు. వాళ్ళతిప్పలు వాళ్ళు పడతారు. పొద్దెక్కుతోంది. పోతా...ఆఫీసుకు కాస్త ఆలస్యమైతే అన్నంకూడా తినకుండా పోతారు......"

"పోదువుగాన్లే, రా. బిందెడు మడినీళ్ళు నేనూ తెచ్చుకోవాలిగా! చెరువుకు నేనూ వస్తా. ఎనిమిదేస్తున్నారు. అది ఇప్పటికీ మొహమన్నా కడుక్కోందికాదు. కాఫీ ఇప్పటికి నాలుగుసార్లు వెచ్చబెట్టి లేపినే..."

"వొంట్లో ఏమీ కులాసా లేదు కాబోలి. డాక్టరుగారికన్నా చూపించకపోయారూ? పిల్ల మరీ పాలిపోతున్నట్టుంది!........

సుశీలా...ఎట్లా ఉంటోంది? లేచి పెందరాళే కాస్త కాఫీ తాగితే కొంచెం కులాసాగా ఉంటుంది. లే...పాపం అత్తగారు మడిగట్టుకోవడానికి నీకోసమే కనిపెట్టుకుంది."

"నాకేమీ బాగుండటంలేదు అక్కయ్యా. వొళ్ళంతా నొప్పులు. ఏమీ తినా లనిపించదు, తాగా లనిపించదు. నీరసంగా ఉంటుంది. లేచే ఓపికకూడా ఉండదు. పాపం! అత్తగారు ఇటు నా పనితో, అటు ఇంటిపనితో సతమత మైపోతున్నారు."

"వొట్టప్పుడే ఇటు చెంబు తీసి అటు పెట్టలేనిదానవు. ఇక ఇప్పుడు నువ్వేం చేస్తావు? ఇంతకూ అదృష్టం ఉండొద్దూ...కూర్చోపెట్టి కాచిపోసే కోడలే వస్తే మన సంసారం ఇట్లా ఎందుకుంటుందీ?...మా అత్తగారు ఉన్నన్నాళ్ళూ ఎంత చేసినా ఇంకా ఏవో ఉందనే చెప్పేది. అప్పుడింత తినేవాళ్ళం. ఇంత చేసేవాళ్ళం. కాటికి కాళ్ళు చాపుకున్న దుంపని నే నే మేడుస్తాను! ఏదో ఆ కాస్తా బయటపడితే ఆమాట చెవిన వేసుకుపోదామని........"

"అత్తయ్యా, మీరు వెళ్ళండి. నే చూస్తా లెండి. సుశీలా... ఇదిగో పళ్ళపొడి. పాపం! మొహం కడుక్కునేందుకు వేన్నీళ్ళు కూడా పెట్టింది. చూశావా అత్తయ్య అపేక్ష?......"

"అదంతా నామీదనా యేవిటి? ఆ పుట్టుకొచ్చే మనమడి మీదే. పెళ్ళికిముందునుంచే మొదలుపెట్టింది...'చదువుకున్న పిల్లండరా...సరిగ్గా కాపరమైనా చేయలేరు. ఉన్న ఆ కాస్త సొమ్మూ ఆర్చడానికీ, తీర్చడానికీ తీరిపోతుంది. ఈకాలపు పిల్లలికి కనడమూ చేతకాదు; పెంచడమూ చేతకాదు. అయినా వాళ్ళది ఉద్యోగప్రాయా. వాళ్ళతో మనం తూగలేం.'అని కొడుక్కి నూరిపోసింది.

ఇంతకూ మా అమ్మ కావాలంది...ఈ సంబంధం అయింది. లేక పోతే నేనూ సుఖంగా ఈ అవస్థ లేకుండా ఉండేదాన్ని......"

"సర్లే...ఆడజన్మ ఎత్తిందర్వాత అనుభవించకే బతకాలి. ఇవాళ ఇక్కడ కాకపోతే రేపు ఇంకోచోట. తప్పేదేమీ లేదు. అయిపోయినదాన్ని గురించి అనుకొని ఏం సార్థకం? కాని; ఆ కాఫీ కాస్తా చల్లారిపోతుంది..."

"పేస్టు ఉందిలే......కాస్త ఆ చెంబు ఇట్లా పట్టిత్తావా అక్కయ్యా? ఏదో నువ్వయినా ఉన్నావుగనక ఈవూళ్లో ఉండ గలుగుతున్నా. పలకరిద్దామన్నా ఎవ్వరూ కనపడరు...బావగారు ఊళ్లో ఉన్నారా? రాముడికి ఏదో సంబంధం వచ్చిందటగా! పిల్ల చదువుకుందేనా?"

"ఏమోనమ్మా...వాడు చూసుకొని, వాడికి ఇష్టమైతే చేసు కుంటాట్ట. నాలుగు అక్షరంముక్కలు వచ్చేసరికి చిన్నప్పట్నుంచీ పెంచిన అమ్మా, నాన్నా అక్కర తీరిపోతుంది...ముందొచ్చిన చెవులకంటే వెనకొచ్చిన కొమ్ములు...!"

"ఏమే రాజ్యం...అయిందా అన్నం? నీకు మరి పొద్దెక్కి పోతోంది. నాకు ఎట్లాగూ ఉండనే ఉంది. నీకూ ఎందుకే చాకిరి! అదుగో, వాళ్లాయన రానేవస్తున్నాడు. దాని సంగతి వాడు చూసు కోవాల్సిందే. ఆ, మనం పోదాం. మళ్లీ వాడు అయిందా అయిందా అని అత్తెసరు వేసిన ఘటియసంచీ గొంతుమీద కూర్చుంటాడు. ఇంతకీ వాళ్ల నాన్న అదృష్టవంతుడు. నేనే నిద్రగా పోయి ఉంటే..."

"ఇప్పుడు అదంతా ఎందుకులే అత్తా! చిలకాగోరింకల్లాగా కొడుకూ, కోడలూ కాపరం చేస్తుంటే చూసే అదృష్టం నీకైనా ఉంది."

* * *

పూర్ణానందం చిన్నప్పట్నుంచీ అతిగారాబంగా పెరిగాడు. వాళ్ల నాన్న అతను ఏది కావాలంటే అదల్లా తెచ్చిపెట్టేవాడు. కొడుకు చాలా తెలివైనవాడనీ, మంచి చురుకైనవాడనీ అందరూ అంటుంటే అతనికి ఎక్కడలేని ఆనందం కలిగేది. ఊళ్లో పిల్లలంతా పలకలు పట్టుకొని రామయ్యబడికి ఊరిబయట్నుంచీకూడా నడిచి పోతూఉంటే, పూర్ణానందాన్ని మోసుకుపోయేందుకు ఒక పనికత్తెను పెట్టాడు. ఏరోజైనా అది నాగావేస్తే తనే స్వయంగా బళ్ళోకి ఎత్తుకుపోయి పంతులికి అప్పగించి పెట్టి వస్తూండేవాడు. ఇంత గారా బంగా పెరుగుతున్నా ఆనందం అల్లరిపను లేమీ చేసేవాడు కాడు. కొంచెం మంకుపట్టుమాత్రం పడుతూఉండేవాడు. తలుచుకున్న పని కాకపోతే కనపడకుండా ఎక్కడికో వెళ్లిపోయేవాడు. వాళ్ల నాన్న పుత మాకేది, వీథివీథీ వెతికి వాణ్ణి ఇంటికి పట్టుకొచ్చేసరికి. ఇంకా ఎప్పు డన్నా వాళ్లమ్మ శేషమ్మ విసుక్కొని ఒక దెబ్బవేస్తే వేసిందేమో కాని, సుబ్బారావుమాత్రం కొడుకుని "ఏమిట్రా ఆ పని" అనైనా అని ఎరగడు. అంచేత పూర్ణానందానికి చిన్నప్పట్నుంచీ తన వ్యవహారా లను తన ఇష్టప్రకారం చేసుకుపోయే అలవాటు ఏర్పడింది. ఆఖరుకు సుశీలపెళ్లికూడా అట్లాగే అయింది. ఈ పెళ్లికి సుశీలనాన్న అంత ఇష్టపడలేదు. పూర్ణానందం పచ్చటివాడే అయినా, తీరు అందం గానే ఉన్నా, బాగా చదువుకున్నా, ఎంచేతనో ఆయన తన కూతు ర్నివ్వడానికి చాలా పస్తాయించాడు. తన కూతురుకూడా చెప్పిన మాట వినే పిల్లగాదు. పెద్దది కాగానే ఏదో పెద్దసంబంధం కుదిర్చి పెళ్లిచేద్దా మనుకున్నాడు. "నాకు పెళ్లివద్దు, గిళ్లీ వద్దు. నేను చదువుకుంటాను" అని మొండికేసి బి. ఏ. దాకా చది వింది. పూర్ణానందం కూడా ఇదేరకం. పిల్లివ్వడానికి కుదరదని వెంకట్రావు అనుమానం; భయంకూడా. అంతా అయి తీరా నాలుగు నెల్లు కాపరంచేసి మొగుడితో దెబ్బలాడి పుట్టింటికి వస్తే నలుగురూ నవ్వి పోతారని, కాస్త చెప్పినమాట వినేవాణ్నిగా చూసి పెళ్లిచేద్దా మనుకున్నాడు. కాని అది కుదిరింది కాదు. కాలేజీలో కుదిరిన స్నేహంతో సుశీల పూర్ణానందాన్ని చేసుకుంటా నంది. వాళ్లమ్మ, అందరి అమ్మల్లాగానే, ఆడపిల్లపక్షం చేరింది. జల్లాజడ్జీ చేసి రిటై రైన వెంకట్రావు, పాపం, ఇలాంటి చిక్కుకేసుల్లో ఎన్నింటిలోనో తీర్పు ఇచ్చినా, తల్లీ, పిల్లా ఏకమై వాదించేసరికి 'సరే' అన్నాడు. పదేళ్లయింది పెళ్లిజరిగి. వెంకట్రావు భయపడినట్లు జరక్కపోయినా, మొత్తంమీద సుశీల అంతగా సుఖపడటం లేదు. చదువుకున్న పిల్ల కావాలని చేసుకున్న పూర్ణానందానికి సుశీల ఆశాభంగం కలిగించక పోయినా, తను అనుకున్నట్లు కాపరం సాగటంలేదు. పూర్ణానందం చిన్నప్పట్నుంచీ ఒంటరిగా పెరిగాడేమో, పిల్లలంటే అమిత అపేక్ష. తనకు తమ్ముళ్లుగాని, చెల్లెళ్లుగాని లేరని, వాళ్ల అమ్మా నాన్నాకంటేకూడా ఎక్కువగా విచారించేవాడు. అసలు సుశీలను పూర్ణానందాని కివ్వడానికి కూడా ఇదే కారణం. అన్నదమ్ముల ఆరళ్లు గానీ, తోడికోడళ్ల దెప్పుళ్లుగానీ ఉండవని సుశీలతల్లి ఆశపడి ఈ సంబంధానికి వొప్పుకుంది.

సుశీలకు పిల్లలంటే రోతా, చిరాకూ పోసినట్లుంటుంది. ఎవరి పిల్లలైనా అయితే కాసేపు సరదాగా ఆడించి, ఎత్తుకొని, ముద్దులాడి అవీ ఇవీ కొనిపెట్టి ఆనందిస్తుంది. కాని తనే పిల్లల్ని కని పెంచి, పోషించాలంటే భయం. అందుచేతనే పూర్ణానందం, వాళ్లమ్మా ఏకమై తన నిత్యా నానాబాధలూ పెడుతున్నారని సుశీల కోపం. అంతకు మించి పూర్ణానందంమీదగాని, అత్తగారిమీదగాని ఏమీ లేదు. వాళ్లమ్మకి తొమ్మిది కాన్పులు. కాన్పుకాన్పుకీ ఎంతో అవస్థ పడుతూ ఉండేది. తన తరువాత పుట్టిన నలుగురుపిల్లల సంగతి బాగా చూసిందేమో పాపం, సుశీలకు ఆ 'ప్రసవపర్వం' అంటే అమిత భయం ఏర్పడింది. పుట్టబోయేవాళ్ల సంగతి ఎట్లా ఉన్నా ముందు తనకే ప్రమాదం వస్తుందో అని భయం. ఎంత జాగ్రత్తపడినా తప్పింది కాదని చాలా బాధపడుతూ ఉండేది. "సగం దాని దిగులే దాని రోగానికి కారణం; [illegible] చేస్తారు; మంత్రసాని స్నేం చేస్తారు?" అని శేషమ్మగారు రోజూ అంటూనే ఉండేది.

పదోనెలకూడా వచ్చింది. నొప్పులు ఎక్కువైనయ్యో గానీ, అసలవి ప్రసవవేదనలాగా ఎవరికీ అనిపించలేదు. శేషమ్మగారు మాత్రం తొలిచూలు అట్లాగే ఉంటుందనీ, తనకి మనమరాలే పుట్టు కొస్తుందనీ పదోనెల సగబడినప్పట్నుంచీ అంటూఉంది.

పూర్ణానందం సెలవు పెట్టక తప్పింది కాదు. ఊళ్లో ఉన్న వైద్యుల కేమీ అంతుపట్టలేదు. పెద్దఆస్పత్రినుంచి ఆడడాక్టర్ను తెచ్చి చూపించమని అందరూ అన్నారు. "అక్కర్లేదురా. నిన్ను కడుపుతో ఉన్నప్పుడు నాకూ ఇట్లాగే ఉండేది" అని వాళ్లమ్మ వారించింది. సుశీల పక్కమొగం వేసుకొని, ఆఖరుగడియలు వచ్చినట్లు, అవసానకాలం సమీపించినట్లు పూర్ణానందంకేసి జాలిగా చూచి కళ్లనీళ్లు పెట్టుకుంది. పూర్ణానందానికి ప్రపంచం ఒక్కసారి గిర్రున తిరిగినట్లయింది. సుశీల అంటే అతనికి పంచప్రాణాలూ. చెప్పిన మాట వినకుండా ఇలా చేశామే అనే పశ్చాత్తాపంతో సుశీలను ఓదార్చి ఆడడాక్టరును తీసుకురావడానికి స్నేహితుడి కారు తీసుకు వెళ్లాడు.

శేషమ్మగారు మాత్రం చేరిన అమ్మలక్కల్తో "ఏముందే... వాడు పిచ్చివెధవ! అది వాణ్ని దానిష్టంవచ్చినట్లు ఆడిస్తోంది. ఏమంత వచ్చిందని వందో ఎంతో పోసి దాన్ని తీసుకురావడానికి? ఈ వూళ్లో సుబ్బి ఎన్ని పురుళ్లు పోసింది! అయినా ప్రపంచంలో ఇంకెవ్వరూ పిల్లల్ని కనటం లేదా ఏమిటి? ఏదో రాకరాక వచ్చింది. అందులోనూ అది కొంచెం అర్భకురాలాయెను. చదువు చదువని వొంట్లో ఉన్న జవసత్వాలను చంపుకుంటే మరి ఇట్లాంటివి వచ్చినప్పుడు కష్టమే. కాకపోయినా ఈకాలం ఏదొచ్చినా ఇంతే. కనలేనని పిల్లలు వద్దనుకుంటారుటమ్మా ఎక్కడన్నా? ఇంట్లో నలుగురు పిల్లలుంటేనే కొంచెం కళకళలాడుతూ ఉంటుంది"

"నిజమే నవ్వా. పిల్లలు పుట్టలేదని చెట్లకూ పుట్లకూ, దేవుళ్లకూ దేవతలకూ ప్రాణాచారం పడేవాళ్లు కొందరూ. పిల్లలు పుడుతుంటే అక్కర్లేదని కడుపుతీసుకునేవాళ్లు కొందరూ" అని రాజ్యమ్మ పెద్దకూతురు అనేసరికి "ఎవరే అదీ?...పిట్ట కొంచెం, కూత ఘనంలాగే ఉంది......నాకు చూస్తుకూడా పోతోంది." అని శేషమ్మగారు పరామర్శిస్తుండేసరికి వాకిట్లో కారు హఠాత్తుగా ఆగిన చప్పుడైంది వినిపించింది.

"అమ్మా! ఎట్లా ఉందే సుశీల...? తీసుకువచ్చా డాక్టర్ని. ఆస్పత్రిమంత్రసానికూడా వచ్చింది. ఇంక ఫరవాలేదులే..." అంటూ పూర్ణానందం హడావిడిగా ఇంట్లోకి పోయి ఒక కుర్చీ ఎత్తుకొని సుశీలగదిలోకి వెళ్లాడు. డాక్టరు ముందు వెళ్లింది. మంత్రసాని సరంజామా అంతా తీసుకొని అక్కడ చేరినవాళ్లతో తన కాన్పుల అనుభవాలు చెప్పుకుంటూ పోయింది. "కొండ తవ్వి ఎలుకని పట్టిన కేసులు ఎన్నో ఉన్నాయి" అని మంత్రసాని అనేసరికి, మంగలిసుబ్బి "అట్లాంటివి నే పుట్టి బుద్ధెరిగినతరువాత ఈవూళ్లో ఇంతవరకూ ఒక్కటీ లేదన్నది.

అందరికీ ఆందోళన ఎక్కువైంది. డాక్టరు ఏమంటుందో అని అందరూ అటుకేసే చూస్తున్నారు. ఇదంతా చూసేసరికి అంతటి శేషమ్మగారికీ దడ పుట్టుకువచ్చింది. ఏదో పుట్టిమునిగిందని కంగారు పడింది. దీనికితోడు వచ్చిన డాక్టరు ఊళ్లో ఉన్న డాక్టరుకు కబురు పెట్టింది. ఇద్దరూ గదిలోనుంచి బయటికి వచ్చి అంతా అనుమానంగా ఉన్నట్టు మొహాలు పెట్టి "ఏంచేద్దాం" అని నేలకేసి చూస్తున్నారు. "ఏమైనా ఆపరేషను చేయాల్సిందే" అని ఆఖరికి ఆడడాక్టరు అనేసరికి "నిండుచూలాలి కడుపు కోయడం ఏమిట్రా" అంటూ శేషమ్మగారు స్పృహతప్పి పడిపోయింది. ఆ మాటే ఆమెకు ఏదో అవాచ్యంగా తోచింది.


వైద్యులిద్దరూ సంప్రతించుకొని అక్కడే ఆపరేషనుకు అన్ని ఏర్పాట్లూ చేశారు. పూర్ణానందంకూడా ఏమనడం లేదన్నమాటే గాని, పాపం నీరైపోయి గది ఇవతల గోడకు ఆనుకొని ఎదురుగా ఉన్న గోడకు తగిలించిన సుశీలపెళ్లిఫోటోకేసి రెప్పలార్పకుండా చూస్తున్నాడు.

"అంతా అయింది. కొంచెం హార్లిక్స్ పెట్టి ఇవ్వండి. చాలా బలహీనంగా ఉంది. పాపం, వొంట్లో రక్తంకూడా లేదు" అన్నాడు పూరి వైద్యుడు మెల్లిగా బయటికి వచ్చి. అసలు సంగతి చెప్పడేమని అందరూ కోపంగా చూస్తున్నారు. మూలపడి మూలుగుతూఉన్న శేషమ్మగారు "మనమడా, మనమరాలా?" అని అంటూ లేవబోయింది. పూర్ణానందం పోయి స్టవ్వు ముట్టించి ఇంత హార్లిక్సు కాచి ముందు తల్లికిచ్చి, తరువాత గదిలోకి తీసుకుపోయాడు. డాక్టరు సుశీల తలవైపు కూర్చుని ధైర్యం చెబుతూ ఉంది. పూర్ణానందం భయపడుతూ, కాంతిలో ఏమైనా పడిందేమో, నూనెలోగాని ముఖం చూడరాదేమో అనే సంకోచంతో వాకిలిదగ్గరగా ఉన్న బల్లమీద కప్పు పెట్టి బయటికి పోతుంటే "ఏంవాలేదు, రండి" అని డాక్టరు పిలిచింది.

సుశీల పక్కమీద ఒంటరిగానే పడుకొనిఉంది. నాలుగువైపులా చూచాడు. ఏమీ కన్పించలేదు. అసలు కెవ్వుమనే కేకైనా వినిపించింది కాదు. అతనికి వణుకు పుట్టుకువచ్చింది. "భయపడకండి. మీ రనుకున్న దేమీ కాదు" అని సుశీల ఆ నీరసస్వరంలో కూడా తనే గెల్చానని ధీమా వెళ్లబోస్తూ అన్నది.

పూర్ణానందానికి అర్థమైంది. ఇంత బాధ పడినా ఇలా అయిందా అని కొంచెం విచారించి తల్లిదగ్గరకు వెళ్లాడు. "అమ్మా, ఏం ఫరవాలేదు లే. సుశీల బాగానే ఉంది. దాని కేం భయం లేదని డాక్టరు చెప్పింది" అన్నాడు. "బిడ్డకి బొడ్డు కోశారా, లేదా?" అంటూ లేవబోతూఉండగా మంత్రసాని చేసేట్లో గుడ్డ కప్పి ఏదో తీసుకురావడం చూసింది. ఒక్కసారి అవురుమన్నది...పూర్ణానందం గ్రహించి "అసలది మనం అనుకున్నది కాదులే. ఏదో బల్ల పుట్టుకువచ్చిందిట. ఇంకా కొన్నాళ్లుంటే మరీ ప్రమాదం అని డాక్టరు అంది" అని తలకాయ వంచుకొని వాళ్లమ్మ చెయ్యి పట్టుకొని ఏదో చెప్తున్నాడు.

అలా అంటుండగానే కాళ్ళూ, చేతులూ చల్లబడినట్టయింది. డాక్టరును పిలిచాడు. డాక్టరు వచ్చి, నాడి చూసింది. గుండె పరీక్ష చేసింది. మూసిన కళ్లు అడుగు రెప్ప కిందికి లాగి చూసింది. వెంటవెంటనే నాలుగు ఇంజక్షన్లు ఇచ్చింది...మళ్లీ నాడి చూచి..."షాక్...సెరీబ్రల్ హెమరేజ్...పాపం"



వసంతలక్ష్మి


వలపుల పూవుదోట నడిబాటకు గ్రేవల తమ్మిపూల క్రొం
గొలకులలో గుమంగుమల గ్రొవ్విన క్రొవ్విరికల్వ తేనెసో
నలు తనివార ద్రావి, అళినాథకులమ్ములు వంత వేయ, కో
యిల యెలుగెత్తి పాడి పరువెత్తెను పండిన దొండపండ్లకున్.

నవసుమనోవికాసముల నవ్వులు నాణెము లొల్కఁబోయ, తా
వి వలపువాసనల్ దెసల బెంపు వహింప, విలోలషట్పద
ప్రవరవినీలకుంతలతరంగము లొప్ప, కనత్క్వణద్విహం
గవలయులై వసంతలతికాయువతుల్ విలసిల్లి రవ్వనిన్.

వలగొని గంధలోభమున పైపయి మూఁగు మిళిందబృంద మూ
ర్పుల గదలించు మావియిపురుల్ దిని కేకిసలాడు గండుకో
యిలల వినేయమండలికి నేర్పడ నేర్పుచు నున్నవాడు పూ
విలుతుని శాస్త్రమర్మముల పేర్మి వసంతగురుండు తోటలోన్.

లలితరసాలపల్లవములం దిగి, మత్తిలి, కూరుచుండి కొ
మ్మల దరి పాటపాడు పికమండలికిన్, మధురస్వరమ్ముతో
బలిసి మిళిందబృందములు వంతలు పాడదొడంగె పూలగు
త్తులపయి నూఁగుచున్ కలల దోఁగు వసంతుని నిండుకొల్వులోన్.

క్రోలుడు శుద్ధపాత్రముల కుత్తుకబంటి మధుద్రవంబులన్;
తేలుడు ప్రేయసీమణుల నెయ్యము తియ్యముగా రసాబ్ధి; నీ
హాలిని గోలుపోవకుఁ; డనంతము గాదు వసంత; మంచు లో
కాలకు చాటి చెప్పె కలకంఠముతో పికరాజు పెద్దగాన్.



ఎక్కడి చందమామ? మరి యెక్కడివాడవు? వసంతు డెక్కడో?
ఎక్కడి చల్లగాలి? పువు లెక్కడి? వెక్కడి గండుతుమ్మెదల్?
ఎక్కడి కోయిలల్? చిలుక లెక్కడి? వి ట్లివియెల్ల నేకమై
ఒక్కెడ గూడె బొమ్మన, వియుక్తుల సాపము గాక, కేఱాకో?


ప్రోష్యన్ ఈ కదంబముల గుత్తులయంతగ తక్కినట్టి ఏ
పువ్వులుగూడ నున్న వెత ముంచవు ప్రల్లదనంబు మీఱగా,
అవ్విరహిల్తు కీ దినములందు మహాకుటి కాధనుస్సు తా
ప్రెవ్వని మస్సరమ్మున ధరించి చరించుచు నున్నవాఁడుగా!

ఏమియు కార్యరూప మగుపింపనిచో ఎలమా తోటలో
ఏమని మూగునే గళము లెత్తుచు మత్తసుమాధయూవళుల్?
వ్యోమము నంటివచ్చు తలలున్ మొలిసుల్లను గ్రమ్మగా మహా
ధూమము లెట్టు లుప్పతిలు తొయ్యలి! నిప్పు పొసంగకుండినన్?

మదనమహాధనుర్ధరుడు మచ్చర మెచ్చగ పూలబాణముల్
పదనులు వెట్టి దాడి వెడలన్ భువనమ్ములపైని, వాని వా
ర్త వెలియబుచ్చె ముందుగ ప్రధాని వసంతుడు దిగ్విదిక్కులన్
కాదకొని భీషణమ్మయిన కోకిలకూజిత ఘోషణమ్మునన్.

తనివున తేనెపానకము త్రావగ నిత్తుము రండురండు మీ
రని పువుదీవబోండ్లు మధుపావళినిం దలిరాకు చేతులన్
పనిగొని పిల్తురా? రసపిపాసమెయిన్ రసికుల్ తమంత దా
మనయము గోరివత్తు; రది యంతయు తప్పుబలస్వభావమా.

— గట్టి లక్ష్మీనరసింహశాస్త్రి





విపినవిహారి

రాజా సితాబ్‌రాయి*

శ్రీ దిగవల్లి వేంకటశివరావు

భారత దేశము నేకచ్ఛత్రముగ నేలిన మొగలాయి చక్రవర్తులలో కడపటివాడు, సమర్థుడైన ఔరంగజేబు క్రీ. శ. ౧౭౦౭ లో చనిపోయెను. ఆయన తరువాతివారు బలహీనులైనందువలన వివిధప్రాంతములనేలు సుబేదారులును, రాజప్రతినిధులును స్వతంత్రులై నవాబులుగ పరిపాలింపజొచ్చిరి. ఆ సమయమున నే మన దేశములో వర్తకము చేసికొనుచుండిన ఫ్రెంచివారును, ఇంగ్లీషు వర్తకసంఘముల వారును ఈ యవకాశమును కనిపెట్టి మెల్లమెల్లగా రాజులను, నవాబులను త్రోసి రాజ్యాధికారమును సంపాదించిరి. ఈ మార్పుల కాలమున, మొదట మొగలాయి ప్రభువుల దగ్గరను, తరువాత ఇంగ్లీషు ప్రభువుల దగ్గరను ఉద్యోగముచేసి పేరుపొందినవారిలో రాజా సితాబ్‌రాయిగారొకరు. వీరి కాపురస్థలము 'షాజహానాబాదు' అని ఆకాలమున వ్యవహరింపబడిన ఢిల్లీనగరము. వీరొక క్షత్రియకుటుంబమునకు చెందినవారు. ౧౭౧౯ మొదలు ౧౭౪౮ వరకును భారతదేశమునకు చక్రవర్తిగా నుండిన మహమ్మదుషాపాదుషాగారి మంత్రియైన ఖాన్ దౌరాన్‌గారి దివానుగా నుండి గొప్ప పలుకుబడిని, గౌరవమును సంపాదించిన ఆగా సుల్తాను అను నొక జ్ఞాతియా దేవోయుని దగ్గర సితాబ్‌రాయిగారు మొదట నొక చిన్నగుమాస్తాగా ప్రవేశించిరి. తరువాత ఆయన తన యజమానికి లోలో నాలుకవలె నుండి విశ్వాసపాత్రుడై క్రమక్రమముగా గొప్ప యుద్యోగములను సంపాదించి పైకి వచ్చినాడు.

ఢిల్లీ (షాజహానాబాదు)లో రాజకీయకల్లోలములు కలుగగానిక అక్కడ నుండుట క్షేమకరము కాదని యెంచి, చక్రవర్తిగారి దర్బారులో తనకు కొందరు స్నేహితు లున్నందువలన వారి ప్రాపకమువలన ఆకాలమున 'అజీమాబాదు' అని పిలువబడుచుండిన పట్నానగరమునందు 'దివాన్' అను పన్ను వసూలుచేయు ఉద్యోగమును, చక్రవర్తిగారి మంత్రియైన ఖాన్ దౌరాన్‌గారికి వంగరాష్ట్రమునందుండిన జాగీరుల నజమాయిషీ చేయు నుద్యోగమును సంపాదించెను. వంగరాష్ట్రము మొగలాయీ సామ్రాజ్యములో నొక భాగము. దానిని సుబేదారు లను రాజప్రతినిధి పరిపాలించుచుండెను. క్రీ. శ. ౧౭౦౭ లో మహాసమర్థుడైన ఔరంగజేబుచక్రవర్తి చనిపోవగా ఆయనసామ్రాజ్యములోని సుబేదారులు బలహీనులై, పేరునకు మాత్రము మొగలుచక్రవర్తికి లోబడి దేశమునకు స్వతంత్రనవాబు లైరి. వంగరాష్ట్రనవాబైన అలీవర్దీఖాను తరువాత ౧౭౫౬ లో నవాబైన సురాజుద్దౌలా చాల చిన్నవాడు. అతని యుద్యోగులు స్వార్థపరులు. సురాజుద్దౌలా ఇంగ్లీషువర్తకులపైని కోపించి వారిని దండింపవలెనని యత్నించుచుండగా నతని బంధువుడును, మంత్రియునైన మీర్జాఫరు అతనిపట్ల ద్రోహముచేసి ఇంగ్లీషువారితో చేరెను. అంతట ౧౭౫౭ లో జరిగిన ప్లాసీయుద్ధములో నవాబుసైన్యము లోడిపోయెను. మీర్జాఫరు సురాజుద్దౌలాను వధించి, ఇంగ్లీషువారి సహాయముతో వంగరాష్ట్రమునకు నవాబయ్యెను.

మీర్జాఫరు నవాబై ఇంగ్లీషువారి చేతిబొమ్మ యయ్యెను. క్రొత్త నవాబు అజీమాబాదు (పట్నా)కు వచ్చిన సమయముననే మన సితాబ్‌రాయిగారు కూడ అక్కడనే యుండిరి. సితాబ్‌రాయిగారు కొంత ధనముతోను, పరివారముతోను అక్కడికి పోయినందున ఆయనకు త్వరలోనే కొంత గౌరవము, పలుకుబడియు కలిగెను. అప్పటి కాప్రాంతములో ప్రముఖుడుగా నుండిన హైందవోద్యోగి రాజా రామనారాయణుడు. సితాబ్‌రాయిగారాయనను దర్శించి, ఆయనయనుగ్రహమును సంపాదించినాడు. క్రొత్త నవాబును కూడ దర్శించినాడు అయితే వీరు తన యుద్యోగమును ఖాయపరతురని అతనికి నమ్మకము కలుగలేదు. అందువలన ఆ సమయమున వంగరాష్ట్రప్రభుత్వమున గొప్ప పలుకుబడి కలిగి మన దేశములో క్రమక్రమముగ బలవంతు లగుచున్న ఇంగ్లీషు వర్తకకంపెనీవారి సేనానాయకుడైన క్లైవు నాశ్రయించినయెడల చాలలాభము కలుగునని యెంచి సితాబ్‌రాయి వంగరాష్ట్రమునకు రాజధానియైన మూర్షిదాబాదుకు పోయి ఇంగ్లీషుసేనానికి బహుమతుల నిచ్చి, ఆయన అనుగ్రహమును సంపాదించి, తాను చక్రవర్తిగారివలన సంపాదించుకొనిన ఉద్యోగములను ఖాయపరుపవలసిన దని మీర్జాఫరుకు సిఫారసులు తీసికొనివెళ్లెను.

---

* ఈవ్యాసము గులాంహుస్సేన్ ఖాన్‌గారు పారశీభాషలో రచించిన 'సియర్‌ముతా ఖెరిన్' అను ఒక చరిత్రగ్రంథముయొక్క ఇంగ్లీషు తర్జుమా నాధారపరచుకొని వ్రాయబడినది.

పిమ్మట నతడు సంగ్రాన్ప్రీనవాబుగారియొక్కయు, రామనారాయణునియొక్కయు అనుగ్రహము నతిశులభముగ సంపాదించి, అప్పటి రాజధానీనగర మయిన మూర్షిదాబాదులో గౌరవముగను, సుఖముగను కాపురముచేయసాగెను.

సితాబ్‌రాయి ఇంగ్లీషువారి స్నేహమునకు పాత్రుడై, చక్రవర్తియైన షాఆలం పాదుషాతో వారు జరిపిన రాయబారతంత్రమునందు వారి రాయబారిగా పోయి వారికి చాల సహాయము చేసెను. తరువాత అయోగ్యనవాబైన షుజా ఉద్దౌలాద్వార ఉపద్రవమునకు కుదిరి వారితో రాజీ కుదిర్చెను. చక్రవర్తి యీయనను బీహారుపరగణాకు దివానుగా నియమించెను. ఇంగ్లీషుసేనాధిపతియైన కార్నకుతోడి స్నేహశీలితముగా అజీంగర్, జాజ్‌పూరుల ద్వార సాలుకు లక్షరూపాయలు రాగల జాగీరు నొకదాని నతని కిచ్చిరి. చక్రవర్తితో రాయబారము జరుపుటకై క్రీ. శ. ౧౭౬౫లో అలహాబాదుకు పోవునప్పు డీతనిని వెంటబెట్టుకొనిపోయెను. ఇతడు గ్రీవుకు అంతరంగికు డయ్యెను. అజీమాబాదులోని ప్రజలకు సౌకర్యములు కలిగించుట కొఱకు పరిపాలనావిధానమును గూర్చియు, ఫౌర్యముల విచారణను గూర్చియు కొన్ని కట్టుబాట్లు చేసి రామనారాయణునితో కలిసి పరిపాలింపసాగెను. కలకత్తాలోని కార్యాలోచనసభవారు సితాబ్‌రాయిని అజీమాబాద్ పరగణాకు ముఖ్యపరిపాలకునిగ నియమించిరి. తరువాత ౧౭౭౦లో సంగ్రామస్థితిన కంపెనీవారి ప్రధానదేశీయాధికారిగ నుండిన రజాఖానుతో పాటు సితాబ్‌రాయినికూడ కంపెనీవారనుమానించి పట్టుకొనిరి. రజాఖాను చాల అన్యాయములు చేసినట్లు బయల్పడెను. సితాబ్‌రాయియందు దోషము లేదనియు విచారణవలన తెలిసెను. అంతట వారతనిని వదలివేసి అతని యుద్యోగము నాతని కిచ్చిరి. ఆయన కీ విచారణవలన చాల మనఃక్లేశము కలిగినది. అతనికి ప్రపంచమువిూదనే రోత కలిగెను. అత డంతట విరక్తుడై, కొలది కాలములోనే మరణించెను.

సితాబ్‌రాయి ఆ కాలమునాటి దేశీయమంత్రులలో చాల సమర్థుడు. వ్రాతకోతలయందు ఆయన చాల నేర్పరి యనుటయేకాక పరిపాలనయందు సమర్థుడును, యుద్ధములందు ధైర్యసాహసములు కలవాడును, గొప్ప కార్యసాధకుడు నై యుండెను. ఆయనను వజీరులు, చక్రవర్తులు ఆశ్రయించుచున్నను ఆయన గర్విష్ఠి కాలేదు. గొప్ప విద్యావంతులుగాని, గొప్పవంశీయులుగాని ఆయనవద్దకు వచ్చినపుడు అతడు వారిని చాల మర్యాదచేయును. ఎవరైన విన్నపము చేయవచ్చినచో వారు చెప్పుకొనుదానిని సావధానముగ విని వారరించిన కార్యము తనకు సాధ్యమైనచో వెంటనే చక్కపెట్టి పంపును. తనకు సాధ్యముకానిచో తా నేమియు చేయలేనందుకు చాల నొచ్చుకొని వారి నోదార్చి, చాల మర్యాద చేయును.

సితాబ్‌రాయిగారు నిర్వహించవలసిన రాజకార్యము లనంఖ్యాకములుగ నుండెను. కార్యభారమువలన నాతని కెప్పుడును విధి విరామము లేని పని యుండును. ఉదయము మొదలు మధ్యాహ్నము వఱకును, రాత్రిమొదలు తెల్లవారుఝామున మూడుగంటలవఱకును అతడు విధి విరామము లేక పచ్చువారికి దర్శన మిచ్చుచునే యుండును. అతి డెన్నడును, ఎవ్వరిని తిట్టిగాని, అవమానించిగాని యెఱుగడు. అతడు మంచి ప్రపంచజ్ఞానము కలిగినవాడు. అన్నివస్తువుల ధరలను బాగుగా నెఱిగినవాడు. అనవసరముగ ఖర్చులు చేసి వర్తకులను బాధింపడు. ఎవరినైనను బహూకరింపదలచినప్పుడు పొదుపు నాలోచింపడు. అవసరమైన వ్యయము చేయడు. తనకు కావలసిన వస్తువులన్నియు చౌకగా సముద్ర చోటులనుండి సరసముగా తెప్పించుకొనును. అతడు చాల భోగి. ఆయనయింట నుండువారందరికి నాతడు సకలసౌఖ్యములు కల్గించును. ఆయూరికి క్రొత్తమనుష్యులు వచ్చినను, వారి హోదానుబట్టి రకరకముల పిండివంటలు, పండ్లు, ఆహారపానీయములు వారికి పంపి గౌరవించును. తనయింట చేయు విందులలో మొగలాయిప్రభువుల ననుకరించి అతిథిసత్కారమును చేయుచుండును.

సితాబ్‌రాయి చాల మర్యాదను, గౌరవమును పాటించు నరసుడు. ఆయనకు 'రాంజీ'యను ఉంపుడుకత్తె యుండెను. ఆమెపై నాతనికి చాల ప్రేమ. ఐన నామెతో నాత డెప్పుడు మాటలాడునో ఎవ్వరికిని తెలియదు. అత డెన్నడు నామెతో బహిరంగముగ సరసమాడియెరుగడు. అతడు జనానాలోనికి పోవుట యెవ్వరు చూచితే రని చెప్పుట యతిశయోక్తి కాదు. అతని ధర్మపత్ని ఒక క్షత్రియస్త్రీ. ఆమెవలన నాయనకు ఇద్దరు కుమాళ్లు కలిగిరి. అతి డామెకొఱకు ప్రత్యేకముగ నొక మేడ కట్టించెను. అతడు సంవత్సరమునకు రెండుమూడుసారులు మాత్రము ఆ మేడకు పోయి హిందూగృహస్థులు శాస్త్రప్రకారము జరుపవలసిన ఆచారధర్మములు నెరవేర్చుచుండును.

సితాబ్‌రాయిగా రెవ్వరికిని అపకారము చేయడు. కాని యాతనికిని కొందరు విరోధు లుండిరి. అయినను అతడు వారి నెన్నడు నగౌరవపరచి యెరుగడు. పైగా వారి కాపద వచ్చినపు డడ్డుపడి రక్షించుచుండెను. తన స్వగ్రామమైన షాజహానాబాదునుండి ఎవ్వరైనను వచ్చిరని తెలియగనే సితాబ్‌రాయి వారి కన్నివిధములైన సహాయములు చేయుచుండెను. అతడు సత్కారస్థానమును ముట్టుకొనువాడు కాడు. అందువలన నెవరికైన నేదైన సహాయము చేయదలచినయెడల వారి కేదో యుద్యోగము నిచ్చుచుండెను. అది సాధ్యముకానిచో వారిని పిలిపించి ఏదో బహుమానము నిచ్చి తాను సహాయము చేయలేకపోయినందులకు విచారమును తెలుపును.

ఇస్లాముమతముకొఱకు ప్రాణములను బాసిన మహానుభావుడైన షెహ సయ్యదు మహమ్మదుగారి వంశీయుడైన షెహ షెరీఫ్

ఉద్దీన్ మహమ్మదుగారు అరబ్బీదేశములోని పవిత్రమైన యాత్రా స్థాన సన్నిధిలోనే పన్నెండు సంవత్సరములు నివసించిన యొక ముసల్మాను విద్వాంసుడు. ఆయన చాల గొప్పవాడును, పుణ్యపురుషుడును. ఆ పుణ్యభూములలో మహమ్మదీయ యాత్రికులకు, దేశాటకులకు, ఫకీరు ముల్లాలకు పర్యటనగా వచ్చిన ప్రసిద్ధులైన అరబ్బీగారి నొక్క వచ్చిన దని మహమ్మదీయ నాటికి సుప్రసిద్ధము. ఈ పుణ్యపురుషునికి కొన్ని చిక్కులు కలిగి దారిద్ర్యానుభవ మయ్యెను. అంతట నతడు హిందూ దేశము పోవలెనను తలంపుతో బయలుదేరి దేశమునకు వచ్చెను, అక్కడి నుండి బ్రిటిషు రాజ్యమునందు గల సంస్థానాధిపతులును, ప్రభువులును అరబ్బీ దేశములోని విద్వాంసులను, పుణ్యస్థలములకు యాత్ర పోయివచ్చిన వారిని ఆదరింతు రనియు విని, అక్కడినుండి ప్రయాణమై వచ్చి తన ఎనుబదవయేట హూగ్లీలోను, మూర్షిదాబాదులోను కొంతకాలము గడపెను. వంగరాష్ట్రమున కప్పుడు ముబారకుద్దౌలా నాజీము (సహాయ పరిపాలకుడు)గాను, మహమ్మదు రెజాఖాను ప్రధానపరిపాలకుడు గాను ఉండిరి. వీ రిరువురును చాల ధనవంతులైన ముసల్మానులు. వారి తాబేదారులు కూడ గొప్ప ఐశ్వర్యము ననుభవించుచున్న వారే. అయినను వా రెవ్వరును ఈ ముసల్మాను విద్వాంసు నాదరింప రైరి. అందువలన నతడు తన జీవనాధారమునకై ఇంకొక చోటికి పోవలెనని అయోధ్యనవాబు షుజాఉద్దౌలా రాజధాని అయోధ్యా లక్నో నగరములకును, షాఅలం చక్రవర్తి నివసించుచున్న అలహాబాదునకును పోయినచో అక్కడ సుఖముగ బ్రతుకవచ్చునని బయలుదేరెను. మార్గమధ్యమున ఆయన అజీమాబాదున [illegible] 'సియరుల్ ముతాఖరీన్' గ్రంథకర్తయైన సయ్యద్ ఘులామ్ హుస్సేన్ ఖాన్‌గారు ఆయనను దర్శించి, తన మిత్రుడైన సితాబ్ రాయిగారి కాయన గొప్పతనమును గూర్చి చెప్పిరి. అంతట నీ మంత్రి గారు హిందువుడైయుండియు, ఈ ముసల్మానుమతాచార్యుని దర్శింప బోయినప్పుడు తన పరివారమును, రాజలాంఛనములను బయటనే వదలి ఒకరిద్దరు సేవకులను, తనమిత్రుడైన మీర్ కరం ఎద్దీన్ ఖాన్‌గారును తప్ప ఇతరులెవ్వరును తనవెంట లేకుండనే పోయెను. ఆ పుణ్యపురుషుని సమక్షమునకు పోవగానే, అణకువతోను భయభక్తులతోను సాగిలబడి మ్రొక్కెను. ఈ గొప్ప మంత్రిగారు వచ్చుచున్నారని ఆ యాచార్యు డాయనకొఱ కొక తివాచీ వేసి దానిపైన ఒక పరుపును వేయించి ఎత్తైన ఒక మస్నదు (పీఠము)ను తయారు చేయించియుంచి, ఆయనను దానిపైన కూర్చుండవలసినదని ఎంత బలవంతముచేసినను, సితాబ్ రాయిగారు వలదు వలదని దానిమీద కూర్చుండక మర్యాదతో ఆముసల్మాను విద్వాంసుడు కూర్చున్న తివాచీకి అంచుచివరనే కూర్చుండిరి. తరువాత నొక గంటసేపాయనతో గడపి, తమ యింటికి దయచేసి తాను చేయు సత్కారము స్వీకరింపవలెనని వారి నెంతో వినయముగ ప్రార్థించి సెలవు పుచ్చుకొని యింటికి వెడలిపోయెను.

ఆ సాయంకాలము సితాబ్ రాయిగారు తమ యింట నొక పెద్ద తివాచీపైన పరుపు వేయించి దానిమీద పట్టుజరీబుటేదారిపని చేసిన కిన్ఖాబు వస్త్రమును పరచి, తాను గొప్పగొప్ప యుత్సవ సమయములలో కూర్చుండునట్టి ఒక గొప్ప 'మస్నదు'ను ఆ విద్వాంసుని కొఱకు అతిభక్తితో తయారుచేయించి, దానిప్రక్కనే ఒక తెల్లని తివాచీ వేయించి దానిపైన తాను కూర్చుండెను. ఆ సమయమున [illegible] చేసెను. అంతట సాయంకాలపు ప్రార్థన ముగించినతరువాత నా ముసల్మాను పుణ్యపురుషుడును, సయ్యదు ఘులాంహుస్సేన్ ఖానుగారును సితాబ్ రాయిగారింటికి రాగా ఆయన తన యింటి ఆవరణమందు సమ్ముఖద్వారమున ఎదురుగా వచ్చి ఆయనకు నమస్కరించి వారిని చేయిపట్టుకొని తీసికొనివెళ్లి మస్నదుపై కూర్చుండబెట్టి ఎంతో భక్తితో అతిథిసత్కారమును చేయసాగెను. ఇంత గొప్పవాడైన యీ హిందూగృహస్థుడు విజాతీయమతాచార్యునియెడ్ల నింత శ్రద్ధాభక్తులు చూపుచు గౌరవించుట చూచి ఆ ముసల్మాను యాచార్యుడు చాల సంతోషించి "అయ్యా, భగవంతుడు మీకు ప్రసాదించిన సుఖసంపదలలో నొక కొంతయైన నీ దేశపు ముసల్మానులకు ప్రసాదించియుండిన నెంత బాగుండును!" అని అరబ్బీభాషలో ననెను. ఈ మాటలను ఘులాంహుస్సేనుగారు సితాబ్ రాయిగారికి తర్జుమా చేసి చెప్పగా ఆయన యింత సదభిప్రాయమునకు తాను తగనని మర్యాదగా బదులుచెప్పి ఆయనకు వందనము లర్పించెను. ఆ విద్వాంసుడు సెలవుపుచ్చుకొనునప్పుడు సితాబ్ రాయిగారాయనకు విలువగల శాల్వాలను, పట్టు జరీతో నేసిన కిన్ఖాబులను అమూల్యాంబరములను సమర్పించెను. అప్పుడు తా నాయనకు ధనము నిచ్చినచో నాయన ఏమైన అనుకొనునేమో యని సందేహించి తాను బసకు వెళ్లినతరువాత నొక నమ్మకమైన సేవకుని కొక వెయ్యి రూపాయలుగల సంచి నిచ్చి, ఘులాం హుస్సేను గారి చేతి కిచ్చి ఆ పుణ్యపురుషునకు సమర్పింపుమని చెప్పి ఇచ్చిరమ్మని పంపెను.

ఒకనాడు సితాబ్ రాయిగారి స్వగ్రామమైన షాజహానాబాదులోని యొక పెద్దమనుష్యుడు గయాక్షేత్రమునకు తీర్థయాత్ర చేయుచు షాజహానాబాదులో నున్న చక్రవర్తిగారి ఖాలిసాదివాను గారైన [illegible] గారి కతడు మిత్రుడైనందువలన గయ అజీమాబాదు, లేక పట్నానగరమునకు మూడుదినముల ప్రయాణములో నున్నందువలన సితాబ్ రాయిగారి కొక సిఫారసుపత్రమును వ్రాసి యీయవలసినదని [illegible] గారిని కోరెను. అతడు తన హోదానుబట్టి వజీరులతోను, ఉమ్రావులతోను సమానమైన దర్జా కలవాడు. "సితాబ్ రాయిగారు మీకు పరిచితులేకదా? మీరు తీర్థయాత్రకు పోవుచున్నారని తెలియగనే ఆయన మీకు తప్పక సహాయము చేయగలరు. నేను మరల ఉత్తరము వ్రాయుట ఎందులకు? ఇంతకును సితాబ్ రాయిగా రిప్పుడు మహోన్నతపదవిలో నున్నారు. ఆయన నెట్లు సంబోధింపవలెనో నాకు తెలియుటలేదు. ఏమి వ్రాసిన నేమి

కోపమువచ్చునో ? ఆయన పూర్వపు మనుష్యుడా ? నే నేదైన జాబు వ్రాసిన నది మీ కుపకరింపకపోగా అపకారముకూడ చేయవచ్చును." అని వకుర్మల్ గారనిరి. ఆకాలములోని గొప్పవారందరివలెనే సితాబ్ రాయిగారుకూడ చాలసొమ్ము వ్యయముచేసి దేశపు నలుమూలలను ప్రతిదర్బారులోను తన గూఢచారులను నియమించి ఎప్పటికప్పుడు నాయా చోటులనుండి వచ్చు వార్తలను తూ.చ. తప్పకుండ తెప్పించుకొను చుండును. అంతట షాజహానాబాదులో జరిగిన సంగతి యీ యాత్రికునికన్న ముందుగనే అజీమాబాదు చేరెను. ఆ పెద్దమనుష్యుడు సితాబ్‌రాయిగారిని దర్శించగనే ఆయన ప్రధానమంత్రిగారైన వకుర్మల్ గారిచేత నొక ముక్క వ్రాయించుకొనివచ్చిన నెంత బాగుండును అనిరి. "అయ్యా, నేను మిమ్ము స్వయముగ నెరుగుదు నని ఆయనకూడ నెరిగియున్నందున నే నాయనవలన సుపత్రము వ్రాయించుకొనిరాలేదు." అని యాపెద్దమనుష్యు డనెను. "అదికాదు లెండు", అని యాసంగతి యంతయు తనకు తెలిసినట్లు సితాబ్ రాయిగారు మాట్లాడగా నప్పు డక్కడ నున్న పెద్దమనుష్యులకు సంగతి యర్థముకాక వా రాయనను మెచ్చిమెచ్చి యడుగగా సితాబ్ రాయిగారు జరిగిన సంగతియంతయు చెప్పి "దేవుడు మేలుచేసిన యెడల నాసంగతి యాయనకు త్వరలోనే తెలియగలదు" అనెను. దీని యంతరార్థ మెవ్వరును గ్రహింపలేకపోయిరి. సితాబ్‌రాయిగారు ఆ వచ్చిన పెద్దమనుష్యునకు తగిన సహాయము చేసి యతడు తిరిగిపోవునపుడు వకుర్మల్ గారి కీయవలసిన ఒక యొక జాబు నిచ్చెను. ఆయన వలన తనకు కావలసిన పని యేమియు లేకపోయినను సితాబ్ రాయిగా రాయన నెంతో మర్యాదగ సంబోధించుచు, మా రాయన నుండు తమపోటివారియందు దయయుంచవలసిన పని ఘనతను సూచించుచు, మీరు నాయం దనుగ్రహించి వ్రాసిన జాబునకు కృతజ్ఞుడ ననియు, మారమున నుండి మీ యనుగ్రహము కోరువారిపట్ల మీ సహృదయత్వము చూపి నాకి నానందము కలిగించుట మీ మంచి స్వభావమునకు తార్కాణమనియు వ్రాసి పది పదిహేను వేల రూపాయల విలువగల బహుమానములను వకుర్మల్ గారి కివ్వవలసిన దని ఆయన కిచ్చెను. వంగదేశమున కూడ ఎత్తుకు ౨౨ ఎత్తుల వెండికి విక్రయించు విలువయైన మస్లినును, వంగరాష్ట్రములో మాత్రమే తయారగు 'మల్‌మల్' ఖలుసు వలువలు (ఢాకా మజిలిన్లు), దంతముతో చేసిన మంచపుకోళ్లును, పర్షియానుండి దిగుమతి చేయబడిన గోడగడియారములు, జేబుగడియారములు, స్ఫటికమువంటి గాజుతో చేసిన వంగలదీపముల లస్తరులు (Sconces), పెద్దపెద్ద అద్దములు, ఐరోపా చీనా దేశముల వింత వస్తువులు మొదలైన విలువగల సామానులను సితాబ్‌రాయిగారు వకుర్మల్ గారి కివ్వగలందులకు తన పరమున నివ్వగా నాపెద్దమనుష్యు డాశ్చర్యపడి తాను గయకు పోయి యింటికి చేరునప్పటి కాలస్యమగునని, ఆ బహుమతుల నెల్ల ముందుగనే షాజహానాబాదుకు పంపించెను. సితాబ్‌రాయి గారి యుత్తరమును, ఆ బహుమతులను చూచి వకుర్మల్ దిగ్భ్రమ చెంది ఆయన నాకు సిగ్గు బుద్ధిచెప్పినారని సిగ్గుపడి అనేక క్షమాపణలతో ప్రత్యుత్తరము వ్రాసిపంపెను.

సితాబ్‌రాయిగారి మహాదాతృత్వములు క్రీ. శ. ౧౭౭౦లో వచ్చిన మహాక్షామములో వెల్లడి యయ్యెను. ఈ కరవు వంగరాష్ట్రమును భయంకరముగా ముంచివేసెను. అన్నవస్త్రములు లేక ప్రజ లల్లాడుచుండుట చూచి సితాబ్‌రాయిగారి హృదయము కరగి పేదవారికిని, కన్ను కాలు లేని వారికిని, ముదుసలి వారికిని, దిక్కు లేని వారికిని అన్నవస్త్రము లిచ్చి కాపాడుట కనేక సదుపాయములను చేసెను. ఇదికాక క్షామనివారణకొరకు కొన్ని చక్కని ఏర్పాటుల నతడు చేసెను. ఆ సంవత్సరమున బియ్యము కరవై ధరలు విపరీతముగ పెరిగిపోగా వేలకొలది ప్రజలు అన్నము దొరకక మరణింప సాగిరి. ఆ సమయమున కాశిలో బియ్యము చౌకగానుండెను. కాని, దానిని వంగరాష్ట్రములోనికి చౌకగా తెచ్చు మార్గము లేదు. అంతట సితాబ్‌రాయిగారు తన పడవలను, మనుష్యులను కాశీకి పంపి, ముప్పది వేల రూపాయల బియ్యమును కొని దానిని అజీమాబాదుకు తెచ్చి కాశీబజారు ధరకే యక్కడ విక్రయింప సాగెను. ఆ సంవత్సర మెల్ల ఆయన పడవలను, మనుష్యులను అట్లు త్రిప్పుచు, బియ్యమును దిగుమతిచేసి ప్రజలకు మహోపకారము చేసెను. సరసమైన ధరకుకూడ బియ్యమును కొనలేని పేదలు పక్షులవలె రాలిపోవుట చూచి హద్దులేనిచో నిజమైన దరిద్రుల కన్నమే దొరకదని నిశ్చయించి సితాబ్‌రాయిగారు నాలుగు తోటలకు చుట్టు నావరణగోడ లుంచి అందులోనికి దరిద్రుల నందరిని చేర్చి, వారి కన్నముపెట్టి రక్షింప సాగెను. దానికొరకు కొందరుమంది గుమాస్తాలను, సిబ్బందిని కూడ నియమించెను. ఆ దరిద్రులలో ముసల్మానులకు వేరుగాను, హిందువులకు వేరుగాను సౌకర్యములు కలిగించెను. ఇట్లు ప్రతిదినమును వేలకు భోజనము పెట్టి యీ దీనజనుల నితడు కాపాడు పద్ధతిని చూచి ఇంగ్లీషువర్తకులును, డచ్చి వర్తకులును కూడ పేదల ననేక ఆవరణలందుంచి పోషింపసాగిరి. రాజధానీనగరమైన ముర్షిదాబాదులో నట్టి చక్కని ఏర్పాట్లు జరుగలేదు. అక్కడ కంపెనీవారు మహమ్మదు రెజాఖానును క్షామనివారణ పనిచేయు పోలీసుశాఖ కధికారిగ చేసిరి. కాని గింజ దొరకక సామాన్యప్రజలు బాధపడసాగిరి. పేదలపైన పెత్తన మివ్వబడిన మిర్ సులేమాన్ ఖాన్ మొదలైన 'సూపరైవైజర్లు' స్వార్థపరులై పేదలకై తెచ్చిన బియ్యము నంతయు తామే హరించివేయసాగిరి. సర్కారువారి బియ్యపు పడవలు రేవులో దిగగానే రెజాఖానుగారి యాంతరంగికులు, ఆ బియ్యమును తమ యింట్లకు తోలించుకొనసాగిరి. ఇట్లు అన్యాయముచేసి పేదలను మాడ్చినవారిలో రాజా అమృత సింగ్ ఒకడు. మీర్జాఫరు దగ్గర నొక నీచసేవకుడుగా నుండిన నామెత్ ఒల్లాఖాన్ మహమ్మదు రెజాఖాను దగ్గర నొక కార్యకర్త (Steward) యై నమ్మిన బంటుగా

నుండెను. ఆ కాలమున బియ్యము నమ్ముటకు నియమింపబడి చాల అక్రమములు గావించెను. అతడు ౧౫ లక్షలార్జించినట్లు ప్రతీతి. ఈ అక్రమములను చూచువారుగాని, బియ్యము సరియైన ధరకు లభించునట్లు చూచువారుగాని, అన్యాయము చేయువారిని శిక్షించువారుగాని లేకపోయిరి. పరిపాలనలో రెజాఖాను చేసిన అన్యాయమునకు తర్వాత ఫలితము పట్టుకొన్నప్పుడు అతనిపైన మోపబడిన నేరములలో నది యొకటి.

సితాబ్‌రాయిగారు ప్రతియేటను ఇరాన్ (పారసీక) దేశము నుండి యపూర్వఫలజాతులను తెప్పించి యింగ్లీషు దొరలలో ముఖ్యులైనవారికిని, వంగరాష్ట్రములోని గొప్పగొప్ప ప్రభువులకును, అజీమాబాదులోని గొప్పవారికిని, విద్యావంతులకును బహుమానముగ పంపుచుండును. ఇతడు ఫలజాతుల నమ్ము వర్తకులకు ప్రత్యేకముగ కొంత ధనమును అప్పుగా నిచ్చి వివిధజాతుల ఫలముల విక్రయమును ప్రోత్సహించుటవలన తన పట్టణములోని బజారులలో నపూర్వ ఫలజాతుల నమ్ముటకు కారణమయ్యెను. అదిగాక అతడు దూర దేశములనుండి లాహోరు, ఆగ్రా, కాబూలు నగరములనుండి అనేక ఫలజాతుల మొక్కలను, గింజలను తెప్పించి, తోటలయందు నాటించుచుండును. ఇతడు కస్తూరికర్బూజ (Musk-melon) అను అపూర్వ కర్బూజజాతిని అజీమాబాదులో వ్యాపింపజేసినాడు.

సితాబ్‌రాయిగారు పుట్టుకవలన హిందువుడే యైనను, మతాచారములందు షియాశాఖకు చెందిన ముసల్మానుడే నని సియరుల్ ముతాఖరీన్ గ్రంథకర్తయైన ఘులాం హుస్సేన్ ఖాన్ గారు చెప్పుచు తమ గ్రంథమునం దీ క్రింది యుదాహరణముల నిచ్చియున్నారు. మహమ్మదు ప్రవక్త అల్లుడైన అలీ యవతార పురుషుడని నమ్మి ఆయనమరణమును గూర్చి దుఃఖించుట కేర్పడిన నెలయైన మొహరంలో అలీగారు చనిపోయిన దినమైన ౨౧వ నాడు సితాబ్‌రాయిగారు పాలతో నుడికించిన యన్నపు ముద్దలను, ఇతర మిఠాయిలను, ఆహారపదార్థములను భక్తితో తయారుచేయించి, ప్రార్థన, నైవేద్యానంతరము దానిని నగరమునందు పంచిపెట్టించుచుండును. ఆయన సాధారణముగ 'యా అలీ' అని భగవన్నామ స్మరణ చేయుచుండురు. 'వల్లాబిల్లా'యని దైవముపై నొట్టు పెట్టుకొనుచుండురు. సంవత్సరమున కొకమారు రాజసింహుని (King of Braves) స్మృతిచిహ్నముగ భోజనములు తయారుచేయించి, 'ఫాతెహా' ప్రార్థనము చేయించి, దానిని పంచిపెట్టించుచుండురు. ఒక దినమున దానిని పంచిపెట్టుట లోపల నేదైన నొక మహత్తు కనబడువఱకును వేచియుండుట మంచిదని ఒక పెద్దమనుష్యు డనగా, "అయ్యా, అన్యమతమునకు చెందిన నావంటివాడు అలీగారి మాహాత్మ్యమును చూడ గోరుట విపరీతము. అట్టి మాహాత్మ్యము లేకుండగనే నా కాయన దివ్యత్వమునందు నమ్మక మున్నది. పదార్థములు చేయించుటలో శుచి శుభ్రతలు తక్కువైనందువలనగాని, మఱి యే పొరపాటు వలనగాని అట్టి నిదర్శనము కనబడక పోవచ్చును. అంత మాత్రమున దానిబట్టి హేళనచేయుట కవకాశ మేర్పడును. ఇది సమంజసము కాదు" అని చెప్పెను.

ఒకమారు అతడు జనరల్ స్మిత్తు దొరకు స్వాగత మిచ్చుటకై యెదురేగుచు పోయి ఒక దేవాలయముదగ్గర గుడారములను వేయుట తటసించెను. ఆ మరునాటి యుదయ మాయన పల్లకీలో బయలుదేరుటకు సిద్ధముగ నున్నప్పుడు ఆ దేవాలయపుర్చకులు వచ్చి "అయ్యా, ఈ దేవాలయము మహాదేవునిది. ఈ దినము పౌర్ణమి. ఇది భగవదారాధనకు ముఖ్యమైన శుభదినము" అని చెప్పి తమ్ము కనిపెట్టు డని వేడుకొనిరి. అంతట నాయన "మీ కేదైన చెప్పవలసినచో దేవుని పూజింపవచ్చిన భక్తులతో చెప్పవచ్చును. ప్రస్తుతము నాకు మీతో గాని, దేవునారాధనతో గాని పనిలేదు" అని పల్లకి నెక్కి వెడలిపోయెను. హిందువులు యాచకు లాయనను సమీపించినపుడు, ఆయన ఏమియు నివ్వక పోయినను, మహమ్మదీయ ఫకీరు లడిగినపుడుమాత్రము తప్పక ఒక రూపాయి నిచ్చుచుండును. సితాబ్‌రాయిగారు కలకత్తాకు గాని, వంగరాష్ట్రమునకుగాని పోవుట తరుచుగా తటసించును. అప్పుడు దారిలోని దేవాలయములలోనికి పోయి దేవుని పూజించవలెనని యాయనతో నున్న మిత్రు లనగా నాయన వారికొక వందరూపాయి లిచ్చి వారిని వెళ్లి పూజలు చేయించుడని, తాను మాత్ర మేదో సాకు చెప్పి పోకుండ నుండును.

సితాబ్‌రాయిగారు తన కాపురమున కొక దివ్య భవనమును కట్టించుకొనెను. అందులో గృహప్రవేశసందర్భమున బ్రాహ్మణులకు సంతర్పణచేయవలసిన దని హిందూమిత్రు లాయనతో ననగా, ఈ బ్రాహ్మణులు తన భవనమును పాడుచేయుదు రనియు, కావలసినచో వారికి గంగాతీరమున సంతర్పణ చేయింతుననియు చెప్పి ఆజ్ఞ గావించెను. ౧౭౭౦ లో వంగరాష్ట్రమును, ఉత్తర హిందూస్థానమును నాశనముచేసిన ఘోరక్షామములో ఆయన స్నేహితుడైన మురళీధరుడు, రాయ్ కిష్ణదాస్ సుద్ధసింగ్ మొదలైనవారి కోరికపైన నిష్ఠాగరిష్ఠుడైన ఒక బ్రాహ్మణుడు ఆయనను దర్శించుట తటసించెను. అటు తర్వాత నా బ్రాహ్మణుడు విద్వాంసుడు తఱచుగా సితాబ్‌రాయిగారికి సనాతనధర్మమునందు గట్టి నమ్మకము గలిగింప తలచి ఒకనాడు "మహాప్రభూ, తమ జాతకమునుబట్టి తాము చేయదగిన నామజపమును నిర్ణయించినాము. దాని ప్రకారము తాము తావళముతో జపము చేయుచుండిన చాల మంచిది" అనెను. అంతట సితాబ్‌రాయిగారు "స్వామీ, నే నిదివరకే వెయ్యినొక్క పేర్లు నామజపముచేయుచున్నాను. అది చాలును" అనెను. అది ఏమని బ్రాహ్మణు డడిగినను, సితాబ్‌రాయిగారు చాలసేపటివఱకు చెప్పలేదు. తరువాత 'రహీము', అనగా పరమదయాళుని జపమని చెప్పెను. అంతట నా బ్రాహ్మణుడు "మహాప్రభూ, రామ్ రహీమ్ లను పేర్లు రెండును అద్వితీయుడైన పరమాత్మయొక్క నామములే కదా ? ఇందు భేద మేమి ?" అని సరిపెట్టజూచెను. సితాబ్‌రాయిగారందుకొని "కొంచెము భేద మున్నది. రాముని పే రుచ్చరింపగనే దశరథనందనుడని స్ఫురించును. రహీముపే రుచ్చరించగనే జరామరణములు లేని పరబ్రహ్మము మాత్రమే స్ఫురించును" అనెను. ఈ వేదాంతిని తాను మార్చలేనని బ్రాహ్మణుడు సెలవు పుచ్చుకొనెను—అని

ధర్మసమన్వయము

శ్రీ కొత్త సత్యనారాయణచౌదరి

తలకొక ధర్మమై యెవరి దారిని వారలు పోయిరేని భూ
తలమునఁ దీవ్రఘట్టముల తాఁకిడి కోర్వఁగలేక సంఘమే
కలఁతను జెంది దానను వికారగుణంబులె యుప్పతిల్లి యా
వలఁ బెను రొంపిలోఁ బడి యవస్థలఁ జిక్కి తపించు నిచ్చలున్.

బ్రదుకుట యొక్కటే యిహపరంబుల ముఖ్య మటంచు నెంచి యె
య్యదనున నైనఁ బ్రాణము రవంతయు జారనిరీతి సంచరిం
చెద రొకకొంద ఱట్టిదె విశిష్టపథంబని ధర్మశాస్త్రముల్
కొదుకక చెప్పుచుండు; మఱికొందఱ కియ్యది గిట్ట దిమ్మహిన్.

మోసపు వేసముం గొని, విభుండగు కర్ణుని దివ్యశక్తికిన్
గాసియొనర్పఁగాఁ దవిరి కావరుఁడైన మహేంద్రుఁ డర్థియై
చేసిన ప్రార్థనంబునకు ఛీ! యనఁ జాలఁడు—దాని కెట్టి సం
త్రాసము చూపఁ డా మహితధార్మికతత్త్వమహత్త్వ మెట్టిదో!

ముందుగఁ దండ్రి భాస్కరుఁడు పుత్రుని జేరి సురేంద్రువర్తనం
బందు స్ఫురించు మోస మది యంతయు నొక్కివచింప దానికిం
గొందల మందఁ డా కొమరుఁగుజ్జు; తదీయమనఃప్రవృత్తికిం
జెందిన ధర్మనిర్ణయవిశిష్టత యెట్టిదొ చూడఁగావలెన్.

"తగదు కుమార! యిట్టులు వృథాయొనరింపకు జీవితంబు, నె
ల్వగ గుణియించి యేది శుభమున్ గలిగించునొ దానిమాత్రమే
జగమునఁ జేయఁగావలయు: సర్వము భంగము పొందువేళ నె
వ్వగ సమకూర్చు త్యాగ మది వ్యర్థముగాదె తలంప నేరికిన్!

చచ్చుట నిశ్చయంబని నిజంబుగఁ దెలిసినాఁడు కీర్తియే
వచ్చిన లాభమేమి? గుణవంతుఁడు వీఁ డని లోకు లెవ్వరో
నిచ్చలు చెప్పుకొందు రని నీవు తలంచియు లాఁతివానికై
ముచ్చట తీర్తువా? వెనుక ముందఱ యారసి సంచరింపవా?"

అని బలిమాలినన్ దన ప్రయత్నము మానెన! కర్ణుఁ డాతనిం
గని యిటు పల్కెఁ బ్రేమఁ: "జనకా! భవదీయహితోక్తి యిత్తఱిన్
విన నని యన్యథా పరిగణింపకు మయ్య! మదీయసువ్రతం
బును వినవయ్య! యిందుఁ బొరపొచ్చెము లున్నను సైఁపవే ననున్!


ప్రాణము లిచ్చియైనను శుభంబగు కీరితి మూటగట్టి యా
ద్దాన ముదంబు నొందుటయె ధర్మముసుమ్మి మహాత్మ! సత్య మ
ద్దానికె వేచియుందునుగదా! యిది నాదు వ్రతంబు; దీని కే
దేనియు విఘ్నముం బొరయునేని సహింపను లేశమేనియున్."

అనియే కర్ణుఁడు పట్టుపట్టెనుగదా! త్యాగంబు గావించు ప
ట్టునఁ బ్రాణంబులుసైత మాత్రఁ డొకనాఁడుంగాని ముఖ్యంబు లం
చను భావింపఁడు; వాని ధర్మ మది యంచుం గొంద ఱగ్గింప వ
చ్చునుగాఁబోలు! రహస్య మేమొ? యదియే చూపెట్టఁగాఁబోలదే!

బ్రదుకుటయే ప్రధాన మనరాదు జగంబునఁ గాకిమూఁకలున్
బ్రదుకుచునుండు నెంగిళులు భక్షణసేయుచుఁ బెద్దగాల; మ
య్యది యొక లెక్కయే? యొకరికైనను బ్రాణ మొసంగి సాహ్యసం
పద గడుఁ గూర్చు భాగ్య మది భావ్యముగా నుతియింపఁ జెల్లదే!

అరయఁగ నశ్వరంబయిన యాయువుమాట మెఱింగి కాలమున్
జరుపుచు సత్ప్రవర్తన మొసంగఁగ- దేహమునన్న ఖిన్నమై
పరఁగుచు వన్నె తేఁగలుగు భవ్యపథంబు గడింపఁగోరి సం
బరముగ లాఁతివారలకుఁ బ్రాణములైన మహాత్ము లీయరే!

ఒక ధర్మంబును నిర్ణయించుతఱి నీ యుక్తిప్రయుక్తుల్ విశా
ర్యకదృష్టిన్ బెనుపొంది సత్యమగు నంశంబున్ వెలార్పంగ ను
త్సుకతన్ జూపుట మేలు; దానికొఱకే సు మ్మిట్టి శాస్త్రాలు సా
ధకవర్గంబులుగా గ్రహింపవలెఁ దత్త్వాంగంబు గుర్తించుచున్.





ప్రాచీనాలంకారము

లేపాక్షి దేవాలయములో రంగులలో చిత్రితమై యున్న రమణీమణి
చిత్రకునకు శ్రీ సుధాంశుకుమారరాయిగారు తీసిన నకలు.



కోయదొర

లేపాక్షి దేవాలయములోని ప్రాచీన వర్ణ చిత్రములలో
ఒకదానికి శ్రీ సుధాంశుకుమార రాయిగారు తీసిన నకలు.

నవ్యాంధ్రవ్యాకరణనిర్మాణము

శ్రీ చిలుకూరి నారాయణరావు

మహోపాధ్యాయ, కళాప్రపూర్ణ, డాక్టరు, ఎమ్. ఏ., పి. హెచ్. డి., ఎల్. టి.—చూచినావా, ఎంతెంతలేసి బిరుదులో! నేయి లేని నేతిబీరకాయలు, బంగారము లేని బంగారపు పిచికలు, నిజము లేని నిజాములు! నవ్యాంధ్రవ్యాకరణము వ్రాయ తలపెట్టి నాయంతటి అజ్ఞాని మఱొక్కడు లేడని కనిపెట్టగలిగినాను. ఆంధ్రభాష నా సొమ్మని నాకు చెడగర్వ ముండేది. ఏమేమో పాడేచి వేసినా నని మితిమీరిన తలతిరుగుడు.

నా స్నేహితు లంటారుకదా—"మీరు గిడుగు రామమూర్తి పంతులుగారి శిష్యులు. ఆయన నవ్యాంధ్రభాషాపితామహు డయితే మీరు నవ్యాంధ్రభాషాజనకులు. ఆయన బయలుదేరదీసిన ఉద్యమము లోకములో వ్యాపించి, వేళ్లు నాటి, కదలించడానికి వీలులేకుండా అల్లుకొనిపోయినది. రామమూర్తిపంతులుగారి ఆశీర్వచనముతో నవ్యసాహిత్యపరిషత్ స్థాపకులయి దాని అభివృద్ధికోసము పాటుపడుతున్నారు. నవ్యాంధ్రవాఙ్మయమేమో వ్యాపిస్తున్నది కాని, నవ్యాంధ్రభాషాస్వరూపమేమో తెలియజేసే వ్యాకరణము లేకపోవడ మొక పెద్దలోపముగా ఎంచి కొందరు మహనీయు లీ నవ్యాంధ్రము పాఠశాలలలోను, కళాశాలలలోను ప్రవేశించకుండా చేస్తున్నారు. మీ రొక నవ్యాంధ్రవ్యాకరణమును వ్రాసిపారేస్తే ఆ ఆటంకము తీరిపోతుంది. నవ్యాంధ్రభాషోద్యమానికి సంపూర్ణవిజయము కలుగుతుంది. అట్టి వ్యాకరణము వ్రాయడము మీ కొక పెద్ద పని కాదు" అని.

అవును, అంతటివాడనే కాబోలు ననుకొన్నాను. ఇదంతపని, తెల్లవారేసరికి గీకిపారేద్దా మని ఊటకలమునిండా సిరా పోసి, కాగితము దస్కూమీద పెట్టి కలము చేతబట్టవలె ననుకొనేసరికి, ఎక్కడ లేని దిగులూ పట్టుకొన్నది. అర్జునునికి యుద్ధారంభములో కలిగినంత దిగులూ కలిగినది. ఆయనకు 'గాండీవం స్రంసతే హస్తాత్' అయితే, నాకు 'లేఖినీ స్రంసతే హస్తాత్' అయినది. ఆపళంగా ఆ కలాన్ని దస్కూమీద పెట్టి ఆలోచనానిమగ్నుడ నైనాను.

నవ్యాంధ్రభాష! ఏది నవ్యాంధ్రభాష? గ్రంథస్థభాషా, వాడుకలోని భాషా? గ్రంథస్థభాష అయితే భారతానుకరణాల నుంచి ఇప్పటి అభ్యుదయతరంగాలదాకా గ్రంథాలున్నవి. వీటిలో ఒక గ్రంథానికీ, మఱొక గ్రంథానికీ గల భేదాలు స్థూలదృష్టికే అనంతముగా కనిపిస్తున్నవి. పూర్వాంధ్రవ్యాకరణము వ్రాయాలంటే పూర్వకాలపు వ్యవహారభాషను గల నిదర్శనాలు చాలా తక్కువగా ఉన్నవి. పూర్వకాలపు గ్రంథాలుకూడా నశించినవిపోగా వైయాకరణుల అదృష్టవశమున కొంచెముమాత్రమే ఉన్నవి. వాటి కేదో విధముగా వ్యాకరణము వ్రాయవచ్చు. వ్రాయలేనప్పుడు "శేషం" వాయినా, ఊకాయింపునా "పూరయేత్" చేయవచ్చు. ఎవరయినా ఆక్షేపించవస్తే "భారతములో ప్రయోగ మున్నది చూడుకో" అని దబాయించవచ్చు. కాని, నవ్యాంధ్రమువిషయములోనో? దీనిలో ఎవనిమట్టుకు వాడే పండితుడు. ఎవనికి వాడే ఆథారిటీ, అంటే అధికారి. లక్షణమును సాధ్యమైనంతవరకూ సరిగానే ఏర్పాటుచేసినా సూత్రాలకంటే అపవాదాలే ఎక్కువగా ఉంటవి కాబట్టి, అది అపవాదాల వ్యాకరణ మవుతుందిగాని సూత్రవ్యాకరణము కాజాలదు. అందుచేత తెగబడి వ్రాస్తే కాకులలాగు నాలుగువైపులనుంచీ గుయ్యిబట్టుకొంటారు. అయితే ఏమి చేయడము? ఊరుకోవలసినదేనా?

ఇట్టి ఆలోచనాపరంపరలో పడినకొద్దీ విశ్వరూపం కనిపించిపోయింది. భగవద్గీత పదకొండో అధ్యాయములోని అర్జునుని అవస్థలో పడ్డాను. అయినా, ఆ అనంతకోటిరూపాలతో కనబడిన ఆ విరాట్ స్వరూపముమధ్య నిరంతరమున్నూ భాసిస్తూఉన్న ఒకానొక కల్యాణమూర్తివలెనే నా కళ్లకూ నవ్యాంధ్రభాషావిశ్వకల్లోలినీమధ్యమున సహస్రారపద్మసంవాసినియై, వీణాపుస్తకపాణియైన సుహాసిని, సుమధురభాషిణిగా నవ్యాంధ్రభారతీస్వరూపము పొడగట్టినది. నాకు కొంత ధైర్యము కలిగినది. దిటవు తెచ్చుకొని కుదుటపడ్డాను.

* * *

వ్యాకరణనిర్మాణము కష్టమైనదే. దానిలోని కష్టనిష్ఠురములను కొంచెము మచ్చుకు చూపుతాను.

వ్యాకరణ మంటే విశదీయడము. సంపూర్ణ భావము సంపూర్ణవాక్యములో వ్యక్తమవుతుంది. అట్టి సంపూర్ణవాక్యము లనేకములు కలిసి ఒక మహావాక్యమయి గ్రంథరూపమును పొందుతుంది. ఆ మహావాక్యములోని అన్ని చిన్నవాక్యములును అర్థవంతములయి

పరస్పరసంబంధము గల సమర్థపదముల కూడికలుగా ఉంటవి. వాక్యములోని పదములను **విడగొట్టి** వాటి పరస్పరసంబంధమును తెలుపడమే వ్యాకరణము చేసే పని.

వ్యాకరణనిర్మాణవిధానమును తెలియజేయడానికి క్రింది మహా వాక్యమును విడగొట్టి దానిలోని పదముల సంబంధమును నిరూపించ ప్రయత్నిస్తాను.

మ హా వా క్య ము

(నా 'అశ్వత్థామ' నాటకము, పుట ౨౧. అశ్వత్థామస్వగతము-)

"ఉహ్ ! (నిట్టూర్పు విడుస్తున్నాడు.) అంతే ? మహారాజా ! నీఋణము తీర్చుకోలేనా ? ఎంత వ్యర్థుడను ! ఈ విల్లు, ఈ అమ్ములు ఎందుకు? మోతదండుగేనా? అయినదీ? కౌరవుల పేరు ఈలోకములో సరా !... అయ్యో ! లోకమంతా నిద్రపోతున్నది. నే నొక్కడనే మేలుకొని ఉన్నాను. ఎంత విచిత్రమయినది ఈ లోకము ! పుట్టితే ఒక్కసారి నవ్వుతారు. జీవి అభివృద్ధిపొందితే చూచి, ఏడ్చి, అసహ్యించుకొనేవాళ్లే ఎక్కువమంది. వృద్ధిలో ఉన్నంతసేపూ అంటిపెట్టుకొని ఉండేవాళ్లయినా స్వలాభ మీడేరేవరకే. పడినవాని వైపు చూడనైనా చూడరు. నవ్వి, మరికొందరు రాళ్లు విసరుతారు. బ్రతికి ఉన్నన్నాళ్లూ చెడ తిని, చస్తే, 'అయ్యో ! మరి వీడివల్ల లాభము ఉండదే' అని ఒక్క ఏడ్పు ఏడ్చి, ఊడ్చిపారవేస్తారు. ఆ తరువాత ఒకసారి తలచుకొనయినా తలచుకోరు. ఆపదలో సహాయపడనివాడు బంధువు డయితేనేమి, మిత్రు డయితేనేమి ? నా యేక వ్యవసాయము... నా ప్రభువు నెట్లు సంతోష పెట్టగలను ? ఏమీ తోచదే ! (ముందర మీదికి చూస్తున్నాడు.) ఓహో ! ఈ చెట్టుమీద ఎన్ని పక్షులు నిద్రపోతున్నవి ! నిర్విచారము ! మనుష్యునిది ఒక పక్షిబ్రతుకయినా బాగుండేది. ఆరూ, పోరూ లేదు. ఏమో ! వీటికిమాత్రము ప్రేమ, ద్వేషము, శత్రుత్వము, మిత్రత్వము ఎందు కుండవు ? ఏమది! ఆచెట్టుమీదికి చప్పుడు చేయకుండా ఎలా వస్తున్నదో ఆ పక్షి ! ఎంత భయంకరంగా ఉంది ! కన్నులవెంట నిప్పులు రాలుస్తున్నది. ఆఁ ! ఆఁ! ఆరంభించినది. పీకలు కొరికివేస్తున్నది. ఎన్ని పక్షులో! ఓహో! నిద్రమత్తుమీద లేచినవి. ఎంతెంత కాళ్లు ! ఎంతెంతలేసి గోళ్లు ! వేల కొద్దీ పక్షులు గిలగిల కొట్టుకొని క్రిందపడుతున్నవి. పారిపోతున్న వాటినికూడా విడువకున్నదే ! వెంబడించి వెంబడించి, రెక్కలతో కొట్టి కూల్చుతున్నది. బలే ! సంహారము ! సంపూర్ణసంహారము ! శత్రునిశ్శేషము ! ఓ ఉలూకమా ! నీవు నాకు గురుడవు. మంచి మిత్రమవు సుమా ! మనుష్యమాత్రుడు చేయలేని ఉపదేశమును చేసినావు. మామను లేపుతాను. మామా ! మామా !!"

పై మహావాక్యమును వ్యాకరించి చూపుతాను. దానికోసము అందులోని పదముల నెంతెంతవరకు అర్థము చెడిపోకుండా విడగొట్ట గలమో అంతవరకు విడగొట్టినాను. అట్లు విడిపోయినపదాలలో ఏక రూపత, ఏకవిధనిర్మాణము, ఏకజాతి గలవాటిని ప్రత్యేకవర్గములుగా మొట్టమొదట ఏర్పాటుచేస్తే ఈక్రింది వర్గా లేర్పడినవి :

I సంధి

౧. ఉత్వసంధి : నేను + ఒక్కడనే = నే నొక్కడనే; పక్షి బ్రతుకు + అయినా = పక్షిబ్రతుకయినా; లోకము + అంతా = లోకమంతా; వాళ్లు + అయినా = వాళ్లయినా.

౨. అత్వసంధి : ఉన్న + అంత = ఉన్నంత; ఉన్న + అన్ని = ఉన్నన్ని.

౩. ఇత్వసంధి : ఏమి + అది = ఏమది; సరి + ఆ = సరా; అయినది + ఈలోకము = అయిన దీలోకము; ఏమి + ఓ = ఏమో.

౪. కొన్ని శబ్దములు ద్రుతాంతములు : అయితేన్ ; దండుగేనా ; అంతేనా ; తలచుకోన్.

౫. ఇతరసంధులు : నిడు + ఊర్పు = నిట్టూర్పు.

II తత్సమ, తద్భవములు

(అ) తత్సమములు :—సం-ఆపద్, తె-ఆపద; సం-ఉపదేశః, తె-ఉపదేశము; సం-ఉలూకః, తె-ఉలూకము; సం-ఋణమ్, తె-ఋణము; సం-కౌరవాః, తె-కౌరవులు; సం-జీవిన్, తె-జీవి; సం-ద్వేషః, తె-ద్వేషము; సం-పక్షిన్, తె-పక్షి; సం-ప్రభుః, తె-ప్రభువు; సం-ప్రేమన్, తె-ప్రేమ; సం-బంధుః, తె-బంధువుడు; సం-భయంకరమ్, తె-భయంకరము; సం-మనుష్యః, తె-మనుష్యుడు; సం-మహారాజః, తె-మహారాజు; సం-మనుష్యమాత్రః, తె-మనుష్య మాత్రుడు; సం-మిత్రత్వమ్, తె-మిత్రత్వము; సం-మిత్రమ్, తె-(మహద్వాచకము) మిత్రుడు; సం-లాభః, తె-లాభము ; సం-లోకః, తె-లోకము; సం-విచిత్రః, తె-విచిత్రము; సం-వృద్ధిః, తె-వృద్ధి; సం-వ్యర్థః, తె-వ్యర్థుడు; సం-శత్రుత్వమ్, తె-శత్రుత్వము; సం-సంహారః, తె-సంహారము; సం-స్వలాభః, తె-స్వలాభము.

పైవాటిలో ఉపదేశ, ఉలూక, ద్వేష, మనుష్య, మనుష్య మాత్ర, లాభ, లోక, వ్యర్థ, సంహార, స్వలాభశబ్దములు సంస్కృతములో అకారాంతపుంలింగశబ్దములు.

ఋణ, మిత్రత్వ, మిత్ర, శత్రుత్వ—ఇవి అకారాంత నపుంసకలింగ శబ్దములు.

వృద్ధి—ఇకారాంత స్త్రీలింగము.

ప్రభు, బంధు శబ్దములు ఉకారాంత పుంలింగములు. బంధు శబ్దము బంధువు అని మాత్రము తత్సమరూపము కావలసి ఉండగా, వ్యవహారములో బంధువుడు అనే తత్సమరూపముకూడా ఏర్పడినది.

ప్రేమ శబ్దము సంస్కృతములో అన్నంత నపుంసకలింగము.

జీవి, పక్షిశబ్దములు ఇన్నంత పుంలింగములు.

భయంకర, విచిత్రశబ్దములు అకారాంతవిశేషణములు.

(ఆ) తద్భవములు:—తె-అమ్మ, సం-అంబకః; తె-ఎక్క, సం.ఏక్ + కృ; తె-ఏడ్పు, సం-విలాపః; తె-చప్పుడు, సం-శబ్దః; తె-చెట్టు, సం-శైత్యకః (చల్లదనమునిచ్చేది); తె-దండుగ, సం-దండః; తె-నాడు=దినము, సం-నాడికా; తె-నిప్పు, సం-అగ్ని, ప్రాకృతము-నిఉ అ, ఒరియా- నియో; తె-పీక=గొంతుక, గొట్టము; చూ. ఇంగ్లీషు-పైప్; తె-పీనుగు, సం-వ్యాపనకః=ప్రాణముపోయినది (వి + ఆప + కః); తె-పేరు, సం-యశస్=ఎసర్=కన్న-హెసర్ పెసర్, తమి- పెయర్, తె-పేరు; తె-మంచి, సం-మాన్య; తె-మత్తు, సం-మత్తా,మదః; తె-మంది, సం. బృంద, బృందికా; తె-గమ, సం-నామః; తె-మీద, సం-మధ్య; తె-ముందు, సం-పురతః; తె-మోత (మోయు), సం-భ్రియ్; తె-రాయి, సం-లోష్టికా=లొత్తిక, లాతి,రాతి, రాయి; తె-రెక్క, సం-రక్షా=రెక్ఖా=రెక్క (రక్షించు నట్టిది); తె-సర(సు), సం-సార; తె-సరి, సం-సదృశ; తె-సారి, సం-సారికా.

III విభక్తి వచనములు

(అ) ప్రథమాబహువచనము:—పక్షులు (పక్షి); నిప్పులు (నిప్పు); నాళ్లు (నాడు); రాళ్లు(రాయి); గోళ్లు (గోరు).

ద్వితీయైకవచనము: ప్రభువును, మామను.

తృతీయాబహువచనము: రెక్కలతో.

షష్ఠ్యేకవచనము: మీదికి, ముందుకు, ఆపదలో, లోకములో, వృద్ధిలో.

షష్ఠీబహువచనము: కన్నులు, కౌరవుల.

సప్తమ్యేకవచనము: తరువాత, మీద, చెట్టుమీద, మత్తుమీద.

సంబోధనప్రథమ: ఓఉలూకమా! మామా!

(ఆ) ఔపవిభక్తికములు: తరువాత (తరువాయి); మీద (మీదు).

ఐచ్ఛికాపవిభక్తికము: ఎంత విచిత్రము! ఎంతటి విచిత్రము!

* ఈధాతువు స్వరూపము తమిళ మళయాళకన్నడము లలో చాలాప్రచారములో ఉన్నది. తెనుగులో మరుగుపడినది. 'ఇరు'లోని రేఫమునకు 'ల'కార మాదేశమయి, 'ఇలు'నుంచి ఇలని (లేని);ఇలక (లేక); ఇలడు (లేడు); ఇలరు (లేరు); ఇలదు (లేదు); ఇలవు (లేవు)-మొదలయిన వ్యతిరేకార్థకరూపము లేర్పడి ప్రచారములో ఉన్నవి. కన్నడములోని 'ఇల్ల', తమిళమళయాళముల లోని'ఇల్లెయ్'అనే వ్యతిరేకార్థకరూపాలుకూడా 'ఇరు'ధాతువునుంచి పుట్టినవే. ఈ అన్ని భాషలలోని వైయాకరణులు, పూర్వభాషా శాస్త్రపరిశోధకులు, అందరూ ఈ విషయమును గ్రహింపలేక వాడుకలో ఎక్కడా లేని 'ఇల్' అనే ధాతు వొకటున్నదనిన్ని, అది వ్యతిరేకార్థకధాతు వనిన్ని చెప్పినారు. ఈప్రతిపాదనము తప్పని మొదట కనుగొన్నవాడను నేను.

(ఇ) కారకము: అభివృద్ధి పొందితే; ఉపదేశము చేసినది; ఏడ్పు ఏడ్చి; పీకలు కొరికివేస్తున్నది—వీటిలో ద్వితీయకు ప్రథమ వాడబడినది.

IV సర్వనామములు

(అ) పురుషసర్వనామములు:

ఉత్తమపురుషము: నేను, నా, నాకు.

మధ్యమ పురుషము: నీవు, నీ.

నిర్దేశార్థక విశేషణములు: ఆ (చెట్టు); ఆ (పక్షి); ఈ (చెట్టు).

('ఆతరువాత'లోని 'ఆ' నిర్దేశార్థకసర్వనామ మవుతుందా? లేక 'అటు' అనే అవ్యయమునకు రూపాంతరమా?)

ప్రథమపురుషము, దూరార్థము, పుంలింగము: వాడు,(సహాయపడని)వాడు; (పడిన) వాడి; వాళ్లు.

సమీపార్థము, పుంలింగము: వీనికల్ల.

ప్రథమపురుషము, దూరార్థము, అమహద్వాచకము: అది, వాటిని.

ప్రథమపురుషము, సమీపార్థము, అమహద్వాచకము: వీటిని.

(ఆ) సంఖ్యావాచకములు: ఒక (నక్కపీనుగు); ఒక (పక్షి బ్రతుకు); ఒక (సారి); ఒక ఏడ్పు; ఒక్క-సారి; రెండురాళ్లు; వేలకొద్దీ—ఈ సంఖ్యావాచకపదముల అర్థవిశేషములను గమనింపవలెను.

(ఇ) పరిమాణవాచకసర్వనామము: (ఉన్న) అంత; ఎంత (కొళ్లు); ఎంతలేసి గోళ్లు; ఎంత భయంకరము; ఎంత విచిత్రము.

(ఈ) సంఖ్యాప్రశ్నార్థకము: ఎన్ని (పక్షులు).

(ఉ) ప్రశ్నార్థకము: ఏమి.

V సమాసములు

(అ) సంస్కృతసమాసములు: నిర్విచారము, మనుష్యమాత్రుడు, మహారాజు, శత్రునిశ్శేషము, సంపూర్ణసంహారము.

(ఆ) ఆచ్ఛికసమాసములు: ఎక్కువమంది, కౌరవులపేరు, నక్కపీనుగు, నిద్రమత్తు, పక్షిబ్రతుకు, మోతదండుగ, సహాయపడనివాడు.

(ఇ) జంటపదములు: ఆరూ పోరూ.

(ఈ) ద్విరుక్తి: వెంబడించి వెంబడించి; కొట్టి కొట్టి; అఁ, అఁ!; మామా! మామా!

VI (అ) ధాతువులు, వాటినుండి కలిగిన ఇతరరూపములు

అగు (కాక, అయిన, అయినా, అయితే);-సహాయక్రియ: విచిత్రమగు; అంటు (అంటిపెట్టుకొని ఉండు, అంటిపెట్టు, అంటిపెట్టుకొను);-అను (అని) అసహ్యించు (అసహ్యించుకొను); ఆరంభించు ;—*ఇరు=ఉండు.

—ఈడేరు (ఈడేరే); ఉండు (చేయకుండా, బాగుండును, ఉన్న, బ్రతికి ఉన్న, ఉండే); ఏడ్చు (ఏడ్చి); కలు (గు), కల ('కల' అనే విశేషణమునకు మూలము 'కలు' అనే ధాతు వుండవలెను. ఇప్పుడది లేదు. 'కల' అనే విశేషణము మాత్రమే మిగిలినది. తక్కిన సందర్భాలలో 'కలుగు' ధాతువే ప్రచారములో ఉన్నది.) కూల్చు; కొను (సహాయకక్రియ), అస హ్యించుకొనే; కొట్టుకొని, తలచుకొను, తలచుకోక, తీర్చు కొనే, పెట్టుకొని, మేలుకొని; కొట్టు (కొట్టి); కోరుకు; చచ్చు (చస్తే); చూచు(చూడక, చూచి);-చెడు (చెడితిని); చేయు (చేయ కుండా, చేయలేని, ఉపదేశము చేయు); తిను (చెడితిని); తీర్చు (తీర్చుకోక); తోచు; నవ్వు (నవ్వి); పడు (పడిన, సహాయపడని); పారు (పారిపోతున్న, పారవేయు); పుట్టు (పుట్టితే); పెట్టు (సంతోషపెట్టు); పొందు (అభివృద్ధి పొందు, పొందితే); పోవు (నిద్రపోతున్న, పారిపోతున్న); రాల్చు (నిప్పులు రాల్చు); లేచు, లేపు; వచ్చు; విడుచు (విడువక); విసరు; వెంబడించు (వెంబడించి వెంబడించి); వేయు.

(ఆ) సంపూర్ణక్రియలు :

వర్తమానకాలము

ఉత్తమపురుషము :—ఉన్నాను, మేలుకొని ఉన్నాను, సంతోష పెట్టగలను.

ప్రథమపురుషము : మహద్వాచకము :— చూస్తున్నాడు, విడుస్తున్నాడు.

అమహద్వాచకము : ఏకవచనము :—ఉన్నది, ఉంది, కూల్చు తున్నది, నిద్రపోతున్నది, కొరికివేస్తున్నది, రాలుస్తున్నది, వస్తు న్నది, వేస్తున్నది.

బహువచనము : నిద్రపోతున్నవి. పడుతున్నవి.

భూతకాలము

మధ్యమపురుషము : ఏకవచనము :—చేసినావు.

ప్రథమపురుషము : ఏకవచనము:—అయినది, ఆరంభించినది.

,, బహువచనము:—లేచినవి.

భవిష్యత్కాలము

ఉత్తమపురుషము : ఏకవచనము :—లేపుతాను.

ప్రథమపురుషము : మహన్మహతీ బహువచనము :—నవ్వు తారు, పారవేస్తారు, విసరుతారు, వేస్తారు.

'బాగుండేది' అనే రూపమున కర్థవిశేష మున్నది.

(ఇ) వ్యతిరేకక్రియలు :—

ఉత్తమపురుష : ఏకవచనము :—తీర్చుకోలేను.

ప్రథమపురుషము : మహన్మహతీబహువచనము :—చూడరు, కొనరు, తలచుకోరు.

అమహత్తు : ఏకవచనము :— ఉండదు, తోచదు, లేదు.

,, : బహువచనము :—ఉండవు.

'విడువకున్నది' అనే వ్యతిరేకరూపనిష్పత్తిలో విశేషమున్నది.

(ఈ) ఇతరక్రియలు:—ఒక్కటేను, వ్యర్థమను, మిత్రమవు, గురువవు.

VII అవ్యయములు

(అ) ఎట్లు; ఎంత (భయంకరము); ఎంత (విచిత్రము); ఎందుకు; ఎలా; ఏమి; క్రింద; గిలగిల; మరి (గొంతు); మరి (వీనివల్ల లాభములేదు); (పిటికి) మాత్రము; ముందుకు.

విశేష్యవిశేషణములమీద అనుధాతుజన్యమైన 'కాగా' చేర్చడము వల్ల అవ్యయాలేర్పడుతవి—భయంకరంగా.

(ఆ) ఆశ్చర్యార్థకములు: అయ్యో! ఆఁ! ఆఁ! ఉహ! ఓహో! బలే!

(ఇ) కొన్ని ఏకాక్షరకావ్యయముల విశేషార్థములు :—

అ (ప్రశ్నార్థకము) : సరా? దంపుగేనా?

ఆ (సముచ్చయదీర్ఘము) : అంతా; సందేహార్థములు : అయినా; చూడనయినా చూడరు; అంటిపెట్టుకొని ఉండేవా ళ్లయినా; తలచుకోనయినా తలచుకోరు.

ఆ : చేయకుండా. ఇందులోని దీర్ఘమున కర్థమేమి?-కూడా.

ఈ : ఏమీ; వేలకొద్దీ; అయినదీ?

ఈ : ఉన్నవాళ్లూ; ఉన్నంతసేపూ; తీర్చుకోలేనూ?

ఏ : విశేషణచిహ్నము—ఉండే, ఈడేరే.

ఏవార్థకము : నగరకే, ఒక్కటనే, వాళ్లే.

ఉండదే! తోచదే!—వీటిలోని అర్థవిశేషము గమనించాలి.

అంతే? (దీనిలో 'ఏ' ప్రశ్నార్థకము.)

ఓ : సందేహార్థకము; ఏమో!

(ఈ) స్వరవిశేషముచేత ఆశ్చర్యబోధ—ఎంత విచిత్రమైన దీ లోకము! సంహారము! సంపూర్ణసంహారము! ఎన్ని పక్షులు నిద్ర పోతున్నవి! ఎంతెంత కాళ్లు! ఎంతెంతలేసి గోళ్లు! ఎంత భయం కరంగా ఉంది! కూలుస్తున్నది! అయినది! ఆరంభించినది!

ఈ (౧) స్వరమే భాషకు ముఖ్యప్రాణము. దీనికితోడు (౨) 'కూత'; (౩) యాస; (౪) పదముల పౌర్వాపర్యము; (౫) ప్రకర ణము—ఈ అయిదున్ను పంచప్రాణములు. వీటిని గ్రహించి నిరూ పించడము చాలా కష్టము. ఇప్పటి కెవ్వరున్ను నిరూపించలేదు. నిరూపించలేరు. చైతన్య మనిర్వాచ్యము, అనిర్వాచ్యము గదా!

నవ్యాంధ్రవ్యాకరణ నిర్మాణము

ఇంతవరకూ ఒక చిన్న గ్రంథములోని చిన్న పరిమిత భాగమును మాత్రము శోధించి, అట్లు శోధించగా వచ్చిన ముక్కలను కొన్ని వర్గములక్రిందకి తెచ్చినాము. అట్లే ఆ గ్రంథము నంతటినీ, లేదా నవ్యాంధ్రగ్రంథముల నన్నిటినీ ఆ విధముగానే చేస్తే, ఇంతకంటె కొన్ని వేలరెట్లు ముక్కలు ప్రోగుపడి, మరికొన్ని రూపాలు, మరికొన్ని వర్గాలు, మరికొన్ని విశేషాలు ఏర్పడి, మన మేర్పరిచే ప్రతివర్గములోను ఎన్నో ఎక్కువ ఉదాహరణాలు చేరుతవి. కాని ఏర్పడిన వర్గముల సంఖ్యమాత్ర మెంతో ఎక్కువగా పెరుగదు.

అయితే గ్రంథస్థమైన భాష చాలా పరిమితముగదా. ఏ రామాయణమో, భారతమో, భాగవతమో, కథలో, పద్యాలో, పాటలో—ఇవి అన్నీ ఏవో కొన్నికథలను, జీవితములోని కొన్ని పట్టులను మాత్రము తెలియజేసే భాషలో ఉంటవి. నిత్యజీవితములోని భాష అనంతవిధముల, అనంతముఖముల, అనంతభావబోధకమై ఉంటుంది. దాని నంతటినీ ఒకచోట చేర్చుట మసాధ్యము. గ్రంథస్థమైన దసలు భాషే కాదేమో అనిపిస్తుంది. ఎందుచేతనంటే, గ్రంథకర్త ఉన్నదాని నున్నట్టుగా గ్రహింపక, దానికి తన సంస్కారము కొద్దీ, శక్తికొద్దీ వన్నెలు, చిన్నెలు దిద్దుతాడు. లోకములో ఉండే ఆ పలుకుబడుల ఒకప్పుడు అందాలను గ్రహించలేక పోతాడు.

వాగ్రూపముగా ఉన్నదే భాష. ఆ భాష ఉత్త గాలి. ఆ గాలి గాలిలో ఎప్పటికప్పుడు కలిసిపోతూ ఉంటుంది. అది ఇతరమనుష్యుల మెదడులలోని కెక్కితే అక్కడ కొంతకాలము నిలుస్తే నిలువవచ్చును. కాని శీఘ్రకాలముననే విస్మృతము కావచ్చును. లేదా, ఆ మనిషి అంతరించగానే ఆ భాషాజ్ఞానముకూడా అంతరించవచ్చును, అట్లంతరించకుండా, తానే మరొకకాలములో స్మృతికి తెచ్చుకొనడానికీ, తనకు దూరముగా ఉన్నవానికి తన భావమును తెలుపడానికీ, దేశకాలములలో మనకు దూరస్థులైనవారికి మన అభిప్రాయాలను తెలుపడానికీ, వారి భావాలను తెలుసుకొనడానికీ ఒక్కొక్క భాషను మాట్లాడేవారు తాము ప్రత్యేకముగానో, లేదా ఇతరులనుంచి ఎరువు తెచ్చుకొనే వ్రాత అనే దాని నేర్పాటుచేసుకున్నారు. ఈ వ్రాత ధ్వనుల నన్నిటినీ సరిగా నిరూపించలేక పోవచ్చును. నిరూపించలేదు కూడాను. ఏదో స్థూలముగా నిరూపించినా దానిలోని సొగసులను, మూర్ఛనలను, ఒత్తులను, నొక్కులను, చిన్నచిన్న మర్మములను తెలుప సమర్థము కాకపోతుంది. జీవితపుభాషలో ప్రతినిత్యమూ తాండవమాడుతూ ఉన్న చైతన్యమును, స్వరము, యాస, పదరచన, రచనలోని వైవిధ్యము, తారళ్యము—వీటి నన్నిటిని వ్రాత తెలుపలేదు. 'అట్లు తెలుపలేని వ్రాత చాలా పరిమితప్రయోజనము కలిగి ఉంటుందని వేరే చెప్పవలెనా ?

మరొక విషయము. లోకములోని భాష అంతా ఒక్కటే విధముగా ఉండదు. మండలములనుబట్టి, వృత్తులనుబట్టి, సంస్కారమునుబట్టి, చదువునుబట్టి, పరిసరములనుబట్టి, ఎదుట మాట్లాడేవారినిబట్టి, వయస్సునుబట్టి, మాట్లాడేవారి తాత్కాలిక శారీరక మానసిక తత్వమునుబట్టి, అవస్థనుబట్టి, ఇంకా ఎన్నో ఎన్నో విషయాలనుబట్టి మారిపోతూ ఉంటుంది. అందుచేత వ్రాతలో పట్టుబడిన భాషను శోధించి, వర్గీకరింపగలిగినట్లు కేవల వాగ్రూపభాషను చేయలేము. ఏ మూలలలో, ఏ సంఘములలో, ఏ కుటుంబములలో, ఎవ రెట్లు మాట్లాడుతున్నారో గమనించి, ఒకచోట చేర్చి, శోధించి, ఎవరు శాస్త్రమును, సంపూర్ణ శాస్త్రమును వ్రాయగలరు ? ప్రపంచ భాషలలో అట్టి పనిని చేయడానికి సంస్కృతభాషలవిషయమున పాణిని, పతంజలి, వరరుచి అనే మునిత్రయమువారు ప్రయత్నించారు. కాని వారి ప్రయత్నమైనా సంపూర్ణముగా నెరవేరలేదు. ఆ మాట వారే ఒప్పుకున్నారు. సంస్కృతభాషావ్యాకరణముతో వైదికభాషా సంప్రదాయాలూ, లౌకికభాషాసంప్రదాయాలూ చేరేసరికి ఉక్కిరిబిక్కిరి అయిపోయింది వారికి. ఆ సంగతిని గ్రహింపగలిగిన మహాశాస్త్రవేత్త కాబట్టి పతంజలి తన మహాభాష్యములో—

"ఏవంహి శ్రూయతే, బృహస్పతి రింద్రాయ దివ్యం వర్ష సహస్రం ప్రతిపదోక్తానాం శబ్దానాం పారాయణం ప్రోవాచ—నాన్తంజగామ"

బృహస్పతి ఇంద్రునికి వేలకొద్దీ దివ్యవర్షములు ప్రతిపదోక్తశబ్దముల పారాయణము చెప్పినాడుగాని, వాటిని చెప్పడము పూర్తికాలేదట. పరిమితగ్రంథసామగ్రి గల గ్రాంథికభాషావ్యాకరణమును నిర్మించడమే ఇంత కష్టమైతే, అనంతమైన, అగ్రాహ్యమైన, తరళమై తప్పించుకొనిపోయే జీవద్భాషకు వ్యాకరణము వ్రాయడ మెంత కష్టమైన పనో ఊహించుకోవచ్చు.

కాని, శాస్త్రకారుడు నిస్పృహ చెందనక్కరలేదు. ఎందుచేతనంటే, ప్రతిపదోక్తములైన శబ్దముల సంఖ్య అనంతమే అయినా, అవి అన్నీ విడిపోయి ఏర్పడే సజాతీయవర్గముల సంఖ్యమాత్రము కొంచెమే. ప్రతివర్గములోని ప్రతిపదోక్తశబ్దములున్ను ప్రత్యేక లక్షణములు గలిగి సామాన్యసూత్రగ్రథితములు కావడానికి యోగ్యములుగా ఉంటవి. అందుచేత వైయాకరణుడు చేయవలసిన పని (౧) సాధ్యమైనంతవరకూ ప్రతిపదోక్తశబ్దజాలము నేర్పరచడము, (౨) వాటిని వర్గములుగా విడదీయడము, (౩) ఒకొక్క వర్గములో చేరిన ప్రతిపదోక్తశబ్దముల సామాన్యలక్షణమును, లేక లక్షణములను గుర్తించి వాటికి సూత్రములను కల్పించడము, (౪) ఆయా సూత్రములలో ఇముడక నిలిచిపోయిన వాటి నాయా సూత్రముల కపవాదములుగా నిరూపించడము.

ఇది చాలా సులభముగానే కనబడుతున్నది కదూ! కాని, ఆ పనిని చేయడముమాత్రము మాటలతో చెప్పినంత సులువైనది కాదు. దానికి పరిభ్రమణము, పరిశ్రమము, పరీక్షణము, పరిమార్గణము,

పర్యాలోచనము, పరిశోధనము, పరిశీలనము, పరిప్రశ్నము, పరిజ్ఞానము —ఇవన్నీ పరిపరి విధముల కావలెను. అప్పుడే సాధ్యమైనంత సంపూర్ణ, సమగ్రవ్యాకరణము లభిస్తుంది.

న్యాయముగా ఆలోచిస్తే, ఒకొక్క మండలభాషకు, ఒకొక్క సంఘమునకు, ఒకొక్క వ్యక్తిభాషకున్నూ ప్రత్యేకవ్యాకరణ మేర్పడవలసినదే. ఆ అన్ని వ్యాకరణములలోని సామాన్యసూత్రముల నొకచోట చేర్చి ఆ సూత్రముల కపవాదముల నా సూత్రములక్రిందనే చూపిస్తే ఒక మహావ్యాకరణము తేలుతుంది.

పైని నా 'అశ్వత్థామ' నుంచి ప్రత్యేకించి వ్యాకరించిన ఆ చిన్నభాగమును చూడండి. దానిని చేయడానికి రెండు దినములు పూర్తిగా పట్టింది. కాని ఇంకా సూత్రరచన కాలేదుగదా. అయితే భాష అంతటికీ సూత్రరచన చేయవలెనంటే ఎంత కాలము పట్టుతుంది? ఒక జీవితకాలము చాలుతుందా? నావంటి ఒక్క సామాన్య వ్యక్తివలన అవుతుందా?

ఇంతా చేస్తే నా 'అశ్వత్థామ' లోని భాష నిత్యవ్యవహారస్థ భాష కాదు సరేకదా, నా నిత్యభాష అయినా కాదు. పాండవ కౌరవులకు ధనుర్విద్యాగురువయిన ద్రోణుని కొడుకు, బ్రాహ్మణుడు, వేదవేదాంగాధ్యయనసంపన్నుడయినా వేదజడుడయిన చాదస్తుడు (ఛాందసుడు) కానివాడు, మహావీరుడు, ఆత్మవిశ్వాసము కలవాడు, సాహసౌదార్యపూరితుడు, సౌహార్ద్రప్రేరితుడయినవాడు అయిన అశ్వత్థామ ఆ ప్రకరణములో ఎట్లు మాట్లాడి ఉంటాడో ఆ భాషను నేను ఊహించుకొని నేనయి కల్పించినది కాని, అశ్వత్థామ మాట్లాడుతూ ఉండగా రికార్డుచేసినది కాదు. అశ్వత్థామ అసలు సంస్కృతములో మాట్లాడేవాడో, తన చుట్టుప్రక్కలవారివలె తన దేశప్రాకృతములో మాట్లాడేవాడో నా కేమి తెలుసు? వ్యాసాదులయిన సంస్కృతకవు లతనిచేత సంస్కృతభాషలో మాట్లాడించినారు. ఇతరభాషాగ్రంథరచయితలు అశ్వత్థామచేత మాట్లాడించవలసిన సందర్భము వస్తే తమ గ్రంథాలలో తా ముపయోగించుకొనడానికి తాము కల్పించుకొన్న భాషలనే మాట్లాడించినారు. అట్లే నేనున్ను అతనిచేత ఆంధ్రభాషలో మాట్లాడించినా ననుకొని తృప్తి పడుతున్నాను. కాని, నిత్యవ్యవహారములో నా నోటినుంచికూడా అటువంటి భాష రాదు. దానిని వ్రాసేటప్పుడు ఒకవిధమైన నాటకరంగము, ఒక సంస్కారము గల ప్రేక్షకులు, శ్రోతలు, ఒకవిధమైన ఆవరణము, ఒకరీతి విమర్శకలోకస్థితిజ్ఞానము, కావ్యరసదృష్టి, మనోవ్యాపారవిజ్ఞానము— ఇన్నిటినీ మనస్సులో ఉంచుకొని—

"దేశము నెంచి, కాలమును దృష్టి లగించి, తెగించి, యాత్మ సందేశవిధాన మెంచి"


ఇంకా ఏమేమో చేసి, భాష కొకవిధమైన గౌరవము, ఉన్నతి, మర్యాద, శక్తి, మాధుర్యము, రీతి, శయ్య, పాకము, ధ్వని, మూర్ఛనలు, ఇంకా ఏ వేవో కలుగవలెనని మననము చేసి, నా సంస్కారము, నా చదువు, నా రసికత్వము, నా ఆత్మప్రీతి, పాండిత్యముల కనువుగా నా భాషను సంస్కరించి, మాటల నేర్చి, పేర్చి, కూర్చి, ఆ వాక్యములను వ్రాసినాను. ఆ వాక్యములు కేవలకల్పితములు. కాని కృత్రిమములు మాత్రము కావు. ఎందుచేతనంటే - ఆ వాక్యములలోని పదములను నేను సృష్టిచేయలేదు. అవి లోకములోనివే. ఆ పదముల స్వరూపమునుకూడా నేను సృష్టిచేయలేదు. ఆ రూపములుకూడా లోకములో నేకదేశమున కాకున్నా ఎక్కడనో ఒకచోట ప్రతిగోచరము లయ్యేవే. కాని, ఆయారూపములలో ఒకొక్కదానికిన్నీ మండలభేదమును బట్టిన్నీ, వృత్తి మొదలయిన భేదములనుబట్టిన్నీ రూపభేదము లుండవచ్చును. అయినా అట్టి అనేకరూపములలో అశ్వత్థామనోటినుంచి ఆ ప్రకరణములో వెడలడానికి యోగ్యము లని నేను తలచిన రూపములను మాత్రము నేను స్వయముగా, బుద్ధిపూర్వకముగా ఏర్చి కూర్చిన వాక్యములు కాబట్టి ఒక విధముగా వాటికి కావ్యత్వసిద్ధి కలిగినది.

అశ్వత్థామ బ్రాహ్మణుడు కాబట్టి అటువంటి మాటలు పలికిస్తేనే ఆ పాత్రమునకు గౌరవము కలుగుతుందని అభిప్రాయపడి అట్లా వ్రాసినాను. కాని, ఆ అశ్వత్థామకాక గంజాము, విశాఖపట్టణముల లోని ఒక బ్రాహ్మణేతరవిశేషు డట్టి ప్రకరణములో నెట్లా మాట్లాడి ఉంటాడోకూడా వ్రాయవచ్చును గదా. అట్లా వ్రాసి చూదాము:

"ఏఁ,...ఏఁ! అంతా? మా రాజా! నీ యప్పు తీర్చుకోనేనూ? యంత పనిమాలినోణ్ణి! ఈ యిల్లూ, యీ బాణాలూ యాల? మోద్దంటానే! కౌరవులోళ్ల పేరి బూమిమ్మీద కడుగుట్టిందా? అయ్యో! అందరూ సుక్రాట్టే నిద్దరోతున్నారు. నా నోణ్ణే తెలిగసున్నా. శాబాసు! యంత యిసిత్తిరం యీ నోకం. పుట్నప్పుడు మాత్తర మోసారి నౌతారూ? ఎత్తిరిల్లితే యాడుత్తారూ? తిన్నన్నాళ్లూ తిని, సత్తే, అయ్యో! యీడివోల్ల నాటం నేడే అని సద్దు మలుపుకోని యెవరిమా నాళ్లు నెసత్తారూ? యీడ్సి పారేత్తారూ? అత రో తోకపోలి యాదికి తెస్సుకోనేనా తెస్సుకోరూ? కట్టకాలానికి కానోడు సుట్టమైతేనేఁ, నేత్తమైతేనేఁ—సచ్చినోళ్లలోనే నెక్క. ఈన నా రాజు. ఈన నేనాసు సంతోసపెట్టడం? యాదీ తోసదే! ఒహోహో! ఈ సెట్టుమీా దెన్ని పిట్టలు నిద్దరోతున్నాయో! నిమ్మళంగా యిశారం నేకుండా ఉన్నాయి. మనిసి దేక పిట్టబతుకయినా బాగుండేది గద్రా. ఆరూ, పోరూ ఉండదు. యామో? యీటికి మాత్తరం కోపం, తాపం, ఒంటెత్తుతనం యాల ఉండవు? ఆ సెట్టుమీాది కెలా వొత్తున్నదో ఆ పిట్ట! జయ మేత్తున్నది. కళ్లెంట నిప్పులు రాలుత్తున్నది. ఆఁ! ఆఁ! మొదలెట్టింది! పీకలు కొరికేత్తున్నది. యన్ని పిట్టలో! నిద్దర మత్తుమీాద నెగిసినాయి! ఓలబ్బో! అకాళ్లు! ఓలమ్మో! ఆగోళ్లు! యేలకేలు గిలగిలా కొట్టుకో గింజుకో పడి సస్తున్నాయి. పారిపోతున్నా వొదల్దే!

యెంటబెట్టెంటబెట్టి, తరిమీ తరిమీ రెక్కలతో కొట్టి కూలుత్తున్నాది. వహ్వా, వహ్వా! సంపేసె! అన్నిట్నీ సంపేసె. వో సుబ్బిగూబోవ్! నువ్వు నాకు గురువ్వెమ్మోక్! మాంచి నేత్తాని వవ్మోవ్! మనిసైనోడు మప్పలేని బుద్ది మప్పినావ్. మావఁని నేపుతాను. మావాఁ! మావాఁ!"

పై వాక్యములకున్ను, నేను నాటకములో వ్రాసిన దానికిన్ని అభిప్రాయములో ఎట్టి భేదమున్ను లేదు. కాని, మాటలలో ఎంతో భేద మున్నది. కొన్ని భేదాలు పైకే తెలిసిపోతున్నవి. (౧) సంస్కృత పదాలు తక్కువగ ఉన్నవి. తెనుగుపదాలెక్కువ అయినవి. (౨) ఉన్నది, ఉన్నవి మొదలయిన క్రియారూపాలలో మధ్యనున్న అచ్చుకు దీర్ఘము కలిగి ఉన్నాది, చేస్తున్నాది మొదలయిన రూపాలు వచ్చినవి. ఉన్నవి అనడానికి ఉన్నాయి అని రూపము కలిగినది. 'నేను' కు నాను! (౩) లేను, నేను; లేపు, నేపు; లెగు, నేగు మొదలయిన వాటిలో లకారమునకు నకారాదేశము కలిగినది. (౪) ఓలమ్మో! ఓయబ్బో! అనే ఆశ్చర్యార్థకములు. (౫) తరిమీ తరిమీ; మావఁ మొదలయిన అనునాసికోచ్చారణములు—ఇటువంటి వింకా భేదాలను గుర్తించవచ్చును. ఇట్లే తెలంగాణపు భాష, రాయలసీమ భాష, కోలారుభాష, దాక్షిణాత్యభాష—మొదలయినవాటిలో ఎన్నెన్నో మాటతీరులు బయలుదేరుతవి. వాటి నన్నిటినీ ఒకచోట చేర్చి వ్యాకరించడము సామాన్యమైన పని కాదు. నాలుగు మొగముల బ్రహ్మ అయినా, వేయినోళ్ల అనంతుడయినా ఆ పనిని చేయలేడనే మాట సత్యము. అయితే యేమి చేయాలి? చేతులు ముడుచుకొని కూర్చోవలసినదేనా? సాధ్యమయినంతమట్టుకు ప్రయత్నింతాము. మనము వ్రాయబోయే వ్యావహారికనవ్యాంధ్రవ్యాకరణము సర్వాంగ సంపూర్ణ మౌతుం దనుకొనడ మసంభవమే. కాని, మన మా వ్యాకరణము వ్రాసే పద్ధతులు శాస్త్రపద్ధతులైతే, లోపలి పూర్ణము తరువాత వచ్చే పండితులు వారివారి ఓపికకొద్దీ పూర్తిచేసుకుంటారు. ఈ ఉద్దేశముతోనే నవ్యాంధ్రవ్యాకరణమును వ్రాయ సాహసిస్తున్నాను. పండిత ప్రకాండుల, పెద్దల ఆశీర్వచనబలమువల్ల చేపట్టిన కార్యము కొంతవరకైనా నెరవేరకపోతుందా? నెరవేరకుంటే పోనీ. ప్రయత్నించినపని అంతా లోకములో వెంటనే సిద్ధిస్తుందా? కాలమనంతము; 'విపులా చ పృథ్వీ'.





బౌద్ధభిక్షువు

చిత్రకారుడు : శ్రీ ఆచంట జానకిరామ్.

1

పిల్లవాడు ఏడుస్తున్నాడు



(కారణంలేకుండానే)

2

అతనికి

గ్రైప్ సిరప్ ఇవ్వండి



(అసహ్యమైన రుచిలేదు)

3

పిల్లవాడు నవ్వుతున్నాడు



ఒక ప్రొడక్టు



BGK-16 TG

మైసూర్ ఇండస్ట్రియల్ అండ్

టెస్టింగ్ లేబొరేటరీ లిమిటెడ్.

మల్లేశ్వరం, బెంగుళూరు వారి తయారు

సెల్లింగ్ ఏజెంట్లు:

బెస్ట్ అండ్ కంపెనీ, లిమిటెడ్

పో. బా. నెం. 63 మద్రాసు.

ఉగాది శుభదినమున

పరిచయము చేయుచున్నాము



ఎలుక బ్రాండు

అగరు వత్తులు, అలంకరణ వస్తువులు

పూలరాణి సెంటు వత్తి, తదితర రకములు, అనగా. పూలరాణి ఛమేలి చందనము, పూలచాంపి, గులాబి, మల్లె మొదలగునవి.

ప్యాకెట్టు 1 కి అ. 4 ల నుంచి రు. 1 వరకు లభించును.

వాటి నాణ్యతవల్లను, వాటిలో ఉపయోగింపబడియున్న దినుసులవల్లను ఎలుక బ్రాండు వస్తువులు మహారాష్ట్రమంతట ప్రజామోదము పొందియున్నవి. నేడు వీటిని పరిసర ప్రదేశములకు పరిచయము చేయుచు సేవాపత్తులమై వారి సహకారము వాంఛించుచున్నాము.

మేము తలనూనెలు, సెంట్లు, తదితర అలంకరణ వస్తువులు కూడ తయారుచేసెదము. ఇవికూడ మా పూలరాణి అగరువత్తి, ఛమేలి అగరువత్తులతో సమముగ ప్రజామోదము పొందియున్నవి.

ఆంధ్రదేశము, నైజాము సంస్థానమునందలి జిల్లా పట్టణములన్నిటినుంచియు ఇంక్వయిరీలు కోరుచున్నాము.

జాబులు ఇంగ్లీషులోనే వ్రాయవలెను.

బాంబే అగర్‌బత్తి కంపెనీ,

సింప్లెక్సు బిల్డింగ్, పోవాల స్ట్రీట్, చార్నిరోడ్డు,

బొంబాయి 4

(S. D. S.)

గణితవిజ్ఞానము

శ్రీ వేలూరి శివరామశాస్త్రి

మూడు నాలుగు వేల యేండ్ల వెనుకటి సంస్కృత వాఙ్మయమున గణితవిజ్ఞాన మున్నది. యజ్ఞములలో పలుదెరగులగు చితులు రచింపవలసి యుండును. దానినిబట్టియే చితి యనగా కూడిక యను నర్థము గణితపరిభాషలో కలదు. తైత్తిరీయసంహిత కొన్ని వేదికల యాకారము గుండ్రముగను, కొన్నిటి యాకారము డేగచందముగను, కొన్నిటి యాకార మర్ధచంద్రునివలెను, మరికొన్నిటి యాకారము త్రికోణముగను, మరి చతుష్కోణముగను చెప్పుచున్నది. ఈ యజ్ఞవేదుల కెన్ని యాకారము లున్నను క్షేత్రఫల మొకటియే కావలయును. కావున నానాకారములు గల క్షేత్రముల క్షేత్రఫలము కనుగొనుట అత్యావశ్యకము. శుల్బసూత్రము దీనిని నిరూపించుచున్నది. 'చచ్చౌకమగు క్షేత్రపు భుజముతో (Side) దాని కర్ణమునకు (Diagonal) గల సంబంధ మేమి? ఆయతమగు క్షేత్రముతో సమమగు వర్గక్షేత్రమును రచించు టెటులు? వృత్తాకారమగు క్షేత్రమునకు సమానముగా వర్గక్షేత్రమును నిర్మించుట యెటులు?' అను నీ మొదలగు ప్రశ్నముల కీ శుల్బసూత్రమున సమాధి లభించును.

భారతీయులకు కర్మకాండ పెరిగినకొలదియు యజ్ఞవేదులయు, యజ్ఞకుండములయు నిర్మాణమున కుపయోగించు క్షేత్రతత్త్వగణితము పెరుగుచు వచ్చెను. ప్రాచీనకాలమున భారతవర్షమున వైదిక కర్మకాండలకే క్షేత్రగణితము సంబంధించివచ్చె గాని గ్రీస్ కాల్డియా దేశములందువలె పొలముల కొలతలు మొదలయిన వ్యవహారకాండలకు సంబంధించుచు రాలేదు. ఆ కాలమున కానవచ్చిన కాసంత గణితము కూడ శైశవములోనే సందు తగిలి పోయెను. గ్రీకులు క్షేత్రగణితమున చాల ముందరికేగిరి. భారతీయులకు తెలిసిన తావన్మాత్రపు క్షేత్రగణితముగూడ గ్రీస్ దేశమునుండి ఎత్తుకొనివచ్చిన దని కొందరు పాశ్చాత్త్యులు సంతసించిరి. శుల్బసూత్రము నుద్ధరించిన థీబో—'భారతదేశమునందలి క్షేత్రగణితము భారతదేశమువారి సొమ్ము. ఇది క్రీస్తువెనుక ఎనిమిదవ శతాబ్దినాటిది' అని పై విమర్శకులు మోపిన కళంకమును తొలగన మొనరించెను.

క్షేత్రతత్త్వము, కుండసిద్ధి మొదలగు సుమారు పదియేను క్షేత్రగణితమునకు సంబంధించిన గ్రంథము లిపుడు దొరకుచున్నవి. యజ్ఞములు మూలబడిన తరువాత దేవాలయములందును, శరద్వసంతనవరాత్రములం దనుష్ఠేయమగు దుర్గాపూజయందును, తంత్రములందును, మరికొన్నిటియందును సంక్షిప్త యజ్ఞమే చూపట్టును. దీనినిగురించి విడిగా వ్రాయవలయును. ప్రాజ్ఞులంద రీ విషయమును పరిశీలించునది. ఈ క్షేత్రతత్త్వవ్యవహారము (Mensuration)ను, కుండరచనయును కడు గొలదిగా అగ్నిపురాణమునందు కనబడుచున్నది. ఆగమములందు కొంచెము విడివిగా గలదు.

జ్యోతిషసంహితలలో గణితవిజ్ఞానము

క్రీస్తుకు వేయికి వెనుక పుట్టిన జ్యోతిషసంహితలలో పరికర్మాష్టకమునకు సంబంధించిన లెక్కలు కలవు. పరికర్మాష్టక మనగా కూడిక (చితి), తీసివేత, హెచ్చవేత, భాగహారము, వర్గము మొదలగు లెక్కలు. మనకు వేళ్లు పుట్టినపుడే కూడికలును, తీసివేతలును పుట్టె ననుకొందును. సంఖ్యావాచకములగు శబ్దములందే కూడికయు, తీసివేతయు, హెచ్చవేతయు కానిపించును. ఏకాదశ=౧+౧౦=౧౧(పదునొకండు). త్రయోదశ=౩+౧౦=౧౩ (పదమూడు). ఈ మొద

లగున వెక్కుడుగా కూడికలో నున్నవి. సంస్కృత సంఖ్యావాచకపదములం దేకాంకము మొదటను, తెలుగునందు చివరను గలవు. దీనికి హేతు వన్యత్ర విచార్యము. ఏకోనవింశ = ౧—౨౦ = ౧౯ (పందొమ్మిది). దీనికి నవదశ అనియు వేదకాలమున వాడుక కలదు. 'సప్తదశ చ మే నవదశ చ మే' అని యజుస్సంహిత- పంచమప్రపాఠకము. ద్వాత్రిగంశత్ = ౨ + (3 × ౧౦) = 3౨. చూ. పై. ఇందు కూడికయు, హెచ్చవేతయు కలిసియున్నవి. వేదకాలముననే ఇట్టి గణనవ్యవహార మున్నదని తెలుపుటకు వేదము నుండియే పై యుదాహరణము లిచ్చితిని. వేదములందలి సంజ్ఞయములు, సంఖ్యలను విచిత్రముగ నుండును. పాణినికాలమున కొంత మార్పు చూపడును.

ఇక సంహితలకు మరలుదము.

నాటివారికి తిథిని కనుగొనుటకు గణితము కావలసివచ్చెను. తిథిజ్ఞానమునకు నక్షత్రమును, చంద్రుడును ప్రాటితో దబ్బనమువలె వత్తురు. మరియు గ్రహముల కక్ష,పరస్పరదూరము, వీని కొలత, లంబనము, వలనము, ఇష్టసంఖ్య (X) కొండగుర్తు ఇవన్నియు కనుగొనుట సామాన్యమైన పనిగా కనబడదు. అనాడు కూడికకు + అనియు, తీసివేతకు — అనియు, హెచ్చవేతకు × అనియు, భాగహారమునకు ÷ అనియు గురుతులు కలవు. (భారతిలో నా వ్రాసిన ప్రాచీనఖగోళమును గూర్చిన రెండవ వ్యాసము చూచునది) ఆర్యభటుని కాలమున ఈ గురుతులు వ్యవహారములోనికి వచ్చినచో అంతగా ఆశ్చర్యపడముకాని, క్రీస్తుకు వేయేండ్ల వెనుకనే యివి కలవనుచో ఈ విషయ మాలోచింపవలసియే యుండును. ఈ గురుతులు గ్రీసుకాల్డియాదేశములలో క్రీస్తుకించుమించు నొకటిరెండు శతాబ్దులవెనుక కనబడును.

భారతీయులకు దేశాంతరవాసులకంటె మునిముందుగానే విజ్ఞానసంపద యంతయు కల దనియు, అది సంపూర్ణ మనియు తెలుపుట నా యుద్దేశము కాదు. 'ఉన్న దిది' అని తెలుపుటయే నావంతు. దీని వలన లాభ మేమేని కలదో, లేదో నే నెరుగను. దానిని పాఠకులకే వదలుదును.

అంకగణితము

పిషావర్ దాపులలో గల 'బక్షాలి' అను ఊరిలో ౧౮౮౧ సాలున భూమి త్రవ్వుచుండగా 'అంకగణిత' మను ఒక గణితగ్రంథము దొరకెను. ఇది కొంత శిథిలమైపోయెను. కొందరు దీనిని క్రీస్తుశకము మూడవ శతాబ్దినాటి దనియు, మరికొందరు పండ్రెండవ శతాబ్దినాటి దనియు అనిరి.

దీనిలో కూడికకు 'యు' అను గురుతును, సమీకరణమునకు 'ఫ' అను గురుతును కలదు. యు=యుతి. ఫ=ఫలము. ఇటీవలివారు కూడికకు యోగమనియు, సమీకరణమునకు లబ్ధమనియు వాసిరి. దీనివలన నిది ౧౨వ శతాబ్దిది కాదు. మరియు వేదకాలమునందలి చితిసంజ్ఞ ఇందు గలదు. ఈ గ్రంథమునందలి గుణోత్తరశ్రేఢి, సంకలితశ్రేఢి, త్రైరాశికము, వృద్ధి, చక్రవృద్ధి మొదలగువానివలన ఆనాడంకగణిత మే స్థితిలో నుండెనో, భాస్కరాదుల కది యెటు లుపకరించెనో యింకను తగినవారు పరిశోధింపవలెను. ఈ గణితమునందలి 'కేన కాలేన సమతాం గతాయిత్వా వదాశు మే' ఇత్యాది రచనల యనుకరణము తరువాతి గ్రంథములం దన్నిటను చూపట్టును.

దైనందినగణితము

పాటీ జ్యామితి పరిమితి త్రికోణమితి మొదలగు గణితములు సభ్యజాతికి నిత్యవ్యవహార్యములు. నిత్యవ్యవహారములలో అతిభుజ (Hypotenuse), చతుర్భుజ (Quadrilateral), త్రిభుజ (Triangle), పంచభుజ (Pentagon), షడ్భుజ (Hexogan), సప్తభుజ (Heptagon), దశభుజ (Decagon), బహుభుజా (Polygon) దులతోనే కాక బహువిధములగు కర్మములతో పని యుండును. పదిశతాబ్దుల క్రింద పాకశాస్త్రమును రచించిన ఒక వంటబ్రాహ్మడు ఇన్ని విధములగు ప్రాయులలో తన పాండిత్యమును ప్రకటించెను. అది యటుండె.

మొదటమొదట సంఖ్యేయశబ్దము సంఖ్యాబోధకము. నేటికి నది కలదు. మరియు నది పోదు. ఇది ఛందశ్శాస్త్రమునందును, కవులందును సూక్ష్మముగా ప్రవేశించెను. పాణినిసూత్రములలో ఇందులకు


చాల నుదాహరణములు కలవు. 'షడ్గవచ్' మొదలగు వానిని చూచునది. ఇక జ్యోతిషమునందంతటను ఈ వ్యవహారమే కనబట్టును—

'నందాద్రీందుగుణా స్తథా శకనృప
స్యాంతే కలే ర్వత్సరాః'

అనగా నందులు తొమ్మండ్రు కావున ౯ అను రాశి. కులాద్రులు లేడు కావున ౭ అను రాశి. చంద్రు డొకడు— ౧. గుణములు సత్త్వరజస్తమస్సులు 3. 'అంకానాం వామతో గతిః.' అంకెల కరబ్బుల అక్షరము లకువలె పుర్ర చేయి కావున ఎడమనుండి వ్రాయుచో ౩౧౭౯ అని అగును. కలిలో ఈ వత్సరమున శకనృపావసాన మని అర్థము. సంఖ్యేయ మగు శబ్దము సంఖ్యార్థమునందు వాడుట యొక భారతదేశమునందే గాని యన్యదేశములందు లేదని పాశ్చాత్యులు వ్రాసిరి.

గణితవిశేషములు

పూర్వము మన దేశమున కన్యాపక్షమువారు వరుని యుక్తిలెక్కలడుగుట కలదు. ఆ పరీక్షలో నెగ్గినచో శుల్కముతోగూడ పిల్ల నిచ్చెడివారు. నా కాలమున ఆ పరీక్షయే యున్నచో నాకు బ్రహ్మచర్యము అవలంబింపగల సౌభాగ్యము కలిగెడిది. నాకు థర్డుఫారములో నూటికి తొమ్మిది మార్కులు వచ్చెను. ఒక మార్కే వచ్చిన నా తమ్ము డొక డున్నాడు. ఆయనసంగతి యిపు డెటు లున్నదో నాకు తెలియదుగాని నా చదువు థర్డుఫారముతోనే పూర్తి



యగు వారికి తెలియునుగాని నా సంగతిమాత్రము మా తనికి లెస్స తెలియును. మా కపుడు గణిత మెటులో చెప్పిన (శ్రీ) కామవరపు వీరరాజుగారిని (దువ్వ) స్మరించుకొనవలెను.

గణితవిజ్ఞాన మటుతరువాత వాస్తుశాస్త్రమున కును, అనగా ఇండ్లు, నల్లిండ్లు, కోటలు, పేటలు కట్టుటకును, నూతులు, చెరువులు తీయుటకును, శిలా లోహాదులతో దేవవిగ్రహములు చేయుటకును, లలిత కళలలో ముఖ్యముగా సంగీతశాస్త్రమునకును, ఛందః ప్రస్తారమునకును కావలసివచ్చెను. ధనుశ్శాస్త్రము జ్యామితిని, గతిగణితము (Dynamics) నుపయోగించు కొనెను. తెలుగులో ధనుశ్శాస్త్ర మను పద్యప్రబంధ మొకటి కలదు. అందు గణితపరిచితి లేదుగాని సంస్కృతధనుశ్శాస్త్రమున కడుకొలదిగా నున్నది. గతి విజ్ఞానముచే విల్లనంబులు చేయుచో శత్రుసంహారము సుకరము. దీనికి భాస్కరుని లీలావతినుండి యుదాహరణము :

తొమ్మిది చేతుల యెత్తు కల ఒక చెట్టుమీద నొక నెమలి యున్నది. చెట్టుకు ఇరువదేడు చేతుల దూరమున నొక త్రాచున్నది. ఇవి రెండును ఒండొండ చూచుకొనినవి. పాము చెట్టుమొదట నున్న పుట్టలో పోయి పడుటకు ప్రాకిపోదొడగెను. నెమలి దానిని పట్టుకొనుటకు దానిమీదికి వాలెను. రెంటి గతియు సమము. ఈస్థితిలో చెట్టు కెన్ని చేతుల దూరమున నెమలి పామును పట్టుకొనగలదు? (చూ: సర్ప-మయూర చిత్రము. పుట ౯౯).

[దీనికి సూత్రము:—కోటివర్గమును భుజకర్ణముల మొత్తముచే భాగించి, లబ్ధమును భుజకర్ణముల మొత్తమునుండి తీసివైచునది. దానిలో సగము భుజ పరిమాణము. భుజకర్ణముల మొత్తమునుండి భుజమును తీసివేయుచో శేషము కర్ణ మని వేరుగా చెప్పనక్కర లేదు.]

కోటి యనగా నిలువురేఖ. భుజ మనగా సరళ రేఖ. అది యిటు లుండును———. కర్ణ మనగా నెదురుగా నుండు రెండు మూలలను కలుపు రేఖ.

కఖ = (స్కంధము) కోటి. భుజాగ్రగబిందువు కడ పాము న్నది. కోటి ౯ చేతులు. క వృక్ష మూలము. అటనుండి గ కు ౨౭ చేతులు. క బిందువున కెంత దవ్వున నెమలి పామును పట్టగలదో తెలిసికొన వలెను.

ఘ బిందువుకడ నెమలి పామును పట్టుకొనె నని అనుకొందము. అటులగుచో ఖ బిందువునుండి ఘ బిందువు వరకును ఒక గీటు గీచుచో ఖఘ రేఖ ఘగ రేఖకు తుల్యమగును. రెంటిగతియు సమము కావున గ బిందువు నుండి పా మెంత దవ్వు రాగలదో ఖ బిందువునుండి నెమలియు సరిగా నంత దవ్వున నే వాలగలదు. కావున కఘ + ఖఘ = కగ = ౨౭. [ఖగ - (కఖ² ÷ ఘగ) ÷ ౨] = ఖఘ :: [౨౭-(౯² ÷ ౨౭)] ÷ ౨=[౨౭-3] ÷ ౨ = ౨౪ ÷ ౨=౧౨. అనగా వృక్ష మూలమునకు పన్నెండు చేతుల దవ్వున నెమలి పామును పట్టుకొనెను. ౨౭—౧౨ = ౧౫ చేతులు కర్ణము. ఆవలి భుజము ౧౫ చేతులు.

ప్రక్రియాంతరము :—

౯ × ౯=౮౧ ÷ ౨౭=3

౨౭—3=౨౪

దాన సగము ౧౨.


కాన ౧౨ చేతుల దవ్వున నెమలి పామును పట్టెను.

గభీరత

గభీరత తెలిసికొనుట కింకొక లెక్క.

చెరువునీటిపై అరచేతి యెత్తున నొక పద్మము వికసించియున్నది. పెద్ద గాలి వచ్చి ఆ పద్మము రెండడుగుల దూరమున నీట బడెను. ఆ నీటి లో తెంత?

[సూత్రము:—కోటికర్ణముల వియోగఫలముచే భుజవర్గమును భాగించునది. భాగలబ్ధమునకు కోటికర్ణముల వియోగఫలమును కలుపునది. దీనిలో సగము కర్ణపరిమాణము. దానినుండి కోటికర్ణముల వియోగఫలమును త్రోసివేయుచో కోటిపరిమాణము నిర్ధారిత మైపోవును.]



"చక్రక్రౌంచాకులితసలిలే క్వాపిదృష్టం తటాకే తోయాదూర్ధ్వం కమలకలికాగ్రం వితస్తిప్రమాణం,
మందంమందం చలితి మనలే నాహతం హస్తయుగ్మే తస్మిన్మగ్నం కథయగణకే క్షిప్రమంభఃప్రమాణం." (లీలావతి)

ఇచట ఖ పైభాగము జలోపరిభాగము. ఖ కడ నుండి క వరకును తామరతూడును, దానిపై విచ్చిన తమ్మియు. తామరతూడు ౧/౨ చేతియెత్తు. పద్మము గాలికి గ బిందువుకడ బడెను. భుజము ౨ చేతుల పొడవు. ఇపుడు నీటిలోతు కనుగొనవలయును.

క ఘ = గ ఘ.

౧/౨ చే భుజవర్గమును భాగించిన ౮ రాశి వచ్చును. +౧/౨=౧౭/౨. దాని సగము ౧౭/౪. ఇది కర్ణపరిమాణము. ౧౭/౪−౧/౨=౧౫/౪ ఇదియే కోటిపరిమాణము, లేక నీటి లోతు.

ఈ లెక్కలుగాక భరతఖండమునందొక్కొక్క దేశమున నొక్కొక్కమాదిరి వింత లెక్కలను అనేకములను వినుచుందుము. జానపదగీతములతోపాటు ఇవియు జనముఖభాండారములనుండి జారిపోయినవి; పోవుచున్నవి. దొరకినంతవరకు వీనిని గ్రంథస్థము చేయుటెన్నడేని కలుగునా?

ఇంకొక లెక్క—

"నలుగురు వైశ్యవర్యు లొకనా
డొక దీవిని జేరి యొంటు లొం
డులు పది యింద్రనీలములు
నూఱు సుపాణులు నైదు వజ్రముల్
ఖులమణు లెన్మిదిం బడసి
కూర్మి దలంచి సమానమూల్యమే
యెలయగ గొన్ని మార్చుకొని
యందుల నెక్కటి విల్వ కట్టుమీ".

(లీలావతి)

= ఒకనికి ౧౦ నీలములును, ఇంకొకనికి ౧౦౦ ముత్తెములును, మరొకనికి ౫ వజ్రములును, వేరొకనికి ౮ మణులును దొరికెను. వీరు నలుగురును స్నేహవశమున కొన్ని విడిగో లొనరించుకొని సమమూల్యమొందిరి. అటు లగుచో నొక్కొక్క రాశి వెల యెంత?

[సూత్రము :— వినిమయస్వరూపమును జనసంఖ్యచే హెచ్చించి లబ్ధమును ఒక్కొక్కని మొత్తము నుండి విడివిడిగా తీసివేయునది. భాగశేషము రాని ఇష్ట రాశిని వెనుక తీసివేసిన మొత్తముచే భాగించునది. భాగలబ్ధి మొక్కొక్కదాని వెల.]

ఇచట జనసంఖ్య ౪. వినిమయస్వరూపము ౧. ౪ × ౧ = ౪. ౧౦, ౧౦౦, ౫; ౮ - ౪ = ౬, ౯౬, ౧, ౪ వచ్చును.

శేషము రాని అభీష్టసంఖ్య ౯౬ అని అనుకొందము. దానిని, వెనుక తీసివేయగా వచ్చిన ౬, ౯౬, ౧, ౪చే భాగింపగా ౧౬, ౧, ౯౬, ౨౪ వచ్చును. కావున ఒక్కొక్క నీలము వెల ౧౬, ముత్తెము వెల ౧, వజ్రము వెల ౯౬, మణి వెల ౨౪.

౧౦ నీలములు × ౧౬ = ౧౬౦
౧౦౦ ముత్తెములు × ౧ = ౧౦౦
౫ వజ్రములు × ౯౬ = ౪౮౦
౮ మణులు × ౨౪ = ౧౯౨
ఏకోను ౯౩౨
౪ చే భాగింపగా ౨౩౩
కావున ఒక్కొక్కని సంపత్తి వెరసి ౨౩౩

విడిగోలు

౧. వజ్రములవానికడనుండి ౩ వజ్రములు తీసికొని మణులవానికి ౧టి, నీలాలవానికి ౧టి, ముత్యాలవానికి ౧టి ఇచ్చి, ౪౧ ముత్యములు వీని కిచ్చునది. ఇపు డితనికడ ౨ వ + ౪౧ము లుండును.

౨ వ = ౧౯౨
౪౧ ము = ౪౧
ఏకోను = ౨౩౩

౨. మణులవానికడనుండి ౩ మణులు నీలాలవాని కొసగునది. మరియు వీనికి ౧౭ ముత్తెము లిచ్చునది. ఇపుడు వీనికడ ౫మ + ౧ వ + ౧౭ ముత్తియము లుండును.

౫ మ = ౧౨౦
౧ వ = ౯౬
౧౭ ము = ౧౭
ఏకోను = ౨౩౩

౩. నీలము వానికడనుండి ౬ నీలములు తీసి ముత్యాలవాని కిచ్చి వానిముత్య మొకటి వీని కిచ్చునది. ఇపుడు వీనికడ ౩ మ + ౧ వ + ౪ నీ + ౧ ము ఉండును.

౩ మ = ౭౨
౧ వ = ౯౬
౪ నీ = ౬౪
౧ ము = ౧
ఏకోను = ౨౩౩

౪. ముత్యాలవానికడ నిపుడు ౧వ + ౬నీ + ౪౧ ముత్యలు కలవు.

౧ వ = ౯౬
౬ నీ = ౯౬
౪౧ ము = ౪౧
రాల ఏకోను = ౧౨౩ ఏకోను = ౨౩౩



చంద్రలేఖ

ఏప్రిల్
9వ తేదీన
ప్రారంభోత్సవము



జెమినివారి మహోజ్వలమైన చిత్ర కళా సృష్టి.

అర్ధభాగాలలో భిన్నహృదయాలు

శ్రీ బలివాడ కాంతారావు

'మీరలా యేడుస్తూ కూర్చుంటే యెలాగండీ? ఆయనకేం, పుణ్యాత్ములయ్యారు!'

'..................'

'నాలో దుఃఖం లేదా? నేను మీకంటే హెచ్చుగా యేడవవలసింది!'

'..................'

'అబ్బాయి యేడుస్తున్నాడు. పాలది యింకా పాలు తీసుకరాలేదు. ఒక్కసారి వెళ్లండి...'

'ఆ చావు నాకైనా వచ్చింది కాదు. యీ సంసారబాధలన్నీ యెవరు పడ్తారు?'

'రామరామ! అవేం మాటలండి. పోనీ, కమలాన్నే పంపిస్తాను లెండి.'

'వీధిలోకి పంపకు; నలుగురూ నవ్వుతారు'.

రుక్మిణి మరి మాటాడలేకపోయింది. వంట యింట్లో కూర్చున్న కమలం కారుతున్న కన్నీటిని చీరకొంగుతో తుడుచుకొంటోంది.

'యీ కర్మ యెలా చేసేది...?'

'అందుకేనా అంతగా విచారిస్తున్నారు? మామయ్యగారు బ్రతికినంతకాలం ధర్మంగా పోయారు. అంత పెద్ద నౌకరీ చేసినా ఒక్కకానీ లంచం పుచ్చుకోలేదు. అందుచేతనే యే బాధాలేకుండా స్వేచ్ఛగా మరణించారు. ఆయన కర్మకు ఆయనే డబ్బు సమకూరుస్తాడు. ధైర్యం చెప్పవలసిన మీరే అలా యేడుస్తూ కూర్చుంటే... చూడండి. పిల్లాడు పాలు లేక యెలా యేడుస్తున్నాడో! చూశారా! వంట యింట్లో మీ చెల్లెమ్మ—మీ కడుపే కాదు, అందరి కడుపులూ దహించిపోతున్నాయ్. కాని చచ్చేవారితో మనం చస్తామా! అన్ని విషయాలూ మీకు తెలుసు. ధైర్యం తెచ్చుకోండి...'

'సరే, ఆ పాలచెంబు యిలా తే' అంటూ మంచంమీదనుంచి చిరాకుగా లేచాడు కిష్టయ్య. కమలం పాలచెంబు తెచ్చి అందిచ్చింది. అన్నయ్యవద్దకు రావటంతోనే ఆమెదుఃఖం పొంగి పొరలింది.

'ఈ పాడుయింట్లో ఆడపిల్లవై యెందుకు పుట్టావమ్మా? ఆమాత్రం మా బాధ్యతను తీర్చుకోలేకపోయాం...' అంటూ కిష్టయ్య చేతితో తన నుదురు పట్టుకొని గబగబా వీధిలోకి నడిచాడు.

రుక్మిణమ్మ మాట్లాడుదామన్నా పెదిమలు కదలలేదు. కమలానికి తామంతా ద్రోహం చేశారు. పెద్దమనిషై ఆరు సంవత్సరాలైంది. యింకా పెండ్లంటూ చెయ్యలేదు. 'నేనే చక్రవర్తినైతే వరకట్నాలు పుచ్చుకున్నవాడికి వెయ్యేండ్లు కఠినశిక్ష వేసేస్తునురా కిష్టయ్యా!' అన్న మామపలుకులు యింకా రుక్మిణిచెవులలో మారుమోగుతూనే వున్నయ్. అంత శాంతపరుడైన మామగారికి యీ కమలంసంబంధంకోసం వచ్చినవారు అడిగిన వరకట్నాలవిషయమై అంత చిరాకూ, కోపం వచ్చినై. 'పెద్ద శిరస్తాదారు పనిచేశాడే! అరవైరూపాయలు ఫించను పుచ్చుకుంటున్నాడు. కొడుకు నలభై రూపాయల జీతం తెచ్చుకుంటున్నాడుగదా. ఆమాత్రం వెయ్యిన్నూటపదహార్ల కట్నం యియ్యలేడేం? యెందరున్నారని యింకా—యీ ఒకేఒక కూతురే కదా?' అన్నవారే ప్రతీవారూను. మొత్తంమీద కమలం పెండ్లికోసం చివరిరోజులలో పరితపించి పరితపించి చివరకు పెండ్లి చెయ్యకుండానే స్వర్గస్థుడయ్యాడు రామయ్య.

రామయ్యగారు వున్నప్పుడు కిష్టయ్యకు కుటుంబబాధ్యత తగలలేదు. వుద్యోగం చెయ్యటం, జీతం తెచ్చి తండ్రిచేతులలో పెట్టటం, వేళకు యింత భోజనం చెయ్యటం—ఇదే ఆయనపని. కుటుంబభారమంతా అరవై యేండ్లు నిండినా రామయ్యనెత్తినే వుండేది. కిష్టయ్య నలుగురు పిల్లల తండ్రి అయినప్పటికీ చాలా స్వేచ్ఛగా తిరిగాడు.

తన బావుటా దిగ్విజయంగా యెగిరేటప్పుడు రామయ్య అందరినీ ఆదరించాడు. అందరూ మావారే అన్నాడు. వచ్చే జీతమంతా బంధువుల ఆదరణకే వినియోగించాడు. ఆర్జించినదేమీ లేదు. యేముందో—పెండ్లికాలమందు రుక్మిణమ్మమెడలో వేసిన పదిహేనుతులాల బంగారంగొలుసు మిగిలివుంది. తను ఫించను పుచ్చుకున్న తరువాత తన ఫించనూ, తన కొడుకుజీతమూ వచ్చిన చుట్టాలక్రిందా, సంసారం సాగటానికి సరిపోయేది. 'రామయ్య మావాడే, మా అల్లుడు చిన్నాన్న తాత మనుమడు' అని యిలా రకరకాల వరసలు కల్పించి తిష్ఠవేసేవారు మూడునాలుగురోజులు. కిష్టయ్యకు సంసారంగొడవే వుండేది కాదు. రుక్మిణి మామగారు యెలా అంటే అలా. ఆమెకు తండ్రయినా, తల్లయినా రామయ్యగారే. రామయ్యగారు రుక్మిణిని బంధుజనాదరణలో అందెవేసినచెయ్యిని చేశారు. సంసారపు ఒడుదుడుకులను రుక్మిణి అవగాహన చేసుకొని ధైర్యంతో మెలగగలిగేది.

రామయ్యగారు చనిపోయేవరకూ మాట్లాడుతూనే వున్నారు. కూతురు కమలాన్ని చేరదీసి 'అమ్మా, నీనాన్నను క్షమించు...అన్నిటికీ మహాయిల్లాలు నీ వదిన వుంది...' అన్నారు. యింకా యేవో మాట్లాడబోయాడు కాని పెదిమలు కదలలేదు. దుఃఖం ముంచుకొచ్చింది. ఆయన నాలుగుమూలలూ చూసుకొని కుమార్తెను మంచియింట్లో వేద్దామని వుబలాటపడ్డాడు. కాని ఆ కట్నం యెక్కడనుంచి తేవటం? రుక్మిణమ్మ తన గొలుసు అమ్మడానికి సిద్ధపడింది. కాని రామయ్య ససేమిరా ఒప్పుకోలేదు. ఒకవేళ అమ్మినా అది ఆ రోజుల్లో వెయ్యిన్నూటపదహార్లకు సరిపోయేది.

శ్రాద్ధభోజనానికి కులంవారంతా తయారై 'యేమోయ్ కిష్టయ్యా! రామయ్యగారు పోయి వారంరోజులైనా యింకా పప్పులూ, వుప్పులూ యేమీ సమకూర్చుకోలేదేం? చాలా ఘనంగా బ్రతికాడోయ్ మీ నాన్న. అలాంటి మహానుభావుడి శ్రాద్ధం మా ఘనంగా చెయ్యాలోయ్...' అని యిలా మనిషాకలా తన్ను పీక్కు తింటుంటే కిష్టయ్యకు యెక్కడలేని దుఃఖమూ పొంగిపొర్లేది. తండ్రిచావువలన కలిగిన దుఃఖంకన్నా, యీ కాలంలో యెలా నెరవేర్చటమా అనేదే హెచ్చుదుఃఖాన్ని కలిగించి చిన్న పిల్లాడిమల్లే యింటిదగ్గర యేడ్చుకొంటూ కూర్చునేవాడు.

మామగారు చనిపోయాక రుక్మిణమ్మ భర్తకు సంసారంగొడవ అంటకుండా చూడడానికి చేతనైనంతవరకు ప్రయత్నించేది. కాని వీధిలోకి ఆమె యెలా పోగలుగుతుంది? యింట్లో బొగ్గులబస్తా అయిపోయినా—బియ్యం కూడానూ కావలసొచ్చినా కిష్టయ్యకు 'బజారుకు వెళ్లండి' అంటే చిరాకు. గొణుక్కుంటూ గొణుక్కుంటూ వెళ్లేవాడు. బేరం తెలిసేది కాదు. వాళ్లంతంటే అంత. భర్త యెలాంటివస్తువులు తెచ్చినా రుక్మిణమ్మ పల్లెత్తు మాట అనేదికాదు. 'చాలా చౌకగా తెచ్చారే' అనేది. ఆయన మనసును చీకాకుపరచడం ఆమెకు యిసుమంతైనా యిష్టంలేదు. పోనీ, కమలాన్నే బజారుకు పంపిస్తామా అంటే మనిషోమాటగా గొణుక్కుంటారని భయం. అందుచేత కిష్టయ్యానే బజారుకు పంపించవలసి వచ్చేది. రామయ్య కమలానికి ఒక్క పెళ్లి తప్ప, మిగతావిషయాల్లో ఏమీ అన్యాయం చెయ్యలేదు. భగవద్గీతాపారాయణం, చదువు చెప్పించాడు; సంగీతం నేర్పించాడు. దేవుడిచ్చిన అందం ప్రకాశిస్తూనేవుంది. కమలం సుగుణవతి. వదినగారి మాట ఆమెకు వేదవాక్కు. ఆమెహృదయం అమృతభాండం.

రామయ్యగారు చనిపోయారని పరామర్శకు యితరప్రదేశాలనుంచి వచ్చిన చుట్టాలు రెండుమూడు రోజులు పూర్వంలా తిష్ట వేసేవారు. వీరందర్నీ చూస్తుంటే కిష్టయ్యకు అసహ్యం. 'యిన్నాళ్లు వీళ్లెందుకు? పొమ్మనలేక పోయావా?' అని భార్యను గదమాయించేవాడు. కాని రుక్మిణమ్మ భర్తను మంచిమాటలతోనే శాంతింపజేసేది. వచ్చినవారు తిని వుత్తగా పోయేవారు కారు. నాలుగు నిందలు పరోక్షంగా మోపి మరీ యిల్లు కదిలేవారు. 'మామయ్య చావటం దీనికి యిష్టమేమో? మొగుడు గోలపెడ్తుంటే, యిది పెద్దగోల పెట్టదేం? రామయ్య కన్నుమూసి వారంరోజులు కాలేదుగాని, యింట్లో బంధువులను యెంత నిరాదరణతో చూస్తున్నారు!' యిలా ఊరిలో, కులంవారిలో చాటుతూ పోయేవారు.

వుత్తచెంబుతో తిరిగివచ్చాడు కిష్టయ్య. చెంబును క్రిందపడవేసి 'అయ్యో! రామా...' అంటూ మంచంపై చేరబడ్డాడు. 'పాలు దొరకలేదాండీ?' అని ప్రశ్నించిన రుక్మిణి వేపు దీనంగా చూస్తూ 'ఇరవై రూపాయలు యివ్వాలటగా...ఆ డబ్బు యివ్వంది పాలెలా యిస్తుంది...?' అన్నాడు. భర్త నేత్రాలు అశ్రుపూరితాలు కావడం రుక్మిణమ్మ గమనించకపోలేదు. రుక్మిణి ఆ చెంబు తీసుకొని వీధిలోకి వెళ్తుంటే వింతగా చూస్తున్నాడామెవేపు కిష్టయ్య.

'మీరేనండీ కిష్టయ్యగారు — డాక్టరుగారు బిల్లు యిచ్చారు' అంటూ ఒక మనిషి గుమ్మందగ్గర నిలబడ్డాడు. వాడివేపు పెద్ద కళ్లతో చూస్తున్నాడేగాని, యేం మాట్లాడాలో తోచింది కాదు. కమలం వంటయింటి గుమ్మందగ్గర నిలబడి యిది చూస్తోంది. 'యేమండీ మాట్లాడరు?' అని మరల ఆ మనిషి అన్న పలుకులు విన్న కమలం వడిగా వచ్చి 'యేదీ బాబూ ఆ బిల్లు...?' అంటూ తీసుకొని చూసి 'యాభై రూపాయలే!' అంది ఆశ్చర్యంగా అన్నవేపు చూసి. ఇంతలో రుక్మిణి వచ్చి, విషయం తెలుసుకొని 'బాబూ, రేపు తప్పక యిచ్చేస్తామని చెప్పండి' అంటూ ఆయనను పంపించివేసింది.

'పాలెక్కడివి? నీళ్లపాలులా వున్నాయే...' అద్దాలలో పోసి కొడుక్కి పాలుపడుతున్న రుక్మిణివేపు చూస్తూ కిష్టయ్య అన్నాడు హీనస్వరంతో.

'ప్రక్కయింటివారిని అడిగి తెచ్చాను. తల్లి ప్రేమతో పోస్తే నీళ్లయినా పాలకంటే హెచ్చుబలాన్ని యిస్తాయిలెండి'

'ఛీ! అన్యకులవాళ్ల యింటి పాలెందుకు తెచ్చావ్?'

'కులంవల్లనే మహాసుఖం అనుభవించాం! కులంతో యేం వుంది? కష్టకాలంలో ఆదరణ చూపిన వారే కులంవారైతే నేం, మానవజాతే లెండి.'

ఈ మాటలు విన్న కిష్టయ్య ముఖం రెండోవేపుకు తిప్పాడు. కమలం ఆశ్చర్యం చెందింది—నిన్నటిదాకా అంత నిష్ఠానియమాలతో వున్న వదిన యిలా మాట్లాడిందేమని.

పిల్లాడు నిద్రపోయాడు. వాడిని మంచంపై పడుకోబెట్టి భర్తదగ్గరకు వచ్చింది రుక్మిణి.

'యేమండీ! మీమనసును అనవసరంగా కష్టపెట్టుకోకండి. పుట్టించినవాడు అన్నమాత్రం పెట్టకపోడు...'

'రుక్మా! శ్రాద్ధం చెయ్యకపోతే...'

'యెంత మాట ఆడారండి...'

'యీమందలో తక్కువగా చేసుకోలేమే? వ్యవధికూడా లేదు. యింతకూ ఆ తక్కువగానైనా చేసుకోడానికి యేముందని?'

'నేనూ యీ విషయమే మాట్లాడుదామని వచ్చాను. నలుగురిలోనూ మన కా చిన్నతనం యెందుకు? నా గొలుసు తీసుకవెళ్లి యెక్కడైనా ఒక మూడువందలకు తాకట్టుపెట్టండి. పాలవాడికి, డాక్టరుగారికి, మిగతా, చిల్లర బాకీలకూ ఒక వంద పోగా మిగతా రెండు వందలతో యెలాగో కానిద్దాం...'

'ఆ గొలుసు తాకట్టుపెడితే పడ్డీ పెరగడమే కాని లాభం లేదు. అమ్మి యిలా యీకార్యానికి తగలేస్తే కమలం పెండ్లి యెలా చేస్తాను? రుక్మా! నామాటకు యిక అడ్డుపెటకు, ఆ గొలుసు యిలా తే. చెయ్యవలసిందేదో నేనే చేస్తా'నని గొలుసు తీసుకొని వీధిలోకి నడిచాడు కిష్టయ్య.

భర్త యిలా ధైర్యంగా మెలగటం చూసి రుక్మిణి ఆశ్చర్యపోయింది. మామగారి ఆత్మ అనే వెలుగు యిలా ఆయన కా ధైర్యాన్ని ప్రసాదించి వుంటుం దని నమ్మింది. కండ్లు మూసింది. మామయ్యగారని ఆ చీకటిలో చూసి కలిగింది. కన్నీరు చెక్కిళ్లమీదినుంచి కాలువలా ప్రవహించింది. తన తండ్రికన్నా హెచ్చుగా చూశారు మామయ్యగారు. అసలే అధైర్యానికి ఆహుతైన భర్తగారికి ధైర్యం చెప్పటానికని ఆమె గుండె రాయి చేసుకుంది. కాని అప్పుడప్పుడూ పరోక్షంగా కన్నీరు కార్చకుండా వుండలేకపోయింది.

'వదినా!...' అన్న కమలంపలుకు చెవిని పడగానే చీరకొంగుతో వడిగా కన్నీటిని తుడిచివేసి వెనుతిరిగి 'ఏం కమలం—?' అంది.

'వదినా...'

'నీ అన్నయ్యను చూచి నీవుకూడా యేడుస్తూ కూర్చోకమ్మా. నా కెవరున్నా రు? తల్లా, తండ్రా? అంతా మీరేకదా? యిద్దరం ధైర్యంగా వుండి ఆయనను ధైర్యంగా వుంచాలి...'

'వదినా! ఒక విషయం చెప్దామని వచ్చాను...'

'చెప్పమ్మా, చెప్పు'

'మరేమీ లేదు. నా పెళ్ళివిషయమై మీరు బెంగ పెట్టుకోకండి. నాకు యెవరినీ పెండ్లా డాలని లేదు. యేదైనా వుద్యోగం చేసి అన్నయ్యకు కాస్త సహాయం చేద్దామని వుంది...'

'అయ్యో! పిచ్చితల్లీ! ఉద్యోగం చేస్తే యింక వీధిలో నడవనిస్తారా? యీ వూర్లో ఉండనిస్తారా? ఇప్పుడు యింట్లోనైనా కూర్చుంటున్నావా? నిన్ను వంటయింట్లోనే మాడ్చేస్తున్నానని నాలో నేను కుమిలి పోతూంటే—'

'వదినా, మీ రలా అనుకోకండి. నాతల్లి కంటే మీరు హెచ్చుగా చూస్తున్నారు...' ఇంకా యేదో మాట్లాడబోయింది కమలం. ఇంతలోకే శాస్త్రిల్లుగారు రావటంవలన ఆపవలసివచ్చింది.

'అవునమ్మా, ఇదేం బాగుందా? అంతటి సహాసుభావుడికి మీరు పుట్టగతులు లేకుండా శాశ్వతనరకంలోకి పంపిస్తున్నారు!'

'బాబూ, మీమాటలు నా కర్థంకాలేదు.

'యెలా అవుతాయ్? కులంలో ఘనంగా బ్రతికాలా వద్దా? అమ్మాయికి పెళ్ళి చెయ్య లేదని యిప్పటికే నలుగురూ వెక్కిరిస్తుంటే యీ వేషంకూడా యేమిటి?'

'బాబూ, మీకాళ్ళపై పడ్తాను. ఆ విషయమేదో చెప్పనిది యెలా...'

'ఇంకేమిటి—అదే. శ్రీజగన్నాథంలో శ్రాద్ధంచేస్తే యెవడు వస్తాడని? అక్కడ చెయ్యడ మేమిటి? చచ్చిన యింట్లోనే చెయ్యాలని వేదాలు ఘోషిస్తుంటే! కిష్ట య్యకు మతిపోతే నీకూడా మతిపోయిందా అమ్మా!'

'శ్రీజగన్నాథంలో చేస్తానన్నారా? యెప్పుడు చెప్పారు మీతో?'

'ఇప్పుడే. బజారులో. ఆమాట విన్నాక నాశరీరం అంతా నెత్తురు, జెర్రులూ పాకు తున్నాయ్. అంత గౌరవకుటుంబాన్ని డబ్బుకాశించి నాశనంచేస్తాడా అని. ఒక్క యెనిమిదివందలరూపాయలైతే కప్పలై పోతుంది. మీ మామయ్యగారు పెద్ద సిరస్తా దారుపని చేశారని మాత్రం మరచిపోకండి.'

'బాబూ! యీ విషయంలో నే నేమీ మాట్లాడలేను. అంతా ఆయనయిష్టం—'

'అయ్యో! వెఱ్ఱితల్లీ! మొగుడు తప్పు చేస్తే దిద్దడానికి భార్యకు సర్వాధికారం వుందని శాస్త్రాలు ఘోషిస్తుంటే...'

'బాబూ! మీ కోనమస్కారం. మా అన్నయ్య యెలా అంటే మే మలా నడవ వలసినవారం. దయచేసి మమ్మల్ని కష్ట పెట్టకండి' అని మధ్యను కలుగజేసుకొని సవినయంగా అంటున్న కమలంవేపు యెర్రగా చూస్తూ 'నీకూడానా... చూస్తారుగా. మీ రెలా యీవూర్లో శ్రాద్ధం చెయ్యరో నే చూస్తాను. నా తఢాకా చూస్తారుగా!' అంటూ చేతికర్రను నేలమీద కొట్టి గుమ్మం దాటాడు శాస్త్రిల్లు. రుక్మిణీ, కమలం ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు.

బజారునుంచి కిష్టయ్య వచ్చాడు. 'అమ్మ య్య! కాస్త మనసు కుదుటపడింది.' అన్నాడు భార్యవేపు చూస్తూ. 'రుక్కూ! ఇవిగో ౫౫౩ రూపాయలు. గొలుసు అమ్మి వేశాను. యీ గోముఖవ్యాఘ్రాలక్రింద డబ్బు తగలేసేబదులు శ్రీజగన్నాథం పోయి, అక్కడ పేదలకు నాన్నగారి పేరు చెప్పి యింత దానం చేస్తే ఆయన స్వర్గానికి పోతారు.'

'సంఘంలో బ్రతుకుతున్నాం. కమలం పెళ్లి చెయ్యవలసి వుంది. ఆలోచించండి.'

'యీ డబ్బు వాళ్లక్రింద తగలేద్దామనా నీవుద్దేశం?'

'..........................'

'మాట్లాడవేం? యీ డబ్బుతో పెళ్ళి కూడా చెయ్యొచ్చు.'

'పెండ్లి అంత తక్కువలో అయి పోతుందా?'

'రుక్కూ! అన్నిటికీ లోకానికి జడిసే యింతవరకూ తెచ్చాడు నాన్న. అన్నిటికీ పరోపకారం అంటూ ఘోషించే మమ్మల్ని తగలేశాడు. యీ విషయంలో మరి యెదురు మాట్లాడకు—'

'మామయ్యగారిని దూషించకండి. ఆయన మహాత్ములు. ఆయన చేసిన పరోపకారమే అదే పుణ్యం—మనను, మన తరతరాలవారిని రక్షిస్తుంది. అన్నీ మీకు తెలుసు. నే నేం చెప్తాను?'

డబ్బు భార్య చేతికిచ్చి వీధిలోకి పోయాడు కిష్టయ్య. అప్పటికప్పుడే శాస్త్రిల్లుగారు వీధిలో థంకామీద దెబ్బ కొట్టి యీ విషయం చాటుతున్నారు. యీ శ్రాద్ధంలో అధమం రెండువందల రూపా యలైనా గుంజుకుందా మనుకున్నారు. కాని ఆయనఆశలు అడియాసలయ్యాయి. 'రామయ్యాకడుపు చెరబుట్టా' డన్న దూష ణలు అప్పుడే రేగుతున్నాయి.

చిరాకుగా కిష్టయ్య యింటికి వచ్చాడు. భార్యతో మాట్లాడలేదు. పరుపుపై వాలాడు. రుక్మిణి చంటిపిల్లాడిని యెత్తు కొని, భర్త యేం చెప్తారో అని మంచం దగ్గ రగా నిలబడింది. అప్పుడే బడినుంచి వచ్చిన పదేండ్ల కుమార్తె సరళా, యేడేండ్ల కొడుకు రామం 'అమ్మా! రేపు మాకు శలవే' అంటూ వచ్చి అమ్మదగ్గర నిలబడ్డారు. రుక్మిణి పిల్లలను చేరదీసింది. అమ్మా, అమ్మా అంటూ నాలు గేండ్ల మోహనుడు కమలాన్ని విడిచి దగ్గరకు వచ్చాడు. నలుగురు పిల్లలనూ, వదిననూ వంటి యింటి గుమ్మందగ్గరే నిలబడి చూస్తూ కమలం మురిసిపోయింది. దుఃఖాన్ని మరిచి పోయింది.

'నాన్న పడుకున్నా రేం అమ్మా?' అని సరళ అడిగింది.

'అమ్మా, అమ్మా! తాతయ్య యెప్పుడు వస్తాడే' అంటూ యేడేండ్ల రామం అమ్మ ముఖంవేపు చూస్తూ అడిగాడు.

కొడుకు మాటలను విన్న కిష్టయ్య వూరుక్కోలేక మంచం దిగి మోహనుని ఎత్తుకొని ముద్దాడి రామాన్ని చేరదీశాడు. 'అమ్మా! కమలం! కాసిన్ని మంచినీళ్ళియమ్మా' అని కేక వేశాడు. కమలం మంచినీళ్లు తెచ్చింది. త్రాగి 'అమ్మయ్య!' అన్నాడు.

'రుక్కూ! శ్రీజగన్నాథానికి రేపే ప్రయాణం. ఇచ్చట యింకా వుంటే నీళ్ళైనా చేస్తారు. రైలుబండి నడవకుండా చేస్తారేమో అని భయంగా వుంది'

'అయితే, వెళ్లటానికే నిశ్చయించారా? ఆ మాత్రం పొదుపుగా యిక్కడే చేసుకుంటే?'

'సరి, మొదటికే వచ్చావ్! రెండువందలు శాస్త్రుల్లుగారికీ, అయిదువందలు శ్రాద్ధభోజనానికీ ఖర్చుపెట్టావా చెప్పు—నాకేం అభ్యంతరం లేదు. వీళ్లంతా మనం పొండి పోతే చూస్తా నవ్వుతారే గాని ఒక్క దమ్మిడీ యెవడిస్తాడు? మోపకూలకు యాభై రూపాయలిస్తే గాని శవం కదలలేదు. చచ్చిన వారి ఆత్మశాంతికి వారు చూపించిన మార్గాన్ని అనుసరిస్తే చాలు. పంచభక్ష్యపరమాన్నాలతో యీ ధనవంతుల బొజ్జలు నింపేబదులు మలమల మాడే పేదవాని కడుపుకు గంజి పోస్తే నాన్న ఆత్మ శాంతిస్తుందిలే...' అన్న కిష్టయ్య మాటలు విన్నాక రుక్మిణి మరి మాట్లాడలేక పోయింది. ఆరోజు సాయంత్రం పాలవాడికీ, డాక్టరుగారికీ ఇవ్వవలసిందీ, మిగతా చిల్లర బాకీలూ తీర్చివేసింది.

పొరుగింటి ఆయన కులంచేత అయ్యరకలవాడు కాని వారి యిల్లు చాలా శుభ్రంగా వుంటుంది. ఆయన డివిజినల్ ఆఫీసులో గుమాస్తాగా పని చేస్తున్నారు. ఆయనభార్యతో రుక్మిణి 'యింటిని చూస్తుండ'మని చెప్పిన మీదట తెల్లారగట్ల నాలుగ్గంటలకు పూరీ పోయే ప్యాసింజరులో అంతా బయలుదేరారు.

రెండువందలతో శ్రాద్ధం చెయ్యటం అయిపోయిందని కిష్టయ్య సంతోషించాడు. యింకా రెండువందలకు పైగా వున్నాయి. అవి జాగ్రత్తగా వుంచి నెల నెల కేమైనా జీతంలో మిగిలేస్తే ఒక పేదయింట్లోనైనా చెల్లెమ్మను పడవేస్తాననుకున్నాడు.

౨

పూరీనుంచి తిరిగివచ్చేటప్పటికి పూరిలో మనిషోమాట, మనిషో కూత! శాస్త్రులు తిరగవేస్తున్నారు—కిష్టయ్య జగన్నాథం వెళ్లిన నాటినుంచీ. 'వీడిని జాతిలో నుంచి వెలివెయ్యవలసిందే' అని శాస్త్రుల్లుగారు పట్టుపట్టారు.

వూరి ఆడంగులు యెవరు వచ్చి యేమన్నా రుక్మిణమ్మ మౌనం దాల్చేది. చుట్టాలు రావటం మాత్రం తగ్గలేదు. వచ్చి రెండేసి మూడేసి రోజులకు తక్కువకాకుండా మకాం వేసి, కడుపు నిండా తిని, నాలుగు నిష్ఠూరాలు విడిచిపెట్టిపోవటమూ జరుగుతున్నది. ఉన్న డబ్బులో యాభై రూపాయలవరకూ భర్తకు తెలియకుండానే రుక్మిణి ఖర్చుపెట్టింది. 'వారందరూ యింకా మన సంసారాన్ని నాశనము చెయ్యాలనే! పొమ్మనలేక పోయావా?' అని అప్పుడప్పుడు రుక్మిణిని మందలించేవాడు. చుట్టాలను యెలా పొమ్మనగలుగుతుంది? భర్తకోపాన్ని శాంతి వచనాలతో చల్లార్చటానికి ప్రయత్నించేది రుక్మిణి.

శాస్త్రుల్లుగారి ప్రచారమూ, పోటీలూ రాను రాను హెచ్చిపోతున్నాయి. 'చెల్లెలికి వీడు పెండ్లిచేసి యేడ్చాడు! దాని బుద్ధి మంచిదైతేగా...!' ఇలా విషబీజాలు సంఘంలో కిష్టయ్యకుటుంబంమీద నాటడమే ఆయన విధిగా ఎంచుకున్నాడు. ఆఫీసులో తనతోడి గుమాస్తాలు కొందరు దెప్పిపొడిచేవారు. దానికి తగ్గట్టు పనికూడా హెచ్చుగానే ఉండేది. వీధివెంబడి తలెత్తి నడవటానికి భయం. కొందరు ఆయనను చూచి తుప్పుమని క్రింద వుమ్మి వూసేవారు. కోపం వచ్చేది. కాని యేం చెస్తాడు? కాస్సేపు ఆ విషయం తలచుకొని విచారించేవాడు. తాను చేసింది మంచి పనే అని సంతృప్తిపడి ప్రజల నిరాదరణను మరిచిపోవడానికి ప్రయత్నించేవాడు. ఒక్కొక్కసారి యెవరైనా తనవిషయాల్లో అనవసరప్రస్తావన తెస్తే కోపం వచ్చి, వారిని నాలుగు చీవాట్లు పెట్టేవాడు; నాలుగు తినేవాడు. చిరాకుతోనైనా ఆఫీసుపని చెయ్యక విధిలేదు. చేస్తే తప్పులు వచ్చేవి. ఆఫీసరు పెట్టే చీవాట్లుకూడా తినవలసివచ్చేది. ఇంటికి పెద్ద ఫైళ్లకట్ట మోసుకొని వచ్చేవాడు. పనిచెయ్యటానికి విసుగుపుట్టేది. ఆయన తలలో తిరిగేది కమలానికి యెంత వేగంగా పెండ్లిచేసి సుఖిద్దామనే. ఆఫీసులో పని, యింట్లో సంసారంగొడవ, కమలం పెండ్లి కోసం తిరగటం, వూరిలో కులంవారు కురిపిస్తున్న దూషణలు భరించటం—ఇవి ఆయనకు విసుగు కలిగించేవి. విసుగుతో కోపంకూడానూ. కిష్టయ్య సంసారపుగొడవ తాకకుండా చేయటానికి రుక్మిణి వీలైనంత వరకు ప్రయత్నించేది.

ఆరోజు ఆఫీసునుంచి చిరాకుతో వచ్చాడు. నాన్నా, నాన్నా అంటూ పిల్లలు ముసురూ చుట్టూ మూగారు. ఆ ఫైళ్ళకట్ట టేబిలుపైన పారేసి 'అమ్మయ్యా!' అంటూ చాపమీద కూర్చుండబడిపోయాడు. రుక్మిణి వచ్చింది. 'రుక్కూ! అగ్రకులంలో యెందుకు పుట్టాం?' అన్న భర్తమాటలు విన్న రుక్మిణి 'మీరు విచారించకండి. ధైర్యంతో వుంటే యేకార్యమైనా నెరవేర్చగలుగుతాం!' అని ఓదార్చింది.

'రుక్కూ! పేదవాళ్ళకు కూడానూ కట్నాల పిచ్చేనే! పోనీ, ఈ వూరునుంచి పోదామా అంటే ఆ వెధవ బదిలీ చెయ్యడు!'

'తప్పు. ఒకరిని తిట్టడ మెందుకు? కమలం పెండ్లి గూర్చి మీమనసు కష్టపెట్టుకోకండి. కమలం యెవరినీ పెండ్లాడదట.'

'రుక్కూ! నీకూ మతిపోయిందా? మన యీస్థితినిజూచి కద్దనక యేమంటుంది!'

రుక్మిణి 'నిజమే' అన్నట్లు మౌనాన్ని సూచించింది. 'రాఘవయ్యగారి కూతురు పెండ్లికి అందరినీ పిలిచారటగా—మనలను తప్పించి?' అన్నాడు కిష్టయ్య. 'పోనీలెండి' అని సమాధానమిచ్చిన రుక్మిణివేపు చూస్తూ 'కమలం పెళ్ళి చెయ్యాలి, నేను నిద్రపోవాలి రుక్కూ! మనకు డబ్బు అధికం ఖర్చు కాదు. పిల్లెవరినీ పెండ్లికి పిలవ నవసరంలేదుకదూ?' అన్నాడు.

ఆమరుసటిరోజు ఆఫీసరుచేత పడచీవాట్లు తిన్నాడు. ఆ ముందురోజు పోవలసిన ఆఫీసు కాగితాలు పంపలేకపోయాడు. ఇంట్లో పని చెయ్యాలని కొన్ని ఫైళ్లు తీసుకవెళ్ళేవాడు. కాని కమలాన్ని చూడడంతోనే దుఃఖం ముంచుకు వచ్చి కాగితం ముట్టుకోలేకపోయేవాడు. ఆఫీసులో తోడిగుమాస్తాలు కొందరు ఆయనను వెలివేసినట్లుంచారు.

ఆరోజే కమలం పెండ్లిమాపులకు యెవరో వస్తానన్నవారు రాలేదు. కిష్టయ్యగుండె కుంగిపోయింది. వూరంతా గోల—ఆపిల్ల గుణాలు మంచివి కావనీ, అదీకాకుండా కిష్టయ్యని కులంనుంచి వెలివేస్తే ఆ పిల్లను యెవరు పెండ్లాడుతారనీ. పిల్లగుణాలు మంచివి కావని నలుగురూ అనుకుంటున్న మాటలు పరోక్షంగా విన్న కిష్టయ్య గుండె

బాదుకొని చిన్నపిల్లాడిమల్లే యేడ్చాడు. లోకంమీద కర్తింపలేని అసహ్యం పుట్టింది. సుగుణవతియైన తన చెల్లెలిని లోకం అలా మాషిస్తుందంటే ఆ పాపులోకంలో బ్రతికే బదులు చావాలనిపించింది కిష్టయ్యకు. 'యెవళ్లో కిట్టనివాళ్లు ఆడే మాటలు తీసుకోకండి. మీ చెల్లెమ్మ మిమ్మల్ని చూసి యేడుస్తోంది. పెండ్లి పనేమిరా వద్దంటోంది. పిల్లలుకూడా యేడుస్తున్నారు. కులం లేకపోతే పోయె. ధైర్యంగా ధర్మంగా మనం పోతే చాలు...' అని రుక్మిణి యెన్నో విధాల ఓదార్చింది. ఆరాత్రికి భోజనం చెయ్యలేదు. పరుపుపైన పడుకొని ఆ రాత్రంతా కమలం పెండ్లివిషయమే పలవరించాడు.

తెల్లవారింది. 'ఆఫీసులో కట్టలుకట్టలు పడి వున్నాయి. యే బాబుకూ సహాయం చేద్దామని దయలేదు—వెళ్తా' నంటూ, స్నానం చేసి కాఫీ త్రాగాక ఆఫీసుకు పోవడానికి బయలుదేరాడు. 'సవళను కేరియరుతో పంపిస్తా, పదిగంటలకు' అంది రుక్మిణి. 'హోటలులో భోంచేస్తాను. అమ్మాయి బడికి పోనీ' అంటూ గుమ్మం దాటాడు.

చీకటి పడింది. భర్త యింకా ఆఫీసునుంచి రానందున రుక్మిణి ఆందోళన చెందింది. ఆ వీథిలో నేవున్న ఒక తాలూకాఫీసుగుమస్తాగారి యింటికి సవళను పంపింది. ఆఫీసు సాయంత్రం అయిదుగంటలకే విడిచిపెట్టినట్లు తెలుసుకొని మరీ ఆందోళనచెంది, భర్తరాక కోసం వీథిగుమ్మందగ్గర చంటిపిల్లాడిని యెత్తుకొని నిరీక్షిస్తోంది. 'అమ్మా, నాన్న యింకా రాలేదేమే' అని యేకకంఠంతో రాముడూ, మోహనుడూ అడుగుతున్నారు.

రాత్రి యెనిమిదిగంటలకు వచ్చాడు. కిష్టయ్య. 'రుక్కూ! యెంతసేపటినుంచి అలా కాచుకుకూర్చున్నావ్?'

'చాలాసేపైంది. యీరోజు యింత ఆలస్యంగా వచ్చారేమండీ? పిల్లలు మీకోసం పలవరిస్తున్నారు.'

'జగన్నాథస్వామికోవెలలో యెవరో వేదాంతం చెప్తున్నారు. యేమిటో విందామని ఒకాయన పిలిస్తే వెళ్లాను.'

'వేదాంతబోధ అప్పుడే మన కెందుకండీ?'

'అందులో తప్పేముందే? చాలా కమ్మగా వుంది.'

భోజనం చేస్తూ అన్నాడు—'రుక్కూ! యీ సంసారమంతా సంతలోని ఒక వ్యాపారంలాంటిదే సుమా! చూడు. యీ గ్లాసు యీ నీటితో అలా పైట పెట్టు. అందులో ఆకాశం కనిపిస్తుందా లేదా? నీరు పారవెయ్—యే మవుతుంది?'

'యేమిటండీ యీవేదాంతం? మీకు పుణ్యం వుంటుంది. రేపటినుంచి వెళ్ళకండి.'

'రుక్కూ! తప్పేముందే? నిన్నంతటి దిగులు యీవేళ లేదు. చూశావా? నేను శాస్త్ర ధైర్యంగా వుండి వుద్యోగం చెయ్యాలంటావా?'

రుక్మిణి భర్తకు జవాబివ్వలేదు. ఆరాత్రి స్వేచ్ఛగా నిద్రపోయాడు కిష్టయ్య. తెల్లవారింది. పరుపుమీద కూర్చుని కిటికీగుండా ఆకాశంవేపు చూస్తున్నాడు. 'యేమిటండీ అంత దీక్షగా చూస్తున్నారు?' అంది రుక్మిణి. 'కమలంపెండ్లి యెలా చెయ్యటమా అని. మనను యే శుభకార్యాలకూ యెవరూ పిలవలేదు. కులంలోనుంచి వెలివేశామని చాటుతున్నారు వూరూరా. మన వసుకు ఆ శాస్త్రిగారికి యెలా తెలుసుందో...' అంటూనే బొటబొట కన్నీరు కార్చేశాడు. ధైర్యాన్ని తెచ్చుకోమని రుక్మిణి యెన్నో మాటలు చెప్పింది. యీ దృశ్యాన్ని చూచిన కమలం వచ్చి 'అన్నయ్యగారూ, నా పెండ్లివిషయమై నీవు విచారిస్తే నీ యింట్లో నేను వుండలేను' అంది. రుక్మిణి ఆశ్చర్యపడింది. కమలం అంత ధైర్యంగా నిలబడి యిదివరకెప్పుడూ అన్నయ్యతో మాట్లాడలేదు.

ఆరోజు ఆఫీసుకు పోతూ 'నేను రావటం ఆలస్యమౌతుంది. బెంగ పెట్టుకోకండి' అంటూ రుక్కుతో చెప్పి పోయాడు. ఆరాత్రి వేదాంతబోధ విని వచ్చి భోజనం చేస్తూ, 'రుక్కూ! యెవరైనా చస్తే యేడవటమంత తెలివితక్కువ యింకేమీ లేదు. ప్రపంచంలో ఒక్క మనిషి చావకుండా ఒక్క నిముషం గడుస్తుందా? ఆ చావులన్నిటికీ యేడిస్తే మన కన్నీరు యెప్పటికీ ఆరదు. ఆత్మకు చావు లేదని తెలుసుకున్నవాడు చావుకు జడిస్తే, వా డేమతంవాడైనా యేంలాభం? మాసిన చింకి బట్టలను విడిచిపెట్టి కొత్తబట్టలు వేసుకోవటం మంచిదా కాదా?' అంటూ లేచి చెయ్యి కడుక్కున్నాడు.

నిద్రలో యీ వేదాంతమంతా మరిచిపోయాడు. నడిరాత్రప్పుడు తెలివి వచ్చింది. లేచి, 'రుక్కూ, రుక్కూ! నామనస్సు అదోలావుంది. వుద్యోగం వదిలేసి యే వూరైనా పోతే యీ పోరంటూ వుండదు. అక్కడ కమలానికి పెండ్లి చెయ్యొచ్చు' అన్నాడు. రుక్మిణి నిద్రపోతోంది. వీథితలుపులు తెరిచాడు. యిటూ అటూ చూశాడు వీథిలోకి వచ్చి. రోడ్డుమీద కొంతదూరం ముందుకు సాగాడు. మళ్ళా వెనుతిరిగి చూశాడు. తన భార్య, పిల్లలూ, కమలం యేడుస్తున్నట్లు కనిపించింది. 'నేనున్నాను. యెక్కడికీ వెళ్లిపోలేదు'. అని గొణుక్కుంటూ యింటికి పోయాడు. తలుపు లోగడియ వేస్తున్నాడు. రుక్మిణికి తెలివివచ్చింది. 'యెక్కడికి వెళ్లారు నిశిరాత్రిప్పు' డంది. 'రుక్కూ! కమలం పెండ్లి చేస్తేనేగాని నేను మనిషిని కాను...' అన్న భర్తపలుకులు విని 'మీ రిలా అధైర్యం చెందితే మా గతేంగాను? మామయ్యగారిని తలుచుకోండి. ఆయన చూపిన త్రోవలో నడుచుకోకపోతే యెలా?' అని అంది.

'అవునుగాని, రుక్కూ! చుట్టాలక్రింద యేమాత్రం డబ్బయింది...?'

'యేమాత్రమైతే యేం లెండి? యింక చుట్టాలు మన యింటికి రమ్మన్నా వస్తారా?'

'రుక్కూ! యీ జీవితం అంతా ఒక కల. కల మాని మరిచిపోతా మెందుకో' అన్న భర్తమాట విని రుక్మిణి గజగజ వణికిపోయింది. భర్తమార్పుకు విచారించింది. 'రోజంతా పనిచేశావ్. పడుకో రుక్కూ!' అంటూ పరుపుపై వాలిపోయాడు. రుక్మిణి కండ్లు మూసి దేవుని ప్రార్థించుకొంది. మామగారిని తలుచుకొంది.

వేదాంతోపన్యాసం వినటానికి వెళ్ళటం రుక్మిణి యెంత బ్రతిమాలినా కిష్టయ్య మానలేదు. రానురానూ వుద్యోగంమీద శ్రద్ధ కూడా పోయింది. ఒక నెలరోజులు ఆఫీసుకు శెలవు పెట్టాడు. ఒక్కొక్కసారి యింట్లో చుట్టంలా మెసిలేవాడు.

ఆనాడు ఆదివారం. తనతో సరిగ్గా మధ్యాహ్నం పండ్రెండుగంటలకు యిద్దరు సాధులను తెచ్చి 'రుక్కూ, వీరికి అన్నం పెట్టు' అన్నాడు. రుక్మిణి వారికి అన్నం పెట్టింది. వారు భోజనం చేస్తున్నారు. రుక్మిణివైపు చూసి నవ్వుతూ కిష్టయ్య అన్నాడు—'రుక్కూ! నాన్న ఒకసారి నీతో ఏమన్నారు? జ్ఞాపకముందా? నేను వీథి అరుగుమీద కూర్చొని విన్నానులే...'

'ఏం మన్నారండీ?'

'అమ్మా, కిష్టయ్య సన్యాసిలాంటివాడే. సంసారంగొడవే అవసరం లేదు. నా వూపిరి కాస్తా పోతే యీ చుట్టాలతో మరి పడ లేడు.అన్నిటికీ స్థైర్యమైన యిల్లాలివి నువ్వు వున్నావులే అమ్మా!—ఆ మాటలు జ్ఞాపకం లేదూ రుక్కూ?'

'ఉన్నాయిలెండి. మీరు భోజనానికి లేవండి' అంటూ రుక్మిణి అక్కడినుంచి లేచిపోయింది.

కిష్టయ్య రోజూ యెవరో సాధువులను భోజనానికి తెచ్చేవాడు. రుక్మిణమ్మ కాదన లేకపోయేది, ఆమెను బంగారు జనాదరణ, అతిథి సత్కారాల్లో అందెవేసిన చేయిగా తయారు చేశాడు రామయ్య.

ఒకరోజు తెల్లారఝామున లేచాడు. 'రుక్కూ! ఒక పనిమీద అనకాపల్లి వెళ్లాలి...' అంటూ బట్ట వేసుకున్నాడు. అనుకోకుండా భర్త యీ ప్రయాణానికి అంతట్లోనే సిద్ధమవటం ఆమెను కలవర పరచి 'నేనూ మీతో వస్తా'నంది. 'యెందుకు? సాయంత్రానికి వచ్చేస్తా'నని బయలు దేరాడు. రుక్మిణమ్మ అరుగుమీద నిలబడి చూస్తూ అప్రయత్నంగా కన్నీటిబొట్లు రాల్చింది.

ఒక్క అరగంటలో కిష్టయ్య మరల తిరిగివచ్చాడు. 'యేం? అప్పుడే వచ్చే శారు?' అంది రుక్మిణి. 'నేను వుండటం నీకిష్టం లేదా?' అని భార్యవేపు చూస్తూ కిష్టయ్య అంటుంటే ఆమె దిగ్భ్రాంతి చెందింది. అలాంటి కఠోరమైన మాటలు వినటం అదే మొదటిసారి.

పడుకున్న మోహనుణ్ని లేపి ముద్దు లాడాడు. చంటిపిల్లాడితో కాస్సేపు ఆడు కున్నాడు, సరళా, రాముంలకు కొంతసేపు చదువు చెప్పాడు. కమలం వేపు తదేకదీక్షతో కొన్ని నిముషాలు చూచాడు. కండ్లవెంబడి కన్నీటిబిందువులు రాలాయి. గబగబా తుడు చుకున్నాడు. వారంరోజులుగా కమలాన్ని మంచినీరు అడగటమే మానివేశాడు. కమలం అన్నయ్యమార్పుకు దుఃఖించింది.

ఆ మూడవరోజున బజారునుంచి కాషా యవస్త్రాలు తీసుకువచ్చాడు. 'యివి మన కెందుకండీ!' అన్న రుక్మిణితో 'కాషాయ వస్త్రాలు పవిత్రమైనవి. మనయింట్లో ఒక మూల వుంటే తప్పా?' అన్నాడు.

ఈ సంఘటన జరిగిన పదిరోజులవరకు కిష్టయ్య రోజుకు అధమం నలుగురు బైరా గులను భోజనానికి తీసుకువచ్చేవాడు. గృహ లక్ష్మి రుక్మిణి భర్తకు సంసారభారం తగలకుండా చూసేది. సిగ్గు విడిచి వీధిలోకి వెళ్ళి అన్ని వస్తువులూ ఆమె తెచ్చుకొనేది. కిష్టయ్యకు మొదటి రోజు లలో కొంత కష్టమనిపించినా, తరువాత తన అశక్తిని తలచుకొని వూరుకున్నాడు. వూర్లో కొంద రాడంగు లీ విషయమై గొణుక్కోక పోలేదు.

3

ఆరోజు మంగళవారం. కోడి కూసింది. చంటి పిల్లాడు కావుమని యేడుస్తున్నాడు. గాఢనిద్రచెందిన రుక్మిణికి తెలివి వచ్చింది. పరుపుమీద కిష్టయ్య లేడు. కేకలు వేసి పిలి చింది. సమాధానం లేదు. స్టాండులో కాషాయవస్త్రాలు లేవు. స్టేషనువేపు పరు గెత్తింది. రైలు అప్పుడే వెళ్ళి పోయింది. వదిన వెర్రిదానిలా పరుగెత్తిపోవడం చూచి కమల నిర్ఘాంతపోయింది. చంటి పిల్లాడిని యెత్తుకొని కన్నీటితో ఓదారుస్తోంది.

తెల్లవారింది. రుక్మిణి యింట్లో కాలు పెట్టింది. వరదపై పారుతున్న కమలం కన్నీ టిని చూచింది. 'అమ్మా, కమలం' అంటూ కమలాన్ని పట్టుకొని యేడ్చింది. నిద్రపో తున్న పిల్లలనందరినీ లేపి తనచుట్టూ కూర్చో బెట్టుకొని యేడ్చింది. వదినయేడుపుతో కమలంయేడుపు మరీ హెచ్చయింది. యిరుగు పొరుగువారంతా వచ్చారు, యేమైంది— యే మయిందని. యేమని యెవరు చెప్తారు? శాస్త్రిల్లుగారు ఆత్రోవను పోతూ దయ చేశారు. 'అయ్యిందీ? అనుకున్నంత పనీ అయ్యిందీ! శాస్త్రాలకు వ్యతిరేకంగా నడిస్తే సంసారి సన్యాసి కాక యేమౌతాడు? నే నెంతగుండె బాదుకొని చెప్పాను! నా మాటలు విన్నావా రుక్మిణీ...!' అంటూ గబ గబా సమ్మందిగాడు. యీ పలుకులు ఆమె హృదయంలో ములుకుల్లా నాటాయి.

'అమ్మా! కిష్టయ్య వుత్త అమాయకుడు. సంసారం చెయ్యలేడు. అన్నిటికీ నువ్వే వున్నావు. సత్యం, శాంతి, సహనాలతో మెలగి ధర్మంగా నువ్వు నీ విధిని నిర్వర్తించా వంటే యే కష్టాలైనా సుఖంక్రిందే భావిస్తావు. భగవంతు డొకడున్నాడనీ, ధర్మమే ఆయన స్వరూపమనీ గుర్తించు తల్లీ. కష్టం, సుఖం రెండూ అనుభవించంది యెవరి జీవితమూ పరిపూర్ణం కాదు. నిస్పృహను విడిచి పెట్టి నీ ఆత్మయందు విశ్వాసం వుంచి నిష్క ల్మషమైన మనస్సుతో నీ కార్యాన్ని నెర వేర్చు. జయం పొందుతావమ్మా..'—చని పోయే ముందు మామగా రన్న యీ పలు కులు ఆమెచెవుల్లో మారుమోగాయి.

పిల్లలవేపూ, కమలంవేపూ ఒకసారి చూసింది. వారి రోదన ఆమె హృదయాన్ని కలవర పరచింది. నిలబడి చీరకొంగుతో కన్నీ టిని తుడుచుకొని కమలందగ్గరకు వెళ్ళి అంది— 'కమలం! నువ్విలా అధైర్యంగా యేడ్చు కొంటూ కూర్చోవద్దు. నా ఆశలన్నీ నీమీదే పెట్టుకున్నా. నీ మూలంగా మీ అన్నయ్య సన్యాసుల్లో కలిసిపోలేదు. కర్మఫలితాన్ని ఆయన అనుభవించక తప్పలేదు!' కమలం యేడ్చుకుంటూ వదినపాదాలపై పడిపోయింది. కమలాన్ని లేవదీసి—'అమ్మా! నువ్వు ధైర్య ముగా వుంటేనే యీ పిల్లల బ్రతుకూ, నా బ్రతుకూను. కానున్నది కాక మానదు ధైర్యంగా, ధర్మంగా పోతే యెప్పటికైనా మీ అన్నయ్య మనలను కలుసుకుంటారు. మామయ్యగారు చనిపోతూ నాతో అన్న సుభాషితాలను జ్ఞాపకానికి తెచ్చుకో అమ్మా. మనకు చంచలలక్ష్మికంటె శాశ్వత ధర్మ మార్గాన్ని చూపించి మీ నాన్న చనిపోయారు. అదే మనకు పదివేలు.' వదిన మాటలు విన్న కమలం ఆమెవేపు చూచింది. ఆమెచూపుల్లో ధైర్యం గోచరించింది. యేడుస్తున్న మోహనుని తీసుకొని ఓదార్చింది.

పరామర్శకు వచ్చేవాళ్ళు వస్తున్నారు; కాని అభిమానంచేత కాదు. యెత్తిపొడుద్దా మని. నిర్మొగమాటంగానే, యెదురుగా అన వలసిన గట్టిమాటలు అనేశారు. వేయవలసిన నిష్ఠూరాలు వేశారు. వదినను పైవారు దూషి స్తుంటే కమలానికి కష్టమనిపించింది. 'శాంతం భూషణం! తొందరపడి యెదురుమాట చెప్ప కమ్మా' అని కమలాన్ని ఓదార్చింది రుక్మిణి.

'మొగుడు బైరాగుల్లో కలిసిపోతే యేడ్చి చావవలసిందే; అలాంటిది యేమిటమ్మా ఆ ధీమా ఆ రుక్మిణికి! దీని పోరూ, గతిలేక స్వర్గానికి పోలేక కాకికడుపులో వున్న రామయ్యశాపమూ మొత్తంమీద, శాంత మూర్తికిష్టయ్యని బైరాగుల్లో కలిపేసింది. దానిమాట వినే జగన్నాథంలో శ్రాద్ధం చేశాడు'అని యెవరికి తోచినట్లు వారు మాటాడేవారు.

చీకటి పడింది. మధ్యాహ్నమనగా యిల్లు విడిచిన రుక్మిణి 'యిల్లు పోరికిందమ్మా కమలం' అంటూ యింట్లోకి వచ్చింది.

'యేకి స్థిలో వదినా?'

'పేదవారికి హృదయం వుందమ్మా. వారి గుడిసెలమధ్య మన గుడిసె; వారిలో ఒకరం మనం.'

'క్రొత్తయింట్లోకి యెప్పుడు పోవాలి వదినా?'

'రేపే. నీకు చాలా శ్రమ యిస్తున్నానమ్మా. నువ్వు శ్రమ అనుకోకు. యీ పిల్లలిని రక్షించే పూచీ నీకే వదిలిపెట్టున్నా'

'.................'

'అలా తల దించావేమమ్మా? నేను సన్యాసినినై పోతాననా? నా గుండెను మామయ్యగారు తమ బోధనలతో శాస్త్రబద్ధంగా తయారుచేశారు. నాచేతనైన పని మీఅందరికీ వండి పెట్టడం. నువ్వు ప్రయివేట్లు చెప్పి డబ్బు తేవాలమ్మా'

'ప్రయివేట్లు సంపాదించట మెలా వదినా? వీళ్ళంతా అడ్డుపెడ్తారేమో?'

'పేదలకు హృదయ ముందని చెప్పలేదా? పదిమంది పిల్లలు మనయింటికే ప్రయివేటుకు వస్తారు. వారికి ప్రయివేటు చెప్పితే నెలకో పదిరూపాయలు వస్తాయి. ఆ ప్రక్క వీధిలో నలుగురు నాయుళ్ళ అమ్మాయిలకు సంగీతం చెప్పితే వారు నెలకో పదిరూపాయలు యిస్తారు. ఆ యిరవైరూపాయలతో యెలాగో సంసారాన్ని గడపగల మనే నా ధైర్యం.'

మర్నాడు సామానులన్నీ క్రొత్త యింట్లోకి నడిచాయి. అక్కడే బాగుంది వారి జీవితం. వారిమధ్య గౌరవంగా బతుకుతున్నారు. పిల్లలు బడికి వెళ్లివస్తున్నారు. కమలం ప్రయివేటులు జాగ్రత్తగా చెప్తోంది. రుక్మిణి తీరుబడి వున్నప్పుడల్లా యిరుగుపొరుగుపిల్లల బట్టలు, స్త్రీల జాకెట్లూ చేతికుట్టుతో కుట్టేది. కమలం వీధిలోకి వెళ్ళకలసిన మనిషిని దగ్గర వున్నడబ్బులో పాతికరూపాయ లిచ్చి మొదటే చీరలూ, జాకెట్లూ కొంది.

౪

అయిదు నెలలు గడిచాయి. రుక్మిణి అప్పుడప్పుడూ భర్తను తలచుకొని యేడ్చేది. కాని పిల్లలూ, కమలం యెక్కడ అధైర్య పడతారో అని ఆ దుఃఖాన్ని వేగంగా ఆపుకొనేది. దేవుని నమ్మింది. ఆయనను పూజించేది. కమలం తన శాయశక్తులా కష్టపడుతోంది. ఆమె శాంతగుణం, ఆమె తియ్యని పలుకులు, ఆమె అందం యెదుటివారి హృదయాలను ఆకర్షించేవి. రోజుకు అధమం పదిగంటలైనా ప్రయివేట్లు చెప్పటంతో గడుపుతోంది. కమలం నలుగురుపిల్లలనూ తన ప్రాణంకంటే హెచ్చుగా చూసుకొంటోంది. ఆ నలుగురు పిల్లలతోనే ఆమె కానందం. వారిలోనే తన జీవితమని మురిసిపోతుంది.

అన్నయ్యకోసం విచారించకపోలేదు. కాని వదిన యెక్కడ విచారిస్తుందో అని ఆమెయెదురుగా యెప్పుడూ దుఃఖించలేదు. అప్పుడప్పుడూ వదినయెదురుగా ధైర్యమైన మాటలు చెప్తుండేది. కమలం నెలనెలకూ తెస్తున్న నలభైరూపాయలలో వారికి నెలకు పదిరూపాయలవరకు మిగిలేది. నాన్నకోసం మొదట రెండు మూడు నెలలవరకు పిల్లలు పలవరించారు. కమలం, రుక్మిణీ వారలను ఆటలలోను, పాటలలోను, చదువులోను పెట్టి రానురానూ తండ్రిని మరపింపజేశారు.

ఆరోజు సంగీతం చెప్పడానికి వెళ్లిన కమలం వేగంగా వచ్చేసి యింట్లో ఒక మూల కూర్చొని ఒక పుస్తకం చాటుపెట్టుకొని కన్నీరు కారుస్తోంది. రుక్మిణి పెట్టెలోని బట్టలు తీయడానికి వచ్చి యీ దృశ్యాన్ని చూచి కమలాన్ని చేరదీసి అంది: 'యేమమ్మా కమలం...అలా?'

'యేమీ లేదు వదినా' అని వేగంగా కన్నీరు తుడుచుకుంది.

'చెప్పు తల్లీ! నాదగ్గర......'

'వాళ్లంతా యిప్పటికీ మనలను బ్రతకనిచ్చేటట్లు లేదు.'

'యేమైంది? యెవ రేమన్నారు?'

'యిన్నాళ్ళూ యెవ రేమన్నా వూరుకొనేదాన్ని. యీరోజు శాస్త్రుల్లుగారు రోడ్డుమీద నిలబెట్టి నే నెవరితోనో తిరుగుతున్నానని నోటికొచ్చినట్లు కూస్తే అందరూ మూగి నన్నొక వింతమనిషిలా చూశారు'

'అయ్యో! నా పిచ్చితల్లీ. అందుకేనా? యే కర్రలో అగ్గి వుంటే అదే కాలుతుంది. నీ ధర్మాన్ని నువ్వు నిర్వర్తిస్తున్నావు. లోకం యెలా అనుకుంటే నీకేం?'

ఇంతలో పిల్లలు బడినుంచి వచ్చారు. సరళ అంది—'అమ్మా! మన పాఠశాలయింటికి నిన్నరాత్రి యెవరో బైరాగి వచ్చి వెళ్ళిపోయారట. కమలమ్మ చెప్పింది బడిలో...'

'హాఁ! వచ్చి వెళ్లి పోయారా అమ్మా?'

'వదినా! అన్నయ్య వచ్చి వుంటారేమో? నే వెళ్ళి ఆ పొరుగువారిని కనుక్కుంటాను...యేమైనా చెప్పారేమో?'

రుక్మిణి నిట్టూర్పు విడిచింది. 'వెళ్తాను వదినా' అంటూ కమల లేచింది. 'వద్దమ్మా వద్దు. మనం వెళ్ళినా లాభం లేదు. ఆయనను కలుసుకున్నా యింటికి రారు. ఆ వచ్చే రోజులు దగ్గరపడలేదు.' వదినమాటలు విన్నాక కమలం ఆశ్చర్యంతో 'వదినా, యేం? యెందుచేత రారు? నేను అన్నయ్యకాళ్లమీద పడ్తాను' అంది.

'అమ్మా! నామనసులో వున్నది చెప్తున్నా. నీకు పెండ్లి చేశానని నీభర్తను ఆయనకు చూపిస్తేగాని ఆయన రారు'

'కులంనుంచి వెలివేశారుగా—' అని అప్రయత్నంగా కమలం అంది.

'పోనీయమ్మా, కులంతో యేముంది? గుణం ప్రధానంగాని'

వదినమాటలు విన్న కమలం తల దించి కాలివ్రేళ్ళవేపు చూస్తూ దీర్ఘంగా యేదో ఆలోచిస్తోంది. పిల్లలు ఆమెను పిలిచారు చదువు చెప్పమని. 'మధ్యాహ్నం కూడా చదువేనా? భోజనం చేసి చదువుకుందురుగాని' అని రుక్మిణి పిల్లలను భోజనానికి కూర్చోబెట్టింది.

మరో నాలుగు నెలలు సాగిపోయాయి. రుక్మిణి కమలచేత పూజాపురస్కారాలు చెయ్యిస్తూనేవుంది. కమలంపెండ్లి యెలా చెయ్యటమా అనే సమస్య ఆమెను కలవరపరచకపోలేదు. దేనికైనా కాలం రావాలనీ, కానున్నది కాకమానదనీ, భగవంతుని నమ్మిన వారికి నాశనం లేదనీ తలచుకొని సంతృప్తిపడేది. ఆ వూర్లోనే వుంటే యెప్పటికైనా భర్తను కలుసుకోటానికి అవకాశం వుంటుందని విశ్వసించింది. లోకంగోలకు ఆయన మన సెలా లొంగిపోయిందో అలాగే పిల్లలను చూడాలనే కోరికకు లొంగిపోతుందని నమ్మింది. ఆ విశ్వాసమే ఆమెను ఆ వూర్లో వుండనిచ్చింది.

ఆరోజు మోహనుడు జ్వరంతో బాధపడుతున్నాడు. రుక్మిణి బజారుకు పోయింది.

సరళా, రామం బడికి పోయారు. కమలం ఒక్కర్తే యింట్లో వుంది. యెవరో బైరాగులు ముష్టికి వచ్చారు పాడుకుంటూ. కమలం బియ్యం ముష్టివేస్తూ 'బాబూ, మీ గుంపులో కిష్టయ్య అనే పేరుతో యెవరైనా వున్నారా?' అని అడిగింది.

'లేరమ్మా. మీవాళ్లెవరైనా బైరాగుల్లో కలిసిపోయారా?'

'అవును బాబూ. మీకు ఆయనగురించి తెలుసునేమో అని.'

'సాధారణంగా బైరాగులయ్యాక పేర్లు మర్చుకుంటాం. అనకాపల్లిలో మా గురువుగారి పీఠం వుంది. దేశదేశాలూ తిరిగి సంవత్సరానికి ఒకసారి అక్కడ కలుసుకుంటాం. మనిషి యెలా వుంటాడు?'

'మనిషి మీకంటే పొడుగ్గా, చామనచాయగా వుంటారు. యెడమకాలి ముడుకు మీద పెద్ద మచ్చ వుంటుంది. సైకిలుమీదినుంచి పడిపోతే ముడుకు మీద పెద్ద దెబ్బ తగిలి పుండయింది. మానటానికి నాలుగు నెలలు పట్టింది. అప్పటినుంచి సైకిలు త్రొక్కటమే మానివేశారు.'

'యేమో అమ్మా. యెవరో చెప్పలేం' అని శెలవు తీసుకొని వెళ్ళిపోయారు.

మోహనుడు మంచినీరు కావాలని గోల పెట్టున్నాడు. పొరుగింటి మామ్మ వచ్చి 'శ్రీ సింహాద్రి అప్పన్నను తలచుకొని, పిల్లాడి జబ్బు నయమైతే ఆయనదగ్గర కొప్పు తీయిస్తానని మొక్కుకోండమ్మా' అని చెప్పింది. కమలం మామ్మమాటలు విని మనసులో అలా నమస్కరించుకుంది. మామ్మ కాస్సేపు కూర్చొని వెళ్లిపోయింది.

ప్రొద్దున్న అనగా వెళ్ళిన రుక్మిణి పది గంటలైనా యింకా రాలేదు. మోహనుడు 'అమ్మా, అమ్మా' అని అరుస్తున్నాడు. కమలం ఓదారుస్తోంది. రుక్మిణి చిరునగవుతో యింట్లో ప్రవేశించింది. కమలం రుక్మిణిచిరునగవును చూడటం ఆ యింట్లోకి వచ్చాక అదే మొదటిసారి.

'వదినా! మోహన్ నీకోసం పలవరిస్తున్నాడు. ఇంత ఆలస్యం...'

'నీవంచేనమ్మా. నీ శాంతగుణం యెదుటివారి హృదయాలను లోబరచుకోక యేం చేస్తుంది? మామయ్యగారి పేరు నిలబెట్టావు. వచ్చేనెలలో పెళ్ళిముహూర్తంకూడా స్థిరమైంది.'

కమలం మాట్లాడకుండా రుక్మిణివేపు ఆశ్చర్యంగా చూస్తోంది.

'యేం కమలం? అలా చూస్తావేం? నీవు యెంచుకున్న వరుడే—మధుసూదనరావు.'

కమలం తల దించింది సిగ్గుతో. మధుసూదనరావు మునసబుకోర్టులో గుమాస్తాగా పనిచేస్తున్నాడు. పుట్టుకచేత కమలంకులం, కమలం తెగే. మధుతల్లి చదువుకుంది. ఆయన తండ్రి విధవావివాహం చేసుకున్నాడని పాతికసంవత్సరాలక్రితం కులంనుంచి వెలివేశారు. కమలం మధు చెల్లెలకు ఆరునెలల క్రితంనుంచి సంగీతం చెప్తోంది. అతనామెను ప్రేమించానన్నాడు. ఆమె నిరాకరించింది. ఆమె శాంతగుణం, అందం రానురానూ ఆయనకు పిచ్చెత్తించింది. రుక్మిణి ఒకనాడు కమలంతో 'కులంతో యేముంది? గుణం ప్రధానం' అని అన్న తరువాత ఆమె ప్రేమకై పరితపించే మధుతో యిలా అంది— 'నాలో ప్రేమ ఉంది. కాని నేను ప్రస్తుతం మిమ్మల్ని ప్రేమించలేను. మీతల్లిదండ్రులు సంతోషంగా ఒప్పుకొని, యిరువురికీ పెండ్లి చేస్తే అప్పుడే నేను మిమ్మల్ని ప్రేమించగలను. నావదినా, పిల్లలూ వున్నారు. వారిని పోషించే బాధ్యత నాది. అందుచేత ఒకవేళ పెండ్లి అయినా నన్నిలా ప్రయివేట్లు చెప్పుకోనివ్వడానికి మీరు అంగీకరించాలి. అప్పుడే మిమ్మల్ని నేను ప్రేమించగలను'.

తలిదండ్రులతో యీ విషయం చెప్పడానికి మధు మొదట సంకోచించాడు. ఎలాగైతేనేమి చివరకు తల్లికి అన్ని విషయాలూ పూసగ్రుచ్చినట్లు చెప్పి 'కమలం పెండ్లికి యెలాగైనా ఒప్పుకుంటేగాని వీలు లే'దన్నాడు. అమ్మ ఒప్పుకుంటే నాన్న తప్పక ఒప్పుకుంటాడని ఆయనకు విశ్వాసం వుంది. మధుతల్లి కమలంలాంటి సుగుణవతి తన కోడలు కాబోతుందని మురిసిపోయింది కూడాను.

రుక్మిణియింటికి వస్తున్న మధుతల్లి ఆమెను త్రోవలో కలుసుకొని ఆమెను యింటికి తీసుకపోయి పెండ్లివిషయాలు చర్చించటంచేత ఆలస్యమైంది. మోహన్ జ్వరం ఒక పదిహేను రోజులలో నయమైంది. అరసవిల్లిలో దేవుని సాన్నిధ్యంలో కమలా, మధులకు వివాహం జరిగింది. కులంలో వెలివేయబడిన రెండు సాంప్రదాయిక కుటుంబాలు యీ వివాహంవలన కలపబడ్డాయి. రుక్మిణి ఆయింటిని విడిచిపెట్టలేదు. కమలం అత్తవారి యింట్లోవున్నా రోజుకు రెండుసార్లు రుక్మిణిదగ్గరకు వస్తుంది. ప్రయివేట్లు మామూలుగానే చెప్తోంది.

❧

ఒకనాడు కొందరు సాధులు 'భిక్షాం దేహి' అంటూ కమలం యింటికి వచ్చారు. వారిని చూడగానే కమలానికి సింహాచలం మొక్కు జ్ఞాపకం వచ్చింది. రుక్మిణితో ఆ విషయం చెప్పి, ఆ వచ్చే శనివారంనాడు రుక్మిణి, కమలం, మధు, పిల్లలూ బయలుదేరారు. కొండ యెక్కుతున్నారు.

ఒక బైరాగి సంసారసాగరంలోని పోటుపోటులను భరించలేక సన్యాసి అయ్యాడు. సంఘంలో మెసలలేక, సంఘనిందలను భరించలేక, యేడ్చి, విరక్తిచెంది, భార్యాబిడ్డలను విడువలేకవిడువలేక చివరకు కష్టంతో యింటినుంచి కదిలాడు. బైరాగి అయ్యాక తన పిల్లలు కనిపిస్తారేమో, నాన్నా నాన్నా అని తన్ను పిలుస్తారేమో అన్న ఆశతో చాలాసార్లు చీకటిలో ఆ యింటిచుట్టూ తిరిగాడు. తాను బైరాగులలో కలిసిపోయాడు. చెల్లెలి పెండ్లి చేయలేకా, సంఘంలో బ్రతకలేకాను. కలిసిపోయాక తనవారంతా జ్ఞాపకానికి వచ్చారు. యేడ్చాడు. తన్ను వేదాంతులూ, బైరాగులూ పాడుచేశారని వారిని తెగ తిట్టాడు. తనవారిని కలుసుకుందామని వుబలాటపడ్డాడు. మరల ఆ సంసారంలో ఆ సంఘంలో తలెత్తి యెలా బ్రతకటం? మరల కుటుంబాన్ని యెలా పోషించటం? కులంనుంచి వెలివేయబడిన తను తన సోదరికి యెలా పెండ్లిచేయటం? దొంగతనం చేసి డబ్బు సంపాదించి తన కుటుంబాన్ని కలుసుకుంటాను, తన పిల్లలను ముద్దులాడుతాను, తన చెల్లెలి పెండ్లి చేస్తాను అనుకొన్నాడు. కాని దొంగతనానికి ఆయన మనసు ఒప్పుకోలేదు. ఒకవేళ దొంగతనం చేసినా, డబ్బు కూడగట్టుకున్నా కమలాన్ని యే బ్రాహ్మణయువకుడు పెండ్లాడుతాడు అనే యీ నిస్పృహ ఆయనను విరాగిగా ఉంచింది. ఆయన దేవుని ప్రార్థించలేదు. తీర్థయాత్రలు సేవించలేదు. ఆజిల్లాలోనే వివిధప్రాంతాలు తిరిగాడు ఆవేదనతో. తన పిల్లలను యే ముఖంతో చూడగలనని దుఃఖించాడు. ఆశ మొలకెత్తితే ఆయన విరాగి కాడు, సంసారి కావాలని ఆయనహృదయకుహరంలో కోరిక తాండవిస్తోంది.

తనను వారు చూశారో, లేదో కాని వారిని ఆయన చూసి తల దించాడు. కాషాయ వస్త్రం కప్పుకున్నాడు. తనను దాటుకొని వారు పైకి పోతున్నారు. అదిగో, మొదటి దార దాటిపోయారు. తలెత్తాడు. తన కండ్లతో తన చెల్లీ, ఆ చెల్లి ప్రక్కనే నడుస్తున్న ఒక యువకుడూ ఒకరివేపు ఒకరు చూసి నవ్వుకోవటం చూశాడు. అవును. ఆ నవ్వులో వలపు వుట్టిపడుతోంది. నా చెల్లెలికి పెళ్లయిందా? సందేహం లేదు. నాచెల్లెలి భర్తే. అదిగో నా రుక్కు—నా అర్ధాంగి—నుదుట కుంకమరేఖ తళతళ మెరుస్తోంది. 'రుక్కూ! నీవు దేవతవే!' అదిగో నా మోహనుడు. వాడిని యీ హస్తాలతో యెత్తుకొని ఒక్క క్షణం విడిచిపెట్టేవాడిని కాదే. నా కూతురు సరళ—నా కొడుకు రామం. నా చిన్నారి చిట్టిబాబు ఆనందుడు. వారంతా నావారు. నా పిల్లలు నన్ను 'నాన్నా' అని పిలవరే? నా చెల్లి నన్ను అన్నయ్యా అని పిలవదే? నా రుక్కు నవ్వుతూ......నా కెందుకీ సన్యాసం? పిలుస్తాను. నా పిల్లలను యెత్తుకొని ముద్దులాడతాను. ఇదిగో నా పెదిమలు తొందర పడుతున్నాయి. నా కంఠంలో మాటలు దొర్లుకుపోతున్నాయి. నా కళ్ల వెంబడి ఆనంద బాష్పాలు రాలిపోతున్నాయి. పిలుస్తాను. ...అయ్యో! చాలా దూరం వెళ్ళిపోయారు.

నేను పిచ్చివాణ్ణి. యీ సంసారం అంతా ఒక బొంతకుట్టు. దారం తెగిపోతుంటే రుక్కు క్రొత్త దారంతో ధైర్యంగా కుట్టోంది. నా రుక్కు మోములో పూర్వపు కళాకాంతులు లేవే? ఔను, యెలా వుంటాయి? నాలాంటి భర్తను కట్టుకొని గొప్పగా సుఖించింది!'

లేచాడు. రెండు అడుగులు ముందుకు వేశాడు; మరల వెనుకకు. 'నాకు గుండె వుంది. అందుచేత డబ్ డబ్‌మని కొట్టుకొంటోంది! అరకటమే కాని కార్యశూరత్వం లేదు. రుక్మిణిగుండె శాంతంగా...యెంత ధైర్యంగా...అవును. శాంతం, సహనం, ప్రేమలతో యెంతటి క్లిష్టకార్యాన్నైనా పరిష్కరించవచ్చు. మన బాపూజీ చెప్పింది యిదే—నాన్న చెప్పిందీ యిదే! భిన్న మార్గాన్ని త్రొక్కి నేను నా భార్యాబిడ్డలకు దూరమయ్యాను. నా రుక్కు ఆ మార్గాన్ని తొక్కి జయం పొందింది. ఆమె దేవతా స్వరూపిణి. ఆమెను పూజించాలి.'

కూర్చున్నాడు. తన తెలివితక్కువకు యేడ్చుకున్నాడు. తన భార్యతో 'నేను నీ భర్త'నని యే ముఖంతో చెప్పగలుగుతాడు? తన పిల్లలు తన వేషాన్ని చూసి తనదరి చేరుతారా? తన చెల్లి తన్ను క్షమిస్తుందా? పశ్చాత్తాపంతో క్రుంగిపోయాడు.

యెండ చల్లారింది. తన కొడుకు మోహన్ మారిపోయాడు. జొత్తు దేవునికి అప్పగించాడు. మెట్లు దిగుతున్నారు—తన పిల్లలూ, తన భార్యా, తన చెల్లీ, చెల్లిభర్తా. పిల్లలను యెంత శుభ్రంగా వుంచింది! తను వస్త్రాన్ని కప్పుకొని తల దించాడు.

అదిగో తన భార్యపాదాలు. పాదాలపై పడి మొక్కుదామనుకున్నాడు. భిక్షు—చేరెడు బియ్యం తన యెదుట పోస్తోంది. జలజల బియ్యం ఆమె చేతిలోనుంచి రాలుతుంటే ఆయనకళ్ల వెంబడి కన్నీరు బొటబొటా కారుతోంది. సిగ్గు, పశ్చాత్తాపం, ఆవేదనా ఆయనను నమిలి మ్రింగివేస్తున్నాయి.

పాదాలు మాయమైపోయాయి. తలెత్తాడు. యింకా తన చెల్లి వెనుకనే వుంది. ఆ యువకుడు ఆమెను పిలుస్తున్నాడు. 'అమ్మా! కమలం!' గట్టిగా పిలిచాననుకున్నాడు. కాని ఆ మాటలు ఆయన గుండెలలోనే ప్రతిధ్వనించాయి. వెనుకబడిన కమలం తన యెదురుగానే వుంది. యెవరో తన్ను పిలిచారని చుట్టూ చూసింది. వెక్కి వెక్కి తల దించి యేడుస్తున్న బైరాగిని చూసింది.

'యేం బాబూ! యీ పవిత్రస్థలంలో యేడుస్తున్నారు?'

'..................'

'తలదించి యేడవకండి. తప్పు. తమ పేరు?'

ఆయన మాట్లాడలేదు. గాలి వీచింది. కప్పుకున్న కాషాయవస్త్రం యెగిరింది. 'యీ శరీరచ్ఛాయ—యీ యేడుపు—అదిగో మెడుకుమీది మచ్చ—యెవరు? అన్నయ్యా! సంశయం లేదు. అన్నయ్యను బసకు తీసుకుపోయి ఆయనకాళ్లమీద పడాలి. యిక్కడ గోల చేస్తే లాభం లేదు...' కమలం మనసులో ఆలోచనలు పరుగెత్తాయి.

'బాబూ! ఒక్కసారి మావూరు దయచేయండి. మీ పాదపూజ చేసుకుంటాం...'

'..................'

'రండి బాబూ, రండి...యేడవకండి. దేవుని నమ్మినవారికి నాశనం లేదు.' అంటూ కమలం తనయెదురుగా నున్న భిక్షుకై పరచిన వస్త్రాన్ని చుట్టి ఆయనచేయి పట్టుకొని లేవనెత్తింది. తనవేపు తిరిగి వస్తున్న మధు వింతగా చూస్తున్నాడు. వూరుకోమని రుక్మిణికీ, మధుకూ సైగచేసింది. రెండు నిమిషాలలో మెట్లు దిగారు. ఆయన తల దించేవున్నాడు. గజగజ వణికిపోతున్నాడు.

వారు సామానులుంచిన ధర్మసత్రపు గది చేరుకున్నారు. ఆయన మాట్లాడలేదు. తల దించేవున్నాడు. గాఢమైన నిట్టూర్పులు విడుస్తున్నాడు.

'యీవిడ మా వదిన. యీయన నా భర్త. యీ పిల్లలు మా అన్నయ్య బిడ్డలు. మా అన్నయ్య నా పెండ్లికై పరితపించి బైరాగులలో కలిసిపోయారు. నా కిప్పుడు పెండ్లయింది. నేను ప్రయివేట్లు చెప్పి డబ్బు తెస్తున్నా. పిల్లలూ, వదినా, నేనూ అంతా సుఖంగా కాలం గడుపుతున్నాం. మా వదిన మా అన్నయ్య సాధించలేని కార్యాలను ధైర్యంతో ధర్మంగా సాధించగలిగింది. మా కున్న విచారం ఒక్కటే—మా అన్నయ్య మాలో చేరలేదని. మా అన్నయ్యకోసమే నేం బ్రతికున్నాం. మా అన్నయ్యను పూజించాలనే నేం బ్రతికున్నాం.—మా అన్నయ్య మా యింట్లో వుంటే చాలు. మా యిల్లు వెలుగుతుంది......' అని కమలం మాటలతో ఆయనమనస్సు మార్చుదామని యింకా ప్రయత్నిస్తోంది. రుక్మిణి యింకెంతసేపూ ఆగలేకపోయింది. కమలం మాట వినలేదు. ఆయనపాదాలపై వాలిపోయింది కన్నీటితో. ఆమెను చూచి పిల్లలు అమ్మపై వాలిపోయారు. కమలం 'అన్నయ్యా' అంటూ ఆయనకాళ్లపై పడింది.


ఆయన రాల్చిన కన్నీటిబొట్లు వారందరిపైనా పడ్డాయి. వారి కన్నీటితో కలిశాయి. 'నా రక్తంలో రక్తం—నా పిల్లలు. నాలో అర్ధభాగం—కాని భిన్నహృదయం. కష్టాలను యెదుర్కొంది నా రుక్కు. నా చెల్లి నా పిల్లలను పోషించింది.' ఆయన గోల పెట్టాడు. పిల్లలను యెత్తుకొని యేడ్చాడు. భార్యనూ, కమలాన్నీ లేవనెత్తాడు. రుక్మిణిని క్షమించమని వేడుకున్నాడు. కారే కన్నీటిని ఆమె తుడిచింది. అనుగ్రహించమని ఆయనను వేడుకుంది.

కాషాయవస్త్రాలు మాయమయ్యాయి. ఆయన కమలానందస్వామి కాడు—కిష్టయ్య. లోకం యిప్పుడు ఆయన నేమన్నా ఖాతరు లేదు. తనకు కావలసింది-తన భార్యాపిల్లలు, తన చెల్లి బాగు, తన ఆనందం!


CP. 189

ప్రపంచంలో నాణ్యతకు మొదటి తరగతి

తాజ్ మహల్ బీడీలు



చాలకాలం నుంచీ అద్వితీయగా ప్రసిద్ధిపొందినవి,

—: వ్యాపార వివరములకు :—


మెస్సర్సు. సయ్యద్ ఖాదర్, తాజ్ మహల్ బీడీఫ్యాక్టరీ,

వాషర్ మన్ పేట, మదరాసు 21.

మా ఖాతాదార్లకు, అభిమానులకు ఉగాది శుభసమయమున

మా అభినందనలు

నవీనమైన ఉత్తమతరగతి గడియారములు




చేతి గడియారములు : *వెస్టెండ్ & ఫేవర్ లూబా రు. 130 మొదలు రు 150 వరకు ఖరీదులలో కలవు

ఇతర రకములు : *ఫ్రూస్ట్ రోల్డుగోల్డు 7¾ క్వాల్సు, 15 రాళ్ళుకలది 10 సం॥ల గ్యారంటీ ఇవ్వబడినది. పురుషులకు రు. 75/-లు *రోల్డుగోల్డు, స్టీల్ బాక్, 1¼ క్రాం గ్యూర్ అప్టిక్ గ్లాసుతో, 15 రాళ్ళుకలది, 10 సం॥ గ్యారంటీ ఇవ్వబడినది రు. 85/-లు *గోల్డుఫీల్డు క్రోంబాక్ 6¼&7¾ క్వాల్సు 5 సం॥ల గ్యారంటీ ఇవ్వబడినది రు. 55/-లు.

అమెరికా ఇంగర్సాల్; అలారం టైంపీసు : రు. 23/-లు * ఇంగ్లీషు వరల్డు స్టాండర్డు స్మిత్ అలారం టైంపీసు రు 20/-లు. ప్యాకింగు, పోస్టేజి రు 2/-లు అదనము.

గోడ గడియారములు ; వరల్డు స్టాండర్డు 12 అంగుళ గుండ్రటి, గంటలు కొట్టని ఇంగ్లీషు స్మిత్ రు 95/-లు. గంటలు కొట్టెడిది రు. 110/- పోస్టేజి, ప్యాకింగు రు 5/-లు అదనము. ఆర్డర్లన్నియు 25% అడ్వాన్సుతో పంపవలెను. గడియారముల మరమ్మత్తు మా ప్రత్యేకత.



రిజ్వాన్ అండ్ బ్రదర్సు,

ప్రొప్రయిటరు :
ఫజులుల్లా

217, చైనా బజార్, జి. టి. మద్రాసు.

రాష్ట్రసంపాదన-నిర్మాణము

(ఒక ఆంధ్రుడు)

సర్వధారి ఎలా ఉంటుందోగాని సర్వజిత్తుమాత్రం మనకు ఏమీ అనుకూలంగా లేదు. అనుకూలంగా లేకపోవడమే గాదు, మనకు అన్నివిధాలా అనిష్టంగానే ఉండిపోయింది. ఉగాదినాడు ఆంధ్రుడు ప్రధానిగా ఉన్న రాష్ట్రమంత్రివర్గం పోయి తమిళుల మంత్రివర్గం వచ్చింది. సంవత్సరాదినాడు ఏమిజరుగుతుందో ఇంక ఆసంవత్సరమంతా అలాగే జరుగుతుం దంటారు. పోయిన సంవత్సరమంతా మనకు అలాగే ఉంది. వచ్చిం దనుకున్న రాష్ట్రం ఏమైనదో, ఏమవుతుందో తెలియకుండా పోయింది. "ఈ ఆంధ్రులకు 'రాష్ట్రం రాష్ట్రం' అని కేకలు వేయడంతప్ప మరొక పనిలేదా ఏమిటి?" అని భారతఅధినివేశప్రధానామాత్యులైన పండిత జవహర్‌లాల్ నెహ్రూ విశాఖపట్నంలో మందలించివెళ్లారు. సర్వజిత్తు పోతూపోతూ మరొకసారి తన శక్తిని ఆంధ్రులకు జ్ఞాపకం చేసింది. ఆంధ్రనాయకుడు రాష్ట్రనాయకత్వానికి పోటీచేయగా, ఆంధ్రుల బలంతో అరవనాయకుడు ఎన్నికఅయినాడు. గతసంవత్సరం ఆద్యంతాలు రెండూకూడా ఆంధ్రులకు చాలా అననుకూలముగానే ఉన్నవి. "ఆంధ్రజాతిజాతకమే పట్టి నష్టజాతకమా" అనే అనుమానం కలిగింది. రానురాను "అసలు మనం ఎవరు? ఆంధ్రులమా, అంధ్రులమా?" అన్న మీమాంసకూడా బయల్దేరింది. ఇంతవరకూ మనం ఎవరమో తెలుసుకోక, మన సంగతి ఏమిట్లో గ్రహించుకోక "ఇది కావాలి, అది కావాలి" అని ఆందోళన చేస్తూ వచ్చామా? కావచ్చు. అందుకే భారత ప్రధానామాత్యుని మందలింపులకు ఆంధ్రనాయకులు కిక్కురుమనలేదు. వేదాంతులు బోధించినట్లు మన సంగతి మనం తెలుసుకోవడమే జీవితలక్ష్యం! అది గ్రహిస్తే మనం ముక్తి పొందినట్లే!

ఈనాడు మన రాష్ట్రరాజకీయాలు గమనిస్తే, మన నాయకుల నడవడి పరిశీలిస్తే "ఆంధ్రులకు ఇంతలో మోక్షం లేదు." అని స్పష్టంగా తేలిపోతుంది. పేరుకుమాత్రం మనకు నలుగు రైదుగురు నాయకు లున్నారు—అంటే నామమాత్రపు నాయకు లని గాదు; ఎవరైనా అడిగితే చెప్పుకోడానికి. వీరిలో ఏ ఇద్దరూ ఒక మార్గాన్ని అనుసరించడం లేదు. అందరికీ రాష్ట్రవాంఛ గాఢంగానే ఉంది. ఆంధ్రప్రజానీకంకూడా బాగా చైతన్యం కలిగే ఉంది. సామాన్య ప్రజలుకూడా రాష్ట్రం కావా లనే అంటున్నారు. ఆరంభదశలో వలె ప్రత్యేకరాష్ట్రవాంఛ ఉన్నతోద్యోగాలూ, అధికార పదవుల కొరకు పరితపించే ఏ కొద్దిమందో జరిపిన ఆందోళన కాదు ఈనాడు. నాయకులుమాత్రం వెనుకటి స్థితిలోనే ఉన్నారు. వీరికి రాష్ట్రం కావాలి. కాని వీరు రాష్ట్రసంపాదనపై దృష్టిని కేంద్రీకరింపక, రాష్ట్రం వచ్చిన తరువాత తమ సంగతి ఏమిటి అనే విషయంమీదనే తమ దృష్టిని కేంద్రీకరిస్తున్నారు. వీరందరికీ ప్రత్యేకరాష్ట్రంకాక రాష్ట్రంలోని ఉన్నతపదవులే లక్ష్యాలు. ఈ విధముగా లక్ష్యాలు వేరైనందువల్ల లక్ష్యసిద్ధికి వారు అనుసరించు మార్గాలూ వేరుగా ఉంటూ నాయకులలో ఐకమత్యం అనేది లేకుండా పోయింది. తాత్కాలిక ప్రయోజనాలకొరకు కొందరు నాయకులు కలిసి ఉండవచ్చు. అయితే అది ఐక్యము కాదు. నలుగురు నాయకులు కలిసి పనిచేయలేనప్పుడు దాదాపు నాలుగు కోట్లుగా ఉన్న ఆంధ్రులు ఏకం కావడం సాధ్యమా? మనకు రాష్ట్రం రావడం సంభవమా?

రాష్ట్రసంపాదనకు మనం ఆంధ్రోద్యమం ప్రారంభించి నలభై సంవత్సరాలు కావచ్చినది. అప్పటికీ, ఇప్పటికీ మన స్థితి ఒకేవిధంగా ఉన్నది. కొంతకాలం రాష్ట్రం కావాలని ఆందోళన చేశాము. ఇప్పుడు రాష్ట్రం రాలేదని ఆందోళన చెందుతున్నాం. అంతకుమించి ఈ మూడుపుష్కరాల్లో కలిగిన పరిణామం ఏమీ లేదు. మన సంస్కృతి నిజంగా మంటగలిసిపోయింది. మన చరిత్ర మట్టిపాలయింది. మనసంప్రదాయం ఏమిట్లో ఎరుగని స్థితికి వచ్చాము. ఆంధ్రసంస్కృతిని, ఆంధ్రసంప్రదాయమును పునరుద్ధరించుటకు, పునరుజ్జీవింపజేయుటకు ఏ ఆంధ్రసంస్థా పనిచేయుటలేదు. "త్యాగబ్రహ్మ తెనుగువాడు. తంజావూరును తెనుగునాయకులు ఏలినారు. పాశ్చాత్య భాషలలో ఇటాలియన్ భాష ఎలాంటిదో ప్రాచ్యభాషలలో తెనుగుభాష అట్టిది. భారతీయులలో ఖండాంతరముల వ్యాపారమును సాగించినవారు ఆంధ్రులు. తురుష్కుల విధ్వంసకలాపము

నుండి భారతీయసంస్కృతిని సంరక్షించినవారు దాక్షిణాత్యులు. తల్లి రాజ్యంనుండి వెడలివేస్తే శ్రీరామునికి ఆశ్రయ మిచ్చినవి ఆంధ్ర అరణ్యములు. అజంతా, ఎల్లోరా, అమరావతీశిల్పచాతుర్యము ఆంధ్ర యశస్సును జగద్విఖ్యాతము చేసినది." ఆంధ్రత్వము పై కుబికినప్పుడు ఈవిధముగా కవితాగానము చేయుటకు అలవాటుపడితిమేగాని, ఆనాటి ప్రాభవమును పునరార్జించుటకు ఇప్పటికి ఎట్టి ప్రయత్నములూ చేయుటలేదు.

రాష్ట్రం రావచ్చును; రాకపోవచ్చును. కాని జరుగవలసినది ఆంధ్రసంస్కృతి, ఆంధ్రసంప్రదాయముల పునరుద్ధరణ. ప్రత్యేక రాష్ట్రముకూడా ఈ కార్యక్రమనిర్వహణ కొక సాధనే. అందుకే మనము రాష్ట్రము కావాలని ఆందోళన చేశాము; రాలేదని ఆందోళన చెందుతున్నాము. మన నాయకులు గవర్నరులు కావలెనని, మన ఉపనాయకులు మంత్రులు కావాలని, మన 'వినాయకులు' దండధరులు కావాలనీ మనం రాష్ట్రం కావాలనడం లేదు. ధనికవర్గాలప్రతినిధి మన రాబోవు రాష్ట్రపారిశ్రామికాభివృద్ధికి పథకాలు తయారుచేయవలసి వస్తే, నిన్నమొన్నటివరకు కాంగ్రెసుకు ప్రతికూలపక్షంలో ఉండి జాతీయశక్తుల నణచివేయడానికి పనిచేసినవారి నాడు 'గాంధీజాతీయస్మారకనిధి' నిర్వాహకులు కావలసిన దుస్థితి ఏర్పడితే, మనకు రాష్ట్రం వచ్చిమాత్రం ప్రయోజన మేమి? అగ్ర నాయకులు తమ ఆశ్రితులకు పదవులూ, అధికారం పంపకం చేసుకొనుటకు కాదుగదా నలభై సంవత్సరములూ మనం ఆంధ్రోద్యమాన్ని నిర్వహించినది! మన నాయకులకు చిత్తశుద్ధి, లక్ష్యశుద్ధి ఏర్పడినగాని, మనకు రాష్ట్రం వచ్చి ప్రయోజనం లేదు. మన నాయకులు రాష్ట్రంకొరకు ఒకే విధానమును అనుసరించి పనిచేసినగాని మనకు రాష్ట్రం రానూరాదు. పరిస్థితులు ఇదేవిధంగా ఉండే పక్షంలో రాష్ట్రం రాకపోవడమే మంచిది! రాష్ట్రం రాకపోవచ్చునుకూడా!

అయితే అసలు రాష్ట్రం రాగల ఆశ, అవకాశం ఏమైనా ఉన్నవా? రాష్ట్రం వచ్చినట్లే అని మన పెద్దలు ప్రజలను ఊరడిస్తున్నారు. "ఆంధ్రరాష్ట్రంగురించి వేరే ఆలోచనే అనవసరం. నూత్న రాజ్యాంగాన్ని రాజ్యాంగపరిషత్తు ఆమోదించినవెంటనే రాష్ట్రనిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటాం" అని ఆదినివేశప్రధానామాత్యుడు హామీ ఇచ్చారు. అసలు రాష్ట్రముల జాబితాలో 'ఆంధ్ర'ను కూడా చేర్పవలసినదిగా వీరు రాజ్యాంగరచనాసంఘాన్ని ముందు ఆదేశించారు. ఆఖరు క్షణంలో తొలగించమని కూడా వీరే ఆదేశించారు. చేర్పడం, తీసివేయడంకూడా జరిగినవి. అయితే అందుకు ఇతరభాషాప్రాంతాల ఆందోళనే కారణం అనీ, ఇప్పటికైనా సరే ఆంధ్రులు సరిహద్దుల విషయంలో ఇరుగుపొరుగువారితో ఒక సమాధానానికి వచ్చి, తమ రాష్ట్రం అన్నివిధాలా సమగ్రంగానూ, స్వయంపోషకంగానూ, స్వయంసమృద్ధంగానూ ఉంటుందని రాజ్యాంగపరిషత్తు అధ్యక్షునకూ, సభ్యులకూ, అధినివేశప్రభుత్వమునకూ ఒక విజ్ఞాపనము సమర్పిస్తే, ఆంధ్రులకు ఈ క్షణం ప్రత్యేకరాష్ట్రం లభిస్తుందని రాజ్యాంగరచనాసంఘ అధ్యక్షుడు, అధినివేశప్రభుత్వన్యాయశాస్త్రశాఖామాత్యుడు డాక్టరు భీమారావు, అంబేద్కర్‌గారు ఆంధ్రపత్రిక బొంబయివిలేఖరిద్వారా ఇప్పటికి రెండు దఫాలు స్పష్టంగా ప్రకటించారు. ఆంధ్రరాష్ట్రసంపాదనే ఏకైకలక్ష్యంగా కల ఆంధ్రమహాసభగాని, ఆంధ్రరాష్ట్రకాంగ్రెసు సంఘంగాని ఇప్పటివరకూ విషయసేకరణకు, ఇలాంటి నివేదికను తయారుచేయించుటకు ఎట్టి ప్రయత్నమూ చేసియుండలేదు. ఆంధ్ర మహాసభ న్యూఢిల్లీ కార్యాలయం స్థాపించింది. ఒక సరిహద్దువిషయసేకరణసంఘాన్ని స్థాపించింది. ఇంక రాష్ట్రకాంగ్రెసు రెండు సరిహద్దుసంఘాలను స్థాపించినది. డాక్టరు మారేమండ రామారావుగారిచే 'ఆంధ్రరాష్ట్రవాదం' అని రాజ్యాంగపరిషత్సభ్యులకు ఒక విజ్ఞాపనను వ్రాయించి ప్రచురించినది. ఈ పాతిక పేజీల విజ్ఞాపనమూ అసంపూర్తిగ నున్నది. ఆంధ్రరాష్ట్రము స్వయం సమృద్ధముగ నుండగల దని సహేతుకముగ నిరూపింపలేదు. ఆంధ్రరాష్ట్రనిర్మాణము సుసాధ్యమని ఋజువు చేయలేదు. లోగడ శ్రీ వేమవరపు రామదాసుపంతులుగారు ఒక సమగ్రమైన మెమోరాండమును తయారుచేసిరి. చెన్నరాష్ట్ర ౧౯౩౭-౩౮ ఆయవ్యయఅంచనాల నాధారముగా తీసుకొని ఆంధ్రప్రాంతముల ఆర్థికస్థితి సంతృప్తికరముగా నుండగల దని నిరూపించిరి. కాని ఈ పదిసంవత్సరములలో పరిస్థితులు పూర్తిగ మార్పుచెందినవి. కనుక తిరిగి అవే పద్ధతులపై వేరొక మెమోరాండమును తయారుచేయుట అవసరమైనది. ౧౯౩౭ వ సంవత్సరములో ఆంధ్రమహాసభస్థాయిసంఘముకూడా ఒక నివేదికను తయారుచేసియుండెను. వీటి నన్నింటిని అనుసరించి ఆంధ్రమహాసభగాని, ఆంధ్రరాష్ట్రకాంగ్రెసుసంఘముగాని వెంటనే ఒక సమగ్రనివేదికను తయారుచేయించవలెను.

అప్పటికైనా ఆంధ్రరాష్ట్రం రాగల దనే నమ్మకము ఏమున్నదని ప్రశ్నించవచ్చును. ఆంధ్రోద్యమచరిత్రను ఒక్కసారి పరిశీలిస్తే ఎవరికైనా ఇలాంటి అనుమానం కలగడం సహజమే ననిపిస్తుంది. ౧౯౧౭ వ సంవత్సరములో ఎడ్విన్ మాంటేగోకు ఆంధ్రులు తమ రాష్ట్రంగురించి ఒక విజ్ఞాపన సమర్పింపగా ఆంధ్రుల రాష్ట్రవాంఛ సబబైనదే ననీ, భాషారాష్ట్రనిర్మాణము జరుగవలసినదేననీ ఆయన అంగీకరించారు. భారతరాజ్యాంగరచనాసంఘముకూడా ఇదే అభిప్రాయమును వెల్లడించెను. తదనుగుణముగా నూత్నరాష్ట్రముల నిర్మాణమునకు దోహదము చేయుటకు ౧౯౧౯ భారతరాజ్యాంగ శాసనములో ౫౨-ఎ సెక్షను ఏర్పరచిరి. నూత్న రాష్ట్ర నిర్మాణముతో సంబంధము గల రాష్ట్రశాసనసభల సమ్మతిని పొంది భారతీయ గవర్నరు జనరల్ ఇండియాకార్యదర్శి ఆమోదముతో నూత్న రాష్ట్రములను ఏర్పాటుచేయవచ్చునని ఈ సెక్షన్ సూచించెను. అయితే ఈ సెక్షన్ ప్రకారము నూత్నరాష్ట్రములు ఏర్పాటు కాలేదు.

తిరువాత సైమన్ కమీషన్ వచ్చినది. రౌండ్ టేబిల్ సభలు జరిగినవి. జాయింటు పార్లమెంటరీ కమిటీ సమావేశములు జరిగినవి. ఆంధ్రులు ప్రత్యేకముగా లండనుకు ఒక రాయబారవర్గమునుకూడ పంపిరి. రౌండ్ టేబిల్ సభకు హాజరైన బొబ్బిలి రాజాగారు ఆంధ్ర రాష్ట్రమునుగురించి ఒక నివేదికను సమర్పించిరి. గాంధీమహాత్ముడు లండన్ వెళ్లనున్న సమయములో అఖిలభారత కాంగ్రెసుసంఘము సందలి ఆంధ్రసభ్యులు మహాత్మునకు ఒక విజ్ఞాపనము సమర్పించి, తమ రాష్ట్రనిర్మాణమునకు తోడ్పడవలసినదిగా కోరియుండిరి. గాంధీజీ అందుకు అంగీకరించెను. కాని రౌండ్ టేబిల్ సభలో గాంధీజీ ఏమియు సాధింపజాలక రిక్తహస్తములతో భారతదేశము తిరిగి రావలసి వచ్చెను.

అయినప్పటికీ ౧౯౩౫ వ సంవత్సరపు భారతరాజ్యాంగశాసనంలో సింధు, ఒరిస్సా రాష్ట్రములను ఏర్పాటుచేస్తూ ఇతరరాష్ట్రముల నిర్మాణమునకు ౨౯౦ సెక్షనును చేర్చెను. కాని ఈ రాజ్యాంగము ప్రకారముకూడ ఆంధ్రరాష్ట్రనిర్మాణము జరుగలేదు. చెన్నరాష్ట్రశాసనసభలు ఇప్పటికి నాలుగుదఫాలు రాజధానిని భాషాప్రయుక్తరాష్ట్రములుగా విభజింపవలసిన ఆవశ్యకతను తెలుపుచు తీర్మానములు చేసియుండెను. ౧౯౩౮ వ సంవత్సరములో, కాంగ్రెసు మంత్రివర్గ మేర్పడిన తరువాత, ఆంధ్రరాష్ట్రమునుగురించి శాసనసభలు తీర్మానముచేయుటయు, మంత్రివర్గ మాప్రకారము ఆంధ్రరాష్ట్రనిర్మాణము జరుగవలసినదేనని భారత కార్యదర్శికి సిఫార్సుచేయుటయు జరిగినది. ఆసమయమున భారతకార్యదర్శితో సంప్రదించుటకు ఆంధ్రమహాసభ తరఫున కొంత ప్రయత్నము జరిగెను. భారత కార్యదర్శికి సలహాదారుగా వెళ్లిన కీ. శే. ఈడ్పుగంటి రాఘవేంద్రరావుగారీ విషయమై కొంత కృషిచేసినట్లును, కాని లోగడ చెన్నరాష్ట్రమంత్రివర్గము చేసిన సిఫార్సు మెతకగ నున్న దని అకారణముగ రాష్ట్రనిర్మాణము దుస్సాధ్య మైనట్లును కొంత ప్రచారము జరిగినది. ఆఖరు క్షణములో ఒక దుష్టశక్తి అడ్డుపడినదని ౧౯౪౦ వ సంవత్సరమున విశాఖపట్నములో జరిగిన ఆంధ్రమహాసభ సమావేశమున కొందరు నాయకులు ప్రకటించిరి. వారు రాష్ట్రఅధిపతి యైనతరువాత రాష్ట్రనిర్మాణమునకు కాదుగదా, ఆంధ్రప్రాంతముల అభివృద్ధికైనను ఏమియు జరుగలేదు. కొంద రాంధ్రులకు లాభించియుండవచ్చును కాని మొత్తముగ ఆంధ్రజిల్లాలకు కలిగిన విశేషప్రయోజనమేమియు లేదు.

అతఃపూర్వము ఆంధ్రజిల్లాలకు బడ్జట్టును వేరుచేయవలె నని ఆందోళన జరిగెను. ఆ పనికూడ జరిగియుండలేదు. ఆదినుండియు ఆంధ్రనాయకుల రాష్ట్రసంపాదనాదీక్ష, స్వజాతిఅభిమానమూ ఇట్లే ఉంటూవచ్చెను. అధికారసంపాదనప్రయత్నముల ప్పుడు ఆంధ్రైక్యత, ఆంధ్రరాష్ట్రం ప్రధానాంశములుగా ఉండి అప్పటి లక్ష్యములు సిద్ధింపగనే ఇవి అప్రధానము లగుచున్నవి. ఇటీవల రాష్ట్రనాయకత్వమునకు జరిగిన ఎన్నికల సందర్భమునకూడ మన నాయకుల ధోరణి ఇదేవిధముగ నుండెను. ఎన్నికలపూర్వము ఆంధ్రైక్యత, సరిహద్దులసమస్యను సమాధానమార్గమున పరిష్కరించుకొనుట అత్యంతముఖ్యవిషయము లయ్యెను. అనంతరము రాష్ట్రసంపాదన ప్రధానాంశ మయ్యెను. ఏదైనను విషయముల సంకోచమైనటువలెనే ఉంటున్నది.

గత సంవత్సరము జూనుమాసమున భారతదేశమునకు అధినివేశప్రతిపత్తిని ప్రసాదించుచు నూత్నస్థాయికి తగినట్లుగా ౧౯౩౫ రాజ్యాంగమును సవరించిరి. ఈ సవరణలో ౨౯౦ వ సెక్షన్ రద్దగునేమో అని ఆంధ్రనాయకులు భయపడిరి. కాని ఆ సెక్షన్ రాజ్యాంగమునుండి రద్దుకాకున్నను ఆ రాజ్యాంగమును అనుసరించి ప్రత్యేకాంధ్రరాష్ట్రమేర్పడు అవకాశముమాత్రము లేకుండెను. నూత్నరాజ్యాంగపరిషత్తు ఆమోదించుటతో ౧౯౩౫ రాజ్యాంగము రద్దయిపోవును. కనుక నూత్నరాష్ట్రనిర్మాణ మింక స్వతంత్రభారత రాజ్యాంగమును అనుసరించియే జరుగవలసియుండును. రాజ్యాంగరచనాసంఘాధ్యక్షుడు పరిషత్తుఅధ్యక్షునకు వ్రాసిన లేఖలో ఈ విషయమునే స్పష్టము చేసెను. నూత్నరాజ్యాంగము అమలులోనికి వచ్చుటతో సమగ్రాంధ్రరాష్ట్ర మేర్పడి వ్యవహారము జరుగవలె నన్న ఇప్పటి రాజ్యాంగము ననుసరించియే ఆంధ్రరాష్ట్రనిర్మాణము జరుగవలసియున్న దనికూడ రాజ్యాంగరచనాసంఘమువారు స్పష్టము చేసిరి. అధినివేశప్రభుత్వఅభిమతముపై అంతయు ఆధారపడియున్నది.

గతసంవత్సరము అధినివేశశాసనసభలో భారతప్రధానామాత్యుడు భాషారాష్ట్రసమస్యనుగురించీ, ఆంధ్రరాష్ట్రనిర్మాణమునుగురించీ చేసిన ప్రకటనవల్లను, గత మార్చి ౧౮ వ తేదీన విశాఖపట్నములో చేసిన ప్రకటనవల్లను అధినివేశప్రభుత్వఅభిమతమంతగా వ్యక్తము కాకపోయినా, వైఖరి కొంతవరకు స్పష్టమైనది. నూత్నరాజ్యాంగమున రాష్ట్రముల జాబితాలో 'ఆంధ్ర'నుకూడా పేర్కొనడం జరుగుతుందనీ, 'పరిషత్తు రాజ్యాంగమును అంగీకరించుట జరిగినవెంటనే ఆ నిర్ణయమును అమలుపరచుటకు ప్రభుత్వము చర్య తీసుకొను' ననీ పండిత నెహ్రూ ప్రకటించెను. ౧౯౩౫ భారత రాజ్యాంగమున సింధు, ఒరిస్సారాష్ట్రములను ముందు పేర్కొని, అనంతరం రాష్ట్రాలను ఏర్పాటు చేసినట్లే ఆంధ్రరాష్ట్రనిర్మాణము జరుగగల దని ఆ సందర్భమున పండిట్ నెహ్రూ సూచించెను. దానిని బట్టి కొందరు ౧౯౩౫ రాజ్యాంగమునందలి ౨౯౦ సెక్షను ప్రకారమే, నూత్నరాజ్యాంగముతో నిమిత్తము లేకనే జరుగు నని ఆశించిరి. అట్లయిన నూత్నరాజ్యాంగరచనకు, రాష్ట్రనిర్మాణమునకు ఎట్టి సంబంధమూ ఉండనవసరములేదు. ౨౯౦ వ సెక్షనును అనుసరించి రాష్ట్రనిర్మాణం జరిగిన రాజ్యాంగరచనాసంఘం ఇతరరాష్ట్రములతో బాటు ఆంధ్రనుకూడా మొదటి షెడ్యూలు మొదటి భాగమున చేర్చియుండును. అట్లుగాక ౧౯౩౫ రాజ్యాంగమును అనుసరించి

సింధు, ఒరిస్సాలు ఏర్పడినట్లే ఆంధ్రరాష్ట్రము ఏర్పాటగునని పండిట్ నెహ్రూ అభిప్రాయపడెడుంటే, నూత్న రాజ్యాంగమును అనుసరించి ఆంధ్రరాష్ట్రనిర్మాణము జరుగవలసియుండును. స్వతంత్ర భారతరాజ్యాంగమును అనుసరించి నూత్న రాష్ట్రముల నిర్మాణమునకు వేరొక మార్గం ఉన్నది. రాజ్యాంగరచనాసంఘఅధ్యక్షుడు పరిషత్తుఅధ్యక్షునకుకూడా ఈ విషయమును వివరించియుండెను. ఏమైనా నూత్న రాజ్యాంగమందలి రాష్ట్రముల జాబితాలో 'ఆంధ్ర' ప్రత్యేకరాష్ట్రంగా పేర్కొనడం జరిగితేనే నూత్న రాజ్యాంగం అమలుజరిగేలోపుగా గాని, జరుగుటతోగాని ప్రత్యేకాంధ్రరాష్ట్రం ఏర్పడుట జరుగగలదు.

ఈ సందర్భములో సింధు, ఒరిస్సా రాష్ట్రములు ౧౯౩౫ రాజ్యాంగమును అనుసరించి ఏవిధముగా ఏర్పడినవో పరిశీలిస్తే ఆంధ్ర రాష్ట్రనిర్మాణము ఎప్పుడు, ఏవిధంగా జరుగగలదో స్పష్టంకాగలదు. ౧౯౩౫ వ సంవత్సరం నూత్న రాజ్యాంగం తయారవడానికి పూర్వమే సరిహద్దుల విచారణసంఘం, ఆర్థికతీర్పుసంఘం, నియోజకవర్గముల నిర్ణయసంఘములు ఏర్పడి, సింధు, ఒరిస్సా రాష్ట్రముల నైసర్గిక స్వరూపం, ఆస్తిపాస్తులు, నూత్న రాజ్యాంగమును అనుసరించి జరుగు శాసనసభల ఎన్నికలకు నియోజకవర్గములు నిర్ణయమైనవి. ౧౯౩౫లో నూత్నరాజ్యాంగము పూర్తి అయినది. ౧౯౩౬ ఏప్రెల్ ౧ వ తేదీన నూత్న ఒరిస్సారాష్ట్రమును ఏర్పాటుచేయుచు, ఒక గవర్నరును, మంత్రులను, శాసనసభాసభ్యులను నియమిస్తూ ఆర్డర్-ఇన్-కౌన్సిల్ జారీ అయినది. ౧౯౩౭ లో రాజ్యాంగము అమలుజరిగి ఎన్నికల కలాపము పూర్తిఅయినది. ఆ పనిని ఒరిస్సా తాత్కాలిక ప్రభుత్వమే నిర్వహించినది. ఈ విధంగా రాజ్యాంగఆమోదానికీ, అమలుకూ మధ్యనే ప్రత్యేకఒరిస్సారాష్ట్రమూ, ఒరిస్సాప్రభుత్వమూ ఏర్పడింది. అంటే ప్రత్యేకఒరిస్సారాష్ట్రనిర్మాణకలాపము యావత్తూ ౧౯౩౫ రాజ్యాంగమును అనుసరించే జరిగినది.

అదే విధముగా ప్రత్యేకాంధ్రరాష్ట్రనిర్మాణకలాపమంతయు నూత్న రాజ్యాంగమును అనుసరించే జరుగవలసియుండును. కాని రాష్ట్రముల జాబితాలో ఆంధ్రరాష్ట్రం లేనందువల్ల ప్రభుత్వం ఎప్పుడు ఏ పని చేస్తుంది అనే విషయం సందిగ్ధమైనది. అలాగాక జాబితాలో చేరిఉంటే నూత్న రాజ్యాంగం అమలుజరిగేనాటికి రాష్ట్రం ఏర్పడితీరేది. ఈలోపుగానే, నూత్నరాజ్యాంగం ఆమోదింపబడినవెంటనే కాకపోయినా, నూత్నరాజ్యాంగం అమలుజరిగే లోపున ఆంధ్రమంత్రివర్గం ఏర్పడిఉండేది. ఇంక ఇప్పుడు రాష్ట్ర నిర్మాణం ఎలా జరుగుతుందో చెప్పలేము. నూత్న రాజ్యాంగం ఈ సంవత్సరం జూను మాసములో ఆమోదింపబడుతుంది. నూతనాంధ్ర రాష్ట్రం నూత్న రాజ్యాంగం అమలుజరుగుటతో ఏర్పడా లన్న జూనులో నూత్న రాజ్యాంగం ఆమోదింపబడుటకు పూర్వమే రాష్ట్ర సరిహద్దుల నిర్ణయము, ఆస్తిపాస్తుల విభజన మున్నగు పనులు పూర్తి కావలెను. రాజ్యాంగరచనాసంఘము ఆంధ్రరాష్ట్రము విషయములో చేసిన సూచన గమనార్హము. ప్రత్యేకాంధ్రరాష్ట్రము నూత్న రాజ్యాంగారంభంనుండి వ్యవహరించాలన్న ఇప్పటి రాజ్యాంగాన్ని అనుసరించియే తత్క్షణం ప్రభుత్వం చర్యలు తీసుకొనవలసియుండు నని హెచ్చరించిరి. ఫిబ్రవరి ౨౧ వ తేదీన ముసాయిదా ప్రకటింప బడినది. ఈ హెచ్చరికను పురస్కరించుకొని అధినివేశప్రభుత్వం ఇప్పటివరకూ ఎట్టి చర్యా తీసికొనియుండలేదు. కనుక నూత్న రాజ్యాంగారంభముతో ఆంధ్రరాష్ట్రం వ్యవహరించుట సాధ్యము గాదు. అధినివేశప్రభుత్వఅభిమతముకూడా ఇందుకు అనుగుణమైనదే అని ఇప్పుడు స్పష్టమైనది. కనుక ఇక ఆంధ్రరాష్ట్ర నిర్మాణం నూత్నరాజ్యాంగాన్ని అనుసరించే జరుగవలసియున్నదని స్పష్టమగు చున్నది. అట్లైనను నూత్న రాజ్యాంగము అమలుజరుగుటకు పూర్వమే పూర్తికావలెనన్న ఇందుకు సంబంధించిన ప్రాతిపదికపనులు నూత్న రాజ్యాంగము ఆమోదింపబడుటకు పూర్వమే జరుగవలసియున్నవి.

భాషారాష్ట్రనిర్మాణావకాశములను పరిశీలించి, ఏయే రాష్ట్రముల నిర్మాణము సాధ్యమో నివేదించుటకుగాను రాజ్యాంగపరిషత్తు ఒక సంఘమును నియమించునని అధినివేశప్రధానామాత్యుడు పండిట్ జవహర్లాల్ నెహ్రూ విశాఖపట్నమునందు ప్రకటించెను. ఈవిచారణ సంఘము ఆంధ్రరాష్ట్రనిర్మాణము సాధ్యమనీ, వెంటనే జరుగవచ్చు ననీ సిఫార్సుచేసిన అప్పుడు సరిహద్దునిర్ణాయకసంఘముల నియామకము జరుగునని కూడా పండిట్ నెహ్రూ ప్రకటించెను. కనుక ఆంధ్రనాయకులు, ఆంధ్రసంఘములు ఆంధ్రరాష్ట్రవాదమును ఈసంఘముఎదుట నిరూపింపవలెను. అందుకు సమగ్రమైన, తగిన ఆధారములతో ఒక నివేదికను సమర్పించిన విచారణసంఘంపని సులభమై, వెంటనే సరిహద్దునిర్ణయసంఘమును స్థాపించుట సాధ్యమగును. అనంతరము సరిహద్దుల నిర్ణాయకసంఘముఎదుట రాష్ట్రసరిహద్దుల విషయమై ఇరుపొరుగువారితో సమాధానము కుదుర్చుకొన్న పక్షంలో రాష్ట్రనిర్మాణముకూడ జూలైలోపున పూర్తికాగలదు. ఇప్పటికి అనేక సరిహద్దుసంఘములు ఏర్పడినవి. కాని సరిహద్దుల విషయంలో ఒక్క సమస్యకూడా పరిష్కారముకాలేదు. చెన్న నగరమును ఆంధ్రులు వదులుకొన్న పక్షములో ఆంధ్రులకు ఈ క్షణము రాష్ట్రము రాగలదని పలువురు చెప్పినట్లు ఇటీవల కొన్ని వార్తలు ప్రచారమైనవి. మన సరిహద్దుసంఘముల క్రమబద్ధముగాని ప్రచారమే ఇందుకు కారణమని స్పష్టమగుచున్నది. ఏట్లొచ్చీ చెన్న నగరమే ఆంధ్రరాష్ట్రమునకు ప్రతిబంధకమైనది ఈ సమస్య నేడు గాకున్న రేపైనను రాజీమార్గముగనే పరిష్కారము కావలసియున్నది. మన నాయకుల ప్రవర్తన, ప్రసంగములు ఇందుకు దోహదము చేయవలెను. ఆంధ్ర, తమిళ, కర్నాటక, ఓఢ్ర అగ్రనాయకులు సంప్రతించుకొని సరిహద్దుల విషయమున ఒక సమాధానమునకు వచ్చుటే

అందరికిని అనుకూలమైన మార్గము. అందుకు నాయకులందరు కలిసి పనిచేయవలెను. కర్నాటకరాష్ట్రకాంగ్రెసుసంఘము సహృదయరాయబారసంఘమును నియమించెను. ఇదే విధముగ ఆంధ్రకాంగ్రెసు సంఘముకూడ ఒక రాయబారసంఘమును వెంటనే నియమింపవలెను. ఈ వివిధసంఘములు సంప్రతింపులు జరిపి జూలైనెలాఖరులోపుగా తమ ఒడంబడికను అధినివేశప్రభుత్వమునకును, రాజ్యాంగపరిషత్తునకును సమర్పించిన, నూత్నరాజ్యాంగము జూలైమాసమున ఆమోదింపబడిన వెంటనే నూత్నరాజ్యాంగమునందలి మొదటి భాగములోని 3వ సెక్షనును అనుసరించి నూత్నపార్లమెంటు ఆంధ్రరాష్ట్రమును ఏర్పాటుచేయుచు శాసనము చేయవచ్చును. ఆప్రకారము ఆంధ్ర రాష్ట్రము, ఆంధ్రప్రభుత్వము, ఆంధ్రశాసనసభ ఆగష్టునాటికి ఏర్పడ గలవు.

అయితే ఇప్పటి ఆంధ్రరాజకీయములను విచారిస్తే ఈ విధంగా ఏర్పడిన ఆంధ్రరాష్ట్రం భిన్నాభిన్నంగా ఉండగలదేగాని, నూత్నాంధ్రరాష్ట్రం సౌష్ఠవంగా ఉంటుందని అనుమానం కలుగు తున్నది. పై నాయకులు మొదలు క్రింది నాయకులవరకు ఉన్న విభే ధాలు చాలా ఆందోళనకరంగా ఉన్నవి. రాష్ట్రం ఏర్పడిన తరు వాత ఇవి ఎక్కువ అగునేగాని తగ్గగల అవకాశములు కనిపించుట లేదు. ఈ పరిస్థితులలో రాష్ట్రం రాకుండుటే మేలుకావచ్చును. ఆంధ్రరాష్ట్రం అనేకం ఇతరరాష్ట్రాలతోబాటు నిలబడుటకు ఒక దశాబ్దం నిరంతర కృషి అవసరం. అన్ని పక్షాలవారూ కలిసి పనిచేయుట అవసరం. ఆంధ్రైక్యముద్వారానే రాష్ట్రసంపాదన జర గాలి. రాష్ట్రం అభివృద్ధి చెందాలి. కనుక అందరూ అట్టి ఐక్యమునకే కృషి చేయాలి.

రాష్ట్రమునందలి వివిధ వర్గముల సమైక్యతకు కృషిచేయవలసిన బాధ్యత రాష్ట్ర కాంగ్రెసుపై గలదు. కాని రాష్ట్ర కాంగ్రెసు ఇప్పటివరకు ఈ బాధ్యతను నిర్వహింపకపోవుటేగాక, వర్గవైషమ్య ముల వృద్ధికి ఒక విధముగ దోహదము చేసినదని చెప్పవలెను. రాష్ట్ర మున కాంగ్రెస్ మంత్రివర్గమున్నపుడు, ఆ మంత్రివర్గమును బలపర చుట రాష్ట్రకాంగ్రెసు కనీసధర్మము. వ్యక్తులకుగాక సంస్థకు ప్రాధాన్యమివ్వవలెను. ప్రభుత్వవిధానములను విమర్శింపవచ్చును. సరియైన మార్గములను సూచింపవచ్చును. కాని ఒక వ్యక్తినే అభిమా నించి, వారు ప్రధానిగనుండిననే అది కాంగ్రెస్ మంత్రివర్గము కాగల దని భావించి, ఆ వ్యక్తికి పట్టముగట్టవలెనని ప్రయత్నించుటవల్ల విభేదములు పెరిగిపోయి కాంగ్రెసులోనే రెండు విభిన్న పక్షము లేర్పడుట జరిగినది. ఎవరికివారు తమపక్షమును బలపరచుకొనుటకు ప్రయత్నము చేయుచుండిరి. రాష్ట్రమునందలి కాంగ్రెస్ సంఘము రాష్ట్రమును పాలించుచున్న ప్రభుత్వమునకు ప్రతికూలపక్షము వలె వ్యవహరించుటచేత రాష్ట్రరాజకీయములకేగాక, కాంగ్రెసు క్రమ శిక్షణమునకుకూడ తీరని హానికలుగుచున్నది. రాష్ట్రమునందలి వివిధ విభిన్నవర్గములను ఏకము చేయగల శక్తి, సామర్థ్యం ఎలా ఉన్నా, ఒక రాష్ట్రకాంగ్రెసుకే కలదు. మంత్రులు కూడ రాష్ట్రకాంగ్రెసు యెడల తమ వైఖరిని సర్దుకొనవలసియున్నది. [illegible] ఇది అసాధ్యమగు విషయముకూడ కాదు. ఈ సంకల్పము ఇది సాధ్యము కావలెనని, తద్వారా రాష్ట్రసిద్ధి సన్నిహితము కావలెనని ఆకాంక్షించుచు సర్వజిత్తు సంవత్సరమునకు [illegible] గోచరించుచున్నది.

ఆంధ్రఐక్యతతోబాటు సాధింపవలసిన విషయము—రాష్ట్ర సంపాదనకు అత్యంత ప్రధానమైన విషయము మరొకటి ఉన్నది. రాయలసీమ, ప్రజలు [illegible] పెట్టున్నను, నాయకులు తీవ్రమగు అసంతృప్తి చెందియుండిరి. గత మంత్రివర్గమున, ఈ మంత్రి వర్గమునకూడ వారికి తగినంత ప్రాతినిధ్యము లేనందున 'సర్కారు ప్రజలు' సదుద్దేశ్యములయెడ వారికి శంకలు హెచ్చినవి. శ్రీబాగు ఒడంబడికను గౌరవింపక యథాపూర్వము కలిగినను, రాష్ట్రనాయకత్వముకూడ కోస్తాజిల్లాలవారే సత్తకు తీసుకొనిన ట్లయ్యెను. రాష్ట్రకాంగ్రెస్ నాయకత్వమునైనను వారి కొసగుట ఉచితము. నాయకత్వము దానికదె రావలసినదే కావచ్చును. కాని రాష్ట్రకాంగ్రెస్ పెత్తనం అట్లు కాదుగదా? రాయలసీమ కళాశాలలు ఇప్పటికిని మద్రాసువిశ్వవిద్యాలయమునందే యుండుటకు కూడ రాయలసీమనాయకుల శంకలే కారణము. మంత్రి వర్గమునందలి ఆంధ్రమంత్రులయినను వీరి సందేహనివృత్తి చేయలేకుండిరి. అయినను ఆంధ్రమంత్రులు ప్రస్తుత మంత్రివర్గమునం దున్నను ఆంధ్రప్రజలకుగాని, ఆంధ్రప్రాంతములకుగాని ఒరుగుచున్న, జరుగగల ప్రయోజనము శూన్యము. [illegible]! వర్గాభిమానముగాక, రాష్ట్రాభిమానము, రాష్ట్రక్షేమాభివృద్ధియందు ఆసక్తి గల మంత్రివర్గ మేర్పడుట అత్యంతావశ్యకము. ప్రధానా మాత్యపదవి లభించినను, భాషాప్రయుక్తముగా చెన్నరాజధాని పునర్నిర్మాణము జరిగినగాని రాష్ట్రమునకు [illegible] ప్రయోజనము ఉండదు. కనుక ప్రధానామాత్యపదవిని సంపాదించు టపై శక్తిని, ధనమును, కాలమును వ్యర్థముచేయుటకంటే ఆంధ్ర ఐక్యతకూ, తద్వారా ఆంధ్రనాయకత్వనిర్మాణమునకూ, రాష్ట్రసంపా దనకూ కృషిచేయుట వాంఛనీయము; అత్యావశ్యకము; ఎక్కువప్రయో జనకరము.

సర్వధారిలో ఆంధ్రులు ఇద్దరు ఆంధ్రమహాపురుషుల సంవత్సరోత్సవములను జరుపుకొనుచున్నారు. వారు ఉభయులు ఆంధ్ర సంస్కృతి, భాషా, సంప్రదాయసముద్ధరణకు జీవితమును ధారపోసినారు. ఈ సంస్మరణోత్సవములనాడు వారి జీవితాశయసాధనకు కృషి చేయుదు మని యావదాంధ్రము ప్రతిన బూని పని చేయుగాక!

స్వాగతము

(శ్రీ పల్లా లక్ష్మీనారాయణశాస్త్రి)

స్వస్తి సమస్తశుభనాయక సంకర్తకు; సర్వపాప వి
ధ్వస్తకు; సర్వసస్యసముదాయవిభాసితభూతధాత్రికి
న్యస్తకు; 'సర్వజిత్'మహిమ హర్తకు; మంగళనూత్నవైభవా
భ్యస్తకు; 'సర్వధారి'కిఁ బ్రభావచరిత్రమనోవిహారికిన్.

సర్వసర్వంసహాచక్ర పాలనము ధర్మచక్రానుసారి మా సర్వధారి
సర్వసస్యవిశేషసంపద్విధాతయౌ జనమనోహారి మా సర్వధారి
సర్వదేశాచారసంఘవిధ్వంసకసమదారిసైరి మా సర్వధారి
సర్వమానవభ్రాతృసౌహార్ద్రకరిపూతసంపద్విహారి మా సర్వధారి
జననిరస్యైకిదారి మా సర్వధారి - సంపదలకెల్ల దారి మా సర్వధారి
సకలభద్రమ్ముకారి మా సర్వధారి - స్వాగతం బిదె కొను మహా! సర్వధారి!

సవ్యమైన వ్యవసాయ విధానావశ్యకత

శ్రీ మోచర్ల దత్తాత్రేయులు

వ్యవసాయమే ప్రధానజీవనాధారముగా గల భారతభూమి వంటి దేశములో ప్రభుత్వమువారొక 'వ్యవసాయాభివృద్ధి విధానము'ను నిర్ణయించి అనుసరింపవలెనని ప్రత్యేకముగా నొక్కి వక్కాణింపవలసిన యగత్య మేర్పడుట వింత విపరీతవిషయముగా తోచవచ్చును. వ్యవసాయదారుని దారిద్ర్యావస్థను తొలగించుటయు, వ్యవసాయోత్పత్తియొక్క హీనస్థితిని తొలగించుటయును ప్రధాన సమస్యలైయున్నవి. ఈ సమస్యలను సమర్థముగా పరిష్కరించవలెనంటే, సర్వవిషయసమన్వయకరమైన, సవ్యమైన వ్యవసాయాభివృద్ధివిధానమును నిర్ణయించుట అత్యంతావశ్యకము. ఇతర సమస్యలన్నింటికంటె దీనికి ప్రథమస్థానము, అగ్రస్థానము యివ్వక తప్పదు. ఇంతవరకును ఈ వ్యవసాయాభివృద్ధివిషయములో ఎప్పటికేది తోచితే ఆ ప్రకారముగా వ్యవహరించుచు, వెర్రివాని చేతి రాయివలె కొన్ని పథకములను అమలుజరుపుచున్నారు. కాని, యీ యాదృచ్ఛికసమయస్ఫూర్తిపద్ధతిని విరమించవలెను. నిజపరిస్థితులను గూర్చిన విషయవివరములను సమగ్రముగా, సశాస్త్రీయముగా పరిశోధించి కార్యక్రమమున కుపక్రమించవలెను.

ఇప్పుడు ఏ లక్ష్యముతో, ఏ వ్యవహారవిధానమును అనుసరించవలసినదిగా మనము ప్రభుత్వమువారిని కోరవలసియున్నది? ప్రజల కోరికలనుబట్టియే ప్రభుత్వవ్యవహార విధానములు ఎప్పటికైనను ఏర్పడవలెను. నిత్యకృత్యపరిపాలనానుభవములోను, శాసననిర్మాణకాండలోను క్రమక్రమముగా, సవిస్తరమైన విషయవివరములతో కూడి వ్యవహారవిధానమునకొక ఆకారస్వరూపము లేర్పడుచుండును. కాని, చిట్టచివరకు యీ విధముగా తయారయిన వ్యవహార పథకములోని కొన్ని చిల్లర అంశములను ప్రజలు స్వీకరించుట గాని, నిరాకరించుటగాని జరుగును. కాబట్టి వ్యవహారవిధాన మనునది ప్రజాభీష్ట మనెడి ప్రాతిపదిక మీదనే నిర్మాణము కావలసియున్నది. ప్రజాభీష్టమే ప్రభుత్వ సంకల్పమునందు ప్రతిబింబితమగుచుండెడియెడల, ప్రజల కోరికలెట్టివో నిర్ణయించి నిరూపించుటయే ప్రశస్తమైన పరిశోధనమార్గము. గ్రామవాసియైన రైతుకోరికలను, పట్టణములలోను, నగరములలోను నివసించు బస్తీప్రజల కోరికలను ఎట్లున్నవో, తమకు ప్రభుత్వమువారు ఏ విధమైన మేలు చేయవలెనని వారు కోరుచున్నారో పరిశీలించవలసియున్నది.

రైతుల కోరికల నీడేర్చుటకు ఆయా కాలములందు ప్రభుత్వమువారు ఏ రీతిగా, ఏ విధమైన ప్రయత్నము చేసియుండిరో మనము పరిశోధించుటవల్ల రైతులు కోరిన కోరికలెట్టివో మనకు బోధపడగలవు. ౧౯౪౭ ఆగస్టు ౧౫ తేదీని బ్రిటిష్‌వారు మన దేశమును మనకే విడిచిపెట్టి వెళ్లినప్పుడు వారి తాపత్రయాగ్నులోనే మనలను కూడ నిమగ్నులను చేసి వెళ్లిరి. బ్రిటిష్‌వారు తమ వలసరాజ్యాల సంపదను స్వలాభప్రయోజనములకై వినియోగించుకొనుటకై సర్వదా తాపత్రయపడుచుండిరి. దేశములో శాంతిభద్రతలను కాపాడి ప్రజలలో అశాంతిని అణచివేయుటకై తాపత్రయపడుచుండిరి. అందువల్లనే ప్రజలు తమ ఆర్థికాభ్యున్నతికై సాగించుచుండిన ఉద్యమములను బ్రిటిషువారు అణచివేయుచుండిరి.

అట్టి పరిస్థితిలోకూడా భూస్వామ్యసంస్కరణమునకును, ఋణవిమోచనమునకును సంబంధించిన కొన్ని శాసనములు అమలులోనికి వచ్చుటయును, అప్పటప్పటికి పరిపాలనయందు యీ సంస్కరణభావములు పరిస్ఫుటమగుటయును సంభవించెను. ఈ రాష్ట్రములోని అమరకపు పద్ధతిలో కొన్ని మార్పులు వచ్చినవి. ఇంకా కొన్ని మార్పులు సంకల్పింపబడియున్నవి. ఆర్థిక మాంద్య దినములలో ఋణవిమోచనచట్ట మొకటి చేయబడెను. వ్యవసాయఫలసాయవస్తువులకు స్థిరమైన ధరలను నిర్ణయించుటకు కొన్ని ప్రయత్నములు జరిగెను. ఇవన్నియును పరిశీలింపదగిన అంశములే. అన్యదేశీయుల ప్రభుత్వములో ప్రజల మాట సహజంగా చలామణికాదు. మన భవిష్యత్తును నిర్ణయించగల స్వపరిపాలనయందు చలామణి యైనట్లుగా పరరాజుల ప్రభుత్వములో కాదు. అందువల్ల ౧౯౪౭ ఆగస్టు ౧౫ తేదీ వరకును పరిష్కారము కాకుండా ఉన్నటువంటి అనేకసమస్యలు ఇప్పుడు ప్రధానాంశములుగా పైకి వచ్చినవి. జమీందారీలు రద్దు కావలెననియు, భూమికిస్తుపద్ధతిని క్రమబద్ధమొనర్పవలెననియు, పంటసరకుల ధరలను

భూస్వాములు బాధ్యత వహించవలె ననియు, గ్రామజీవితమును సుస్థిరముగా, క్రమముగా నాగరిక వృద్ధిలోనికి తీసికొనిరావలె ననియు జరుగుచుండిన ఆందోళన అంతకంతకు ఎక్కువై యీ కోరికలు సంబంధనే శీఘ్రంపవలెనను పట్టుదల ప్రబల మగుచున్నది. ఈవిధమైన ఆందోళన కన్నింటియొక్క ముఖ్యోద్దేశ మేమనగా, గ్రామములో జీవించేవానికి జీవితము సుకరముగా ఉండవలెననియే. గ్రామము వాసయోగ్యముగా ఉండవలెను. జీవితానికి ముఖ్యముగా మూడు ప్రధానావసరములు కలవు—అన్నము, వస్త్రము, ఆవాసము. ఈ మూడింటిని ప్రజావసరములకు చాలినంతగా సమకూర్చుటయే ప్రభుత్వకర్తవ్యము. జీవితమునకు ముఖ్యమైన యీ మూడు అవసరములను సమకూర్చుకొనుటకై పాటుపడుటకు సిద్ధముగా నన్న ప్రజలకు కూడా వాటిని లభింపజేయ లేకపోవుట అతివిషాదకరమైన దేశ దౌర్భాగ్యము. ఈ జీవితావసరములను ప్రజలకు లభింపజేయుట కొరకై ప్రభుత్వమున్ను, ప్రజలున్ను సకలవిధముల కృషి చేయవలసి యున్నారు.

పై జెప్పిన ప్రధానజీవితావసరత్రయముమాత్రమేగాక, ఇతర అవసరములనుకూడా మరికొన్నింటిని తీర్చవలెను. మన దేశప్రజానీకమునకు వైద్యసహాయము అత్యంతావశ్యకమైయున్నది. వైద్యశాస్త్ర శిక్షణ పొందిన వైద్యులు గ్రామములలో కరువైయున్నారు. ప్రజారోగ్యశాఖవారు వ్యాధినివారణకార్యములకై నియమించెడి సిబ్బంది దేశమునకు తగినంత లేదు. అందువల్లనే అంటువ్యాధులు తరచు ప్రబలి వేలకొలదిగా జనులు మరణించుచున్నారు. కాబట్టి సర్వమైన వ్యవసాయాభివృద్ధిపథకములో వైద్యసహాయము ప్రధానాంశముగా పరిగణింపబడియున్నది.

గ్రామస్థులకు గ్రామములను ఆవాసయోగ్యములుగా చేయు నిమిత్తమై చక్కని రస్తాలు, రాకపోకలకు, వార్తలకు సౌకర్యములు ఎక్కువగా చేయవలెను. అందువల్ల గ్రామస్థుడు పండించెడి పంటసరకులకు ప్రక్కబస్తీలలో మంచి ధర లభించును. తద్వారా అతని ఆర్థికస్థితి బాగుపడును. అదిన్నిగాక బస్తీలలో నివసించే వారికి చక్కని రోడ్లు, బండ్లు వగైరా సౌకర్యము లుండుటవల్ల, గ్రామస్థునకు అవి లేకపోవుటవల్ల గ్రామస్థుడు తన దుస్థితిని చూచుకొని నిరుత్సాహి యగుచున్నాడు.

మానవునకు కావలసినది భుక్తిమాత్రమే కాదు. భుక్తి లభించిన తర్వాత జ్ఞానపిపాస కలుగుచుండును. మన దేశములో నూటికి ౮౫ వంతుమంది గ్రామాలలో నివసిస్తున్నారు. ప్రభుత్వమునకు వసూలయ్యెడి శిస్తుల ఆదాయ మంతా గ్రామాలవల్లనే లభించుచున్నది. అటువంటి గ్రామాలలో పాఠశాలలు అత్యల్పముగా నున్నవి. ఉన్న పాఠశాలలైనను అధ్వాన్నముగా ఉన్నవి. గ్రామస్థులు తమ పిల్లలు తమ వ్యవసాయకార్యములకును, యితర వృత్తివ్యాపారములకును అక్కరకు వచ్చి ప్రయోజకులు కావలెనని కోరుచుందురు. లౌకికవ్యవహారజ్ఞానము, సంఘసంప్రదాయజ్ఞానము కలిగి వృద్ధిలోనికి రావలెనని కోరుచుందురు. పల్లెలలోని ప్రజలు తమ నిత్యకృత్యవ్యాపారాలు చేసికొనుచు ఇతరలోకవ్యవహారాలు, అనేకసద్విషయములు తెలిసికొనవలె నని కుతూహల పడుచుందురు. అందుకొరకైన గ్రంథములను లభింపజేయగల గ్రంథాలయములు—స్థావరంగా ఉండేవి, జంగమంగా (సంచారం చేస్తూ) ఉండేవి చాలా అవసరము.

పల్లెవాసుల సుఖజీవితమును వర్ణించుచు మనోహరముగా కవులు కథ లల్లవచ్చును. కాని, నగరవాసుల జీవితములో గల హుషారుగాని, ఉత్సాహముగాని గ్రామవాసులకు లేదు. గ్రామస్థులకు చక్కని వినోదప్రదర్శనములను, సత్కాలక్షేపములను ఏర్పాటు చేయవలెను. రేడియోలు దేశంలో వ్యాప్తిలోనికి వచ్చినవి. గ్రామాలలో కూడ విశేషంగా వెలసినవి. కాని, గ్రామస్థులకు సహజానందకరములైన జానపదగేయములను, కోలాటములు వగయిరా సాముదాయిక బృందగాన నృత్యములను ఎక్కువగా ప్రోత్సహించవలెను. అట్టివి గ్రామస్థుల సహజప్రకృతిని వ్యక్తీకరింప జేయగల్గి వారికి ఎక్కువ ఆకర్షణీయమైనవి. ఇట్టి వినోదకాలక్షేపముల మూలముగా గ్రామజీవితములో కళావికాస మేర్పడగలదు.

మరొక ముఖ్యవిషయ మేమనగా, తమ కొక హోదా వహించగల తాహతున్న, జీవితములో ఉన్నతస్థాయియున్నా కలదనే భావము ఏర్పడిననేతప్ప వారిలో ఆత్మగౌరవము వృద్ధికాదు. గ్రామస్థుడైనవాడు తాను కూడా దేశమునకు అక్కరకు రాగలనని గ్రహించవలెను. అట్టి ఆత్మపరిజ్ఞానాభివృద్ధివల్ల దేశమునకు అక్కరకు రాగల పౌరుడై, నాయకవీరుడై పెంపొందగలడు. తానొక వర్గమునకు నాయకత్వము వహించి, పెద్దరికము సంపాదించవలెననే కుతూహలము గ్రామస్థునకుకూడా కలుగును. అట్టి వ్యవహారాధిపత్యావకాశములను గ్రామస్థులకు కల్పించుట కూడా వ్యవసాయాభివృద్ధివిధానమునకు అవసరము.

పైజెప్పిన సదుపాయాభివృద్ధుల నన్నింటిని గవర్నమెంటువారే పూనుకొని చేయవలెనని వాదింపజాలము. ప్రజలకు ఎక్కువ ద్రవ్యార్జనావకాశములను, ఎక్కువ తీరికకాలమును లభింపజేయవలెను. ప్రభుత్వమువారి పనిని నెరవేర్చిన చాలును. ప్రజలు తమ జీవితసౌఖ్యమును పెంపుజేసికొనుటకు తగిన అవకాశములను కల్పింపవలెను. ఈ పనిని ప్రభుత్వమే నెరవేర్పవచ్చును. లేదా అన్యథా నెరవేరునట్లు చేయువచ్చును. అట్టి గ్రామాభ్యుదయకరఉద్యమములో ప్రజలే పాల్గొనుటకు అవకాశమును కల్పించినను కల్పించవచ్చును.

హాలికుని జీవితము హాయియైన దని సత్కవులెంత పసందుగా వర్ణించి చిత్రించినప్పటికీ, దుర్భరదారిద్ర్యఋణబాధలవల్ల రైతు జీవితము విషాదభరిత మగుచున్న దను మాట ప్రత్యక్షనిదర్శనముగా